# గ్రామీణ మరియు నగర సమాజశాస్త్రము

## బి.ఎ. సమాజ శాస్త్రము - మూడవ సంవత్సరము, పేపరు - 4, Opt. (A)


**రచయితలు**

**డా॥ యం.యస్. పార్థసారధి**
విజిటింగ్ ప్రొఫెసర్
సమాజ శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ వి. వెంకటేశ్వర్లు**
టీచింగ్ అసోసియేట్
సమాజశాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**డా॥ ఎస్. భాస్కర్**
అసోసియేట్ ప్రొఫెసర్
సమాజశాస్త్ర విభాగము
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

**డా॥ జి.వి. రమణ**
అసోసియేట్ ప్రొఫెసర్
సమాజశాస్త్ర విభాగము,
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము, అనంతపురం

**డా॥ ఆర్. విజయకృష్ణనాయుడు,**
అసోసియేట్ ప్రొఫెసర్,
సమాజశాస్త్ర విభాగము,
శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయము,
అనంతపురం

సంపాదకులు మరియు సమన్వయకర్త
**ఆచార్య యం. లక్ష్మీపతిరాజు**
సమాజ శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్
**ఆచార్య ఎం.వి. రామ్‌కుమార్ రత్నం,** M.A., Ph.D.



**దూరవిద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జుననగర్ - 522 510

Ph : 0863 - 2293299, (08645) 211023, 211024, Cell : 98482 85518
E-mail : anucde@yahoo.com
Website : www.nagarjunauniversity.ac.in

B.A. : Rural and Urban Sociology

| | | |
|---|---|---|
| First Edition | : | 2005 |
| Second Edition | : | 2006 |
| Third Edition | | 2010 |
| Fourth Edition | | 2014 |
| No. of Copies | | 1000 |


(C) Acharya Nagarjuna University

This book is exclusively prepared for the students of Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is meant for limited circulation only.

*Published by :*
**Prof. M.V. Ramkumar Ratnam**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University

*Printed at :*
**Don Bosco Technical School Press**
Ring Road, Guntur-7, Ph : 2350832

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ పురోగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

ఆచార్య కె. వియన్నారావు

కులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

B.A. Sociology, Final Year

# PAPER - IV (A) : RURAL AND URBAN SOCIOLOGY

## SYLLABUS

## Part (A) Rural Sociology

1. Scope and subject matter of Rural Sociology in India.
2. Rural Community and its characteristics - types of villages and settlement Patterns, India Joint and Ryotwari villages.
3. Caste, religion and Politics in rural areas - Caste and village Panchayats, Jammani system and land ownership recent land reforms in Andhra Pradesh.
4. Rural population in India, Rural Health and Sanitation, Rural Unemployment, Rural Development in India.

## Part (B) Urban Sociology

1. Scope and subject matter of Urban Sociology.
2. Urban Community and its characteristics, Types of cities rural urban interaction and contrast, composition of urban population in India.
3. Levels and trends of urbanization in India, Urbanism as a way of life, characteristics of per-industrial and industrial cities.
4. Urban Ecology settlement patterns in cities - urban social problem slum, rural urban migration, population and Poverty in Indian cities.

**Books Reference :**


1. A.R. Desai - Rural Sociology in India
2. Gist and Fava - Urban Society
3. M.S. A. Rao - Urban Sociology in India.

B.A. Degree Examination
(Examination at the end of Final Year)
Part - II Sociology

## PAPER IV - RURAL AND URBAN SOCIOLOGY

Time : Three Hours | Maximum : 100 marks

***Answer any FIVE Questions.***
***Select atleast TWO from each Section.***
***All questions carry equal marks.***

### SECTION A

1. Define the nature of Rural Sociology.
   గ్రామీణ సమాజ శాస్త్ర స్వభావాన్ని వివరించండి.
2. Differentiate between Rural and Urban communities.
   గ్రామీణ, నగర సముదాయాల మధ్యగల తేడాలను వివరించండి.
3. Discuss various types of villages on the basis of structure.
   నిర్మితిని ఆధారంగా వివిధ రకాల గ్రామాలను పేర్కొనండి.
4. "Industrialization is the main cause for disintegration of Jajmani system in India". Discuss.
   "భారతదేశంలో జాజ్‌మాని వ్యవస్థ విచ్ఛిన్నమగుటకు పారిశ్రామికీకరణ ఒక ముఖ్య కారణము". వివరించండి.
5. What are the functions panchayathi system in Andhra Pradesh?
   ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీ వ్యవస్థ యొక్క ప్రకార్యములను వివరింపుము.

### SECTION B

6. What are the factors, influenced the growth of cities in India.
   భారతదేశంలో నగరాల పెరుగుదలకు గల కారణాలను తెలపండి.
7. Describe the Urban Economic Organization.
   నగర ఆర్థిక వ్యవస్థాపన గూర్చి వివరించండి.
8. Explain the growth of Urban population in India after Independence.
   స్వాతంత్ర్యానంతరం భారతదేశ నగర జనాభా పెరుగుదలను గూర్చి వివరించండి.
9. Explain the Meaning of urban Ecology.
   నగర ఆవరణ యొక్క అర్థాన్ని వివరించండి.
10. Suggest measures for solving the problem of urban poverty.
    నగర పేదరిక సమస్యను నిర్మూలించుటకు ఏమి చేయవలయునో మీ సలహాను తెలపండి.

# విషయ సూచిక


1. భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం పరిధి, అధ్యయనాంశాలు 1.1 - 1.9
2. గ్రామీణ సముదాయము - నిర్వచనము - లక్షణములు 2.1 - 2.4
3. గ్రామముల రకములు 3.1 - 3.9
4. గ్రామీణ ప్రాంతాలలో కులం, మతం మరియు రాజకీయాలు 4.1 - 4.13
5. కులం మరియు గ్రామ పంచాయితీలు 5.1 - 5.8
6. జజ్‌మానీ వ్యవస్థ 6.1 - 6.4
7. భూమి యాజమాన్యం - ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు 7.1 - 7.10
8. భారతదేశంలో గ్రామీణ జనాభా 8.1 - 8.4
9. గ్రామీణ సమస్యలు ఆరోగ్యం పారిశుద్ధ్యం - నిరుద్యోగిత 9.1 - 9.15
10. భారతదేశంలో గ్రామీణాభివృద్ధి 10.1 - 10.13
11. నగర సమాజ శాస్త్రము - ఆవిర్భావము, అభివృద్ధి, పరిధి 11.1 - 11.6
12. నగర సముదాయము దాని లక్షణములు 12.1 - 12.6
13. నగరాలు వర్గీకరణ 13.1 - 13.7
14. గ్రామీణ, నగర సముదాయాల పరస్పర సంబంధం - తారతమ్యాలు 14.1 - 14.5
15. భారతదేశ నగర జనాభా సంయోజనం 15.1 - 15.4
16. భారతదేశంలో నగరీకరణ స్థాయి, తీరు తెన్నులు 16.1 - 16.7
17. నగరీయత ఒక జీవన విధానం 17.1 - 17.4
18. ప్రాక్ పారిశ్రామిక నగరాలు - పారిశ్రామిక నగరాల లక్షణాలు 18.1 - 18.5
19. నగర ఆవరణ శాస్త్రం-నగర నివాస ప్రాంత నమూనాలు 19.1 - 19.9
20. పట్టణ సమస్యలు - మురికి పేటలు, గ్రామీణ, నగరవలస మరియు జనాభా సమస్యలు 20.1 - 20.14
21. భారతీయ నగరాలలో పేదరికం 21.1 - 21.6

పాఠం - 1

# భారతదేశం లో గ్రామీణ సమాజశాస్త్రం పరిధి, అధ్యయనాంశాలు

(Scope and subject matter of Rural Sociology in India)

## 1.0 లక్ష్యం :

గ్రామీణ సమాజశాస్త్ర నిర్వచనం, పుట్టుక, అభివృద్ధి స్వభావం, పరిధి మరియు అధ్యయనాంశాలతో పాటు భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం ప్రాముఖ్యతను తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానోద్దేశ్యం.

## విషయక్రమం :

1.1 పరిచయం
1.2 గ్రామీణ సమాజశాస్త్రం - నిర్వచనం
1.3 గ్రామీణ సమాజశాస్త్రం - పుట్టుక, అభివృద్ధి
1.4 గ్రామీణ సమాజశాస్త్రం - స్వభావం
1.5 గ్రామీణ సమాజశాస్త్రం - పరిధి మరియు అధ్యయనాంశాలు
1.6 భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్ర అధ్యయన ప్రాముఖ్యత
1.7 సారాంశం
1.8 ముఖ్యపదాలు
1.9 నమూనా ప్రశ్నలు
1.10 చదువదగిన గ్రంథాలు

## 1.1 పరిచయం :

ఆది నుంచి నేటి ఆధునిక యుగం వరకూ విజ్ఞానభివృద్ధి విశేషంగా వికాసం పొందుతూ ఉంది. శాఖోపశాఖలుగా వృద్ధి చెందుతుంది. ప్రకృతిని జయించి, తన పురోగతికి ఆ విజ్ఞానాన్ని వినియోగించుకోవాలనే మానవుని కోర్కె ఫలితంగా విజ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతూ ఉంది. విజ్ఞానాన్ని కొన్ని శాస్త్రాలుగా విభజించి తరవాత తరానికి అనేక పద్ధతులు ద్వారా అందించడం జరుగుతూ ఉంది. ఈ శాస్త్రాలన్నింటిని ప్రధానంగా రెండు తరగతులుగా విభజించవచ్చు అవి భౌతిక శాస్త్రాలు మరియు సాంఘిక శాస్త్రాలు. సాంఘిక శాస్త్రాలలో ఒకనొక విభాగం సామాజిక శాస్త్రం. సాంఘిక శాస్త్రాలన్నింటికన్న సామాజిక శాస్త్రం వయస్సులో చిన్నది. మానవ సామాజిక సంబంధాల అధ్యయనమే సమాజ శాస్త్ర లక్ష్యం. సమాజశాస్త్రం అనే తెలుగు పదానికి సమానార్థకమైన ఆంగ్లపదం 'సోషియాలజీ'. దీనిని 19వ శతాబ్దంలో ఫ్రెంచితత్త్వవేత్త ఆగస్ట్‌కోమ్ట్ లాటిన్ భాషలోని 'సొసైటస్' అనే పదాన్ని, గ్రీకు భాషలోని 'లోగాస్' అనే పదాన్ని సమ్మేళనం చేసి 'సోషియాలజీ' గా రూపొందించాడు.

సమాజంలో మానవుల మధ్య జరిగే పరస్పర చర్యలను పరస్పర సంబంధాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసే శాస్త్రం సమాజశాస్త్రం. దీనిలో సామాన్య, సాధారణ అంశాలు, ప్రత్యేక అంశాలని రెండు విభాగాలుగా వర్గీకరించవచ్చు. సమాజంలో వ్యక్తుల మధ్య పరస్పర చర్యల ఫలితంగా ఏర్పడే పరస్పర సంబంధాల అధ్యయనం సాధారణ సమాజశాస్త్రం యైతే లోతుగా అధ్యయనం చేయడానికి ఎన్నుకొన్న విశిష్టాంశాల అధ్యయానికి పరిమితమైంది ప్రత్యేక సమాజశాస్త్ర విభాగం సమాజంలోని అనేక ప్రత్యేక

దృగ్విషయాలను సమగ్రంగా పరిశీలించి, విశ్లేషణ చేయడం ద్వారా సమాజశాస్త్రం నుండి వివిధ ప్రత్యేక శాస్త్ర విభాగాలు ఏర్పడ్డాయి. వీటిలో గ్రామీణ సమాజశాస్త్రం ఒకటి.

భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్ర ఆవశ్యకత ఎంతైన ఉంది. దేశజనాభాలో 75 శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తూ వివిధ విధాలుగా సమాజాన్ని ప్రభావితం చేస్తున్నారు. దీనితో గ్రామీణ సమాజశాస్త్ర ప్రాముఖ్యత దేశంలో చాలా ఉంది.

## 1.2 గ్రామీణ సమాజశాస్త్రం - నిర్వచనం :

గ్రామీణ సమాజశాస్త్రాన్ని సమాజశాస్త్రజ్ఞులు వివిధ విధాలుగా నిర్వచించారు.

శాండర్సన్ - భూమి మీద ఆధారపడి జీవించే ప్రజల సామాజిక స్థితి గతులను మెరుగు పరచడమే గ్రామీణ సమాజశాస్త్ర ప్రధాన ఉద్దేశ్యమని భావించాడు.

**లిన్‌స్మిత్** - గ్రామీణ సామాజిక సంబంధాల క్రమబద్ధ విజ్ఞానమే గ్రామీణ సమాజశాస్త్రమని వివరించాడు.

బెర్ట్రాండ్ - గ్రామీణ ప్రజల సంబంధాన్ని గురించి గ్రామీణ వాతావరణం గురించి గ్రామీణ సమాజ శాస్త్రం అధ్యయనం చేస్తుందని అభిప్రాయపడినాడు.

ఎవరెట్ రోజర్స్ - సామూహిక సంబంధాల భావనకు ప్రాముఖ్యతనిస్తూ గ్రామ వాసుల సామూహిక సంబంధాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడమే గ్రామీణ సమాజశాస్త్ర ముఖ్యఉద్దేశమని నిర్వచించాడు.

ఎ.ఆర్.దేశాయ్ - గ్రామీణ సమాజాన్ని గురించి అధ్యయనం చేసేదే గ్రామీణ సమాజశాస్త్రమని నిర్వచించాడు.

నెల్సన్ - గ్రామీణ సమాజశాస్త్రమంటే "గ్రామీణ సంస్థల సమూహాల వర్ణన, పరిశీలన" అని నిర్వచించాడు.

జె.యమ్.గిల్లెటి - భూమితో సర్దుబాటు వల్ల కలిగే ఫలితాలకు గ్రామీణ జీవితంలో అద్వితీయమైన ప్రాధాన్యత ఉంటుందని భావించాడు.

కార్ల్.సి.టేలర్ - గ్రామీణ జీవిత అధ్యయనమే గ్రామీణ సమాజశాస్త్రమని అభిప్రాయ పడినాడు.

ఎఫ్.ఎస్.చాప్లిన్ - గ్రామీణ జీవితానికి సంబంధించిన సమాజశాస్త్రం గ్రామీణ జనాభాను, సామాజిక వ్యవస్థను సామాజిక ప్రక్రియలను అధ్యయనం చేసేశాస్త్రంగా నిర్వచించాడు.

గ్రామీణ సమాజశాస్త్రం గ్రామీణ సామాజిక వాతావరణాన్ని ప్రతిబింబిస్తుంది. గ్రామీణ జీవితానికి సంబంధించిన వివిధ అంశాలను, సమస్యలను, సంస్కృతిని సంస్థలను గురించిన సమగ్ర సమాచారాన్ని అందిస్తుంది. గ్రామీణ ప్రగతికి సూచనలిస్తుంది. సమస్యలకు పరిష్కార మార్గాన్ని వివరిస్తుంది.

## 1.3 గ్రామీణ సమాజశాస్త్రం - పుట్టుక, అభివృద్ధి :

గ్రామీణ సమాజశాస్త్రం ఆవిర్భావానికి మూలకేంద్రం అమెరికా సంయుక్త రాష్ట్రాలు. అమెరికా దేశ సమాజంలోని గ్రామీణ సమాజం 'మహత్కార్య కాలం' (1889-1920) (ఎక్స్‌ప్లాయిటర్ పీరియడ్)లో క్షీణ దశలో ఉన్నప్పుడు నాటి గ్రామీణ సమాజ సమస్యలను సమాజ శాస్త్ర వేత్తలు గుర్తించి స్పందించడం జరిగింది. ఈ పరిణామాన్ని గ్రామీణ సమాజశాస్త్ర చరిత్రలో తొలి ఉషస్సుగా చెప్పవచ్చు. 1890లో అప్పటి అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్ వెల్ట్ జనపదాలలోని జీవిత విశేషాలను అధ్యయనం

చేయడానికి ఒక కమీషన్‌ను నియమించారు. కంట్రిలైఫ్ కమీషన్‌గా పిలవబడే దీనికి డీన్ బేలీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ఈ కమీషనర్ గ్రామీణ సమస్యలను సమగ్రం పరిశీలించి, పరిశోధించి విషయాలను విశ్లేషించి, చర్చించి సమగ్రమైన సంపూర్ణమైన నివేదికను అందించింది. గ్రామీణ సమాజశాస్త్రంలో మొట్ట మొదటి విలువైన గ్రంథంగా ఈ నివేదికను చెప్పవచ్చు. ఈ నివేదిక గ్రామీణ సమాజశాస్త్ర వేత్తలకు స్ఫూర్తినిచ్చింది. పరిశోధనలో ముందు వెళ్లటానికి ఉపకరించింది. 1912 తరువాత అమెరికన్ సోషియలాజికల్ సొసైటి వార్షిక సమావేశాలలో ఈ అంశమే ప్రముఖ చర్చనీయాంశమైంది. 1937లో గ్రామీణ సమాజాల అధ్యయనం పట్ల శ్రద్ధ, ఆసక్తి ఉన్న సమాజశాస్త్రజ్ఞులు "రూరల్ సోషియలాజికల్ సొసైటి" నొకదాన్ని స్థాపించారు. 'రూరల్ సోషియాలజీ' అనే పత్రికను సొసైటి ప్రచురించడం ప్రారంభించింది.

డబ్ల్యూ.హెచ్.విల్సన్ (W.H. Wilson), క్వేకర్‌హిల్ (Quaker Hill), జి.యమ్. విలియమ్స్ (G.M. Wiliams)- 'ఏన్ అమెరికన్ టౌన్ (An Amercian Town)', ఎన్.ఎల్. సిమ్స్ (N.L. Sims) , - 'ఏ హుసియర్ విలేజ్' (A Hoosier Village) అనే గ్రంథాలు అమెరికాలోని గ్రామీణ సముదాయ అధ్యయనాలకు దర్పణంగా నిలుస్తాయి. 1906-1912 మధ్యకాలంలో కొలంబియ విశ్వవిద్యాలయంలో గ్రామీణ సమస్యలను విశ్లేషించే గ్రంథాలుగా పేరు పొందాయి.

1915లో సి.జె. గాల్పిన్ (C.J. Galphin) - 'సోషల్ అనాటమీ ఆఫ్‌పిన్ అగ్రికల్చరల్ కమ్యూనిటీ' గ్రంథం గ్రామీణ సమాజ అధ్యయనంలో చాలా ముఖ్యమైనది. 1916లో జాన్.ఎమ్.గిల్లెట్ రచించిన 'గ్రామీణ సమాజశాస్త్రం' కళాశాల స్థాయి పాఠ్య పుస్తకంగా నిర్ణయించారు. ఆ తరువాత ఎందరో సమాజశాస్త్రజ్ఞులు గ్రామీణ సమాజాన్ని వివరించే పలు విలువైన గ్రంథాలను ప్రచురించారు. 1930లో సోరొకిన్, (Sorokin), జిమ్మర్‌మాన్ (Gimmerman), గాల్పిన్ (Galphin) లు రచించిన "ఏ సిసమేటిక్ సోర్స్‌బుక్ ఇన్ రూరల్ సోషియాలజీ" గ్రామీణ సమాజశాస్త్ర చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

గ్రామీణ సమాజ విషయాలను సుదీర్ఘంగా, నిశితంగా సమగ్రంగా, పరిశీలించిన మేథావులలో సోరొకిన్, జిమ్మర్‌మన్, గాల్పిన్, టేలర్, కొల్బ్, బ్రన్నర్, సిమ్స్, డైవాట్ సాండర్‌సన్, లాండిస్, రెడ్ పీల్ట్, స్మిత్ మొదలైనవారు సుప్రసిద్ధులు. కాలక్రమేణ గ్రామీణ సమాజశాస్త్రంలో పరిశోధనలు గుణాత్మకంగా, పరిమాణాత్మకంగా పరిపుష్టమవుతున్నాయి. 1956లో వేసిన అంచనాల ప్రకారం గ్రామీణ సమాజశాస్త్రంలో పరిశోధనలు వేయికి మించి పోయినాయి. అంతర్జాతీయ సంస్థలైన యు.ఎన్.ఒ., యునెస్కో, ఎఫ్.ఎ.ఒ.,లు కూడా గ్రామీణ సమాజ శాస్త్రాభివృద్ధికి దోహదపడ్డాయి.

## భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం - అభివృద్ధి :

భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం ఎప్పుడు ప్రారంభమయినదో చారిత్రకంగా నిర్ధారించి చెప్పడం కష్టం. గ్రామాలకు సంబంధించిన వివిధ విషయాలు బ్రిటీష్ అధికారుల నివేదికలలో, ఐరోపామత ప్రచారకుల గ్రంథాలలో లభ్యమవుతుంది. నాటి గ్రామీణ సామాజిక సంబంధాలను, గ్రామీణ స్థితిగతులను బ్రిటీష్ అధికారులు భూమిని సర్వే చేస్తూ రూపొందించిన జిల్లా నివేదికలలో పొందుపరిచారు.

భారతీయ సామాజిక ఆర్థిక వ్యవస్థలో పూర్వ చారిత్రక కాలం నుంచి గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. ప్రాచీన సాహిత్యంలో గ్రామం అనే పదాన్ని ఒక స్థలంలో నివసించే కొన్ని కుటుంబాల సమూహానికి ఉపయోగించేవారు. ఋగ్వేదంలో గ్రామ ప్రస్తావన ఉంది. మనుస్మృతిలో గ్రామం, పట్టణం, నగరం మధ్య తేడాలను వివరించింది. దీని ప్రకారం గ్రామం ఒక చిన్న పరిపాలన యూనిట్ గ్రామానికి స్వంత అధికారులు, స్వయం వ్యవస్థలు ఉంటాయి. మను స్మృతిలోనూ, మహాభారతంలోనూ గ్రామ నాయకుడిని గ్రామీణి అని అంటారు. గ్రామీణుల సమస్యలను వారే పరిష్కరించుకొనే వారని తెలుస్తుంది.

బేడెన్ పవెల్ (Baden Powell) 1896లో "భారతీయ గ్రామీణ సముదాయము" అనే గ్రంథంలో అనాటి గ్రామీణ వ్యవస్థను పరిశీలించినాడు. వాల్టర్‌నీల్ ఉత్తర ప్రదేశ్‌లోని గొండా జిల్లా నివేదిక ఆధారంగా "రెసిప్రాసిటి అండ్ రీడిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఇండియన్ విలేజ్" (Reciprocity and Redistribution in the Indian Village) అనే శీర్షికలతో అనేక వ్యాసాలు రచించాడు. 1936లో వైజర్ (Wiser) 'హిందూ జాజ్‌మాని సిస్టమ్' (Hindu Jajmani System) అనే గ్రంథం గ్రామీణ సామాజిక అధ్యయనంలో కొత్త ఒరవడిని సృష్టించింది. నూతన శకానికి శ్రీకారం చుట్టింది. 1949లో ఎన్.కె.బోస్ (N.K. Bose) బెంగాలీలో హిందూ సమాజనిర్మితి గ్రామీణ సమాజ అధ్యయనాలలో నూతన మార్గానికి నాంది పలికింది. కులవ్యవస్థ కొనసాగటానికి గల కారణాల్ని బోస్ దీనిలో తెలియజేశాడు.

1950 నుంచి గ్రామీణ సమాజశాస్త్రానికి సంబంధించిన అధ్యయనాలలో కొత్త చైతన్యం కనిపిస్తుంది. 1948-1956 మధ్య కాలంలో గ్రామీణ దృగ్విషయాలను గురించి ఈస్టర్న్ ఆంథ్రోపాలజిస్టు (Eastern Anthropologist), అమెరికన్ ఆంథ్రోపాలజిస్ట్ (American Anthropologist) జర్నల్ ఆఫ్ ఆసియన్ స్టడీస్ (Journal of Asian Studies), ఎకనామిక్ వీక్లి వంటి పత్రికలలో ఎందరో సమాజ, మానవ శాస్త్రజ్ఞులు పరిశోధనా వ్యాసాలను ప్రకటించారు. 1951లో హజారీ (Hazari) - 'యాన్ ఇండియన్ జాట్ కాస్ట్' గ్రంథాన్ని 1952లో ఎన్.జి.డి. జోర్డర్ (N.G.D. Joorder) భారతదేశంలో గ్రామ పరిపాలన అనే గ్రంథాన్ని వెలువరించారు. 1951-1954 మధ్య గ్రామీణ దృగ్విషయాలను గురించి పత్రికలలో ఎందరో శాస్త్రజ్ఞులు చర్చలు సాగించారు. 1955లో యం.ఎన్. శ్రీనివాస్ 'ఇండియన్ విలేజ్', మెక్కిమ్ మారియట్ (Meckhm Marriat) 'విలేజ్ ఇండియా' అనే గ్రంథాలకు సంపాదకత్వం వహించి, గ్రామీణ సమస్యలలోని వైవిధ్యాన్ని, ఏకత్వాన్ని, సహకారాన్ని సంఘర్షణను, సంప్రదాయాన్ని, ఆధునికతను, వివిధ కులాల మధ్య నెలకొన్న సంబంధాలను వివరించారు. 1955లోనే హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న షామీర్‌పేట గ్రామాన్ని అధ్యయనం చేసి ఎస్.సి. దూబే (S.C. Dube) 'భారతీయ గ్రామం' అనే గ్రంథాన్ని ప్రచురించాడు. 1957లో ఎఫ్.జి. బేలె (F.G. Bailay) "కాస్ట్ అండ్ ద ఎకనామిక్ ఫ్రాంటియర్" (Caste end the Economic Frontier), రామక్రిష్ణ ముఖర్జీ, "ద డైనమిక్స్ ఆఫ్ ఎ రూరల్ సొసైటి, ఎ స్టడీ ఆఫ్ ఎకనామిక్ స్ట్రక్చర్ ఇన్ ఎ బెంగాల్ విలేజ్, గ్రంథాలను ప్రచురించారు. 1958లో దేశాయ్ భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం అనే గ్రంథంలో గ్రామీణ సముదాయంల అధ్యయనం ప్రాముఖ్యతను వివరించారు.

1958లో దూబే రాసిన ఇండియన్ చేంజింగ్ విలేజస్" అనే గ్రంథంలో గ్రామీణ ప్రాంతాలలో వస్తున్న సామాజిక మార్పులను పరిశీలించాడు. ఆస్కర్ లూయిన్ (Oscar Lewis) లైఫ్ ఇన్ నార్త్ ఇండియన్ విలేజ్ (Life in North Indian Village), డి.ఎన్. మజుందార్ (D.N. Majumdar) - కాస్ట్ అండ్ కమ్యూనికేషన్ ఇన్ యాన్ ఇండియన్ విలేజ్ (Caste and Communication in An Indian Village) అనే గ్రంథాలు కూడా 1958 లోనే వెలువడ్డాయి. 1960లో బైలీ రచించిన 'ట్రైబ్, కాస్ట్ అండ్ నేషన్' ఎ.సి. మేయర్ గ్రంథం కాస్ట్ అండ్ కిన్‌షిప్ ఇన్ సెంట్రల్ ఇండియా' (Caste and Kinship in Central India) ప్రచురింపబడ్డాయి. 1965లో టి.ఎన్. మదన్ - ఫ్యామిలీ అండ్ కిన్‌షిప్ - ఎ స్టడీ ఆఫ్ ద పండిట్స్ ఆఫ్ రూరల్ కాశ్మీర్ (Family and Kinship a study of the pandits c[illegible] Kashmir), అలెన్ స్టీన్ (Alen Stean) - కాన్‌ఫ్లిక్ట్ అండ్ కొహెషన్ ఇన్ యాన్ ఇండియన్ విలేజ్ (Conflict and Cohesion in An Indian Village) గ్రంథాలు ప్రచురించారు. 1966లో ఎల్.కె.షేన్ , పి.రాయ్ (P. Roy) లు రచించిన "ఎవేర్‌నెస్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఇన్ విలేజ్ ఇండియా (Awareness of Community Development in Village India), అగ్రికల్చరల్ ఇన్నోవేషన్స్ ఇన్ ఇండియన్ విలేజ్ (Agricultural Innovations in Indian Village) ఈశ్వరన్ (Eswaran) - ట్రెడిషన్ అండ్ ఎకానమీ ఇన్ విలేజ్ ఇండియా (Tradition and Economy in Village India) మొదలైనవి వెలువడ్డాయి.

గ్రామీణ అధ్యయనాలు చాలా వరకు ఒక గ్రామానికో లేదా రెండు మూడు గ్రామాలలో పరిమితమై ఉన్నాయి. ప్రాంతీయ స్థాయిలోగాని, దేశీయ స్థాయిలోగాని గ్రామీణ సమాజాలలో మార్పుల గురించి సమగ్రంగా పరిశోధనలు జరగలేదు.

## 1.4 గ్రామీణ సమాజశాస్త్రం - స్వభావం (Nature of Rural Sociology):

గ్రామీణ సమాజశాస్త్రం గ్రామీణ సమాజాన్ని సమగ్రంగా, శాస్త్రీయంగా అధ్యయనం చేస్తుంది. దీని ద్వారా వెల్లడైన వాస్తవాలను, సూత్రాలను గ్రామీణాభివృద్ధిలో ఉపయోగించాలి. అప్పుడే గ్రామీణ సమాజశాస్త్రం ఒక శాస్త్రమేకాక, ఒక కళ కూడా అవుతుంది.

గ్రామీణ సమాజశాస్త్ర వేత్తలు శాస్త్రీయ పద్ధతులననుసరించి దత్తాంశ సేకరణ చేయడం, సేకరించిన దాని యదార్థతను, ఖచ్చితత్వాన్ని పరీక్షించి సుసం బద్ధమైన విజ్ఞానాన్ని అందించడం వల్ల గ్రామీణ సమాజ శాస్త్రాన్ని శాస్త్రంగానే గుర్తిస్తారు. ఇతర సాంఘిక శాస్త్రాలలో ఉపయోగించే శాస్త్రీయ పద్ధతులను గ్రామీణ సమాజ శాస్త్రం కూడా అనుసరిస్తుంది. శాస్త్రమనేది ఒక సమస్యను సిద్ధాంత పరంగా అధ్యయనం చేసేదైతే దాని అమలు ఒక కళ లేదా సాంకేతిక విజ్ఞానం. గ్రామీణ సమాజ సమస్యలు అధ్యయనం చేపట్టే పద్ధతి తప్పనిసరిగా వివిధ శాస్త్ర విజ్ఞానాలతో కూడిన సాంకేతిక విజ్ఞానం. గ్రామాలలోని ప్రతి సమస్యని పరిశీలించడానికి ఒకటి కంటే ఎక్కువగా శాస్త్రాల సాంగత్యం అవసరమవుతుంది. దీనివల్ల గ్రామీణ సమాజశాస్త్రం మొదట ఒక శాస్త్రం. ఆ తరువాత అది ఒక కళ.

## 1.5 గ్రామీణ సమాజశాస్త్రం - పరిధి (Scope of Rural Sociology):

ప్రతి శాస్త్రానికి ఒక పరిధి ఉంటుంది. ఏ ఏ అంశాలను ఎంత వరకు అధ్యయనం చెయ్యాలి ఏ దృక్కోణంలో ఆయా అంశాలను దృగ్విషయాల్ని పరిశీలించాలి? అనే విషయాలు ఆ శాస్త్ర పరిధిని తెలియజేస్తాయి. గ్రామీణ సమాజశాస్త్రానికి ఆయా గ్రామీణ సమాజశాస్త్రజ్ఞులు ఇచ్చిన నిర్వచనాలను బట్టి వారి అభిప్రాయాలను, ఆలోచనలను అనుసరించి గ్రామీణ సమాజశాస్త్ర పరిధిని తెలుసుకోవచ్చు.

ఎన్.ఎన్. సిమ్స్ (N.N.Sims) గ్రామీణ సమాజశాస్త్ర పరిధిని గురించి వివరిస్తూ వ్యవసాయం మీద, వ్యవసాయ సంబంధిత వృత్తుల మీద ఆధారపడి జీవించే ప్రజల సహచర్యాన్ని గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుందని తెలియజేశాడు. సోరొకిన్, జిమ్మర్‌మన్‌ల అభిప్రాయం ప్రకారం దేశకాల పరిస్థితులలో పునరావృతమయ్యే స్థిరమైన గ్రామీణ జీవితాలలో ఉండే వ్యత్యాసాలను వివరించటమే గ్రామీణ సమాజశాస్త్ర పరిధిగా గుర్తించారు. జె.ఎమ్. గిల్లెట్ - గ్రామీణ సమాజశాస్త్రం భూమితో సర్దుబాటు వల్ల కలిగే ఫలితాలకు గ్రామీణ జీవితంలో అద్వితీయమైన ప్రాధాన్యత ఉంటుంది. వీటిని అధ్యయనం చేయడమే గ్రామీణ సమాజశాస్త్ర పరమావధిగా భావించాడు.

లోరికెల్‌సన్ గ్రామీణ సమాజశాస్త్ర పరిధిని ఇలా వివరించారు. గ్రామాలలోని సముదాయాల జీవితాలలోని ప్రధాన, ఉపప్రధాన అంశాలకు సంబంధించి మంచి అవగాహన కల్పించడమే గ్రామీణ అర్థశాస్త్ర పరిశీలన చేయాల్సిన పని. సముదాయాలతో సంబంధం ఉన్న అన్ని సంఘాల విధులను వివరిస్తుంది. ఈ అంశమే గ్రామీణ సమాజశాస్త్ర పరిధి విస్తృతిని సూచిస్తుంది. ఈ అంశమే గ్రామీణ సమాజశాస్త్రం నగరీకరణ, గ్రామీణీకరణ ప్రక్రియ ఫలితాలను వాటి ప్రభావాలను క్రమబద్ధంగా అధ్యయనం చేస్తుందని జిమ్మర్‌మన్ అభిప్రాయపడ్డాడు. అంతేకాకుండా నగరీకరణ, గ్రామీణీకరణ ప్రక్రియ విధానాలను, వాటి కారణాలను, ఫలితాలను గ్రామీణ సమాజశాస్త్రం అన్వేషిస్తుందని తెలియజేశాడు.

ఎ.డబ్ల్యు.హైస్ తన గ్రంథం 'రూరల్ సోషియాలజీ'లో గ్రామీణ సమాజశాస్త్ర పరిధిని గురించి ఇలా వివరించారు. సమూహ జీవితానికి సంబంధించిన సామాజిక దృగ్విషయాలను అధ్యయనం చేసేది గ్రామీణ సమాజశాస్త్రం. ఈ దృగ్విషయానికి సంబంధించిన అంశాలు గ్రామీణ సంస్థలు, విద్యావసరాలు, విలువలు, గ్రామ ప్రజల గతిశీలతల అభివృద్ధి, క్షీణత, పట్టణ - గ్రామ సంబంధాలు

కనిపిస్తాయి. షొరొకిన్ అభిప్రాయంలో గ్రామీణ సమాజశాస్త్రానికి రెండు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. అవి (1) గ్రామీణ, నగర దృగ్విషయాలలో ఉండే స్థిరమైన వ్యత్యాసాలను అధ్యయనం చేయడం (2) గ్రామీణ దృగ్విషయాలలో ఉన్న ప్రత్యేకాంశాలను విశదీకరించడం.

గ్రామీణ వాతావరణంలో నెలకొన్న మానవ సంబంధాల అధ్యయనమే గ్రామీణ అర్థశాస్త్ర పరిధి అని బెట్రాండ్ వారి అనుచరులు అభిప్రాయపడ్డారు. గ్రామీణ సమాజశాస్త్రం నిర్మితపరమైన, వస్తుపరమైన, సంస్థాగతమైన ప్రక్రియాతమైన విషయాలను శాస్త్రీయంగా అధ్యయనం చేస్తుంది. గ్రామీణ జీవితంపై నగరీకరణ ప్రక్రియ ప్రభావాన్ని గ్రామీణ సమాజశాస్త్రం పరిశీలిస్తుందని టైలర్ భావించాడు.

గ్రామ సముదాయ సంబంధాలు, గ్రామీణ సమాజవికాసం, సామాజిక సమస్యలు, వివిధ రకాల సామాజిక దృగ్విషయాలు గ్రామీణ సంస్థలు మొదలైన అంశాలన్నీ గ్రామీణ సమాజశాస్త్ర పరిధిలోకి వస్తాయి.

**అధ్యయనాంశాలు (Subject matter):**

గ్రామీణ సమాజశాస్త్ర పరిధిని విశ్లేషించేటప్పుడు కింది అంశాలను అధ్యయనం చేయవలసి ఉంటుంది. వీటిలో ముఖ్యమైనవి

1. గ్రామీణ సముదాయం - గ్రామీణ సమాజశాస్త్రం గ్రామీణ సముదాయ లక్షణాలు, ప్రత్యేక అంశాలు మరియు గ్రామీణ పరిసరాలు, సముదాయరూపాలు - వాటి కార్యకలాపాల గురించి అధ్యయనం చేస్తుంది.
2. గ్రామీణ సామాజిక నిర్మితి - గ్రామీణ సమాజశాస్త్ర పరిధిలో ప్రధానమైనది గ్రామీణ సామాజిక నిర్మితి. దీనిని గ్రామీణ సమాజశాస్త్రము అధ్యయనం చేస్తుంది.
3. గ్రామీణ సంస్థలు - సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య మరియు మత పరమైన సంస్థలన్నింటిని గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. సంస్థల తీరుతెన్నులను నిర్మాణం, విధులను గ్రామీణ సమాజంపై దాని ప్రభావాన్ని, సమాజం లో పాత్రని అధ్యయనం చేస్తుంది.
4. గ్రామీణ సంస్కృతి - గ్రామీణ ప్రజల సంస్కృతిని దానికి సంబంధించిన వివిధ విషయాలను గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది.
5. గ్రామీణ సామాజిక జీవనం - గ్రామీణ ప్రజల జీవన స్థితి గుతులు, ఆర్థిక, సామాజిక పరిస్థితులు, జీవన విధానం మొదలైన సామాజిక జీవనానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేస్తుంది.
6. గ్రామీణ సామాజిక వ్యవస్థాపన - గ్రామీణ సమాజశాస్త్రం గ్రామీణ సామాజిక వ్యవస్థాపననే కాకుండా గ్రామీణ సమాజ అవ్యవస్థని కూడ అధ్యయనం చేస్తుంది. గ్రామీణ సామాజిక వ్యవస్థాపనలో గ్రామీణ వివాహం, కుటుంబం, గ్రామీణ సామాజిక స్తరీకరణం, గ్రామీణ మత సాంస్కృతిక సంస్థలు మొదలగు అంశాలుంటాయి.
7. గ్రామీణ సామాజిక పరివర్తన - నగరీకరణ, పారిశ్రామికీకరణ, ఆధునీకరణ వల్ల గ్రామీణ జీవితంపై కలిగే ప్రభావాన్ని వాటివల్ల గ్రామాలలో మార్పులను గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది.
8. గ్రామీణ జనాభా - జనాభావృద్ధి, గ్రామాలలో జననాలరేటు మరణాల రేటు, శిశుమరణాలు తీరుతెన్నులు, గ్రామాల నుండి నగరాలకు వలసపోవటం, గ్రామాల నుండి గ్రామాలకు తరలిరావటం వంటి అంశాలను గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది.

9. గ్రామీణ సామాజిక సమస్యలు - గ్రామీణ ప్రాంతాలలోని సామజిక, ఆర్థిక అసమానత్వం, నిరుద్యోగిత, పేదరికం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత, మద్యపానం, ఋణాలు, నేరాలు, సామాజిక దురాచారాలు, మూఢనమ్మకాలు, అనారోగ్యం, కాలుష్యం మొదలైన సమస్యలను గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది.

10. గ్రామీణ ప్రణాళిక, పునర్నిర్మాణం - గ్రామీణ సమాజశాస్త్ర ప్రధాన లక్ష్యాలలో గ్రామీణ ప్రణాళిక రూపకల్పన ముఖ్యమైనది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరివర్తనలను అధ్యయనం చేసి ప్రగతి పదంలో పునర్నిర్మాణానికి ప్రణాళికలు ఏర్పరచటానికి గ్రామీణ సమాజశాస్త్రం దోహదపడుతుంది.

11. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు - గ్రామీణ ప్రజలపై అభివృద్ధి కార్యక్రమాల ప్రభావాన్ని, వివిధ వర్గాలకు వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను, వీటి అమలులో ఎదురయ్యే సమస్యలను, సామాజిక శాసనాల చర్యలు ఏ విధంగా గ్రామీణ ప్రజలకు ఉపకరిస్తున్నాయి. అనే గ్రామీణ ప్రగతికి సంబంధించిన అంశాలను గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది.

12. గ్రామీణ - నగర వ్యత్యాసం - గ్రామీణ సమాజశాస్త్రం గ్రామీణ, నగర వ్యత్యాసాలను అధ్యయనం చేస్తుంది. గ్రామీణ - నగర సామాజిక సంస్థల మధ్య ఉన్న ప్రత్యేకతలను, గ్రామీణ - నగర సంస్కృతుల మధ్య ప్రత్యేకతలను వాటి మధ్య సంబంధాలను అధ్యయనం చేస్తుంది.

## 1.6 భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం - అధ్యయన ప్రాముఖ్యత:

"భారతదేశం గ్రామాలలో ఉంది" అన్న గాంధీజీ మాటలు అక్షరసత్యాలు, గ్రామాలు భారతీయ సంస్కృతికి దర్పణాలు. భారతీయ సమాజానికి మూలస్తంబాలు. దేశ ప్రగతికి పురోగతికి కారకాలు. 75 శాతం పైగా ప్రజలు గ్రామీణ ప్రాంతాలలోనే జీవిస్తున్నారు. దేశం వ్యవసాయం మీద ఆధారపడి ఉంది. ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక భూమికను పోషిస్తుంది. గ్రామీణ జనాభా ప్రధానంగా వ్యవసాయ వృత్తిపై ఆధారపడతారు. వ్యవసాయ ఆధార ఆర్థిక వ్యవస్థ సామాజిక, రాజకీయ, మత సంస్థలను ప్రభావితం చేస్తుంది. గ్రామీణ సమాజ ప్రగతి వ్యవసాయం మీద ఆధారపడి ఉంది. దీని పట్ల అవగాహన ఏర్పడాలంటే భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం అధ్యయనం ఎంతైనా అవసరం.

దేశాభివృద్ధిలో గ్రామాలు ప్రధానపాత్ర పోషిస్తాయి. గ్రామాల నుండి దేశానికి ప్రధానంగా ఆదాయం వస్తుంది. గ్రామాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యపడుతుంది. దీనిని సాధించడానికి గ్రామాలను అభివృద్ధి చేసే సూత్రాలు, ప్రణాళికలు కావాలి. వీటిని రూపొందించడానికి గ్రామీణ సమాజశాస్త్రం ఆవిర్భవించింది.

వివిధ జాతులు, విభిన్న మతాలు, భాషలూ, ఆచారాలు కల్గి ఉన్న గ్రామీణ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి వాటి ప్రగతికి గ్రామీణ సమాజ సమగ్ర పరిశీలనకు గ్రామీణ సమాజశాస్త్రం ఉపకరిస్తుంది. దేశంలో గ్రామీణ సమాజశాస్త్రం ప్రాముఖ్యత ఎంతైన ఉంది.

భారతదేశంలో కుటుంబ వ్యవస్థకి ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి కుటుంబం చాలా ప్రాముఖ్యతని కల్గి ఉంది. అయితే గ్రామాలలో ఉమ్మడి కుటుంబాలు ఆధునికీకరణ, పాశ్చాత్యీకరణ పారిశ్రామికీకరణ, నాగరీకరణ ప్రభావం వల్ల విభిన్నమవుతున్నాయి. దీనికిగల కారణాలను, పర్యావసానాలను, తెలుసుకోవటానికి గ్రామీణ సమాజశాస్త్రం తోడ్పడుతుంది.

గ్రామీణ ప్రాంతాలలో కుల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. కులపరమైన కట్టుబాట్లు, ఆంక్షలు, నిషేధాలు, వివిధ కులాల మధ్య సంబంధాలు, అంటరానితనం వంటి దురాచారాలు వీటికి గల కారణాల్ని ఫలితాలను, పరిష్కార మార్గాల అన్వేషణకు

గ్రామీణ సమాజశాస్త్రం సహకరిస్తుంది. ప్రపంచంలో ఎక్కడలేని, కానరాని కులవ్యవస్థ వల్ల కలిగే అనర్థాలను వెలికి తీయ్యటానికి, వెలుగులోకి తీసుకురావడానికి, అవగాహనకి గ్రామీణ సమాజశాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామాలలోని భూస్వాములు, కౌలుదార్లు, ఉపకౌలుదార్లు వీరందరి మధ్య నెలకొన్న సామాజిక సంబంధాన్ని అధ్యయనం చెయ్యడం ద్వారా పరిస్థితిలో మార్పు తీసుకురావచ్చు. ఇల్లాంటి వాటి గురించి అవగాహన గ్రామీణ సమాజశాస్త్రం కల్పిస్తుంది.

గ్రామీణ సమస్యలైన పేదరికం, నిరుద్యోగిత, నిరక్షరాస్యత, అనారోగ్యం మొదలైన వాటికిగల కారణాలను తెలుసుకోవటానికి గ్రామీణ సమాజశాస్త్రం ప్రయత్నిస్తుంది.

అంగ్లేయుల పాలనలో గ్రామాల పరిస్థితి దుర్భరంగా ఉండేది. వీరి పరిపాలనకు పూర్వం గ్రామాలు స్వయం ప్రతిపత్తితోనూ, స్వతంత్రంగానూ ఉంది. ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థితిలో ఉండేవి. స్వతంత్ర భారతదేశంలో గ్రామాల పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇంకా మార్పు రావలసిన అవసరం ఉంది. గ్రామీణ సమాజాన్ని పునర్వ్యవస్థీకరణకు పునర్నిర్మాణానికి, ప్రగతికి గ్రామీణ సమాజశాస్త్ర అధ్యయనం ఎంతైన అవసరం. దీనివల్ల భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్ర అధ్యయన ప్రాముఖ్యత ఎంతైనా ఉంది.

## 1.7 సారాంశం :

గ్రామీణ సమాజశాస్త్రం, సమాజశాస్త్రంలో ఒక ప్రధానమైన విభాగము. గ్రామీణ సమాజాన్ని శాస్త్రబద్ధంగా అధ్యయనం చేసే శాస్త్రం. గ్రామీణ సమాజ నిర్మితిని, వ్యవస్థాపనను, పరిణామము మరియు ప్రకార్యములను వివరించే శాస్త్రం. గ్రామీణ ప్రజలలో పరస్పర చర్యలను, వివిధ సంస్థలను, వాటిలో వస్తున్న మార్పులను అధ్యయనం చేస్తుంది. గ్రామీణ సముదాయ సంబంధాలు, సామాజిక సమస్యలు, గ్రామీణాభివృద్ధి, ప్రణాళిక, పునర్నిర్మాణం, వంటి అనేక అంశాలు గ్రామీణ సమాజశాస్త్ర పరిధిలోకి వస్తాయి. వ్యవసాయంపై ఆధారపడే అభివృద్ధి చెందే భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్ర పాత్ర ఎంతైన ఉంది. విభిన్న మతాలు, కులాలు, ఆచారాలు, సంస్కృతులున్న గ్రామాలను అవగాహన చేసుకోవడానికి, గ్రామాల ప్రగతికి పునర్నిర్మాణానికి ప్రణాళికల రూపకల్పనకి గ్రామీణ సమాజశాస్త్రం ఉపకరిస్తుంది. గ్రామీణ సమాజ సమస్యల పరిష్కారానికి గ్రామీణ సమాజశాస్త్రం సహకరిస్తుంది. అందువల్ల భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్రం ప్రాముఖ్యత ఎంతైనా ఉంది.

## 1.8 ముఖ్యపదాలు :

గ్రామీణ సమాజం
గ్రామీణ సామాజిక నిర్మితి
గ్రామీణ సమూదాయం
గ్రామీణాభివృద్ధి

## 1.9 నమూనా ప్రశ్నలు:

1. గ్రామీణ సమాజశాస్త్రాన్ని నిర్వచించి దాని పరిధి, స్వభావాన్ని వివరించండి.
2. గ్రామీణ సమాజశాస్త్ర చారిత్రిక అభివృద్ధిని తెలపండి.
3. భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్ర అభివృద్ధిని వివరించండి.
4. గ్రామీణ సమాజశాస్త్ర అధ్యయనాంశాలను వివరించండి.
5. భారతదేశంలో గ్రామీణ సమాజశాస్త్ర అధ్యయన ప్రాముఖ్యతను తెలపండి.

## 1.10 చదువదగిన గ్రంథాలు :

1. Rural Sociology an introduction - P.C. Hub
2. Rural Sociology - S.L. Doshi & P.C. Jain
3. Rural Sociology in India - A.R. Desai
4. India's developing village - G.R. Madan
5. Introduction to Rural Sociology - J.B. Chitamb

ఆచార్య. ఆర్. విజయకృష్ణ నాయుడు

పాఠం - 2

# గ్రామీణ సముదాయము - నిర్వచనము - లక్షణములు

## 2.0. లక్ష్యం :

గ్రామీణ సముదాయమును నిర్వచించి, లక్షణములను వివరించుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


2.1. పరిచయము

2.2. గ్రామము - పుట్టుక

2.3. గ్రామీణసముదాయము - నిర్వచనము

2.4. గ్రామీణసముదాయము - లక్షణములు

2.5. ముగింపు

2.6. నమూనా ప్రశ్నలు

2.7. చదువదగిన గ్రంథాలు


## 2.1. పరిచయము

నిర్ణీత ప్రాంతంలో 'మేము', మనము అనే భావనతో నివసిస్తున్న సామాజిక సమూహము సముదాయము.

సముదాయాలు మూడు రకములు

1) ఆదిమ సముదాయము

2) గ్రామీణ సముదాయము

3) నగర సముదాయము

భారతదేశం 'గ్రామాలలో నివసిస్తోంది'. అంటే మనదేశంలో నేడు సుమారు 70 శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. గ్రామాలలో ప్రధాన వృత్తి వ్యవసాయం. గ్రామీణ ప్రజలు వ్యవసాయంపై, వ్యవసాయ సంబంధిత వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. మన దేశ సంస్కృతి గ్రామాలలో ప్రతిబింబిస్తుంది. అంతేకాక, మన దేశములో జాతీయాదాయములో అధిక భాగం గ్రామాలనుంచే వస్తోంది. ఇన్ని కారణాల వలన మన దేశములో గ్రామాలకు ప్రాధాన్యత కలదు.

## 2.2. గ్రామము - పుట్టుక

గ్రామసమాజంలో గ్రామం ఒక కేంద్రం. గ్రామాలలో గ్రామీణ జీవనం వెల్లివిరుస్తుంది. మానవ జీవన పరిణామంలో ఒక దశలో గ్రామం ఆవిర్భవించింది. మానవ చరిత్రలో తరువాత గ్రామం పెరిగి పెంపొందింది.

చరిత్రలో వ్యవసాయరంగ పుట్టుకకు, గ్రామాల పుట్టుకకు, అవినాభావ సంబంధమున్నది. మానవుడు సంచార జీవనం స్థిర నివాసానికి అలవాటు పడడంలో గ్రామం పుట్టుక ప్రధాన పాత్ర వహించింది. ఆదిమ మానవుడు ఆహారాన్ని అన్వేషిస్తూ సంచార జీవనాన్ని గడిపేవాడు. సంచార దశ నుండి మచ్చిక చేసుకున్న పశువుల సాయంతో సాగు వ్యవసాయానికి దిగినాడు. నాగలి కనుగొనడంతో స్థిర వ్యవసాయం

పెంపొందినది. ఆహార సరఫరా ఖచ్చితంగా లభించడానికి అదొక ప్రధాన ఆధారమయినది. మానవుని సంచార జీవనం అంతమై స్థిర నివాసం ప్రారంభమయినది. మానవులు స్థిరపడి వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ ఆధారంగా గ్రామాలను పెంపొందించారు. గ్రామాలలో స్థిర నివాసం ఏర్పరచుకుని జీవించడానికి వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా చేసుకున్నారు. మానవ జాతి చరిత్రలో ఇదొక ముఖ్యమైన దశ. సామాజిక మనుగడలో అప్పుడే ఉన్నత దశ ఆరంభమయినది.

## 2.3. గ్రామీణ సముదాయము - నిర్వచనము.

5,000 లోపు జానభా కలిగియుండి, తక్కువ జనసాంద్రత (చదరపు మైలుకు 1000 కంటే తక్కువ) కలిగి ఉండి, అధిక శాతం వ్యవసాయంపైన, వ్యవసాయ సంబంధిత వృత్తులపైన ఆధారపడి జీవించే ప్రజలు నివసించే ప్రాంతాన్ని గ్రామీణ సముదాయముగా నిర్వచించవచ్చును.

జనాభా ప్రాతిపదికగా వందలోపు జనాభా నివసిస్తున్న గ్రామీణ ప్రాంతాన్ని 'ఖండిక' అంటారు. 350 లోపు జనాభా నివసిస్తున్న ప్రాంతాన్ని 'ఖండిక గ్రామము' అంటారు. 1000 నుంచి 5000 జనాభా గల ప్రాంతాన్ని గ్రామము అంటారు. కొన్ని పెద్ద గ్రామాలు 10,000 జనాభా కూడా కలిగి ఉంటాయి. గ్రామాన్ని కొన్ని సందర్భాలలో 'ఊరు' అని కూడా పిలుస్తారు. బహుశా ఊరు అనే పదము చోళుల పరిపాలనా కాలం నుండి ప్రాచుర్యం పొంది ఉండవచ్చు. ఊరు వేరు పల్లె వేరు. సామాన్యంగా ఊరిలో రైతులు, పల్లె లేక గూడెంలో వ్యవసాయ కూలీలు నివసిస్తుంటారు.

## 2.4. గ్రామీణ సముదాయము - లక్షణములు :

గ్రామీణ సముదాయ లక్షణములను ఈ క్రింది విధంగా వివరించవచ్చు.

**1) వ్యవసాయం ప్రధాన వృత్తి :** గ్రామీణ సముదాయాలలోని ప్రజలు ఎక్కువ మంది వ్యవసాయం మీద ఆధారపడతారు. వ్యవసాయ కూలీలు కాక కొద్ది మంది ఇతర వృత్తుల వారు ఉన్నప్పటికీ, వారు కూడా వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాలతో జీవనం సాగిస్తుంటారు. రైతులకు కావలసిన పరికరాలు తయారు చేసేవారు, సేవలు చేసేవారు కూడా గ్రామాలలో ఉంటారు. వారు కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయం పైనే ఆధారపడుతుంటారు. వ్యక్తి పాత్రను ప్రభావితం చేసే అంశాలలో వృత్తి ప్రధానమయింది. వ్యవసాయమే ప్రధాన వృత్తి అయినపుడు లేక పరోక్షరంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నప్పుడు ఆ స్థితి, ఆవ్యక్తిని అనేక విధాల ప్రభావితం చేస్తుంది.

**2) ప్రకృతి మీద ఆధారం, ప్రకృతితో సంబంధం :** వ్యవసాయం వర్షాధార పంట, కాబట్టి గ్రామీణ సముదాయాలు ప్రకృతిపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. వ్యవసాయంతో సంబంధం ఉన్న వ్యక్తికి ప్రకృతితో నిత్య నూతన సంబంధం ఉంటుంది. గ్రామీణ సముదాయంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఆరోగ్యకరంగా ఉంటుంది. గ్రామీణ సముదాయంలోని ప్రజలు ఎక్కువగా ప్రకృతి అందించే సౌకర్యాలతో జీవిస్తారు. ఋతువులు మారడం, వర్ష సూచనలు మొదలగు వాటి గురించి గ్రామీణులకు సహజమైన అవగాహన ఉంటుంది. ఏ కాలంలో చేయవలసిన వ్యవసాయపు పనులను ఆ కాలాలలో చేస్తుంటారు. వేసవి కాలంలో భూమిని చదును చేయడం, పొలాలలోని రాళ్ళను, కలుపు మొక్కలను ఏరివేయడం, వర్షాకాలం రాగానే పొలాలు దున్ని విత్తనాలు వేసి నారు పోస్తుంటారు. గ్రామీణులు సహజంగా ప్రకృతిని బాగా ఎరిగినవారై ఉంటాయి. భూసారం, భూమిలో తేమ మొదలగు అంశాల గురించి శాస్త్రీయ శిక్షణ లేకుండానే తెలుసుకోగలుగుతారు. గడియారంతో నిమిత్తం లేకుండానే సమయం తెలుసుకోగలుగుతారు. స్వచ్ఛమైన గాలి, సూర్యరశ్మి అనుభవించడమే కాక, కాయకష్టానికి అలవాటుపడతారు.

**3) సముదాయ పరిమాణము :** గ్రామీణ సముదాయము పరిమాణములో చాలా చిన్నదిగా ఉంటుంది. గ్రామీణ ప్రజలకు విశాలమైన మైదాన ప్రాంతాలలో వ్యవసాయ భూములున్నప్పటికీ, వారు నివసించే ప్రాంతం చాలా తక్కువ పరిమాణంలో **ఉంటుంది.** సముదాయ పరిమాణం సముదాయంలోని అంశాలను ప్రభావితం చేస్తుంది.

**4) జనసాంద్రత :** గ్రామీణ సముదాయాలలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. ఒక చ॥కి॥మీ. కు 1000 కంటే తక్కువ జనాభా ఉంటారు. ఈ కారణంగా గ్రామీణ సముదాయాలలో నివాస భూములపై ఒత్తిడి తక్కువగా ఉంటుంది. జన సాంద్రత తక్కువగా ఉండడం వలన గ్రామీణ ప్రజలు అందరూ ఒకరికొకరు ఎరిగిన వారై ఉంటారు.

**5) జనాభా :** గ్రామీణ సముదాయాలలో సహజంగా తక్కువ జనాభా ఉంటారు. ఇందువలన గ్రామ ప్రజలు ముఖాముఖి సంబంధాలను కలిగి ఉంటారు.

**6) వ్యవసాయంలో కుటుంబము :** వ్యవసాయ గ్రామీణ సముదాయ ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయాన్ని గ్రామాలలో కుటుంబ సభ్యులందరూ కలసి నిర్వహిస్తారు. సభ్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క పని నిర్వహిస్తుంటారు. స్త్రీలు వ్యవసాయ పనులేకాక, పశువుల సంరక్షణ, పెరటితోట పెంపకం కూడా చేస్తుంటారు.

**7) ఉమ్మడి కుటుంబము :** గ్రామీణ సముదాయముల ముఖ్య లక్షణం ఉమ్మడి కుటుంబము. రెండు, మూడు తరాలకు చెందిన వ్యక్తులు ఒకే ఇంట్లో నివసిస్తుంటారు. కుటుంబ పెద్ద మాటను మిగిలిన సభ్యులు పాటిస్తారు. ఉమ్మడి నివాసము, ఉమ్మడి వంట, ఉమ్మడి ఆస్థి ఆదాయాలు, ఉమ్మడి సంస్కృతిని గ్రామీణ సముదాయ ప్రజలు కలిగియుంటారు.

**8) ప్రాధమిక సంబంధాలు :** గ్రామ సముదాయాలతో కల తక్కువ జనాభా, తక్కువ జన సాంద్రత, చిన్న పరిణామాల లక్షణాల వలన సముదాయంలోని ప్రజలు ప్రాధమిక సంబంధాలను కలిగి ఉంటారు. ఈ సముదాయాలలోని ప్రజల మధ్య సంబంధాలు కృత్రిమంగా కాక, సహజమైనవిగా ఉంటాయి. ముఖాముఖిగా ప్రజలు ఒకరికొకరు తెలిసి ఉంటారు. చుట్టరికం లేనప్పటికీ, వదినా, అక్కా, బావా మొదలయిన వరసలతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటారు. ప్రాధమిక సమూహాలకు ఉదాహరణగా ఈ గ్రామీణ సముదాయములను పేర్కొనవచ్చును.

**9) సాముదాయక చైతన్యం :** గ్రామీణ సముదాయాలలోని ప్రజలలో ఎక్కువగా మేము, మనము అను భావన ఉంటుంది. ప్రజల మధ్య పరస్పర చర్యలు ఎక్కువగా ఉంటాయి. అనేక సామూహిక కార్యకలాపాలలో పాల్గొనడం, పెళ్ళిళ్ళు, మొదలైన ముఖ్యమైన కార్యక్రమాలలో గ్రామీణులంతా హజరయ్యి, వాటికి తమ సహాయ సహకారాలను అందివ్వడం చేస్తుంటారు. అనారోగ్య ఆపద సమయాలలో ఒకరికొకరు తోడుగా నిలుస్తారు.

**10) సామాన్య జీవితం :** గ్రామీణ ప్రజలు సామాన్యమైన, నిరాడంబర జీవితాన్ని గడుపుతారు. వీరు ఆధునిక, నాగరిక కృత్రిమ జీవనానికి దూరంగా ఉంటారు. తమ ప్రవర్తనలో నిష్కపటంగా ఉంటారు. వీరు డాంబికంగా మాట్లాడరు. గ్రామీణ సముదాయంలోని ప్రజలు సహజంగా అమాయకులు, స్నేహశీలురు. ప్రశాంత జీవనాన్ని గడుపుతుంటారు. నీతి నియమాలను పాటిస్తారు. ఏ విధమైన మానసిక ఒత్తిడులకు లోను కాకపోవడం వలన వీరికి జబ్బులు కూడా తక్కువే. సామాజిక నేరాలు వీరిలో చాలా తక్కువ.

**11) సర్దుబాటు తత్వము :** సామాన్యంగా గ్రామీణ సముదాయములోని ప్రజలు కల్లాకపటం ఎరుగని వారు. నిజాయితీపరులు, ఈర్ష్యా ద్వేషాలు, స్వలాభాపేక్ష వారికి తక్కువగా ఉంటాయి. వీరికి సర్దుబాటుతత్వము, సహకార భావము ఎక్కువగా ఉంటాయి.

**12) సారూప్యత :** గ్రామీణ సముదాయంలోని ప్రజలు సామాజికంగా, మానసికంగా ఎక్కువ పోలికలను కలిగి ఉంటారు. వీరి వేషభాషలలో, నమ్మకాలలో, ఆలోచనలలో, విలువలలో, ప్రవర్తనలలో ఏకరూపత కనిపిస్తుంది.

**13) ఉమ్మడి సంస్కృతి :** గ్రామీణ సముదాయాలలో సాధారణంగా ఒకేరకమైన సంస్కృతి ఉంటుంది. సాంస్కృతిక విభేదాలు ఉండవు. గ్రామీణులందరూ పండుగలను, జాతరలను వానల కోసం చేసే పూజలను కలిసి చేస్తారు.

**14) కుల వ్యవస్థ :** గ్రామీణ సముదాయములలో కుల వ్యవస్థ కఠినంగా ఉంటుంది. కుల నిబంధనలను కుల సభ్యులు విధిగా పాటించాలి. కులాల మధ్య అంతరాలు ఉంటాయి. సాధారణంగా ఒక్కొక్క కులం వారు ఒక్కొక్క వీధిలో నివసిస్తుంటారు.

**15) కుల పంచాయితీలు :** గ్రామీణ సముదాయములలో ఏ కులానికి ఆ కులపు పంచాయితీలు ఉంటాయి. వివిధ కులాల మధ్య తగవులు వచ్చినపుడు వాటిని కుల పంచాయితీలు తీరుస్తాయి. కుల నిబంధనలు పటిష్టంగా అమలు జరిగేటట్లు చూస్తాయి. కుల నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానా వేయిడమే కాక, ఒకొక్కసారి కుల బహిష్కరణ శిక్షలు కూడా కుల పంచాయితీలు వేస్తాయి.

**16) మతంలో నమ్మకం :** గ్రామీణ సముదాయంలోని ప్రజలకు మతములో గట్టి నమ్మకముంటుంది. ప్రకృతి దేవతారాధనేకాక, గ్రామ దేవతలను కూడా పూజిస్తారు. ప్రత్యేక సమయాలలో జంతు బలులను కూడా ఇస్తారు. అనారోగ్యాలకు, కరువు కాటకాలకు దేవుని ఆగ్రహమే కారణమని భావిస్తారు. మూఢ నమ్మకాలు గ్రామీణులకు ఎక్కువ. ఏ అనారోగ్యం చేసినా గాలి పట్టిందనో, దెయ్యం పట్టిందనో తాయెత్తులు కట్టించుకుంటారు. టోటెమ్ (తమ మూలాధారంగా ఒక జంతువునో, పక్షినో, చెట్టునో భావించుట)ను పూజిస్తారు.

**17) గతిశీలత :** గ్రామిణ సముదాయాలలోని ప్రజలకు గతిశీలత తక్కువ. భూమిని భూ వసతిగా కాక, భూమాతగా భావించుట వలన గ్రామాలను వదలి ప్రజలు మరొక చోటకు వెళ్ళుటకు ఇష్టపడరు. వారు ఎంతో కాలంగా నివసిస్తున్న గ్రామాన్ని వదలుటకు అంగీకరించరు.

**18) జాజ్‌మాని పద్ధతి (యాజమాన్య పద్ధతి) :** సాధారణంగా గ్రామీణ సముదాయములలో జాజ్‌మాని లేక యాజమాన్య పద్ధతి అమలులో ఉంటుంది. ఒక కులపు సమూహము వారు వేరొక కులపు సమూహము వారికి తరతరాలుగా సేవలను అందించుట యాజమాన్య పద్ధతి. దీని వలన యాజమానులకు, సేవకులకు మధ్య సంబంధాలు స్థిరమైనవిగా ఉంటాయి. సేవలకు ప్రతిఫలంగా సేవలు చేసేవారు వస్తురూపేణా ప్రతిఫలాన్ని తీసుకుంటారు.

**19) బాల్య వివాహాలు :** సాధారణంగా గ్రామీణ సముదాయాలలో బాల్య వివాహాలు జరుగుతుంటాయి. ఒక్కొక్కసారి కుటుంబపెద్ద కుటుంబ సభ్యులను సంప్రదించకుండానే పెళ్ళిళ్ళు కుదురుస్తుంటారు.

**20) సామాజిక నియంత్రణ :** కుటుంబము, కుల పెద్దలు గ్రామీణ సముదాయాలలో సామాజిక నియంత్రణ 'ఏజన్సీ'లని చెప్పవచ్చు.

## 2.5. ముగింపు :

అయితే, ఈనాడు గ్రామీణ సముదాయ లక్షణాలను ఇదే విధంగా చెప్పడం సరికాదని భావించే వారున్నారు. ఎందుకంటే గ్రామాలలో మార్పులు సంభవించే కొద్దీ గ్రామీణ సముదాయాలలోని ప్రజల స్వభావాలలో కూడా మార్పులు చోటు చేసుకుంటాయి. నేడు భారతీయ సమాజంలో వివిధ ప్రాంతాలలోని వివిధ గ్రామాలు వివిధ రకాలుగా మార్పు చెందుతున్నాయి. గ్రామాలలోని ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. రవాణా, భావప్రసార సౌకర్యాలు, పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, విద్యా వ్యాప్తి, నూతన చట్టాలు మొదలైన వాటిని గ్రామీణ సముదాయాలలో మార్పులకు కారణాలుగా చెప్పవచ్చును.

## 2.6. నమూనా ప్రశ్నలు :

1. గ్రామీణ సముదాయములను గూర్చి వ్రాయుము ?
2. గ్రామీణ సముదాయమును నిర్వచించి, లక్షణములను తెలుపుము ?

## 2.7. చదువవదగిన గ్రంథాలు


1. ఎ.ఆర్. దేశాయ్ : రూరల్ సోషియాలజీ ఇన్ ఇండియా
2. గ్రామీణ సమాజ శాస్త్రం : తెలుగు అకాడమి


**డా॥ ఎం.ఎస్. పార్థసారథి**

పాఠం - 3.

# గ్రామములు - రకములు

## 3.0 లక్ష్యం

గ్రామాలలోని రకములను వివరించుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :


3.1. పరిచయము

3.2. గ్రామాల వర్గీకరణ ప్రాతిపదికలు

3.3. గ్రామాల వర్గీకరణ ప్రమాణాలు

3.4. గ్రామ సముదాయ నమూనాలు

3.5. నిర్మితి ఆధారంగా గ్రామాల వర్గీకరణ

3.6. వ్యవసాయ స్వభావాన్ని బట్టి గ్రామాల వర్గీకరణ

3.7. కులాలను బట్టి గ్రామాల వర్గీకరణ

3.8. భూమిపై యాజమాన్య ప్రాతిపదికగా గ్రామాల వర్గీకరణ

3.9. వివిధ గ్రామ స్వరూపాలకు గల కారణాలు.

3.10. ముగింపు

3.11. నమూనా ప్రశ్నలు

3.12. చదువదగిన గ్రంథాలు


## 3.1. పరిచయము :

భారతదేశము ప్రధానంగా పల్లె సీమలతోకూ డిన వ్యవసాయక దేశము. భారత జనాభాలో అత్యధికులు గ్రామాలలో నివసిస్తూంటారు. పూర్వము అవిభక్త భారతదేశంలో ఏడు లక్షలకు పైగా గ్రామాలు ఉండేవని అంచనా. అయితే దేశ విభజనానంతరము ఈ సంఖ్య మారింది. అయితే గ్రామాలలో నివసించే జనాభా నిష్పత్తిలో మాత్రం చెప్పుకోదగిన మార్పేమీ లేదు. వివిధ అంచనాల ప్రకారం దేశ జనాభాలో 70 నుంచి 80 శాతం వరకు గ్రామాలలో నివసిస్తుంటారు.

అనాదినుంచి భారతీయ సామాజిక వ్యవస్థలో గ్రామము ఒక మూలకాంశము. గ్రామీణ వ్యవస్థ భారతీయ సమాజానికి వెన్నెముక. భారత ఉపఖండమంతటాకూ డా గ్రామమనేది సామాజిక కేంద్రంగా, సాంస్కృతిక కేంద్రంగా ఉన్నప్పటికీ గ్రామీణ స్వరూపాన్ని, సమస్యలను చక్కగా అవగాహన చేసుకోవలెనంటే గ్రామీణ వర్గీకరణను తెలుసుకోవడం అవసరం.

## 3.2. గ్రామాల వర్గీకరణ ప్రాతిపదికలు :

వర్గీకరణకు కొన్ని ప్రాతిపదికలు తీసుకోవాలి అందులో దిగువ ఉదహరించినవి కొన్ని :

1. పరిమాణము, జనాభా భూ విస్తీర్ణము

2. కుల వ్యవస్థ

3. భూస్వామ్య నమూనా

4. అధికార నిర్మితి, ఆధిపత్యము, అంతస్తులు

5. వేర్పాటుస్థాయి (degree of Isolation)

6. స్థానిక సాంప్రదాయాలు

## 3.3. గ్రామాల వర్గీకరణ - ప్రమాణాలు :

గ్రామసమాజాలను వర్గీకరించడానికి సుప్రసిద్ధ సమాజ శాస్త్రజ్ఞులు కొన్ని ప్రమాణాలు ఏర్పరచినారు.

1) మానవుడి సంచార దశ నుంచి గ్రామంలో స్థిర నివాసరం ఏర్పరచుకున్న దశలో ఆవిర్భవించిన గ్రామాలను ఒక నమూనాగా వర్గీకరించి మూడు విధాలుగా వివరించినారు.

ఎ) సంచార వ్యవసాయ గ్రామాలలో ప్రజలు కొద్ది మాసాలపాటు ఇళ్ళల్లో ఉండటం

బి) వ్యవసాయంపై కొంతమేరకు ఆధారపడే జనాభా కొన్నేళ్ళపాటు ఒక చోట ఉండి, భూసారం పోవడంతో మరో చోటు ప్రవాసానికి వెళతారు.

సి) గ్రామాలలో శాశ్వతంగా ఉంటూ తరతరాలుగా స్థిరపడేవారు.

2) కొన్ని గ్రామాలను ఒక సమూహంగా పరిగణించుట మరొక పద్ధతి. ఈ పద్ధతిలో గ్రామంలో రైతులు ఒక చోట నివసిస్తారు. గ్రామం చుట్టుపట్ల పొలాలలో పని చేస్తారు. ఒకేచోట నివసించుట వలన జీవనంలో క్రమ పద్ధతి ఏర్పడుతుంది. మరికొందరు రైతులు తమ పొలాలలోనే నివసించడం వలన వారి సామాజిక జీవనం అనేక రీతులుగా ఉంటుంది.

3) సమాజంలో వైవిధ్యం, స్థిరీకరణ, చలనం, భూమి, యాజమాన్యం ఆధారంగా గ్రామాలను వర్గీకరించారు.

## 3.4. గ్రామ సముదాయ నమూనాలు :

గ్రామసముదాయాలను స్థూలంగా ఆరు నమూనాలుగా వర్గీకరించారు.

1. రైతుల ఉమ్మడి యాజమాన్యాలు

2. రైతుల ఉమ్మడి కౌలుదారీ విధానాలు

3. వ్యక్తిగత యాజమాన్యం కొందరు కౌలుదార్లు, కూ లీలు

4. వ్యక్తిగతంగా రైతులే కౌలుదార్లుగా ఉండుట.

5. భూస్వాముల వద్ద నియోగితులైనవారు

6. ప్రభుత్వం నియమించినవారూ, కూ లీలూ, మతపరమైన ఆస్తులలో పనిచేసేవారు, ప్రభుత్వ కమతాలలో పనిచేసేవారు.

భారతదేశంలో ప్రతి సంస్కృతీ ప్రాంతంలోను ఆ ప్రాంతంలో గ్రామల ప్రమాణము, జనాభాల విషయంలో ఆ గ్రామల వర్గీకరణకు వేరు వేరు పేర్లు ఉన్నాయి. ఉత్తర, మధ్య భారతదేశంలో ఖేదా (పాలెము) గావ్ (గ్రామము) కస్బా (పెద్ద గ్రామము), వీటికి గల తేడా స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణా ప్రాంతంలో కూ డా గుంపు, మజ్రా, గ్రామములకు గల తేడాలను గమనించవచ్చు. గుంపు లేదా గూడెం అంటే కొద్ది సంఖ్యలో ఉన్న గుడిసెల సమూహము. మజ్రా అంటే మరికొంత పెద్దదయిన శివారు. ఇక మూడోది అసలు గ్రామము. ఈ మూడు గ్రామీణ నివాస స్థానాల మధ్య భేదాలు వాటి పరిమాణానికి జనాభాకు మాత్రమే పరిమితం కాలేదు. మూడూ జానపద సమాజానికి చెందినవనే చెప్పవచ్చు. కానీ వాటి అంతర్ వ్యవస్థలోనూ, ఆర్థిక స్వయం సమృద్ధిలోనూ, బయట ప్రపంచంతో ఉండే సర్దుబాట్ల విషయంలోనూ, విశాల గ్రామసమాజంలో వాటికి ఉండే పరపతి, హోదాలలోనూ అవి ఎంతో భేదిస్తాయి. వీటినన్నింటినీ ఒకే దృష్టితో చూడకూడదు. పెద్ద గ్రామాలలో వారు తమకంటే తక్కువ నాగరికులనీ, గూడేలలో ఉండేవారు మొరటువారనీ భావిస్తుంటారు. చిన్న పల్లెల్లో ఉండే మనిషి పెద్ద గ్రామాల వారి పద్ధతులను అపనమ్మకంతోనూ, విమర్శనాత్మకంగా చూస్తాడు. అతనికి అంతరాత్మలో వారంటే భక్తీ, గౌరవము రెండూ ఉంటాయి. ఇతడు కూ డా తన పల్లెకంటే చిన్న పల్లెలలో నివసించేవారు, మొరటువారనుకుంటాడు. పెద్ద గ్రామాలలోని జనాభాలో అన్ని వృత్తులకు చెందిన కులాలూ ఉంటాయి కాబట్టి, అక్కడి ఆర్థిక, సాంఘిక, మత జీవిత విషయాలలో చిన్న గ్రామాలలో కంటే ఎక్కువ సమన్వయము, స్వయం సమృద్ధి కన్పిస్తుంది. చిన్న గ్రామాలలో కొన్ని వృత్తులకు చెందిన కులాలు లేనందువల్ల ఇతర నివాస స్థలాల మీద ఆధారపడవలసి రావచ్చు. ఎక్కువ కులాలు, అధిక జనాభా స్వీయ సమస్యల క్లిష్టత పెద్ద గ్రామాలలో ఉన్న కారణం వల్ల, అక్కడి వ్యవస్థ చిన్న గ్రామాలలో ఉండే దాని కంటే భిన్నము, నిజానికి, కొన్ని కొన్ని చిన్న పల్లెలను, శివార్లను పెద్ద గ్రామాలకు అనుబంధమయినవిగా కూ డా పరిగణించడం జరుగుతుంది. సొంత విషయాలలో ఎంత స్వేచ్ఛ ఉన్నా పొరుగున ఉన్న పెద్ద గ్రామస్థుల అభిప్రాయాల ప్రభావం చాలా వరకు వారి మీద పనిచేస్తుంది.

గ్రామంలో నరవర్గాలు (Ethnic Groups) కుల వ్యవస్థ దాని స్వభావాన్ని నిర్ణయిస్తాయి. పూర్తిగా గిరిజనులతో కూ డిన గ్రామ లక్షణాలు, స్వరూపము, సమస్యలు మిశ్రమ జనాభా ఉన్న గ్రామ లక్షణాలు, స్వరూపము, సమస్యలకు చాలా భిన్నము. గిరిజన గ్రామము అధికార రూపు రేఖలలో ఏకత్వ లక్షణం పొంది ఉంటుంది. ఆ గ్రామాలకు సంబంధించిన ఆచారాలు, సంస్కృతి మొదలయిన వ్యవహారాలమీద గిరిజనుల ఆధిపత్యానికి తిరుగులేదు. అయితే మిశ్రమ జనాభా అంటే ఒక వంక గిరిజనులు, ఇంకొకవంక హిందూ కులాలు లేదా వేర్వేరు భాషలు మాట్లాడే రెండు విభిన్న సంస్కృతులు ఉన్న సమాన హిందూ కులాల వర్గాలు కానీ లేదా హిందువులు, ముస్లిములు కాని ఒకే గ్రామంలో ఉంటే, దాని అంతరంగిక వ్యవస్థ, అధికారము మొదలైనవాటి స్వభావము వేరుగా ఉంటుంది.

గ్రామం పెద్ద పెద్ద పరిపాలక లేదా పారిశ్రామిక కేంద్రాలకు దగ్గరగా ఉన్నా, దూరంగా ఉన్నా గ్రామీణా వ్యవస్థా స్వభావం మీద, బాహ్య ప్రపంచం పట్ల దాని దృక్పథం మీద వాటి ప్రభావం ఉంటుంది. ఆధునిక వార్తా ప్రసార సౌకర్యాలు అందుబాటులో ఉంటే ఆ గ్రామం తీరు తెన్నులు కూ డా మారుతూనే ఉంటాయి. ఈ మూల కారణాలన్నింటినీ గ్రామాలను వర్గీకరించేటప్పుడు తెలుసుకొనవలసిన అవసరం ఉంది.

గ్రామ నివాస స్థానాలనేవి కొన్ని ప్రాంతీయ, స్థానిక సాంప్రదాయాలకు అనుగుణంగా ఏర్పడుతుంటాయి. వేషధారణ, మాటతీరు, నడవడి గృహనిర్మాణము, గృహ నిర్మాణ పథకము ఇవన్నీ ఆ ప్రాంతపు సంస్కృతిని నిర్ణయించిన రీతులను అనుసరించి ఉంటాయి. అందుచేత వివిధప్రాంతాల గ్రామ వ్యవస్థలను పరిశీలించినప్పుడు విభిన్నత గోచరిస్తుంది. ఈ ప్రాంతీయ విభేదాలు తప్ప గ్రామాలకు సంఘపరమైన సమైక్యము ఉన్నది. ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. కొన్ని గ్రామాలు శాంతియుతంగాను, కొన్ని గ్రామాలు అశాంతితోను ఉంటాయి, కొన్ని గ్రామాలు దాన ధర్మాలకు, న్యాయానికి నిలయాలయితే, మరికొన్ని నైచ్యానికి పెట్టింది పేరుగా ఉంటాయి. కొన్ని గ్రామలు సవ్యమైనవని, నిక్కచ్చిగా ఉండేవని ప్రసిద్ధిపొందితే, మరికొన్ని భ్రష్టమయినవిగా పేరుపడినాయి. పేచీకోరుతనము, డంబము కొన్ని గ్రామాల విలక్షణాలయితే, కొన్ని గ్రామాలు తమ మంచితనాన్ని ఎప్పుడూ పెంపొందించుకుంటాయి. అట్లాగే, సహకార స్వభావము ఉండడం, లేకపోవడంకూ డా కొన్ని గ్రామాల తీరును వ్యక్తీకరించవచ్చు. ఈ లక్షణాలకు మూలము స్థిరమయిన స్థానిక సాంప్రదాయాలుగానీ, లేదా ఆయా సమయాలలో కలగా పులగంగా పనిచేసే అనేక కారకాలుగానీ అవుతాయి. .ఇవి అన్నీ కూ డా గ్రామానికి ఒక ప్రత్యేకతను ఆపాదిస్తాయి.

## 3.5. నిర్మితి ఆధారంగా గ్రామాల వర్గీకరణ :

గ్రామాలు నిర్మితిని బట్టి, వాటి స్వరూప స్వభావాలను బట్టి అనేక రకాలుగా వర్గీకరింపబడ్డాయి. నిర్మితిని బట్టి ప్రఖ్యాత మానవశాస్త్రవేత్త సమాజశాస్త్రవేత్త అయిన శ్రీమతి ప్రొఫెసర్ ఐరావతీకార్వే గ్రామాలను ఈ క్రింది విధంగా వర్గీకరించినారు. అవి

1) కేంద్ర నివాస ప్రాంతాలు (Nucleated villages)

2) సరళ రేఖా గ్రామాలు (Line Villages)

3) నిక్షేపిత గ్రామాలు (Dispersed Villages)

నిక్షేపిత గ్రామాలు రెండు రకాలు అవి :

1) ఇళ్ళు, పొలం కలిసి ఉన్న గ్రామాలు

2) చెదురుమదురుగా ఇళ్ళు ఉన్న గ్రామాలు

### కేంద్ర నివాస ప్రాంతంగల గ్రామాలు :

ఈ రకమైన గ్రామాలు ఆంధ్రదేశంలో ఎక్కువ. ప్రతిగ్రామం ఒక పద్ధతిగా నిర్మాణమై ఉంటుంది. గ్రామం తాలుకు పొలాలు గ్రామం చుట్టు ప్రక్కల, గ్రామం పొలిమేర లోపల ఉంటాయి. రైతులు, వ్యవసాయకూ లీలు, ఇతర వృత్తులు చేసేవారు ఆ గ్రామంలో ఇళ్ళు కట్టుకుని నివసిస్తుంటారు. ఈ రకమైన గ్రామాలకు పద్ధతైన సామాజిక వ్యవస్థకూ డా ఉంటుంది. చోళుల కాలం నాటి గ్రామాలను పరిశీలించినట్లయితే గ్రామ నిర్మాణంలో ఎన్నో విశేషాలు విశదమవుతాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్‌లలో కేంద్ర నివాస ప్రాంత గ్రామాలు ఎక్కువగా కనిపిస్తాయి. సూక్ష్మంగా చెప్పాలంటే ఈ రకమైన గ్రామాలలో గ్రామం మధ్యలో ప్రజలు నివసించే ఇళ్ళు ఉంటాయి. ప్రజలు నివసించే నివాస స్థలాలు వారి పొలాల నుండి దూరంగా ఉంటాయి. గ్రామం మధ్యలో నివాస గృహాలు, దేవాలయం, పాఠశాల, నీళ్ళ చెరువు ఉంటాయి. ఒక ప్రధాన రహదారి ఉంటుంది. గ్రామం లోపలే సరుకుల దుకాణాలు ఉంటాయి. గ్రామాలలో నివాస ప్రదేశం నిర్దిష్టంగా కన్పిస్తుంది. ఒక గ్రామంలోని పొలాలు ఇంకొక గ్రామ క్షేత్రంలోనికి చొచ్చుకొని పోతాయి. రెండు గ్రామాల మధ్యగా కొండలు, పంటకాలువలు సరిహద్దులుగా ఉంటాయి. గ్రామాల మధ్య దూరం ఎక్కువగా ఉండదు. పొలాలను కాలినడకన దాటుకొని మరొక గ్రామానికి చేరుకోవచ్చును. వివిధ గ్రామాల ప్రజల మధ్య అన్యోన్య సంబంధాలుంటాయి. సన్నిహితంగా ఉన్న గ్రామాల సంస్కృతి జీవన విధానాలలో ఎంతో సారూప్యం గోచరిస్తుంది.

కేంద్ర నివాస ప్రాంత గ్రామాల ప్రధాన లక్షణ మేమిటంటే ఈ గ్రామాలలో ఒక పెద్ద వీధి ఉంటుంది. ఈ వీధి దాని చుట్టూ ఉన్న నివాస ప్రాంతాలకు కేంద్రంగా ఉంటుంది. ఈ కేంద్ర ప్రాంతం చుట్టూ చిన్న చిన్న నివాస ప్రాంతాలు అల్లుకొని పోయి గ్రామంగా నిర్మితమవుతుంది. ఈ కేంద్ర ప్రాంతాన్ని తెలంగాణాలో గ్రామకంఠం అని పిలుస్తారు. గ్రామంలోని కార్యాలయాలు, దేవాలయాలు, పాఠశాలలు, వ్యాపార దుకాణాలు, రవాణా సౌకర్యాలు ఈ ప్రాంతంలోనే ఉంటాయి. గ్రామాలలోని ప్రధాన నివాస ప్రాంత ప్రజలు, ఉప నివాస ప్రాంత ప్రజలు తమ అవసరాలను తీర్చుకునేందుకు ఈ కేంద్ర ప్రాంతానికే వస్తారు.

సరళరేఖా గ్రామాలు : రోడ్డుకు ఇరువైపులా నివాస గృహాలు వ్యాపించి ఉండే గ్రామాలు, సరళరేఖా గ్రామాలు అంటారు. ఈ గ్రామాలలో ఇళ్ళు రోడ్డుకిరువైపులా ఉంటాయి. అంటే రోడ్డు వెంబడి వరుసగా మనకు అనేక గ్రామాలు కనిపిస్తాయి. రోడ్డు ప్రక్కగా ఎక్కువ ఇళ్ళు ఉంటాయి. సరళరేఖలో ఉన్న గ్రామాలు ఎక్కువగా జాతీయ రహదారులు ఉన్న ప్రాంతాలలో ఏర్పడతాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా కొన్ని కారణాల వలన ఇండ్ల సముదాయాలు ఏర్పడినపుడు వాటిని 'సరళరేఖ' గ్రామాలు అంటారు. ఈ గ్రామాలకు రెండు లక్షణాలు సర్వసాధారణంగా ఉంటాయి.

1. ప్రధాన రహదారికి ప్రక్కన ప్రజలు ఇండ్లు నిర్మించుకోవడం

2. గ్రామాలకు పొడవు ఎక్కువగా ఉండడం.

గ్రామాల మధ్య స్పష్టమైన ఎల్లలు, సరిహద్దులు కన్పించవు. ఒక గ్రామం, ఇంకొక గ్రామం కలిసిపోయి గ్రామమంతా ఒకే రీతిగా కనిపిస్తుంది. ఒక గ్రామానికి మరొక గ్రామానికి మధ్య తేడాను వెంటనే గమనించలేము. ఎక్కడ గ్రామం మొదలయిందో మరెక్కడ ఆగిపోయిందో వెంటనే తెలియదు. క్రొత్తవారు ఈ గ్రామాల సరిహద్దులను తెలుసుకోలేరు. ఈ గ్రామాలలోని ఇళ్ళు ప్రక్కప్రక్కనే వుండి, ఒకే రేఖలో అవిచ్ఛిన్నంగా సాగిపోతుంటాయి. రెండు ఇళ్ళ మధ్య ఉమ్మడిగా గోడ సరిహద్దుగా ఉంటుంది. రోడ్డు వెంబడి ఇళ్ళ వెనుకగా వ్యవసాయ భూములుంటాయి. ఇటువంటి గ్రామాలు మన రాష్ట్రంలో అక్కడక్కడా కనిపిస్తాయి. అయితే రాజస్తాన్ నుంచి సూరత్ వరకూ ఇటువంటి అనేక గ్రామాలను గమనించవచ్చు. ఇంకా ఒరిస్సా, గుజరాత్ రాష్ట్రాలలో కూ డా ఇటువంటి గ్రామాలను చూడవచ్చు. ఇళ్ళ మధ్య సన్నని కాలి బాటలుంటాయి. ఈ గ్రామాలలోని ప్రజల మధ్య గాఢమైన సాన్నిహిత్యం నెలకొని ఉంటుంది. ఈ విధమైన గ్రామరూపాలు భారతదేశంలోనే కాక, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ దేశాలలోను, థాయిలాండ్‌లో నదుల ప్రక్కన కూ డా కనిపిస్తాయి.

**విక్షేపిత గ్రామాలు (Dispersed villages) :** రైతు తన కుటుంబంతో తన పొలములోనే ఇల్లు నిర్మించుకుని నివసించే పద్ధతి వలన విక్షేపిత గ్రామాలు ఏర్పడతాయి. ఈ విధమైన గ్రామాలు పొలాల మధ్యనే ఏర్పాటై ఉంటాయి. పొలాల మధ్యనే ఇళ్ళు కట్టుకొని నివసించడాన్ని విక్షేపిత గ్రామాలుగా పరిగణిస్తారు. అంటే వ్యవసాయ కమతాల మధ్య మనకు అక్కడక్కడా గుంపులు గుంపులుగా ఇళ్ళు కన్పిస్తుంటాయి. ఇక్కడ వ్యక్తి తన పొలం మధ్యనే ఇల్లు నిర్మించుకుని జీవిస్తారు. సాధారణంగా ఒక బంధువర్గానికి చెందినవారు ఒకే చోటు పొలంలో ఇళ్ళు గుంపుగా కట్టుకుంటారు. ఈ ఇళ్ళ గుంపులు దూరదూరంగా వుంటాయి. ఒక ఇళ్ళ గుంపుకు మరొక ఇళ్ళ గుంపుకు మధ్య ఒక మైలు దూరం ఉండవచ్చును. వ్యవసాయ కమతాల మధ్య నివసిస్తూ, వ్యవసాయ పనులను పర్యవేక్షిస్తుంటారు. ఒక ఇంటి నుంచి మరొక ఇంటికి వెళ్ళాలంటే పొలాలలోనుంచి నడిచి వెళ్ళవలసి ఉంటుంది. ఒకరి వ్యవసాయ కమతానికి, మరొక వ్యవసాయ కమతానికి మధ్య సరిహద్దు గుర్తులు తప్ప మరే విధమైన తేడా కన్పించదు. ఇటువంటి గ్రామాలలో వ్యవసాయ ప్రాంతానికి, నివాస ప్రాంతానికి మధ్య తేడా ఉండదు. ఎందుకంటే పొలాల మధ్యనే ఇళ్ళుంటాయి. ఆ ఇళ్ళను ఆనుకునే ధాన్యపు కొట్టు వ్యవసాయ సామానులు భద్రపరచే గది, పశువుల కొట్టము మొదలయినవి ఉంటాయి. ఈ విధమైన గ్రామాలు ప్రధానంగా దక్షిణ భారతదేశంలోని కేరళ, మలబారు ప్రాంతాలలో కన్పిస్తాయి.

పై గ్రామాలే కాక భౌతిక అంశ ప్రమాణాల ఆధారంగా గ్రామాలను ఈ క్రింది విధంగా కూ డా వర్గీకరించవచ్చు.

**1. గుండ్రంగా ఉండే గ్రామాలు :** ఈ గ్రామంలో ఇళ్ళు వర్తులాకారంలో నిర్మించబడి ఉంటాయి. ఈ గ్రామాలలో ఒక ఇంటికి మరొక ఇంటికి దూరం తక్కువగా ఉంటుంది.

**2. వ్యాపార కేంద్ర నివాస ప్రాంతాలు :** ఈ విధమైన గ్రామాలు ప్రపంచంలో అనేక ప్రాంతాలలో ఉన్నాయి. ఈ గ్రామాలు ప్రధానంగా ఆర్థిక ప్రాతిపదికన ఏర్పడతాయి. ఈ గ్రామాలు ప్రధానంగా వస్తువుల సరఫరాకు, పంపిణీ చేయడానికి ఆహార పదార్థాలను అందించడానికి, పెట్రోలు బయు సౌకర్యం వర్క్ షాపులు మొదలైన సేవలను అందించడానికి ఏర్పాటవుతాయి. ఈ గ్రామాలలో ప్రధానంగా వ్యాపారస్తులు ఉంటారు. వ్యవసాయదారులు నివసించరు.

**3. కుగ్రామాలు :** ఇవి చాలా చిన్న గ్రామాలు. ఇవి మామూలుగా పెద్ద గ్రామాలకు చాలా దూరంగా ఉంటాయి. ఈ గ్రామాలలో ప్రజలకు కావలసిన వస్తుసేవలు అందుబాటులో వుండవు. ఈ గ్రామాలలోని ప్రజలు తమకు కావలసిన వస్తువులను పెద్ద గ్రామాలకు వెళ్ళి కొనుగోలు చేస్తారు.

## 3.6. వ్యవసాయ స్వభావాన్ని బట్టి గ్రామాల వర్గీకరణ :

ప్రజల జీవనాధారమైన వ్యవసాయ స్వభావాన్ని బట్టి కూ డా గ్రామాలను వర్గీకరించవచ్చును. అవి :

**1. వలస వ్యవసాయ గ్రామాలు :** శీతోష్ణస్థితిలో వచ్చే మార్పులను బట్టి, పంటలు స్థితిగతులను బట్టి, ప్రజలు తమ నివాస ప్రాంతాలను మార్చుకుంటారు. అంటే వ్యవసాయానికి అనుకూ లమైన వాతావరణం ఉన్నంతవరకూ ఒకే గ్రామంలో నివసించి, తర్వాత కొంత కాలం మరొక ప్రాంతానికి తరలి వెళ్ళిపోయే పరిస్థితి ఉంటే దానిని వలస వ్యవసాయ గ్రామం అంటారు. మన దేశంలో ముఖ్యంగా హిమాలయాలలో కొంతకాలం పొలం పనులు కొనసాగించి ఆ తర్వాత మంచు ఎక్కువగా కురిసే కాలంలో వేరొక ప్రాంతానికి వెళ్ళిపోతారు. మళ్ళీ పంటల కాలంలో పాత గ్రామాలకు చేరుకుంటారు.

**2. స్వల్ప కాలిక వ్యవసాయ గ్రామం :** వ్యవసాయపు పనుల కాలంలో స్వగ్రామంలో ఉండి మిగతా సమయంలో మరొక గ్రామానికి వెళ్ళడాన్ని స్వల్పకాలిక వ్యవసాయ గ్రామం అంటారు. అంటే తాముఉంటున్న గ్రామాలలో ఏడాది పొడవునా పనిగాని లేకపోతే పొలం పనులు ముమ్మరంగా ఉన్న సమయంలో అక్కడ ఉండి, ఆ తర్వాత మరొక ప్రాంతానికి ప్రజలు తరలి వెళ్తుంటారు. ఇలాంటి గ్రామాల వారు తమ స్వగ్రామాలలో స్థిరాస్తులను చెప్పుకోతగ్గస్థాయిలో ఉంచుకోరు.

**3. స్థిర వ్యవసాయ గ్రామాలు :** జీవ నదులు ఉండి వ్యవసాయానికి అనుకూ లమైన శీతోష్ణస్థితి సారవంతమైన భూములు ఉన్న ప్రాంతాలలో స్థిర నివాస గ్రామాలు ఉంటాయి. ఇటువంటి ప్రాంతాలలో ప్రజలు తరతరాలుగా స్థిర నివాసమేర్పరచుకుని నివసిస్తుంటారు. వ్యవసాయ పనులు లేని కాలంలో ఇతర అనుబంధ వృత్తులను ఎన్నుకుంటారు. ఇటువంటి గ్రామాలలో జనాభా పెరిగి పట్టణాలుగా కూ డా వృద్ధి చెందుతుంటాయి. మన దేశంలో గంగా, కృష్ణా గోదావరి వంటి జీవనదుల పరీవాహక ప్రాంతాలలో ఇటువంటి అనేక గ్రామాలను గమనించవచ్చు.

గ్రామ స్వరూపాన్ని బట్టి వారి జీవన విధానం, సంస్కృతి రూపొందుతాయి. వలస గ్రామాలలో తాత్కాలిక నివాసం వలన స్థిర జీవన విధానం ఉండదు. అదే స్థిర నివాస గ్రామాలలో శాశ్వత సంస్కృతి విలసిల్లుతుంది.

## 3.7 : కులాలను బట్టి, గ్రామాల వర్గీకరణ :

కుల ప్రాతిపదికన గ్రామాలను ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చు. అవి :

**1) ఏకకుల గ్రామాలు :** ఈ గ్రామాలలో ఒకే కులస్తుల కుటుంబాల వారు నివసిస్తారు. ఈ గ్రామంలోని ఆర్థిక వనరులు, రాజకీయ పలుకుబడి, సామాజిక ప్రతిష్ఠ మొదలైన అంశాలన్నీ ఈ కులస్తుల వారి చేతులలోనే ఉంటాయి. ఈ ఏక కుల గ్రామాలలో ఉత్పత్తి కార్యకలాపాలలో మిగతా కులాల వారు ఇతర గ్రామాల నుంచి ప్రతిరోజూ వచ్చి కార్యకలాపాలలో పాల్గొని సాయంత్రానికి వారి గ్రామాలకు తిరిగి వెళ్ళిపోతారు. ఈ ఏకకుల గ్రామాలకు ఉదాహరణగా పూర్వపు అగ్రహార గ్రామాలను పేర్కొనవచ్చు. ఈ గ్రామాలు ఈనాడు చాలా అరుదు. నగరీకరణ ప్రభావం వలన ఈ గ్రామాలు కూ డా అనేక మార్పులకు లోనవుతున్నాయి.

**2) బహుకుల గ్రామాలు :** ఈ గ్రామాలలో అనేక కులాలకు సంబంధించిన కుటుంబాలు నివసిస్తాయి. భారతదేశంలోని గ్రామాలలో ఎక్కువ శాతం ఈ విధమైనవని చెప్పవచ్చును. ఈ గ్రామాలలోని భూములు వివిధ కులాలకు చెందినవై ఉంటాయి. ఈ గ్రామాలు సామాజికంగా ఆర్థికంగా చైతన్యవంతంగా ఉంటాయి. ఈ గ్రామాలలో అనేక వృత్తులు చేసేవారు నివసిస్తుంటారు.

పైన చెప్పిన వర్గీకరణ కాక, గ్రామాలను ఈ క్రింది విధంగా కూ డా వర్గీకరించవచ్చును. అవి.

1) నగరీకరణ ప్రభావానికి లోనైన గ్రామాలు

నగరీకరణ ప్రభావానికి లోనుగాని గ్రామాలు

ప్రతిరోజూ అనేకమంది ప్రజలు నగరాలకు వెళ్ళి వస్తుండడం వలన నగర ప్రభావం వారి మీద తద్వారా గ్రామస్థుల మీద అనేక రకాలుగా ఉంటుంది. దీని వలన గ్రామీణ సంబంధాలలోను, గ్రామీణ వ్యవస్థలోను గ్రామీణ ఆచార వ్యవహారాలలోను అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ గ్రామాలను అధ్యయనం చేసేటప్పుడు ఆ గ్రామం నగర ప్రభావానికి లోనయ్యిందా ? లేదా ? అనే అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

## 3.8. భూమిపై యాజమాన్య ప్రాతిపదికగా గ్రామాల వర్గీకరణ :

భూమిపై యాజమాన్య ప్రాతిపదికగా కూ డా గ్రామాలను ఈ క్రింది విధముగా వర్గీకరించవచ్చును. అవి

1. రైత్వారీ గ్రామాలు
2. సమిష్టి గ్రామాలు లేక ఉమ్మడి గ్రామీణ పద్ధతి
3. జమిందారి గ్రామాలు

**రైత్వారీ గ్రామాలు (రైత్వారీ విధానం) :** ఈ విధానాన్ని తమిళనాడులో 1792లో ప్రవేశపెట్టినారు. తరువాత మహారాష్ట్ర బొంబాయి, బీహార్, అస్సాం మొదలైన రాష్ట్రాలకు దీనిని విస్తరింపచేయడం జరిగింది. రైత్వారీ విధానంలో భూహక్కును కలిగిన రైతు ప్రభుత్వానికి నేరుగా శిస్తు చెల్లింస్తుంటాడు. ప్రభుత్వానికి భూమిశిస్తు చెల్లించే బాధ్యత భూకామందు మీద ఉంటుంది. సేద్యగానికి, ప్రభుత్వానికి మధ్య దళారులు, మధ్యవర్తులు ఉండరు. రైతుకు తన భూ ఆస్థిని ఇతరులకు దానం చేయడానికి గానీ, అమ్మడానికి గానీ, ఋణదాతలకు తాకట్టు పెట్టడానికి గానీ హక్కు ఉంటుంది. ప్రభుత్వం నిర్ణయించిన శిస్తు చెల్లించినంత కాలం భూమి రైతు యాజమాన్యం క్రిందే ఉంటుంది. దేశంలో ఉండే భూమి మొత్తం ప్రభుత్వానిదే అయినప్పటికీ వాస్తవానికి ఈ పద్ధతిలో రైతే భూమికి యజమాని అని చెప్పవచ్చు. రైత్వారీ విధానంలో ప్రభుత్వం భూమిని ఆక్రమించుకున్న రైతులకు యాజమాన్య హక్కును శాశ్వతంగా ప్రసాదిస్తుంది.

రైత్వారీ పద్ధతిలో ప్రభుత్వానికీ, రైతుకూ ప్రత్యక్ష సంబంధం ఉండటం వలన ఎన్నో ప్రయోజనాలు చేకూ రుతాయి. భూసారము, ...క్కారకు వచ్చే పంటదిగుబడి, ఉత్పత్తి ఖర్చులు, మొదలైన కొన్ని ముఖ్యమైన అంశాలను అనుసరించి ప్రభుత్వం భూమిశిస్తును ప్రత్యక్షంగా నిర్ణయిస్తుంది. అయితే రైతు చెల్లించే భూమిశిస్తును ప్రభుత్వం అప్పుడప్పుడు తగ్గించవచ్చును. లేదా హెచ్చించవచ్చును. అనగా అతివృష్టి, అనావృష్టి లేదా ఇంకేదైనా కారణాల వలన పంటలు పండనప్పుడు ప్రభుత్వం శిస్తు తగ్గిస్తుంది లేదా ఒక్కొక్కసారి పూర్తిగా శిస్తును రద్దు చేస్తుంది. 20 లేదా 30 సంవత్సరముల కొకసారి శిస్తు నిర్ణయం ప్రభుత్వం చేస్తుంది. ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధి కోసం కూ డా చర్యలు తీసుకుంటుంది.

ఈ విధానంలోని ముఖ్యమైన అంశం ఏమిటంటే ఇందులో భూఖండ ప్రక్రియకు అంతగా తావులేదు. పైగా ప్రభుత్వానికి, రైతుకూ మధ్య ప్రత్యక్ష సంబంధాలు ఉంటాయి. కానీ ఈ పద్ధతిలో కూ డా రైతులు తమ ఆధీనంలో ఉన్న భూములను ఇతర రైతులకు కౌలుకు ఇవ్వడం వలన ఈ విధానం లోపభూయిష్టంగా తయారైనది. రైత్వారీ విధానం అమలులో ఉన్న ప్రాంతాలలోని భూమి వ్యవసాయేతరుల ఆధీనం కావడంతో క్రమేపీ వ్యవసాయ కూ లీల సంఖ్య కూ డా పెరిగింది. క్రమంగా కమతాల పరిమాణం (Size) కూ డా చాలా తగ్గింది. ఈ విధానంలో శిస్తు నిర్ణయ పద్ధతి ఖచ్చితంగా లేదని, చాలా వరకు అధికారుల అంచనాలను బట్టి, ఊహలను బట్టి శిస్తు నిర్ణయించడం జరుగుతుందని ఆర్థిక శాస్త్ర వేత్తలు, మేధావులు అభిప్రాయ పడినారు. శిస్తు నిర్ణయించే పద్ధతి అశాస్త్రీయమైనదని భావించారు. అంతకంటే ముఖ్యమైన ...యమేమిటంటే ఈ వ్యక్తిగత శిస్తు విధానం, గ్రామీణ సాముదాయక జీవితాన్ని సమూలంగా నష్టపరచింది.

**సమిష్టి గ్రామాలు లేక ఉమ్మడి గ్రామాలు (ఉమ్మడి గ్రామీణ పద్ధతి) (Joint Village System)**

ఈ పద్ధతిని మహల్వారీ పద్ధతి అని కూ డా అంటారు. ఉమ్మడి గ్రామీణ పద్ధతి గల గ్రామాలను సమిష్టి ఆధిపత్యం గల గ్రామాలు అనికూ డా అంటారు. ఉమ్మడి గ్రామీణ పద్ధతి మొదటగా ఆగ్రా, అయోధ్యలో అమలులోనికి వచ్చింది. ఆ తర్వాత పంజాబు రాష్ట్రానికి వ్యాపించింది. కాల్వర్ట్ (Calvart) చెప్పినట్లుగా ఉమ్మడి గ్రామీణ పద్ధతిలో గ్రామీణ సముదాయాలు గ్రామంలోని భూమి, గడ్డి, చెట్టు,

భవనాలు మొదలైన వనరులపై ఉమ్మడి యాజమాన్యం అధికారం చట్టబద్ధంగా కానీ, సాంప్రదాయికంగా గానీ సంక్రమించవచ్చును. ఈ పద్ధతిలో గ్రామంలో ఉండే భూమి అంతా గ్రామస్థులందరికీ చెందిన ఉమ్మడి ఆస్తిగా పరిగణించడం జరిగేది. అందువల్ల ప్రభుత్వం మొత్తం భూమి మీద శిస్తు విధించేది. ఈ శిస్తు వసూలు చేయడానికి గాను ఒక గ్రామ పెద్దను నియోగించడం లేదా నిర్ణయించడం జరిగేది. శిస్తు చెల్లించే బాధ్యతను గ్రామస్థులందరూ ఉమ్మడిగాను, వ్యక్తిగతంగాను వహించేవారు.

ఉమ్మడి గ్రామాలను ఈ క్రింది విధంగా విభజింపవచ్చును. అవి

1. వారసత్వపు గ్రామాలు (Ancestral Villages)
2. వారసత్వ రహిత గ్రామాలు (Non-ancestral Villages)
3. కమతాలున్న గ్రామాలు

**1. వారసత్వపు గ్రామాలు (Ancestral Villages) :** ఈ గ్రామాలలో యాజమాన్యం ఒక తరం నుంచి ఇంకొక తరానికి వారసత్వంగా సంక్రమిస్తుంది. భూమి నుంచి వచ్చే ఆదాయంలోని భాగం అనువంశిక వృక్షంలో (తరతరాలలో) వ్యక్తి యొక్క స్థితిపై ఆధారపడి ఉంటుంది. కొన్ని గ్రామాలలో వంశజుల ఉమ్మడి యాజమాన్యం కూ డా కన్పిస్తుంది.

**2. వారసత్వ రహిత గ్రామాలు (Non-ancestral villages) :** వారసత్వ పద్ధతి లేని గ్రామాలలో సాంప్రదాయక సూత్రాన్ని బట్టి భూ విభాగం (భూమి విభజన) జరుగుతుంది. భూ యాజమాన్యం ఉమ్మడి అయినా భూ వసతిని, వనరులను, నాగుళ్ళు, బావులను కొన్ని కుటుంబాలవారు పంచుకుంటారు.

**3. కమతాలున్న గ్రామాలు :** కమతాలున్న గ్రామాలలో భాగస్వామ్యానికి సంబంధించిన ప్రత్యేకమైన పద్ధతులు, సూత్రాలు లేవు. కొన్ని ఉమ్మడి గ్రామాలలో వ్యవసాయం చేసే రైతులే భూస్వాములు. మరికొన్ని గ్రామాలలో భూ కౌలుదారులు డబ్బు రూపేణా అద్దె చెల్లించి గానీ, లేదా ధాన్యరూపేణా కొంత చెల్లించికానీ, భూమిని దున్నుకోవచ్చును.

అయితే ఉమ్మడి గ్రామీణ వ్యవస్థలో శిస్తు నిర్ణయం క్రమంగా గ్రామంలోని మొత్తం భూమి మీద కాక, వ్యక్తుల కమతాల మీద విడివిడిగా విధించడం ఆచరణలోనికి వచ్చింది. ఉమ్మడి యాజమాన్యం పేరుకు మాత్రమే నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లో ఉమ్మడి యాజమాన్య వ్యవస్థలో తాలూక్దార్లనే పేర్లతో కొందరు పెత్తందార్లు రూపొందినారు. అందువల్ల అసలు యాజమాన్యపు హక్కులు క్షీణించి, క్రమేణా అదృశ్యమైనాయి.

## 3.9. వివిధ గ్రామస్వరూపాలకు గల కారణాలు :

గ్రామస్వరూపాలు అనేక రకాలుగా ఉండడానికి ఈ క్రింది కారణాలను పేర్కొనవచ్చును.

1. ప్రకృతి వనరుల ప్రభావము
2. సామాజిక పరిస్థితుల ప్రభావము
3. వ్యవసాయ మరియు ఆర్థిక వ్యవస్థల ప్రభావము

## 3.10. ముగింపు :

ప్రపంచ వ్యాప్తంగా వ్యవసాయం పెంపొంది వ్యాపించడంతో అనేక విధాలైన గ్రామాలు తలెత్తాయి. తొలుత ఏర్పడిన గ్రామాలు రానురాను సాంకేతిక, ఆర్థిక, సాంఘిక పరిణామముల వలన అనేక మార్పులు చోటుచేసుకున్నాయి.

## 3.11. నమూనా ప్రశ్నలు :

1. ఐరావతీ కార్వే గ్రామాల వర్గీకరణను వివరింపుము :
2. వివిధ గ్రామాల రకములను వివరింపుము ?
3. రైత్వారీ మరియు సమిష్టి గ్రామాలను వివరింపుము ?

## 3.12. చదువదగిన గ్రంథాలు


1. రూరల్ సోషియాలజీ ఇన్ ఇండియా : ఎ.ఆర్. దేశాయ్
2. గ్రామీణ సమాజ శాస్త్రం : తెలుగు ఎకాడమి


డా॥ ఎం.ఎస్. పార్థసారథి

పాఠం - 4

# గ్రామీణ ప్రాంతాలలో కులం, మతం మరియు రాజకీయాలు

## (Caste, Religion and Politics in Rural Areas)

### 4.0 లక్ష్యం :

గ్రామీణ ప్రాంతాలలో కులం, మతం మరియు రాజకీయాల గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

### విషయక్రమం :


4.1 పరిచయం

4.2 కులం - అర్థం నిర్వచనం

4.3 కులం - లక్షణాలు

4.4 కులం - విధులు

4.5 గ్రామీణ సమాజంలో కులవ్యవస్థ తీరు తెన్నులు

4.6 మతం - నిర్వచనం

4.7 మతం - లక్షణాలు

4.8 మతం - విధులు

4.9 మతం - సిద్ధాంతం

4.10 గ్రామీణ సమాజంలో మతం

4.11 గ్రామీణ రాజకీయాలు

4.12 సారాంశం

4.13 ముఖ్యపదాలు

4.14 నమూనా ప్రశ్నలు

4.15 చదువదగిన గ్రంథాలు


### 4.1 పరిచయం :

కుల వ్యవస్థ భారతీయ సమాజంలో తప్ప మరే యితర సమాజాలలోను లేదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మానసిక ప్రవృత్తులపై కుల వ్యవస్థ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో కులం పాత్ర చాల ఉంది. మతం కూడ గ్రామీణ జీవితాలతో ప్రముఖ పాత్ర వహిస్తుంది. తరతరాల ఆచారాలు, విశ్వాసాలకు గ్రామాలు పుట్టినిల్లు.

సంస్కృతి సంప్రదాయాలకు పల్లె సీమలు పట్టుకొమ్మలుగా నిలుస్తాయి. మతం పట్ల గ్రామీణులకు విశ్వాసం ఎక్కువగా ఉంటుంది. రాజకీయ వ్యవస్థలో కూడ నగరాలకు, గ్రామాలకు మధ్య వ్యత్యాసం ఉంది. స్థానిక స్వపరిపాలను పంచాయితీ రాజ్ సంస్థ గ్రామీణాభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో కులం, మతం, రాజకీయం తమదైన ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. అవి గ్రామ సామాజిక జీవనంపై ప్రత్యక్షంగానో పరోక్షంగానో తమ ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. గ్రామీణ సమాజంలో వీటి ప్రాముఖ్యత చాలా ఉంది.

## 4.2 కులం - అర్థం - నిర్వచనం :

కులం అనే తెలుగు పదానికి ఆంగ్లంలో అర్థం కాస్ట్ (Caste) కాస్ట్ అనే ఆంగ్ల పదం కాస్టా (Casta) అనే పోర్చుగీస్ పదం నుంచి వచ్చింది. కాస్టో అంటే వారసత్వంగా లేదా అనువంశికంగా కలిగేది అని అర్థం - స్పానిష్ పదమైన కాస్టా అనేది జాతికి చెందినవారని సూచించేదిగా కూడ ఉంది. అయితే అనేక మంది సమాజ శాస్త్రజ్ఞులు. మానవశాస్త్రజ్ఞులు కులాన్ని వివిధ విధాలుగా నిర్వచించారు. కులానికి సంబంధించి అనేక నిర్వచనాలు ఉన్నప్పటికి ఏ ఒక్కటి సమగ్రమైనదిగా సంపూర్ణమైనదిగా లేదు.

రిస్లే అభిప్రాయంలో కులమనేది ఒకే మూల పురుషుణ్ణి కలిగి ఉండి, ఒకే వారసత్వ వృత్తిని పాటిస్తూ, అంతర్వివాహాలు మాత్రమే ఉండి, ఒకే పేరుతో కొనసాగుతున్న కొన్ని కుటుంబాలను లేదా బంధు సమూహాల కులం.

ఒక తరగతి వ్యవస్థ వంశపారం పర్య విధానంపై పూర్తిగా ఆధారపడినపుడు దానిని కులవ్యవస్థ అనవచ్చని సి.హెచ్. కూలే భావించాడు.

మజుందార్, మదన్‌లు - కుల వ్యవస్థ పరిధీకృత తరగతి వ్యవస్థగా తెల్పాడు.

ఎమ్.ఎన్. శ్రీనివాస్ "వారసత్వమైన స్వకుల వివాహం, సాంప్రదాయ సిద్ధమైన వృత్తి సంబంధాలు కలిగి ఉంది. స్థానిక సముదాయ క్రమశ్రేణిలో ఒక ప్రత్యేకమైన అంతస్తు కలిగి ఉండే అంశాన్ని కులంగా నిర్వచించినాడు.

ఋగ్వేదకాలంలోని చాతుర్వర్ణాలు కులాలు కాదని అది తరగతి వారీ వ్యవస్థ అని జె.హెచ్. హట్టన్ వివరించాడు.

కుల వ్యవస్థలో సంప్రదాయ బద్ధమైన వృత్తులను అనుసరిస్తూ, స్థానికమైన హోదా కలిగి వంశ పారంపర్యమైన అంతర్ వివాహాలు కలిగిన సమూహాలు.

## 4.3 కులం - లక్షణాలు :

ఎమ్. ఎన్. శ్రీనివాస్, హట్టన్, ఘుర్యే, క్రొబర్, కెట్కర్ మొదలైన సమాజ శాస్త్రజ్ఞులు కులాన్ని కూలంకుషంగా అధ్యయనం చేసి కుల లక్షణాల్ని వివరించారు.

కెట్కర్ కులం రెండు లక్షణాలు కల్గి ఉన్న సామాజిక సమూహంగా భావించాడు. అవి (1) కుల సభ్యత్వం కులంలో పుట్టిన వ్యక్తులకు, పుట్టబోయే వ్యక్తులకు మాత్రమే వర్తిస్తుంది. (2) ఒక కులంలోని సభ్యులు ఇంకొక కులంలోని సభ్యులతో వివాహం చేసుకోకూడదు.

**కులవ్యవస్థ క్రింది లక్షణాల్ని కలిగి ఉంది.**

1. పుట్టుకను నిర్ణయిస్తుంది - ఒక వ్యక్తి ఏ కులానికి చెందుతాడు అనేది అతని పుట్టుకను బట్టి నిర్ణయించడం జరుగుతుంది. ఒకసారి వ్యక్తి ఒక కులంలో జన్మిస్తే, అతడు మరణించే వరకు అదే కులానికి చెందుతాడు. కులాన్ని బట్టే అతని అంతస్థు కూడ నిర్ణయింపబడుతుంది. అతని వృత్తి, మతం, సంప్రదాయాలు, ఆచారాలు, బంధువులు మొదలైనవన్ని పుట్టుకతోనే నిర్ణయమవుతాయి. ఒక వ్యక్తి విద్య, ఆస్తి, వృత్తి ద్వారా ఎంతో ఉన్నత స్థానాన్ని పొందిన జన్మతా వచ్చిన కులం మ మారదు.

2. అంతర్వివాహ సమూహం - ఏ కులానికి చెందిన వ్యక్తి ఆ కులానికి చెందిన వారిని మాత్రమే వివాహమాడాలి. ప్రతి కులంలోను అనేక గోత్రాలు ఉంటాయి. సగోత్రుల మధ్య వివాహాలు నిషేదం. ప్రతి కులంలోను అనేక శాఖలు ఉంటాయి. ఒక శాఖకు చెందిన వారు తిరిగి అదే శాఖకు చెందిన వారిని మాత్రమే వివాహం చేసుకోవాలి. వెస్టర్ మార్క్ అంతర్వివాహం అనేది కుల వ్యవస్థ ముఖ్య లక్షణంగా భావించారు.

3. క్రమశ్రేణిలో ఆరోపిత అంతస్తు - కులవ్యవస్థలో కులాల మధ్య వివిధ అంతస్తులుంటాయి. మొదటి స్థానాన్ని బ్రాహ్మణులు తరువాత స్థానాలను వరుసగా క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు కలిగి ఉన్నారు. క్రమశ్రేణిలో ఉన్న కుల వ్యవస్థ హిందూ మతకర్మ సిద్ధాంతంలో ముడి వేసింది. పూర్వ జన్మల కర్మ ఫలితంగా జన్మ నిర్ధారణ అవుతుందనే విశ్వాసం హిందూ సమాజంలో ఉంది. దీని ప్రకారం కొందరు ఉన్నత కులాలలోను మరి కొందరు నిమ్నకులాలలోను పుడతారని నమ్ముతారు.

4. కులవృత్తులు - కులస్తరీకరణ వ్యక్తులకు అంతస్థుల్ని ఆపాదించటంతో పాటు వృత్తులను కూడ నిర్ణయించింది. వృత్తులు కుల సభ్యులకు అను వంశికంగా సంక్రమిస్తాయి. వృత్తి మార్పిడి కుల వ్యవస్థలో లేదు. బ్రాహ్మణులు పౌరోహిత్యం, ఉపాధ్యాయ వృత్తిని క్షత్రియులు రాజ్య పరిపాలనా యంత్రాగాన్ని చేపట్టడం, వైశ్యులు, వర్తక, వాణిజ్యాన్ని వ్యవసాయాన్ని చెయ్యటం. శూద్రులు సమాజానికి అంటే బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యులకు సేవ చేస్తారు. ఆధునిక కాలంలో అనేక మార్పులు వచ్చాయి. అయితే గ్రామీణ ప్రాంతాలలో నేటికి కులవృత్తులు కొనసాగుతున్నాయి. ఏ కులంవారు ఆ కులవృత్తిని చేస్తారు. ఉదాహరణకు రజకులు బట్టలు ఉతకటం, కుమ్మరి కుండలు చేయ్యడం, మంగలి క్షురకర్మ చేయ్యడం జరుగుతుంది. సమాజంలో శుద్ధ వృత్తులు, అపరిశుద్ధ వృత్తులు అని రెండు రకాలు. ఉదాహరణకు పౌరోహిత్యం చెయ్యడం పవిత్రవృత్తికి ప్రతీకలైతే చెప్పులు కుట్టడం, శవసంస్కారం జరిపించడం, వంటివి నీచమైనవిగా హీనమైనవిగా అపరిత్రమైనవిగా భావిస్తారు.

5. అశుచి, అశుభ్రత - చేసే వృత్తిని బట్టి వ్యక్తి అంతస్థు నిర్ణయింపబడుతుంది. వృత్తులను బట్టి శుచి, అశుచి, శుభ్రత, అశుభ్రత ఉంటాయి. వివిధ కులాల మధ్య సాంస్కృతిక, మతపరమైన తేడాలున్నాయి ఉన్నత కులాల వాళ్ళ తక్కువ (నిమ్న) కులాలను తాకడం, కలవడం చేయ్యరు. దానివల్ల మైలు పడతామనే భావన వారిలో ఉండటమే దీనికి కారణం. వాళ్ల పవిత్రతకు భంగం కలుగుతుందని నిమ్నకులాలకు దూరంగా ఉంటారు.

6. ఆహార, పానీయాలలో నియమాలు - ఆహార పదార్థాలను శాకాహారం, మాంసాహారంగా విభజించటం జరిగింది. బ్రాహ్మణులు, వైశ్యులు శాకాహారాన్ని స్వీకరిస్తే, క్షత్రియులు, శూద్రులు మాంసాహారాన్ని భుజిస్తారు. ఆహార, పానీయాలను తీసుకోవటంలో కులవ్యవస్థలో కొన్ని నియమాలు, నిషేధాలు ఉన్నాయి. బ్రాహ్మణులు వండిన ఆహారాన్ని మాత్రమే బ్రాహ్మణులు తింటారు. బ్రాహ్మణులు, క్షత్రియులు వండిన ఆహారాన్ని క్షత్రియులు భుజించవచ్చు. వైశ్యులు బ్రాహ్మణులు వండిన ఆహారాన్ని తీసుకోవచ్చు. శూద్రులు, బ్రాహ్మణులు, క్షత్రియ, వైశ్యులు వండిన ఆహారాన్ని భుజించవచ్చు. పానీయాల విషయంలో సైతం ఈ నియమాలు వర్తిస్తాయి. ఉన్నత కులాలు, నిమ్నకులాల మధ్య ఆహర, పానీయాల విషయంలో గ్రామీణ ప్రాంతాలలో నిషేదిత నియమాలు నేటికి కొనసాగుతున్నాయి.

7. ఆచారాలు, వేషభాషలు - వివిధ కులాలు వివిధ రకాల ఆచారాలను, సంప్రదాయాలను, కలిగి ఉంటాయి. వేష భాషల సైతం కులానికి వ్యత్యాసాలు ఉంటాయి. వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు, భాష, జీవనవిధానం వంటి వాటిలో తేడాలుంటాయి. ఉదహరణకు వస్త్రధారణ ఉన్నత కులాలలో ఒక రకంగా ఉంటే మధ్యకులాలలో మరొక విధంగా, నిమ్నకులాలలో తక్కువ స్థాయిలో ఉండటాన్ని గమనించవచ్చు. నగలు ధరించడంలోను ఈ తేడాలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో నిమ్న కులాలు నగలు ధరించడం పై ఆంక్షలున్నాయి. భాష ఉచ్చారణలో కూడ బేదాలున్నాయి.

8. మతపరమైన అవకాశాలు, అనర్హతలు - ఉన్నత కులాలకున్న సౌకర్యాలు, నిమ్నకులాలకు లేవు. ప్రత్యేకించి దళితలపై నివాసాల ఏర్పాటులోను, దేవాలయ ప్రవేశంలోను, చదువుకోవడంలోను ప్రజా వినియోగ ప్రదేశాల ప్రవేశంలోను ఎన్నో అంక్షలున్నాయి. వీరిపై నిషేధాలు నేటికి కొన్ని గ్రామాలలో కనిపిస్తున్నాయి.

9. కుల పంచాయితీలు - ప్రతి కులంవారు వారి కుల పెద్ద ఆధ్వర్యంలో పంచాయితీని ఏర్పరచుకొనేవారు. కులపెద్ద కొన్ని నియమాలకు, ప్రమాణాలకు, విలువలకు కట్టుబడి ఉండేవారు కుల సభ్యులంతా కులపెద్ద అదేశాలను, ఆజ్ఞలను తు.చ. తప్పక పాటించేవారు. ఎవరైనే వ్యతిరేకిస్తే వారిని శాశ్వతంగా లేదా, తాత్కాలికంగా కుల బహిష్కరణ శిక్ష కులపెద్ద విధించేవారు. వృత్తి పరమైన, కుల సభ్యుల మధ్య తగాదాలు ఏర్పడిన, భేదాలు కల్గిన, కుల సభ్యులు కట్టుబడి ఉంటారు. ఈనాటికి కొన్ని గ్రామాలలో కుల పంచాయితీలు ఉన్నాయి.

## 4.4 కులం - విధులు :

సమాజంలో కులం కొన్ని విధులను కూడ నిర్వర్తిస్తుంది.

వీటిలో ప్రధానమైనవి.

1. వృత్తిని నిర్ణయించుట - ఏ కులంలో జన్మించిన వ్యక్తి ఆ కులవృత్తిని చేపడతాడు. దీనివల్ల మరో వృత్తిని చేపట్టేపని లేదు. కుల వృత్తి అను వంశికం కాబట్టి వృత్తిలోను మెలకువల్ని తెలుసుకొని నైపుణ్యాన్ని సంపాదించ గల్గుతాడు.

2. అంతస్థుని నిర్ణయించుట - వివిధ కులాలు, వివిధ స్థాయిలను కలిగి ఉంటాయి. బ్రాహ్మణులకు ప్రథమ స్థానం క్షత్రియులకు ద్వితీయ స్థానం వైశ్యులకు తృతీయ స్థానం, చివరిగా శూద్రులకు చతుర్థ స్థానాన్ని కుల వ్యవస్థ కల్పించింది. దీనివల్ల ఒక కులంలో జన్మించిన వ్యక్తి తన అంతస్థును తెలుసుకొంటారు. దానికి అనుగుణంగా నడుచుకుంటారు.

3. సామాజిక నియంత్రణ - ప్రతి కులానికి కొన్ని కట్టుబాట్లు, నిబంధనలు ఉంటాయి. వీటి ద్వారా కుల సభ్యుల ప్రవర్తనను అదుపులో ఉంచేటందుకు వీలుంటుంది. ఈ విధంగా కులవ్యవస్థ సామాజిక నియంత్రణగా కూడ ఉపయోగపడుతుంది.

4. సామాజిక భద్రత - కులవ్యవస్థ తన సభ్యులకు రక్షణను, భద్రతను కల్పిస్తుంది. కులసభ్యులకు ఎటువంటి కష్టం కల్గిన, అన్యాయం జరిగిన ఆ కులం వారంతా అండగా ఉంటారు. ఆపద సమయంలో ఆదుకుంటారు.

5. సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణ - ప్రతి కులానికి ప్రత్యేకమైన సంప్రదాయాలు సంస్కృతి, విలువలు ఉంటాయి. దీనివల్ల ప్రతీకులం ఒక ప్రత్యేకమైన సాంస్కృతిక వర్గంగా ఉంటుంది. ఈ సంస్కృతిని సంప్రదాయాల్ని స్థిరంగా ఉంచే విధిని కులం నిర్వర్తిస్తుంది.

6. శ్రమ విభజన - కులవ్యవస్థ యొక్క ప్రధాన విధి గ్రామీణ సమాజంలో శ్రమ విభజనను ఏర్పరచడం. వివిధ కులాలకు వివిధ రకాల వృత్తులు ఉండటం వల్ల శ్రమ విభజన యంత్రాంగంగా కులవ్యవస్థ పని చేస్తుంది. వీటి వల్ల కులాల మధ్య సామరస్యభావం నెలకుంటుంది. పరస్పర సహకారం లభిస్తుంది.

7. మత పరిరక్షణ - హిందూ, మతానికి పునాది కులవ్యవస్థ మతాచారాలు రక్షణలో, మత ధర్మ పరిరక్షణలో కులవ్యవస్థ ప్రధానపాత్ర పోషిస్తుంది. మత పవిత్రతను కాపాడుతుంది.

## 4.5 గ్రామీణ సమాజంలో కులవ్యవస్థ - తీరుతెన్నులు :

భారతదేశ గ్రామీణ సమాజంలో కులం ప్రముఖపాత్ర నిర్వహిస్తుంది. గ్రామాలలో కుల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. కులం వ్యక్తి అంతస్థుని, వృత్తిని నిర్ణయిస్తుంది. గ్రామీణ సమాజంపై కుల ప్రభావం చాల ఎక్కువ. కుల వ్యవస్థలో కొన్ని కులాలు ఉన్నతమైనవి గాను మరికొన్ని నిమ్నమైనవిగాను పరిగణించడం జరుగుతుంది. ఉన్నత తక్కువ కులాల మధ్య ఆచార వ్యవహారాలలో తేడాలున్నాయి. అంతరాలు చోటు చేసుకొన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో కుల ప్రభావం గణనీయంగా ఉండటం వల్ల సామాజిక గతిశీలతకు అడ్డంకుగా ఉంది. ఉన్నత కులాలు వారు ఆర్థికంగా బలపడి ముందుంటే నిమ్నకులాలు సామాజిక స్థాయి తక్కువకావడం, ఆదాయం అంతగా లేని వృత్తులతో సమాజంలో ఉన్నత స్థానానికి ఎదగలేక పోతున్నారు. అంతేకాకుండా అనేక సామాజిక, సాంస్కృతిక ఆర్థిక, రాజకీయ, విద్య పరమైన సమస్యలను నిమ్నకులాలు ఎదుర్కొంటున్నారు. దోపిడికి గురవుతున్నారు. కులం కట్టుబాట్లకు, ఆంక్షలకు బలవతున్నారు. మారుమూల ప్రాంతాలలో అంటరాని తనం కొనసాగుతునే ఉంది. కులంపేరకొందరిని వెలివెయ్యడం జరుగుతునే ఉంది. అయితే కొన్ని మార్పులు కులవ్యవస్థలో చోటు చేసుకోవడం గమనించదగ్గ విషయం. బ్రిటీష్ వారి పాలనలో కులానికి కులవృత్తికి సంబంధాలు క్షీణించటం మొదలయ్యాయి దాంతో కులవ్యవస్థలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. కుల ప్రాబల్యం సన్న గిల్లడానికి ప్రధానంగా కులానికి వృత్తులకి సంబంధాలు లేకపోవడమే.

క్రింది చర్యలు కులవ్యవస్థలో మార్పు రావడానికి దోహదపడ్డాయి.

1. పంచవర్ష ప్రణాళికలు
2. వయోజన ఓటింగ్ హక్కు
3. ఆధునిక విద్యా విధానం
4. నూతన చట్టాలు
5. ఆధునీకీకరణ
6. నగరీకరణ
7. పారిశ్రామికీకరణ
8. సంక్షేమ కార్యక్రమాల అమలు
9. కులాంతర వివాహాలు
10. రవాణా, భావప్రసార సౌకర్యాలు
11. రాజకీయ పార్టీలు
12. స్వచ్ఛంద సంస్థలు

### గ్రామీణ మత వ్యవస్థ

## 4.6 మతం - నిర్వచనం :

మతం విశ్వజనీనమైన సంస్థ. మతం ప్రధానమైన సామాజిక వ్యవస్థ. మానవ సమాజాలన్నింటిలోనూ, 'మతం' అనేది ఏదో ఒక రూపంలో కనిపిస్తుంది. మానవజాతి చరిత్ర పురాతన కాలం నుంచి కూడా మతం మానవుని నిత్య జీవన విధానంలో అంతర్భాగమై ఉంటూ వచ్చింది. మానవుని దైనందిన వ్యవహారాలు ఎక్కువగా మతంతో ముడిపడి ఉంటాయి. మానవాతీతశక్తి ఉందనే నమ్మకమే మతానికి పునాదిగా ఉంది. ఆచారాలు, సంప్రదాయాలు, విలువలు, విశ్వాసాలు మతాన్ని ఆధారంగా చేసుకొని ఏర్పడినవే.

మతం అనే పదానికి వివిధ సమాజ మరియు మానవ శాస్త్రజ్ఞులు వివిధ విధాలుగా నిర్వచించారు. వీటిలో ప్రధానమైనవి.

ఎమిల్ దుర్క్ హైమ్ తన గ్రంథం "మత జీవితపు ప్రాథమిక రూపాల" లో మతాన్ని క్రింది విధంగా నిర్వచించినాడు.

"మతం అనేది పవిత్ర విషయాలకు సంబంధించిన ఈ విశ్వాసాలు, ఆచారాలు వాటిని పాటించే వాళ్లందరినీ మతం సంస్థ అనే ఏకైకనైతిక సమాజంగా ఐక్య పరుస్తాయో, ఆ విశ్వాసాల, ఆచారాల సమైక్య సమాహారం".

విలియం అగ్బర్న్ మానవాతీతశక్తులపై ఉండే వైఖరులే మతమని భావించాడు.

జెమ్స్ జి. ఫ్రేజర్ ప్రకారం "ప్రకృతిగతినీ, మానవ జీవితగతినీ నియంత్రించి, నడిపించే మానవాతీత శక్తులు ఉన్నాయనుకొని వాటిని నమ్మడం మతం.

హరియం జాన్సన్ - మతం అంటే అలౌకిక స్థాయికి చెందిన జీవులకుగాని, శక్తులకు గానీ, స్థలాలకుగానీ, యితర పధార్థాలకు గానీ సంబంధించిన విశ్వాసాలు, ఆచారాలు దాదాపు సుసంయుక్తమైన వ్యవస్థగా భావించాడు.

సమ్నర్, కెల్లర్ అనే సమాజశాస్త్ర వేత్తలు మిగిలిన యితర సంస్థల మాదిరిగా మతం కూడా మానవుడు పరిసరాలతో సర్దుబాటు చేసుకోవడానికి ఏర్పరుచుకొన్న సాధనంగా పేర్కొన్నారు.

దుర్క్‌హైమ్ మతంలో రెండు ముఖ్య భాగాలున్నాయని వెల్లడించాడు అవి 1. పవిత్రమైనది 2. అపవిత్రమైనది. ఈయన మతం సమాజం చేత సృష్టించబడిందని, మానవుడు దానికి అనుగుణంగా నడుచుకుంటూ ఉంటాడని తెలియజేశాడు. పాల్ రాడ్కిన్ అనే మానవ శాస్త్రవేత మతం రెండు భాగాలుగా ఉంటుందని భావించాడు. అవి 1. అనుభూతి 2. ఆచారాలు. ఆచారాల పేరుతో చేసే క్రియలన్నీ కూడా అనుభూతిని ఏర్పరుస్తాయి. మతం యొక్క అనుభూతి అనేది అతి చిన్న దృగ్విషయం కాదు. అది మనిషి శారీరక మానసిక స్థాయిలను కలిగి ఉంటుంది. శారీకకాను భూతి అంటే మోకాళ్ళ మీద కూర్చోవడం, రెండు చేతులు జోడించి నమస్కారం చేయటం, కండ్లను పూర్తిగా మూసుకోవడం మొదలైన వాటిని పేర్కొనవచ్చు. మానసికానుభూతి అంటే భక్తి పారవశ్యం చెందడం, భక్తి పూర్వకమైన భయం మొదలైన వాటిని చెప్పవచ్చు. పాల్ రాష్కిన్ ప్రకారం మతం మానవుని ద్యానమార్గం ద్వారా జీవిత గమ్య స్థానానికి చేరే ప్రక్రియగా కాకుండా మానవుని జీవితపు విలువలను నిక్షిప్తం చేసే సాధనంగా చెప్పవచ్చు. గోల్డెన్ వైజర్ మతం పట్ల మరో అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. అలౌకిక శక్తుల మీదనమ్మకాన్ని కలిగి ఉండటమే ప్రతి మతం యొక్క మూల భావన అది అగాధమైన అవేశ పూరితమైన అనుభూతి గోల్డెన్ వైజర్ తన ప్రధాన భావనను మత సంబంధమైన పులకింతగా తెలిపాడు.

## 4.7 మతం - లక్షణాలు :

అన్ని పమాజాలలోను మత సంబంధమైన నమ్మకాలలోను, ఆచారాలలోను, సంస్కారాలలోను తేడాలు ఉన్నప్పటికి సాధారణంగా మతం కొన్ని లక్షణాలను కలిగి ఉంటుంది. అవి

1. మానవాతీత శక్తులు - మానవాతీత, ప్రకృతేతర శక్తులు ఉన్నాయనే భావన మత ప్రధాన లక్షణంగా చెప్పవచ్చు. మతానికి మూలం మానవాతీత శక్తులే. ఆ శక్తులు అనేక రూపాలలో అధిక సంఖ్యలోను ఉన్నాయి. దేవుడు, భూతాలు, దయ్యాల, ఆత్మప్రేరక శక్తులును ఉదాహరణంగా చెప్పవచ్చు.
2. విశ్వాసాలు - మానవాతీత శక్తులకు సంబంధించి మానవులు వివిధ నమ్మకాలతో ఉండటం. వారి విశ్వాసాలకు తగ్గట్టుగా వారు రాయిరప్పలను, జంతువులను, పూర్వీకులను కొలవడం, వాటిని గురించి ఉత్సవాలు, జాతరలు, సంబరాలు,

సంస్కారాలను జరపడం చేస్తుంటారు.

3. మత సంస్కారాలు - మానవులు మానవతీత శక్తి పట్ల తమకున్న విశ్వాసాలను కొన్ని సంస్కారాల ద్వారా వ్యక్తపరుస్తారు. ఉదహరణకు గోవును, నాగుపామును, తులసి, వేపరావి వంటి చెట్లను ఆరాధించడం, జంతుబలి ఇవ్వడం నాట్యం చెయ్యడం మంత్రోచ్ఛారణ, ఉత్సవాలను జరపడం, మందిరాలను నిర్మించడం మొదలైనవి.

4. సాంస్కృతిక ప్రతీకలు - ప్రతి మతంలోను సాంస్కృతిక ప్రతీకలు ఉంటాయి. విగ్రహం, క్రాస్, మంత్రతంత్రాలు, ప్రార్థనలు మొదలైనవి వీటికి ఉదాహరణగా చెప్పవచ్చు.

5. నైతిక విలువలు - నైతిక వ్యవస్థకు ఆధారం మతం, వ్యక్తులు నైతిక ప్రవర్తన కలిగి ఉండటంలో మతం తన ప్రభావాన్ని చూపుతుంది.

6. విశ్వాసాల సముదాయం - ప్రతి పెద్ద మతానికి ఒక పవిత్ర గ్రంథం ఉంది. బృందం విశ్వాసాలను అది వెల్లడిస్తుంది లేదా కనీసం ఆ విశ్వాసాలను నిర్ణయించడానికి ప్రాతిపదికను సమకూరుస్తుంది. అంతేకాక, అలాంటి అధికారిక లేదా మౌలిక రచనలలోని విశ్వాసాలకు తోడుగా ప్రతి మతానికి మరికొన్ని విశ్వాసాలు కూడా వుంటాయి.

## 4.8 మతం - విధులు :

1. మతం మానవుడు ధర్మ మార్గాన నడుచుకొనేటట్లు నైతిక ప్రవర్తన కలిగి ఉండేటట్లు చేస్తుంది.
2. మతం మానవుడు అనుభవించే బాధలు, కష్టనష్టాలను ధైర్యంగా ఎదుర్కొనేటట్లు చేస్తుంది.
3. ప్రకృతి వైపరీత్యాల వల్ల లేదా ఉపద్రవాల వల్ల ఏర్పడే భయాందోళనలను పోగొట్టి మానసిక రక్షణకు దోహదపడుతుంది.
4. మత సంస్థలు నిర్వహించే ఉత్సవాలు, వేడుకల వల్ల సంఘంలో సమూహాల మధ్య, వ్యక్తుల మధ్య సత్‌సంబంధాలు ఏర్పడతాయి. సహృద్భావం సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుంది.
5. మతం వల్ల సంఘంలో అనేక రకాల కళలు ముఖ్యంగా లలిత కళలు అనగా శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం, కవిత్వం మొదలైనవి ఏర్పడి మానవుని విజ్ఞానానికి, వినోదానికి, మనోవికాసానికి దోహదపడతాయి.
6. మానవసేవే మాధవసేవగా భావించి సమాజ సేవ మతం చేస్తుంది. హిందూ, బౌద్ధ, జైన, శిక్కు, పార్సీ, ఇస్లాం, క్రైస్తవం మొదలైన మతాలు వివిధ రకాలుగా సమాజసేవ చేస్తున్నాయి. విద్యా, వైద్య, సంస్థలను శరణాలయాలను స్థాపించి సమాజసేవకి అంకితమవుతున్నాయి.
7. మతం వ్యక్తి ప్రవర్తనను అదుపులో ఉంచుతుంది. సామాజిక నియంత్రణగా ఉపయోగపడుతుంది.
8. సామాజిక విలువల రక్షణలో మానవత్వ భావన పెంపులోను మతం కృషి చేస్తుంది.

## మతం - వివిధ సిద్ధాంతాలు :

ప్రపంచ ప్రసిద్ధి పొందిన ప్రధానమతాలైన క్రైస్తవం, ఇస్లాం, హిందూ మతం, బౌద్ధం, జైన మతం, సిక్కు మతం షింటోమతం, జోరాష్ట్రియన్ మతం మొదలైనవే కాకుండా ఇంకా ఇతర రకాల మతాలు కూడ ఉన్నాయి. ప్రతి మతానికి కొన్ని సిద్ధాంతాలుంటాయి. అవి కొన్ని మతాలలో గ్రంథ రూపంలో ఉంటాయి. కాని ఆదిమ జాతి సమాజాలలో కూడా రకరకాల మత సిద్ధాంతాలు లేదా వాదనలు గ్రంథ రూపంలో లేకున్న వారి నిత్య జీవితంలో చోటు చేసుకున్నాయి. వాటిని గురించి తెలుసుకుందాం.

## 1. సర్వాత్మవాదము (Animism) :

బ్రిటిష్ మానవ శాస్త్రజ్ఞుడు ఇ.బి. టైలర్ సర్వాత్మవాదాన్ని ప్రతిపాదించాడు. టైలర్ ఆత్మ విషయమై అనేక విషయాలు వెల్లడించాడు. అయితే ఈయనకు పూర్వం భారతదేశంలో కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఋషులు, తత్త్వవేత్తలు సర్వాత్మవాదాన్ని ప్రతిపాదించి అనేక మౌలికమైన మత గ్రంథాలు వ్రాయడం జరిగింది. తర్వాత మతాచార్యులు శాస్త్ర దృష్టిలో ప్రజలకు వివరించడమే కాకుండా గ్రంథ రూపంలో పొందుపరిచారు.

భారతీయులు ఆత్మ విశ్వవ్యాప్తమైనదని, పంచభూతాలకు అతీతమైనదని శాశ్వతమైనదని, నాశనం లేనిదని గాఢంగా విశ్వసిస్తున్నారు. ప్రపంచంలోని ప్రముఖమతాల వారుకూడా ఈ విషయాన్ని వివిధ విధాలుగా చెపుతున్నారు. ఆత్మ విషయాన్ని అండమాన్ దీవులలోను ఆదిమ తెగల వారు వెయ్యి షో, షోని ఇండియన్ అనేజాతి వారు, మెనొమి ఇండియన్ అనే తెగవారు, హిదత్సా ఇండియన్ అనే గిరిజన జాతి, దహోమి అనే ఆఫ్రికాజాతి, సవన్నా తీర వాసులైన యూచి సమాజంవారు, ఆయమర ఇండియన్ మొదలైన ఆదిమ జాతి తెగలు వారి వారి నిత్య జీవన విధానాలలో సర్వాత్మ వాదాన్ని విశ్వసిస్తున్నారు. టైలర్ ఆదిమజాతుల నమ్మకాన్ని పరిగణనలోకి తీసుకొని మానవుని ప్రధానమైన ఆదిమ మతమే సర్వాత్మ వాదమని పేర్కొన్నాడు. మనిషి జన్మించడం, చనిపోవడం, దేహానికే కాని, ఆత్మకుకాదని, మనిషి పుట్టడమంటే ఆత్మ శరీరంలోకి ప్రవేశించడం అని, మరణించడం అంటే ఆత్మ శరీరం నుంచి బయటకు పోవడం అనే నమ్మకం ఆదిమ తెగలులోనే కాదు ఆధునిక సమాజంలోను ఉంది. ఆత్మవల్లనే మానవునికి కల వస్తుందని, అతడు నిద్రిస్తున్నప్పుడు, ఆత్మ శరీరాన్ని వదలి అనేక ప్రాంతాలలో తిరిగి వస్తుందని ఆ విధంగా తిరిగేటప్పుడు అది చేసే పనులు, పొందిన అనుభవాలే కలలో కనిపిస్తాయనే విశ్వాసం అదిమతెగలలో ఉన్నట్లు టైలర్ తెలియజేశాడు.

ఒక వ్యక్తి మరణించినా ఆ వ్యక్తి ఆత్మను మరణం లేదని, ఆ మనిషి ఆత్మ అతని రక్తబంధువులతో కలిసి ఉండేవారిని రక్షిస్తుందని విశ్వాసం ఉంది. ఇటువంటి విశ్వాసాల వల్ల అదిమతెగలు అలౌకిక శక్తులను సంతృప్తి పరిచి తమ జీవితానికి కావలసిన మంచిని పొందటానికి వాటిని ఆరాధించేవారు. విశ్వ మతాలు విశ్వాసాలు మొట్టమొదట సర్వాత్మ వాదానికి దారి తీసిన రకరకాల బహుదేవతారాధనలుగా బయలుదేరి, తర్వాత రానురాను ఏక దేవతారాధనగా పరిణమించినదని టైలర్ భావించాడు. టైలర్ అభిప్రాయంతో ఆధునిక మానవ శాస్త్రజ్ఞులు ఏకీభవించిలేదు. వీరు సర్వాత్మవాదంలో నిజం ఉన్నప్పటికి ఆది మానవుని మతానికి ఇది తొలి అనుభవంకాదని విమర్శించాడు.

## 2. జీవాత్మవాదం (Animitism) :

ఆర్.ఆర్. మారెట్ అనే బ్రిటీష్ మానవ శాస్త్ర వేత్త ఆదిమతెగలకు ఆత్మకంటే సునాయాసంగా కనిపించే భావన అతీతమైన శక్తి లేదా అవైయుక్తికమైన శక్తి 'మాన' (Mana) అని తెలియజేశాడు. అన్ని రకాల సంఘటనలు 'మాన' వలన జరుగుతాయనే ప్రగాఢ విశ్వాసం అదిమతెగలకుందని వివరించాడు. ఈ శక్తిలే మలేషియన్లు 'మాన' అని భారతదేశంలో తెగలు బొన్గా అని అమెరికాలోని ఇరాక్ ఇండియన్ తెగలు ఒరెన్డా అని వివిధ పేర్లతో పిలుస్తున్నారు. మానవులలోను జంతువులలోను, జీవంలేని వస్తువులు, కొన్ని ప్రదేశాలలోనూ, నదీ నదాలలోనూ ఉంటుందనే భావన అదిమతెగలలో ఉంది. మారెట్ అతీతశక్తి అనబడే అలౌకికశక్తి సర్వాత్మవాదం కంటే ముందుగానే పుట్టిందని అభిప్రాయపడ్డాడు. అయితే రెండు వాదాలు ఆదిమతెగలలో ఉన్న ఏది ముందు ఆవిర్భవించిందో తెలియదు.

## 3. ప్రకృతి వాదం :

జర్మను శాస్త్రవేత్త మాక్స్ ముల్లర్ ప్రకృతి వాదాన్ని ప్రతిపాదించాడు. మతం యొక్క ప్రారంభ దశలో ఆదిమ మానవుడు ప్రకృతిలో ఉన్న సూర్య చంద్రులు, ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం, నక్షత్రాలు, నదీనదాలు, చెట్లు, కొండలు, పర్వతాలు,

ఆకాశం, భూమి మొదలైన వాటికి అభౌతికశక్తి ఉన్న నమ్మకంతో పూజించేవారని, ఇంకా ఈనాటికి అట్లాంటి తెగలున్నాయని మాక్స్ ముల్లర్ అభిప్రాయం. దీనిని బట్టి మతానికి మొదటి దైవ ప్రకృతి ఆరాధన అని తెలియజేశాడు. అయితే మతానికి అది తొలి రూపమనడాన్ని ఆధునిక మానవ శాస్త్రజ్ఞులు అంగీకరించటం లేదు.

## 4. టొటమ్ వాదం :

ప్రఖ్యాత మానవ శాస్త్రవేత్త జేమ్స్, డి. ఫ్రేజర్, తదితరులు టొటెమ్ వాదాన్ని వివరించారు. ఫ్రేజర్ రచన గొల్డెన్ బౌగ్‌లో టొటెకు గురించి వివరణ ఉంది. ఇది గిరిజన తెగలలో కనిపించే ప్రాథమిక మత రూపాలలో ఒకటి. టొటెమ్ అనేది ఒక గణంలోగాని, ఒక వంశంతోగానీ, ఇతర సామాజిక బృందంతో కాని ప్రత్యేక సంబంధం కలిగి ఉన్నట్లు పరిగణింపబడే ఒక వర్గం వస్తువులకు, ఒక జాతి జంతువులకు నిర్జీవ వస్తువులకే వర్తిస్తుంది. అట్టి జంతువులను, వృక్షాలను పవిత్రంగా భావించి పూజించటం, వాటికి రక్షించటం చేస్తారు. టొటెమ్‌కు సంబంధించిన వ్యవహారమంతా కూడా మతం కిందకు వస్తుందని ఫ్రేజర్ తదితర శాస్త్రజ్ఞుల మాటలను ఆధునిక శాస్త్రజ్ఞులు విశ్వసించడం లేదు.

## 5. ఫెటిష్ వాదం :

ఫెటిష్ వాదంలో ఒక వస్తువుకు అంటే ఒక రాయికిగాని, ముత్యపు చిప్పకుగాని, గవ్వకుగాని, నెక్లెస్‌కుగాని లేదా ఒక నగిషి చెక్కబడిన కర్ర ముక్కకుగాని వ్యక్తిగతమైన శక్తి ఆపాదించబడుతుంది. అట్టి శక్తిగల వస్తువును ధరించిన వ్యక్తిని గాని లేదా కలిగి ఉన్న వ్యక్తినిగాని ఆ శక్తి వెంటాడి తనుసాయం చేస్తుందనే విశ్వాసం ఆ ఫెటిస్‌ను లేదా వస్తువును కలిగి ఉన్న వ్యక్తి కోరికలు నెరవేరినా, లేకున్న ఆ వస్తువు పూజనీయంగా చూడబడుతుంది. ఈ శక్తినే మాన అని లేదా అతీత శక్తి అని పిలుస్తారు. కొన్ని సందర్భాలలో వాటిలోని శక్తి తగ్గిపోవచ్చు లేదా పాడై పోవచ్చు. ప్రకృతిలోని అనేక వస్తువులను పెటిష్‌ల కింద ఆరాధించే ఆదిమ జాతి తెగలు చాలా కలవు.

సర్వాత్మవాదం, జీవాత్మవాదం, ప్రకృతి వాదం మొదలైన విశ్వాసాల ద్వారా మతం ఆవిర్భవించలేదని, మతమనేది సంఘంలో ఆదిమ మానవుల జీవితానుభవాల నుంచి పుట్టిందని ఆధునిక సమాజ శాస్త్రవేత్త దుర్క్‌హెమ్ పేర్కొన్నాడు. సామూహికంగా చేసే వేడుకలు ఉత్సవాలు మొదలైన వాటివల్ల మానవునిలో నూతన శక్తి పుడుతుందని ఆశక్తి తొలి మానవునకు అతీతశక్తిగా మతానికి తొలి రూపంగా ఏర్పడిందని తెలియజేశాడు. రాడ్‌క్లిఫ్ బ్రౌన్, మలినొవ్‌స్కి వంటి మానవ, సామాజిక శాస్త్రజ్ఞులు దుర్క్‌హెమే అభిప్రాయాలతో ఏకీభవించి వీటి వృద్ధికి కృషి చేశారు.

## 4.10 గ్రామీణ సమాజంలో మతం :

గ్రామీణ సమాజంలో మతానికి ప్రత్యేక స్థానముంది. ప్రజల నిత్యజీవన విధానంలో మతం ప్రధాన పాత్రను నిర్వహిస్తుంది. ఆచారాలు, సంప్రదాయాలు, విలువలు, విశ్వాసాలు, పండగలు, సంస్కారాలు, వేడుకలు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, శుచి శుభ్రత మొదలైన అనేక అంశాలకు సంబంధించి మత ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మత విధానాలను, ఆచారాలను అన్ని కులాలవారు, అన్ని ప్రాంతాలవారు ఒకే రీతిగా జరుపుకుంటారని, పాటిస్తారని భావించడం సరికాదు. పూజ పద్ధతులలో, ఆచార విధానాలతో, విశ్వాసాలతో సంప్రదాయాలతోను కులానికి, కులానికి, ప్రాంతానికి, ప్రాంతానికి వ్యత్యాసాలు ఉన్నాయి.

గ్రామాలలో పాటిస్తున్న మత పద్ధతి వివరించ వీలులేనిది. ఎందుచేతనంటే విశాలమైన మతం దేశ వ్యాప్తంగా ఉన్న హిందూ మతం ప్రాంతీయ, స్థానిక వైరుద్ధ్యాలు దీనిలో సర్వ సాధారణం. యమ్. యన్. శ్రీనివాస్ తన గ్రంథం, దక్షిణ భారతదేశ

కూర్గీల మతం, కూర్గుల సమాజంలో వ్యాప్తి అనే ప్రయోజనకరమైన భావనను ప్రవేశపెట్టి గ్రామాలలోని హిందూమతాన్ని అఖిల భారత హిందూ మతం, దక్షిణ భారత హిందూ మతం, ప్రాంతీయ హిందూ మతం, స్థానిక హిందూ మతం అని విభజించారు. గ్రామీణులు ఆచరించే హిందూ మతం సంప్రదాయ సిద్ధమైన భారతీయ తత్వసిద్ధాంతాలకు చెందిన హిందూమతం కాదు. దీనిలో ఉన్నతమైన తత్వంగాని సిద్ధాంతకాని లేదు. ఉపవాసాలు, భజనలు, సంతర్పణల పండుగలతో కూడిన మతం.

గ్రామీణ ప్రజలకి దేవుని పట్ల అపారమైన నమ్మకం. ప్రధాన దేవుళ్లుగా భావించే త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో ప్రధానంగా శివుడిని లేదా విష్ణు వంశ సంభూతులైన రాముడు లేదా కృష్ణుడిని ఆరాధిస్తారు. వేదాలు, ఉపనిషత్తుల సారం, పురాణాలు, ఇతిహాసాలైన రామాయణ, భారతం పట్ల గ్రామీణులకు మక్కువ ఎక్కువ. పునరజన్మని, కర్మ సిద్ధాంతాన్ని, స్వర్గ నరకాల్నీ, ఇహలోక, పరలోకాన్ని గ్రామీణులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. 'ధర్మోరక్షిత రక్షితః' ధర్మాని ఎవరు కాపాడతారో ధర్మం వారివి రక్షిస్తుందనే భావనను గ్రామీణ ప్రజలు నమ్ముతారు. నీతి నియమాలను పాటించటానికే ప్రాధాన్యతనిస్తారు. వ్యవసాయదారులు, వృత్తి పనివారు కొత్తగా పనిని ప్రారంభించేటప్పుడు విత్తనాలు చల్లేటప్పుడు, పంటనుకోసేటపుడు మొదలైన సందర్భాలలో కొన్ని సంస్కారాలను పాటిస్తారు.

పండుగలు, వేడుకలు, జాతరలు, సంబరాలు ఉత్సవాల నిర్వహణలో గ్రామీణులదే పైచేయి. గ్రామీణుల మతాచారాలు మూడు విధాలుగా విభజించవచ్చు. అవి 1) ప్రార్థనలు, భజనలు 2) కర్మకాండ 3) బలులూ గ్రామీణ ప్రజలు నిత్యం ఇంట్లో ప్రార్థనలు చేస్తారు. తరచు దేవాలయాలకి వెళ్లి ప్రార్థనలు చేస్తారు. ప్రధానంగా కష్ట సమయాలలో, రోగాలతో బాధపడుతున్నప్పుడు, ప్రకృతి వైపరీత్యాలకు భయపడుతున్నప్పుడు భగవంతుని స్మరిస్తారు, పూజిస్తారు. తమ కష్టాల తొలగిపోవాలని మొక్కుకుంటారు. ముడుపులు కడతారు. గ్రామీణులు హిందూమతంలోని ప్రధాన దేవుళ్లతో పాటు ప్రాంతీయ, గ్రామ దేవతలను పూజిస్తారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవత (అమ్మవారు) జాతర జరుపుతారు. గ్రామ దేవతలకు బలినివ్వడం గ్రామీణులలో సర్వసాధారణం. కోళ్లను, మేకలను, ఎనుపోతులను గ్రామ దేవతలకు బలి ఇస్తారు. తెలంగాణా ప్రాంతాలలో గ్రామ దేవతలు పోచమ్మ దుర్గమ్మ, మైసమ్మ, బాలమ్మ, మహంకాళమ్మ వంటి పేర్లతోను, రాయలసీమ ప్రాంతంలో పోలేరమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మ, ఓబులమ్మ, ముసలమ్మ వంటి పేర్లతోను, ఆంధ్రా ప్రాంతంలో, పైడితల్లమ్మ, నూకాలమ్మ, మరిడమ్మ, పల్లాలమ్మ, బంగారమ్మ, తలుపులమ్మ, తిరుపతమ్మ వంటి పేర్లతో పిలుస్తారు. వీరిని గ్రామీణులు భక్తితో, శ్రద్ధతో కొలుస్తారు. ప్రకృతిలోని అనేక అంశాలను పవిత్రంగా చూస్తారు. ఆరాధిస్తారు. నదులు, సముద్రాలు, సూర్యచంద్రులు, గోవులు, నాగుపాములు, తులసి, వేప, రావి, మర్రి, ఔదుంబరం, ఉసిరి వంటి చెట్లని గ్రామీణ ప్రజల పూజిస్తారు. దయ్యాలు, భూతాల పట్ల వీరికి విశ్వాసం ఎక్కువ. వీటి నుండి విముక్తి పొందటానికి శాంతులను చేస్తారు. రక్షరేకులు, తాయత్తులు ధరిస్తారు. పాము, తేలు వంటి విషపురుగుల బారినపడినప్పుడు మంత్రగాళ్ల దగ్గర మంత్రాలు వేయించుకోవటం కూడా గ్రామీణులలో గమనించవచ్చు. కర్మకాండలకి గ్రామీణులు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తారు. సంస్కారాల నిర్వహణలో ముందుంటారు నామకరణ, అన్నప్రాసన, అక్షరాభ్యాసం ఉపనయనం, వివాహం, దహన సంస్కారం వంటి అనేక సంస్కారాలను పాటిస్తారు.

గ్రామీణ కుటుంబ సాంఘిక జీవనంలో ఉత్సవాలు, ఉపవాసాలు ప్రధానంగా ఉంటాయి. ఏడాది పొడవునా ఏదో కార్యక్రమం ఉంటుంది. అత్యంత భక్తి శ్రద్ధలతో పండుగలను, ఉత్సవాలను జరుపుకోవడం గ్రామీణ ప్రాంతాలలోనే ఎక్కువగా ఉంటుంది. వినాయకచవితి, ఋషిపంచమి, సుబ్రమణ్యాం షష్ఠీ రథసప్తమి, శ్రీకృష్ణాజన్మష్టమి, శ్రీరామ నవమి, విజయదశమి, తొలి ఏకాదశి, దీపావళి, ఉగాది, సంక్రాంతి, శివరాత్రి వంటి పర్వ దినాలను జరుపుకుంటారు. ఇంకా శ్రావణ పూర్ణమి, కార్తీక పౌర్ణమి, గురు పౌర్ణమి, వరలక్ష్మి వ్రతం, గౌరిపూజ, ఉండ్రాళ్ల తద్ది, అట్ల తద్ది వంటి పండుగలను కూడా కొన్ని ఉన్నత కులాలవారు జరుపుకుంటారు. రైతులు వ్యవసాయానికి సంబంధించిన వేడకలుమామూలే.

ఈ విధంగా గ్రామీణ సమాజంలో వివిధ అంశాలకు సంబంధించి మతం తనదైన పాత్రను నిర్వహిస్తుంది. గ్రామస్థులు సమైక్యంగా ఉండటానికి సామూహికంగా ఉత్సవాలు జరుపుకోవటానికి మతం దోహదపడుతుంది.

## 4.11 గ్రామీణ రాజకీయాలు :

గ్రామీణ ప్రజలు రాజకీయాలకు దూరంగా ఉంటారని, రాజకీయ చైతన్యానికి వారు నోచుకోలేదని, ఉద్యమాలంటే తెలియవని భావించడం సరికాదు. నగరవాసులంత అభిరుచి రాజకీయాల పట్ల లేకపోవచ్చు. రాజకీయాల పట్ల పూర్తి పరిజ్ఞానం వారిలో కనిపించకపోవచ్చు. అంత మాత్రానే వారు రాజకీయాలతో ప్రమేయం లేని వారు కాదు. అనేక రాజకీయ ఉద్యమాలలో గ్రామీణ ప్రజలు ముందున్నారు. స్వాతంత్ర పోరాటంలో వీరు ప్రముఖ పాత్ర నిర్వహించారు. దీనితో సహజంగానే జాతీయ రాజకీయాలతో ప్రమేయం, భాగస్వామ్యం వీరికి ఉంది.

ఆధునిక చరిత్రను పరిశీలిస్తే గ్రామీణ ప్రజలు ఉద్యమాలకు దూరంగా లేరని వెల్లడవుతుంది. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం (1857) లో గ్రామాలలోని అనేక మంది రైతులూ, చేతివృత్తులవారూ చురుకుగా పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమం (1924), శాసనధిక్కారోద్యమం (1930-1934) కిసాన్‌సభ (1934) క్విట్ ఇండియా ఉద్యమం (1942) మొదలైన అనేక ఉద్యమాలతో గ్రామీణ రైతులకి ప్రత్యక్ష సంబంధముంది. వీరి పాత్ర కీలకమైనది. తెలంగాణా, అస్సాంలలో జరిగిన రైతాంగ పోరాటాలు గ్రామీణ రాజకీయలలో మైలురాళ్ళు.

దేశానికి స్వతంత్ర్యం వచ్చిన తరువాత రాజకీయాలలో గ్రామీణుల పాత్ర ఎక్కువయింది. 70 శాతం మంది గ్రామాలలో ఉండటం వల్ల దేశ రాజకీయాలలో ప్రభుత్వాన్ని నిర్ణయించేది గ్రామీణ ప్రజలే. కుల, మత, వర్గ, వర్ణ, లింగ, ప్రాంతీయ భేదాలు లేకుండా, అర్హత, అంతస్తు తేడాలేకుండా, వయోజన ఓటింగ్ పద్ధతి ద్వారా ఓటు హక్కును కలిగి ఉంటాడు. గ్రామీణ ప్రజలలో అధిక శాతం నిరక్షరాస్యులు కావడంతో నోట్లకి అమ్ముడుపోవడం, సారాయి, బ్రాందివంటి మత్తు పదార్థాలు తీసుకోవడం వంటివి భూములకు, ప్రలోభాలకు లొంగి పోవటం గ్రామీణ ప్రజలలో కనిపిస్తుంది. గ్రామీణ రాజకీయ జీవన అధ్యయనం చాలా ముఖ్యమైన అంశం. గ్రామం ఒక ప్రాథమిక రాజకీయ యూనిట్ దీనివల్ల గ్రామీణుల ఆలోచనలు, అభిప్రాయాలు జాతీయ సంబంధమైన రాజకీయాలను అధికంగా ప్రభావితం చేస్తాయి.

గ్రామీణ రాజకీయాలను నాలుగు ప్రధాన అంశాలుగా అధ్యయనం చేయవచ్చు.

1. పరిపాలనా యంత్రాంగం 2. రాజకీయ పార్టీలు 3. స్థానిక రాజకీయాలు 4. గ్రామీణల రాజకీయ ప్రవర్తన

**1. గ్రామీణ పరిపాలనా యంత్రాంగం -** పాలనాపరంగా కొంత స్వయం ప్రతిపత్తి ఉన్నా గ్రామీణ పరిపాలన సాధారణంగా జాతీయ పరిపాలనతో కూడుకొని అనుసంధానం అయి ఉంటుంది. గ్రామం మండలంలో ఒకభాగంగాను, మండలం జిల్లాలో ఒక భాగంగాను చేసి ఈ అనుసంధానం చేశారు. గ్రామ పంచాయితీ సభ్యులతో పాటు, గ్రామ సభ, గ్రామ పంచాయితీ, గ్రామీణ పరిపాలన తహసీల్‌దార్, రక్షణ అధికారి, డిప్యూటి కలెక్టర్ పరిధిలోకి చేర్చారు. గ్రామంలో శాంతి పరిరక్షణలో చౌకీదారు సహకరించడమే కాకుండా దోపిడీలు, అల్లర్లు జరిగినప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తాడు. చౌకీదారు పోలీస్, సబ్ ఇన్‌స్పెక్టర్ కింద పనిచేస్తారు. గ్రామంలోని భూమి శిస్తును తహసిల్‌దారు వసూలు చేస్తాడు. గ్రామంలో రెండు స్థాయిలలో పాలన జరుగుతుంది. అధికారుల పాలన ఒక వైపు, ప్రజా ప్రతినిధుల పాలన మరో వైపు దీనితో కొన్ని సమస్యలు, ఏర్పడతాయి. అభివృద్ధి విషయంలో ఆటంకాలు కలుగుతాయి. ప్రభుత్వాధికారులు ప్రతినిధులను పట్టించుకోని పరిస్థితులు ఉంటాయి. ఆదే విధంగా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాధికారులకు సహకరించని సందర్భాలు ఎదురవుతాయి.

**2. రాజకీయ పార్టీలు** - జాతీయ రాజకీయాలలో అడుగు పెట్టాలంటే గ్రామలే కీలకం. గ్రామస్థాయిలో బలం పెరిగితే అది పార్టీ సుస్థిరంగా ఉండటానికి వీలుంటుంది. ప్రజలలో బాగా పలుకుబడి ఉంటుంది. రాజకీయ పార్టీలు గ్రామీణ రాజకీయాలలో అధికారం కోసం కృషి చేస్తాయి. గ్రామాలపై పట్టకు ప్రయత్నిస్తాయి. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భారతీయ జనతాపార్టీ, కమ్యూనిస్ట్ పార్టీలు ప్రాంతీయ పార్టీలు గ్రామాలలో తమ పరస్థితిని పెంచుకోవటానికి ప్రజలలో తమ బలాన్ని అధికం చేసుకోవటానికి నిరంతరం కృషి చేస్తుంటాయి.

**3. స్థానిక రాజకీయాలు** - గ్రామ రాజకీయాలలో ప్రధానంగా ముఠాలు, కులాలు, ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. గ్రామంలో ప్రతీకులం రాజకీయంగా ఎదగాలనుకుంటుంది. దాన్ని సత్తాను ఎన్నికల్లో చాటాలనుకుంటుంది. గ్రామీణ రాజకీయాలలో ప్రాబల్య కులాలు ప్రభావాన్ని కలిగి ఉంటాయి. దేశంలో గ్రామీణ రాజకీయాలను పరిశీలిస్తే చాలా వరకు కులసంఘాలే రాజకీయాలలో ప్రయోజన వర్గాలుగా పని చేస్తున్నాయి. కొంత మంది ముఠానాయకులు వల్ల రాజకీయాలను ముఠాతత్త్వయం బయలుదేరింది. ముఠాలు కూడ గ్రామీణ రాజకీయాలకు కీలకపాత్ర వహిస్తాయి. కులసంఘాలు చెప్పిన విధంగా పార్టీలకు ఓట్లు వెయ్యడం జరుగుతుంది.

**4. రాజకీయ ప్రవర్తన** - గ్రామీణ రాజకీయ ప్రవర్తన వివిధ విధాలుగా ఉంటుంది. రాజ్యాంగ పరంగా అధికారం పొందాలనుకొనే వారు. కొందరైతే అవినీతే ప్రధానంగా అక్రమదారుల ద్వారా లబ్ధిపొందాలనుకొనే వారు మరి కొందరు. గ్రామీణ రాజకీయాలను శాంతియుత వాతావరణమూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో అహింస పద్ధతులను అనుసరించడం జరుగుతుంది. నేటి గ్రామీణ ప్రాంతాలలో చాలా వరకు ఉద్రిక్తతలు లేకుండా శాంతి సామరస్యం ప్రజాస్వామ్య స్ఫూర్తితో ముందుకు పోతున్నాయి. దీనికి స్వపరిపాలన దోహదపడిందని చెప్పకతప్పదు.

**సారాంశం :**

గ్రామీణ సమాజంలో కులం గ్రామీణ ప్రజల, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ జీవితాలను ప్రభావితం చేస్తున్నది. హిందూ మతానికి కులం మూలం, కులాల వారిగా అంతస్థు, వృత్తుల విభజన ఆహార అలవాట్లుకు సంబంధించిన నిషేధాలు, నియమాలు, కులపంచాయితీలు గ్రామీణ ప్రాంతాలలో సర్వసాధారణం, మతం కూడ గ్రామీణ సమాజంలో ప్రత్యేకమైన పాత్రను నిర్వహిస్తుంది. సామాజిక నియంత్రణగా పని చేస్తుంది. నైతిక విలువలను పెంచడంలోను ధర్మ రక్షణలోను మతం ప్రజలకు మార్గదర్శిగా ఉంటుంది. గ్రామీణ సమాజంలో మతం పరంగా ఆచారాలు, సంస్కారాలు ఎక్కువగా పాటిస్తారు. ప్రార్థనలు, బలులూ, కర్మకాండల విషయంలో గ్రామీణులు ముందుంటారు. గ్రామీణ రాజకీయాలలో ముఠాలు, కులాల ప్రాబల్యం ఎక్కువగా ఉంటుంది. రాజకీయ పార్టీలు గ్రామాలనే ప్రధానంగా భావిస్తు పార్టీ పునాది కోసం కృషి చేస్తాయి. గ్రామీణులకు రాజకీయాల పట్ల ఆసక్తి లేదని చెప్పలేము. అనేక ఉద్యమాలలో గ్రామీణులు చురుకుగా పాల్గొనడమే దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

**4.13 ముఖ్యపదాలు :**

కులం - వారసత్యం, స్వకుల వివాహ, సాంప్రదాయ సిద్ధమైన వృత్తి సంబంధాలను కలిగిన వ్యక్తులు సమూహము.

అంతర్వివాహం - ఒక సమూహానికి చెందిన వ్యక్తి తన సమూహంలోని వ్యక్తినే వివాహం చేసుకొనే పద్ధతి.

ప్రకృతివాదం - ప్రకృతిలో ఉన్న సూర్యచంద్రాలు, నీరు ఆకాశం వంటి వాటితో అలైకికశక్తి ఉందనే విశ్వాసంతో వాటిని ఆరాధించడం.

ఫెటిష్‌వాదం - కొయ్య విగ్రహాలకు అతీతశక్తిని అపాదించి ఆశ్వీదించడం.

మతం - మానవాతీత శక్తుల పట్ల ఉన్న విశ్వాసం.

టోటెమ్ - గిరిజన సముధాయాలలో తమ వంశం ఒక చెట్టు నుండిగాని, జంతువు నుండి గాని ఆవిర్భవించినదనే విశ్వాసాన్ని కలిగి ఉంది. వాటిని పవిత్రంగా ఆరాధించడం వారు విశ్వసించిన చెట్టు లేదా జంతువుని టోటెమ్ అంటారు.

## 4.14 నమూనా ప్రశ్నలు :

1. కులాన్ని నిర్వచించి దాని లక్షణాలను, విధులను తెలియజేయండి.
2. గ్రామీణ సమాజంలో కులవ్యవస్థ తీరుతెన్నులను వివరించండి.
3. మతాన్ని నిర్వచించి లక్షణాలని, విధులను విశదీకరించండి.
4. మతం యొక్క వివిధ సిద్ధాంతాలను వివరించండి.
5. గ్రామీణ సమాజంలో మతం పాత్రను తెలియజేయండి.
6. గ్రామీణ రాజకీయాలపై ఓ వ్యాసాన్ని వ్రాయండి.

## 4.15 చదువదగిన గ్రంథాలు :


1. Caste in India - J.H. Hython
2. Caste and Race in India - G.S. Ghurya
3. Caste in India - N.K. Dutta
4. Social change in modern India - M.N. Srinivas
5. Elementary forms of religions - Emile Durcheim
6. Social Anthur of glory - Frazer
7. Indian social system - Ram Ahuja
8. Rural society in India - Sharma K.L.


ఆచార్య. ఆర్. విజయకృష్ణ నాయుడు

**పాఠం - 5**

# కులం మరియు గ్రామ పంచాయితీలు

## 5.0 లక్ష్యం :

గ్రామీణ సమాజంలో కుల పంచాయితీలు వాటి తీరుతెన్నులను, పంచాయితీ రాజ్ పరిణామం, వ్యవస్థ నిర్మాణం, గ్రామాలలో పంచాయితీరాజ్ ప్రభావం గురించి తెలుసుకోవడమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

## విషయక్రమం :


5.1 పరిచయం

5.2 కుల పంచాయితీలు

5.3 పంచాయితీ పద్ధతులు

5.4 సభ్యులు, సభలు

5.5 పంచాయితీ - శిక్షలు

5.6 పంచాయితీ రాజ్ - పరిణామం

5.7 పంచాయితీ రాజ్ వ్యవస్థ నిర్మాణం

5.8 గ్రామసభ

5.9 గ్రామ పంచాయితీ

5.10 పంచాయితీ సమితి

5.11 జిల్లా పరిషత్

5.12 సారాంశం

5.13 ముఖ్య పదాలు

5.14 నమూనా ప్రశ్నలు

5.15 చదువదగిన గ్రంథాలు


## 5.1 పరిచయం :

మానవ సమాజంలో సాంఘిక, ఆర్థిక సంస్థలకు ఎంత ప్రాముఖ్యత ఉందో రాజకీయ సంస్థలకు అంతే ఉంది. అధికారం రెండు విధాలుగా ఉంటుంది, సాంఘికమైనది మరియు చట్టపరమైన అధికారం సమాజం, సంస్కృతి నిర్దేశించిన అధికారం సాంఘిక అధికారం. కులపెద్దలు నిర్వహించేది ఈ అధికారమే. ఇది పూర్తిగా వ్యక్తి పరమైంది. అధికార విధులను నిర్వర్తించలేదు. అయితే సమాజ గుర్తింపు ఉంది. దీన్ని అతిక్రమిస్తే సాంఘిక శిక్ష చర్యలు అమలు చేయడం జరుగుతుంది. వ్రాత పూర్వకంగా, చట్టం పరిధిలో [illegible]యించే అధికారం చట్టపరమైన అధికారం. ఇది వ్యక్తిపరమైంది కాదు. హోదా పరమైంది. గ్రామీణ సామాజిక, రాజకీయ స్థితిగతులకు పంచాయితీలు కీలక పాత్రను నిర్వహిస్తాయి. గ్రామీణాభివృద్ధిలో పంచాయితీల పాత్ర ఎంతైన ఉంది.

## 5.2 కుల పంచాయితీలు :

పంచాయితీ అనే పదం 'పంచ' అనే పదం నుండి వచ్చింది. పంచ అంటే అయిదు. పంచాయితీ అంటే అయిదు మంది ఉన్న మండలిగా చెప్పవచ్చు. అనగా గ్రామాలలో వెల్తే తగాదాను, వివాదాలను కుల సంప్రదాయాలకు అనుగుణంగా పరిష్కరించడానికి ఏర్పడే గ్రామ పద్ధతి సమావేశం. గ్రామీణ భారతదేశంలో సంప్రదాయ వ్యవస్థ నిర్మాణం ముఖ్యంగా కుల పంచాయితీలపై ఆధారపడి జరిగేది. కులపంచాయితీలు పరస్పర అంగీకారం, సహకారం వ్యవస్థీకృత సాధారణ సంక్షేమం, సంస్కరణ, సౌభ్రాతృత్యం మరియు మొత్తం కులసమైక్యతను ఆధారంగా చేసుకొని ఏర్పడినవి. కొన్ని కులాలలో వంశపారం పర్యంగానూ, కొన్నింటిలో వ్యక్తుల ఎన్నిక ద్వారాను పంచాయితీలే అధికారాలను నిర్వహిస్తాయి. వివిధ కులాలకు వేరు వేరుగా కులపంచాయితీలుంటాయి. జనాభాను బట్టి గ్రామాల మధ్య దూరాన్ని బట్టి ఇవి నిర్ణయింపబడతాయి. కులానికి సంబంధించిన వివిధ వ్యవహారాల్లో దీనికి విస్తృత అధికారాలుంటాయి. కులానికి సంబంధించిన విషయాలన్నింటిలోను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కులపంచాయితీల ప్రభావం ఉంటుంది. వివాహ సంబంధమైన పెండ్లి, నిశ్చితార్థం, విడాకులు, విందు, ఇతర ఆచారాలు, సంప్రదాయాలు. కర్మకాండ, ఇతర సంస్కారాలు, సంప్రదాయాలు ఆహార అలవాట్లు, కులకట్టుబాట్లు, వీటికి సంబంధించిన నియమాలు, నిషేధాలు నిబంధనలు కుల పంచాయితీలే రూపొందిస్తాయి. వీటి అమలులో కూడ కులపంచాయితీల పాత్ర చాల వుంది. మతపరమైన, సామాజిక విలువలు పరిరక్షణ కులపంచాయితీలు ప్రముఖ పాత్ర వహిస్తాయి.

కుల పంచాయితీలకు నాయకులుగా ఉండేవాళ్లు సాధారణంగా స్త్రీలు ఉండరు. వంశాను గతంగా నాయకత్వం వస్తుంది. వీరు ఆస్తిపరులై తమ తమ కుటుంబాలలో ఎదురు లేకుండా ఉండాలి. సంఘంలో పలుకుబడి, పరువు, ప్రతిష్ఠ కలిగి ఉండాలి. వివాదాలను పరిష్కరించే నైపుణ్యం, సమయస్ఫూర్తి, విషయాలను సూటిగా, స్పష్టంగా వివరించే శక్తి, అనర్గళంగా మాట్లాడటంతో పాటు ప్రజలను ఆదరాభిమానాలను పొందగల్గే ప్రజ్ఞా పాటవాలు, సామర్థ్యం ఉండేవాళ్లే నాయకులుగా బాగా రాణిస్తారు. ఎక్కువుగా వీరికే నాయకత్వం లభిస్తుంది. నాయకుల పెద్ద మనిషిగా మధ్య వర్తిత్వం వహించాలి. వంశాచారాలను పాటించేటట్లు చూడాలి. వివాహానికి సంబంధించిన కట్న కానుకల విషయాల్లోను ఏవైన అభిప్రాయ భేదాలొస్తే పరిష్కరించాలి.

## 5.3 పంచాయితీ పద్ధతులు :

పంచాయితీ అంటే తగవుల పరిష్కారానికి మరో పేరుగా గ్రామీణులు వాడే పదం. కులానికి సంబంధించిన సమస్య ఏర్పడినప్పుడు అది కుటుంబానికి లేదా వంశానికి లేదా కులానికి సంబంధించినదైనప్పుడు ఆ సమూహంలోని బాధ్యత గల పెద్దలంతా ఏకమై సమస్యను చర్చించి పరిష్కారం చేస్తారు. సమస్య తీవ్రతను బట్టి ఎంత మంది సభ్యులుండాలి, ఎక్కడ సభ జరపాలి. ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనేవి ఆధారపడి ఉంటాయి. ఆస్తితగాదాలు, వ్యక్తుల మధ్య కలహాలు వంటి సమస్యల పరిష్కారానికి సమావేశం కావచ్చు. ఎందుచేతనంటే పెద్ద, పెద్ద విషయాలు, వివాదాంశాల విషయంలో ఎక్కువ మంది సాక్షులను విచారించి, పరీక్షించి, చర్చించి నిర్ణయం తీసుకోవాలి. అదే చిన్న సమస్యలైతే వాటివి కొన్ని సార్లు అక్కడకక్కడే పరిష్కరించవచ్చు.

## 5.4 సభ్యులు, సమావేశాలు :

సమావేశ స్థలం సాధారణంగా దేవాలయం దగ్గర ఉంటుంది. దేవుని సన్నిధిలో అసత్యమాడరనే ప్రగాఢ విశ్వాసం వల్ల గుడికి దగ్గర సమావేశాల ఏర్పాటు ఉంటుంది. సమావేశాలు ఎక్కడైన జరగవచ్చు. సమావేశాలకు నేరారోపణ చేసిన వారు నేరారోపణకు గురైన వారు, నేరస్థుల బంధువులు వంశ, జాతి, పెద్దలు గ్రామస్థులు అందరూ విచ్చేస్తారు. సాక్ష్యమిచ్చే వారు మామూలుగా దేవుని సాక్షిగా లేదా ఆత్మసాక్షిగా అని చెప్పి సాక్ష్యమిస్తారు. నేరస్థులు, ఫిర్యాదిదారులు పరస్పరం తమ వాదనలకు సాక్ష్యాలను ఉపయోగిస్తారు.

పార్టీలు తాము చేప్పే సత్యాలని నిరూపించటానికి ప్రమాణం చేయడం, ఆలయాలకు, దేవుని ముందు నిజాలు తెలియజేయడం ఉంటుంది. కాగుతున్న నూనెలో చేయి పెట్టడం, అర చేతిలో హరతి కర్పూరాన్ని వెలిగించు కోవడం, కాలుతున్న ఇనుపకడ్డీని పట్టుకోవడం వంటి అనాగరిక పద్ధతుల్ని ఆశ్రయించడం గ్రామీణులలో సర్వసాధారణం. పంచాయితీ నాయకుల మధ్య అంగీకారం కుదిరితే తప్ప నిర్ణయాలు వెలువడవు. లేకుంటే సమావేశం వాయిదా పడుతుంది. ఏకాభిప్రాయానికి అంతా ప్రయత్నించటం జరుగుతుంది. మామూలుగా పంచాయితీలు నిష్పక్షపాతంగా ఉంటాయి.

## 5.5 శిక్షలు :

సాధారణంగా కుల పంచాయితీలు విధించే శిక్షలు తక్కువ అపరాధపు పన్ను మొదలుకొని కుల బహిష్కరణ వరకు ఉంటాయి. కులం నుంచి వెలి వేయడంకన్న పెద్ద శిక్ష ఏదీ లేదు దీనినే తీవ్రమైన శిక్షగా పరిగణిస్తారు. బహిష్కృతుడైన వ్యక్తి మామూలుగా క్షమాబిక్షను ప్రసాదించమని పంచాయితీలని ప్రాధేయపడతాడు. పంచాయితీ నిర్ణయించిన రీతిలో పశ్చాత్తాప పద్ధతుల్ని పాటిస్తాడు.

## పంచాయితీరాజ్ పరిణామం :

భారతదేశంలో పంచాయితీ వ్యవస్థ అత్యంత పురాతనమైనది. వేదాలు పురాణాలకాలంలో కూడ పంచాయితీలున్నట్లు ఆధారాలున్నాయి. మహాభారతం శాంతి పర్వంలో గ్రామ సంఘాల ప్రస్తావన ఉంది. అదే విధంగా మనుస్మృతి, బౌద్ధ జాతక కథలు కౌటిల్యుని అర్థశాస్త్రంలోను గ్రామసభల గురించిన వివరణ దొరుకుతుంది. వేల సంవత్సరాల నాడే గ్రామ పంచాయితి వ్యవస్థ ఉన్నట్లు పురావస్తు తవ్వకాలలో వెలుగుచూసిన ఆధారాలను బట్టి తెలుస్తుంది. పురాతన కాలంలో పంచాయితీల ప్రాబల్యం బాగా ఉండేదని కె.యమ్. ఫణిక్కర్ అభిప్రాయపడ్డాడు. గ్రామ రక్షణ, ప్రగతి, శిస్తు వసూలు వంటి కార్యక్రమాలు ఆ రోజులలో గ్రామ పంచాయితీలు నిర్వహించేవని డా॥ అల్టేకర్ పేర్కొన్నాడు. పదో శతాబ్దంలోని శుక్ర నీతి సారం ప్రకారం పంచాయితీలు ఏడు ప్రధానమైన బాధ్యతలను నిర్వర్తించేవని తెలుస్తుంది. సర్ చార్లెస్ మెట్కాన్ నాటి పంచాయితీలు చిన్నదిజీ పబ్లిక్ లక్షణాలు పొంది ఉండేవని భావించాడు. 1909 (వికేంద్రీకరణ) రాయన్ కమీషన్ గ్రామ పంచాయితీల ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను గుర్తించి వాటిని ప్రోత్సాహించాలని కోరింది. దీనికిగాను 1915, 1919 మరియు 1920 లలో శాసనాలు చేయబడ్డాయి. అయితే అవి అంతగా రాణించలేదు. ప్రాచీన భారతదేశంలో ఉజ్వలంగా ఉన్న పంచాయితీలు ముస్లీమ్ పాలకాకాలంలో క్షీణ దశకు చేరుకొన్నాయి. ఆంగ్లేయుల పాలనలో పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే దేశం స్వాతంత్ర్యం పొందాక పంచాయితీ వ్యవస్థ పునరుద్ధరణ జరగడమే కాకుండా పుంజుకుంది.

దేశానికి స్వతంత్ర్యం వచ్చాక గ్రామ పంచాయితీల ప్రాముఖ్యతను జాతీయ నాయకులు గుర్తించారు. గ్రామీణ సామాజిక ఆర్థిక రంగాలలో గ్రామ పంచాయితీల పాత్ర ఎంతైన ఉందనే భావనతో పంచాయితీరాజ్ వ్యవస్థకి జవాన్ని జీవాన్ని కలిగించేటందుకు కృషి చేశారు. భారత రాజ్యాంగంలోని నిర్దేశక సూత్రాలలో పంచాయితీలను ఏర్పాటు చేసి, స్థానిక ప్రభుత్వాలుగా ఉండటానికి అవసరమైన అధికారాలను కలిగించాలని సూచించడం జరిగింది.

స్వాతంత్ర్యనంతరం భారతదేశ గ్రామీణ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి తొలిసారిగా అక్టోబరు 2, 1952 గాంధీ జయంతిని పురస్కరించుకొని సమాజ వికాసాలు పథకం చేపట్టడం జరిగింది. పంచాయితీ రాజ్ భావన ఈ పథకాల రూపంలో ఉందని చెప్పవచ్చు. దీనిని అనుసరించి ప్రతి రాష్ట్రాన్ని కొన్ని బ్లాకులుగా విభజించి, ఒక్కొక్కబ్లాకుని ఒక్కొక్క సమాజ వికాస అధికారి ఆధ్వర్యంలో ఉంచడం జరిగింది. అయితే ఈ విధానం సాధించినది ఏమిలేదు. విజయవంతం కాలేక పోవటానికి గ

కారణాల్ని పరిశీలించి, సమాజ వికాస పథకాలను సమీక్షించడానికి 1954 బల్వంత్ రాయ్ మెహతా అధ్యక్షతన ఒక అధ్యయన సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యయన సంఘం గ్రామ, బ్లాక్, మరియు జిల్లా స్థాయిలో ప్రజలలో ఎన్నుకోబడిన సంస్థలను ఏర్పాటు చేయకోరింది. ఈ పరిపాలన వివేంద్రీకరణ జరిగి తీరాలని సిఫార్సు చేసింది. దీనినే "ప్రజాస్వామ్య వికేంద్రీకృత సంస్థ" గా లేదా పంచాయితీ రాజ్‌గా వ్యవహరిస్తారు. అభివృద్ధి కార్యక్రమాలలో పంచాయితీ రాజ్ సంస్థ ముడిపడి ఉండాలని అధ్యయన సంఘం సూచించింది. 1958లో జాతీయాభివృద్ధి మండలి దీనిని అమోదించింది. గ్రామ పంచాయితీలకు అధికార బదలాయింపులు జరగాలని, వికేంద్రీకరణ పాలనీయంత్రాంగం ప్రజా ప్రతినిధుల నియంత్రణాధికారంలో ఉండాలని అధ్యయన సంఘం సిఫార్సు చేసింది. మూడు అంశాల వ్యవస్థను ఈ సంఘం సూచించింది. గ్రామ పంచాయితీ, పంచాయితీ సమితి, జిల్లా పరిషత్ ఈ నాటి పంచాయితీరాజ్ వ్యవస్థలో త్రివిధ పరిపాలనా పద్ధతి అమలులో ఉంది. క్రింది (నిమ్న) స్థాయిలో గ్రామ పంచాయితీ, మద్యస్థాయిలో పంచాయితీ సమితి (మండలి) ఉన్నత స్థాయిలో జిల్లా పరిషత్తును వ్యవస్థీకరించారు. పంచాయిత్ రాజ్ వ్యవస్థలో మార్పులు చేసుకొనే అధికారాన్ని, స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వడం జరిగింది. బల్వంత్‌రాయ్ కమిటీ సిఫార్సులు ఆధారంగా ప్రప్రథమంగా రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో 1959లో పంచాయితీ రాజ్ వ్యవస్థకు ఏర్పాటు జరిగింది. విస్తరణ జరిగింది. ఆ తర్వాత మిగతా రాష్ట్రాలలో కూడ దీని ఏర్పాటు జరిగింది.

## 5.7 పంచాయితీ రాజ్ వ్యవస్థ - నిర్మాణం :

దేశంలో వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మూడు అంచెల పంచాయితీ రాజ్య వ్యవస్థలో గ్రామస్థాయి లో రెండు సంస్థలు గ్రామ సభ గ్రామ పంచాయితీ, బ్లాక్ స్థాయిలో పంచాయితీ సమితిలు జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్‌లు ఏర్పాటయ్యాయి.

## 5.8 గ్రామ సభ :

గ్రామ సభ అనేది గ్రామ పంచాయితీ యొక్క సాధారణ సమావేశం. ఒక గ్రామ పంచాయితీలోని అర్హులైన ఓటర్లందరిచే ఏర్పాటు చేయబడుతుంది. ఈ సభ ఏడాదికి కనీసం రెండు సార్లు సమావేశం కావాలి. గ్రామ సభ గ్రామ పంచాయితీకి సంబంధించిన ఆదాయ వ్యయ వివరాలు పంచాయితీ వ్యయతాలుకా ఆడిట్ నివేదికను పరిశీలించాలి. గ్రామ పంచాయితీ నివేదిక, గత సంవత్సరపు పాలనా నివేదక, వచ్చే సంవత్సరపు కార్యక్రమ పట్టిక, పన్నుల ప్రతిపాదన మొదలగు అంశాలతో కూడ గ్రామ సభ చర్చిస్తుంది. గ్రామ పంచాయితీ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటుంది.

గ్రామ పంచాయితీ - జనాభా పరిమాణాన్ని బట్టి గ్రామ పంచాయితీ సభ్యుల సంఖ్యను నిర్ణయిస్తారు. సభ్యుల సంఖ్య 7 నుండి 19 వరకు ఉంటుంది. 18 సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషులందరికి ఓటు హక్కు ఉంది. గ్రామ పంచాయితీ సభ్యులను ఓటర్లు ఎన్నుకొంటారు. దీని కాల పరిమితి 5 సంవత్సరాలు. పంచాయితీ అధ్యక్షుడిని సర్పంచ్ అంటారు. సర్పంచ్‌ని కూడా గ్రామంలోని ఓటర్లంతా ఎన్నుకొంటారు. ఉప సర్పంచ్‌ని పంచాయితీ సభ్యులతో ఒకరిని వారే ఎన్నుకొంటారు. పంచాయితీలో కొన్ని స్థానాల్ని స్త్రీలకు, షెడ్యూల్డ్ కులాలకు, తెగలుకు కేటాయిస్తారు. సర్పంచ్ పంచాయితికి సర్వాధికారి. అనేక పాలనాపరమైన బాధ్యతలు సర్పంచ్‌కు ఉన్నాయి. పన్నుల విధింపులోను, పన్నుల మదింపులోను అతని పాత్ర ప్రధానమైనది.

### గ్రామ పంచాయితీ - విధులు :

గ్రామ పంచాయితీ నిర్వహించే విధులు స్థూలంగా రెండు రకాలు

1. ఐచ్ఛిక విధులు (Optional Function)
2. నిర్బంధపు విధులు (Compulsury Function)

1) గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటం.
2) మురికి నీటి పారుదల ఏర్పాట్లు.
3) వీధి దీపాలను సమకూర్చటం.
4) గ్రామంలో రోడ్లను వేయించడం, సరి చేయించడం
5) శ్మశాన వాటికల నిర్మాణం మరియు నిర్వహణ
6) నీటి సరఫరాకు తగిన సౌకర్యాల కల్పన
7) చిన్న నీటి పారుదల నిర్వహణ
8) పాఠశాల భవన నిర్మాణ నిర్వహణ బాధ్యత
9) కుటుంబ నియంత్రణ పథకాల నిర్వహణ
10) జనన మరణాల నమోదు
11) అంటు రోగాల నిరోధక చర్యలు
12) గ్రంథాలయాలను నెలకొల్పడం
13) పిల్లలకు ఆట స్థలాలు, పార్కుల ఏర్పాటు
14) గ్రామంలోని వనరుల వినియోగం
15) పనికిరాని భూములను సాగులోకి తేవడం.

ప్రతి గ్రామ పంచాయితీకి ఒక నిధి ఉంటుంది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విధులు సమకూరుతూ ఉంటాయి. ప్రధానంగా గ్రామ పంచాయితికి ఆదాయాన్ని చేకూర్చేవి.

1. పన్నులు - ఆస్తిపన్ను, ఇంటి పన్ను, భూమి శిస్తు, వాహనాలపై పన్ను, వృత్తి పన్ను మొదలైనవి.
2. ఫీజులు - నీటి సరఫరాకి, వీధి దీపాలు అమర్చినందుకు చెల్లించాల్సిన ఫీజు, వృత్తి పరమైన నిపుణులు, కమీషన్ ఏజెంట్ల వంటివారు చెల్లించాల్సిన లైసెన్సు ఫీజులు
3. గ్రామ ఆస్తుల ద్వారా వచ్చే అద్దెలు
4. చట్టాన్ని అతిక్రమణకు విధించే ఫీజులు
5. ఇతరత్ర మార్గాలు - మార్కెట్‌లో వస్తువుల అమ్మట బండి పన్ను మొదలైనవి.

## 5.10 పంచాయితీ సమితి :

ప్రతి బ్లాక్ ప్రాంతానికి ఒక పంచాయితీ సమితి ఉంటుంది. పంచాయితీ సమితి అధిపతిని వివిధ రాష్ట్రాలలో వివిధ పేర్లతో పిలుస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌లో అధ్యక్షుడు (ప్రెసిడెంట్) అని పిలుస్తారు. బ్లాక్‌లో ఉన్న గ్రామ సర్పంచ్‌లంతా దీనిలో సభ్యులుగా ఉంటారు. స్థానిక ఎం.ఎల్.ఎ. ఎం.ఎల్.సి.లకు ప్రాతినిధ్యం ఉంది. సమితిలో షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు, స్త్రీలు, బలహీన వర్గాలు కూడ ప్రాతినిధ్యం ఉంది. సమితి కాలపరిమితి 5 సంవత్సరాలు. నూతన పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం సమితిని 30 నుండి 40 వరకు ప్రాదేశిక నియోజక వర్గాలుగా విభజించి వయోజన ఓటింగ్ విధానంలో ప్రతి నిధులను ఎన్నుకోవడం జరుగుతుంది. ఎన్నికైన సభ్యులు సమితి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు.

బ్లాక్‌ల స్థానంలో మండలాలు - మండల ప్రజా పరిషత్‌లను ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశ్‌పెట్టడం జరిగింది. మండలాలు బ్లాకులకంటే చిన్నవి. ప్రతి మండల్‌ని 10,15 మండల ప్రజాపరిషత్, ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించి ప్రతి ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజక వర్గం నుంచి ఒక ప్రతినిధిని ఎంపిక చేసుకొనేటట్లు రూపొందించడం జరిగింది.

**పంచాయితీ సమితి ప్రధాన విధులు :**

1) ప్రాథమిక విద్యకు
2) వ్యవసాయాభివృద్ధి
3) కుటీర పరిశ్రమలు
4) మురికి నీటి పారుదల
5) రోడ్ల నిర్మాణం
6) ఆరోగ్యాభివృద్ధి
7) గ్రంథాలయాల నిర్వహణ
8) పశుగణాభివృద్ధి, పశువైద్యం
9) సహకార సంఘాలు - అభివృద్ధి
10) స్త్రీ సంక్షేమం

స్థాయి సంఘాలకు అధ్యక్షుడిగా మండలాధ్యక్షుడు ప్రెసిడెంట్ ఉంటాడు. సామాజిక సేవలు, పన్ను వ్యవహారాలు ఉత్పత్తి పథకాలు మొదలైన వాటిని వీరు నిర్వహిస్తారు. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్. (బి.డి.ఓ) పంచాయితీ రాజ్ వ్యవస్థలో కీలకమైన పాత్రను నిర్వహిస్తాడు. ఆంధ్రప్రదేశ్ మండల స్థాయిలోని కార్యనిర్వహణాధికారి, మండలాధికారి (యం.డి.ఓ.) ఉంటాడు. గ్రామాభివృద్ధి అధికారులు (వి.డి.ఓ.) వీరికి సహాయకులుగా ఉంటారు.

పంచాయితీ సమితులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆర్థిక వనరులతో నడుస్తాయి. బ్లాక్ బడ్జెట్ సమకూర్చే నిధులు భూమిశిస్తులో భాగం, సమితి విధించే పన్నులు ప్రత్యేక పథక నిధులు, పంచాయితీలు కూడా కొన్ని నిధులను పంచాయితి సమితికి సమకూరుస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఋణాలు లభిస్తాయి. నిధుల కొరత, గ్రామ పంచాయితీల పంచాయితీ సలహాలకు ఎదురవుతుండు సర్వసాధారణం.

## 5.11 జిల్లా పరిషత్ :

ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్తు ఉంటుంది. చాలా రాష్ట్రాలలో సమితి అధ్యక్షులంతా జిల్లా పరిషత్ చైర్మెన్‌ను ఎన్నుకొంటారు. చైర్మెన్ జిల్లా పరిషత్ పాలనా బాధ్యతలు నిర్వర్తిస్తారు. జిల్లా పంచాయితీరాజ్ అధికారి (డి.పి.ఆర్.ఓ) జిల్లా పరిషత్ నిర్వాహణాధికారిగా ఉంటాడు. జిల్లా కలెక్టర్ ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ఉంటాడు. సాధారణంగా షెడ్యూల్డ్ కులాలు, తెగలుకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఉంటుంది. కొన్ని రాష్ట్రాలలో జిల్లాకు చెందిన ఎం.పి.లు, ఎమ్మెల్యేలు జిల్లా పరిషత్‌లో సభ్యులుగా ఉంటూ పట్టుసే హక్కుని కలిగి ఉంటారు. జిల్లా పరిషత్ కాలపరిమితి 5 సంవత్సరాలు నూతన పంచాయితీరాజ్ చట్టం ప్రకారం జిల్లా నంతటిని 40-50 ప్రాదేశిక నియోజక వర్గాలుగా (జెడ్.పి.టి.సి) విభజించడం, ప్రతి ప్రాదేశిక నియోజక వర్గం నుంచి ఒక ప్రతినిధిని ఎన్నుకోవడం జరుగుతుంది. ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులంతా చైర్మెన్ ఎన్నుకొంటారు. జిల్లా పరిషత్ కార్యకలాపాల నిర్వహణ సవ్యంగా సాగేటందుకూ అనేక స్థాయి సంఘాలను ఏర్పాటు చేస్తుంది. జిల్లా అధికారులు, సాంకేతిక సిబ్బంది సహాయంతో అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తాయి.

**జిల్లా పరిషత్ - విధులు :**

జిల్లా పరిషత్ ప్రధానంగా పాలనా సంబంధమైన సలహా అందివాల్సిన విధులు ప్రణాళిక రూపకల్పనతో పాటు కింది విధులను నిర్వర్తిస్తుంది.

1. సమితి బడ్జెట్‌లను ఆమోదించడం.
2. సమితి ప్రణాళికల్ని సమన్వయ పరచడం.
3. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధుల్ని పంచాయితీ సమితలకు కేటాయించటం.
4. జిల్లాలోని రోడ్ల నిర్వహణ
5. తాగు నీటి సరఫరా చేయడం
6. ఆసుపత్రులు, ప్రసూతి, శిశు సంక్షేమ కేంద్రాల నిర్వహణ
7. సమాజ వికాస పథకాల అమలు
8. విద్యా సంస్థల నిర్వహణ (ప్రాథమిక, మాధ్యమిక మరియు ఉన్నత విద్యా సంస్థలు)
9. జిల్లాలోని కుటీర పరిశ్రమలను ప్రోత్సహించటం.
10. ప్రణాళిక పథకాల అమలపై పర్యవేక్షణ.

**ఆర్థిక వవరులు :**

జిల్లా పరిషత్‌కి ప్రధానమైన ఆదాయ వనరులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్ - ఇన్.ఎయిడ్ వివిధ పన్నుల రూపంలో లభించే ఆదాయం, భూమిశిస్తులో వాటా, గ్రామ పంచాయితీ, సమితుల ఆదాయం నుంచి వచ్చే వాటా మరియు ప్రత్యేక పథకాల అమలు కోసం ఉన్న నిధులు.

గ్రామీణాభివృద్ధికి గ్రామీణ పునర్నిర్మాణానికి మూడంచెల వ్యవస్థయైన పంచాయితీ రాజ్ ఎంతగానో దోహదపడింది. అనేక అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రగతిని సాధించింది. గ్రామీణ ప్రజలలో చైతన్యాన్ని కలిగించింది. కొన్ని లోపాలు, సమస్యలు ఉన్నప్పటికిని పంచాయితీ రాజ్ వ్యవస్థ గ్రామీణాభివృద్ధిలోను ముందడగు వేసింది. గ్రామీణ ప్రాంతాలలో సామాజిక పరివర్తనకు పంచాయితీ రాజ్ వ్యవస్థ ప్రధానంగా దోహదపడింది.

పంచాయితీ రాజ్ వ్యవస్థలోని లోపాలను సవరించటానికి మరింత సక్రమంగా సమగ్రంగా ఉండటానికి అనేక కమిటీలను ప్రభుత్వం నియమించింది. వీటిలో అశోక్ మెహతా కమిటీ ముఖ్యమైనది. కమిటీ సూచనలు, సిఫార్సుల పంచాయితీ వ్యవస్థ పని తీరును మెరుగు పర్చడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

**73వ రాజ్యాంగ సవరణ - ముఖ్య అంశాలు:**

బల్వంతరాయ్ కమిటీ సిఫార్సు (1959) తర్వాత పంచాయితీ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి తీసుకొన్న చర్యలలో ప్రధానమైనది. 73వ రాజ్యాంగ సవరణ (1992).

వీటిలో ముఖ్య అంశాలు

1. అన్ని రాష్ట్రాలలో మూడు అంచెల పంచాయితీ వ్యవస్థ ఉండాలి.
2. ప్రతి ఐదేళ్లకొసారి పంచాయితీ ఎన్నికలు జరపాలి.
3. 33 శాతం తగ్గకుండా షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు, స్త్రీలకు, పంచాయితీలలో సీట్లను కేటాయించాలి.
4. గ్రామ సభలను తప్పకుండా ఏర్పాటు చేయాలి.
5. పంచాయితీల ద్రవ్య సంబంధిత అధికారాలపై తగిన సిఫార్సులు చేయడానికి స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నియమించాలి.
6. జిల్లా అభివృద్ధి కోసం ప్రణాళికను రూపొందిండానికి జిల్లా ప్రణాళిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

## 5.12 సారాంశం :

1952లో ప్రారంభించిన సమాజ వికాస పథకాలు ఆశించిన ఫలితాన్ని అందించలేక పోవటంతో దీనికిగల కారణాల్ని అన్వేషించటానికి 1954లో బల్వంత్ రాయ్‌కు అధ్యక్షతన ఒక అధ్యయన సంఘం ఏర్పాటైయింది. ప్రజలు సముదాయక అభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగాను, విరివిగా పాల్గొనాలంటే స్థానిక ప్రజా సంస్థల్ని ఏర్పాటు చేయాలని కమిటి సూచించింది. ఫలితంగా దేశంలో మూడు స్థాయిలలో పని చేసే వ్యవస్థ ప్రారంభమైయింది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయితీ, బ్లాకు స్థాయిలో పంచాయితీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తు ఏర్పాటైయ్యాయి. పంచాయితీ రాజ్ వ్యవస్థ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు బాగా ప్రోత్సాహం లభించింది. గ్రామీణ సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రగతిని సాధించింది. మొత్తం మీద గ్రామీణ భారతంలో నూతన పోకడలకు సామాజిక పరివర్తనకు గ్రామీణాభివృద్ధికి పంచాయితీరాజ్ వ్యవస్థ శ్రీకారం చుట్టింది.

## 5.13 ముఖ్యపదాలు :

గ్రామ సభ

పంచాయితీ

పంచాయితీ సమితి

జిల్లా పరిషత్తు

## 5.14 నమూనా ప్రశ్నలు :

1. కుల పంచాయితీల గురించి వివరించండి.
2. పంచాయితీరాజ్ పరిణామం గురించి వ్రాయండి.
3. గ్రామ సభ, గ్రామ పంచాయితీల నిర్మాణం నిర్వహణ విధులను విశదీకరించండి.
4. పంచాయితీ సమితి నిర్మాణం, విధులు, ఆర్థిక వనరుల గురించి వివరించండి.
5. జిల్లా పరిషత్ నిర్మాణం, విధులను తెలియజేయండి.

## 5.15 చదువదగిన గ్రంథాలు :


1. Rural leadership & Panchayat - R.R.S. Mehta
2. Rural Development - Gopal Lal Jain
3. Rural Sociology in India - A.R. Desai
4. Rural Society in India - Sharma K.L.


ఆచార్య. ఆర్. విజయకృష్ణ నాయుడు

# జజ్‌మానీ వ్యవస్థ

## 6.0 లక్ష్యం :

భారతదేశంలోని గ్రామాలలో వివిధ కులాల ఆర్థిక పరస్పరాధీనతను క్రమబద్ధం చేసే జజ్‌మాని వ్యవస్థ స్వభావాన్ని, లక్షణాల్ని, పనితీరుని, వ్యవస్థలో వచ్చిన మార్పులని తెలియజేయడమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానోద్దేశ్యం.

## విషయ క్రమం :


6.1 పరిచయం

6.2 జజ్‌మాని వ్యవస్థ - నిర్వచనం, స్వభావం

6.3 జజ్‌మాని వ్యవస్థ, లక్షణాలు

6.4 జజ్‌మానీ వ్యవస్థ - పనితీరు

6.5 వ్యవస్థలో వచ్చిన మార్పులు

6.6 సారాంశం

6.7 ముఖ్య పదాలు

6.8 నమూనా ప్రశ్నలు

6.9 చదువదగిన గ్రంధాలు


## 6.1 పరిచయం :

భారతీయ సమాజంలో ఆర్థిక వ్యవస్థ, ఉత్పత్తి మరియు పంపిణీ పద్ధతులు వివిధ మార్పులకు లోనవుతూ వచ్చాయి. సామాజిక సంబంధాలను ప్రభావితం చెయ్యటంలో వీటికి కీలకపాత్ర ఉంది. గతంలో దేశాన్ని పాలించిన హిందూరాజులు, ముస్లీంలు ఆంగ్లేయుల కాలంలో ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ పరస్పరం ప్రభావితమయ్యాయి. నేటికి వివిధ ప్రాంతాలలో సెమిప్యూడల్ వ్యవస్థ, పెట్టుబడి దారి విధానాల ప్రభావాలను గమనించవచ్చు. ఒక సామాజిక వ్యవస్థలో సామాజిక సంబంధాలను విశ్లేషించేటప్పుడు, వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. హిందూ సమాజంలో కులానికి వృత్తికి అవినాభావ సంబంధం ఉంది. వృత్తులను బట్టి కులాలు ఏర్పడ్డాయనే సిద్ధాంతం కూడా ఉంది. ఆనాటి సామాజిక వ్యవస్థలో ఒకానొక సామాజిక, ఆర్థిక విధానమే జజ్‌మాన్ లేదా యాజ్‌మాని వ్యవస్థ.

## 6.2 జజ్‌మానీ వ్యవస్థ - నిర్వచనం, స్వభావం :

జజ్‌మానీ అనే పదం యజమాన్ అనే సంస్కృత పదం నుండి ఏర్పడింది. గ్రామాలలో వృత్తి కులాల కుటుంబాలు వంశపారం పర్యంగా కొన్ని కుటుంబాలకు పని చేసి వస్తు రూపేణా ప్రతి ఫలం పొందే విధానాన్ని జజ్‌మాని లేదా యాజ్‌మాని పద్ధతి అంటారు.

'హిందూ జజ్‌మానీ విధానం' (1936) అనే గ్రంథంలో వైజర్ జజ్‌మానీ విధానాన్ని తొలిసారిగా వివరించాడు. ఈ పద్ధతిలో సేవలు పొందే వ్యక్తిని 'జజ్‌మాన్' అని, సేవలను అందించే వ్యక్తిని 'కామిన్' అని అంటారు. వైజర్ ఉత్తర ప్రదేశ్‌లోని ఒక గ్రామాన్ని

పరిశీలించి ప్రతి గ్రామంలో ప్రతి కులం ఇతరులకు ఒక రకమైన సేవలను అందిస్తుందని, సేవలను అందించే విషయంలో వివిధ కులాలు పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయని, ప్రతి కులానికి సంప్రదాయం ప్రకారం ఏర్పాటైన సేవలను పొందే వ్యక్తులు ఉంటారని, ఈ విధానం తరతరాలుగా కొనసాగుతుందని వివరించాడు.

అన్ని రకాల పనులనూ, సేవలనూ వివిధ కులాలు నిర్వహిస్తాయని, శ్రమ విభజన, పనుల నిర్వహణ, సప్లయి డిమాండు న్యాయాన్ని బట్టి ఉండదని, యాజమాన్య విధానం గురించి ప్రమథనాథ్ బెనర్జీ వివరించాడు.

భూస్వాములైన ఉన్నత కులాలకు చెందిన జజ్‌మానులకు వడ్రంగులు, కుమ్మరి, కమ్మరి, రజకులు వంటి వివిధ నిమ్నకులాల వ్యక్తుల సేవలను అందించే పంపిణీ విధానమే జజ్‌మాని విధానమని కొలెందా నిర్వచించాడు.

ఆస్కార్ ల్యూయిస్‌తో పాటు అనేక మంది పాశ్చాత్య శాస్త్రజ్ఞులు, మజుందార్, దూబే వంటి భారతీయ సమాజ శాస్త్రజ్ఞులు జజ్‌మాని విధానాన్ని అధ్యయనం చేశారు. జజ్‌మాని పద్ధతిలో వ్యవసాయక సంబంధాలు ప్రధానమైనవి. వ్యవసాయ ఉత్పత్తులు పండించే రైతులకు అదే గ్రామంలో ఉన్న మిగితా కులాలు వారు వారి వృత్తులను బట్టి సేవలందించి ప్రతి ఫలాన్ని వస్తు రూపేణా తీసుకుంటారు. అంటే కమ్మరి, కుమ్మరి, నాయీ బ్రాహ్మణులు (మంగలి) రజకులు (చాకలి) మేదరి, తదితర వృత్తులవారు వంశపారం పర్యంగా వారి సేవలను యజమానులకు అందించి పంటలో కొంత భాగాన్ని ప్రతిఫలంగా పొందుతారు. ప్రతిఫలాన్ని ధాన్యరూపంలో యజమానులు చెల్లిస్తారు ఇది పంట కోతలు ముగిసిన తరువాత సంవత్సరానికి రెండు సార్లు సంప్రదాయన్ని అనుసరించిన రీతిలో ధాన్యాన్ని ఇస్తారు. జజ్‌మాని విధానాన్ని అధ్యయనం చేసిన సమాజశాస్త్రజ్ఞులు ఆ రోజులలో దేశమంతటా జజ్‌మానీ పద్ధతి కొద్దితేడాలలో అమలులో ఉండేదని భావించారు. కులం, వృత్తి, మతం, గతిశీలత లేకపోవటం, కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలు, వస్తుమార్పిడి పద్ధతి మొదలైన అంశాలు జజ్‌మానీ వ్యవస్థ బలపడటానికి ఆనాడు దోహదపడి ఉండవచ్చు.

## 6.3 జజ్‌మాని వ్యవస్థ - లక్షణాలు :

1. జజ్‌మాని పద్ధతిలో జాజ్‌మాని - కామిన్ సంబంధాలు శాశ్వత సంబంధాలు కామిన్‌లు నిరంతరం జజ్‌మాన్‌కి సేవలు అందిస్తారు. స్థిర నివాసులుగా ఉన్న కుల వృత్తుల వారు ఒక కుటుంబానికి లేదా కొన్ని కుటుంబాలకు తమ సేవలను శాశ్వత ప్రాతిపదిక మీద అందిస్తూ ఉంటారు. వీరు యాజమాన్య హక్కులను కలిగి ఉంటారు. హక్కు మార్పిడి లేదా బదవాయింపు యాజమాన్య వ్యవస్థలో లేదు.

2. కామిన్‌లు వంశ పారంపర్యంగా తమ సేవలను జజ్‌మానీకి అందిస్తారు. యాజమాన్య హక్కులు అనువంశికంగా ఉంటాయి. జజ్‌మాని కామిన్‌ని అతను చేసే పని నుండి తొలగించే వీలులేదు. ఆ విధంగా తొలగిస్తే కుల సమితి తొలగించిన వ్యక్తి హక్కుల కోసం కృషి చేస్తుంది. కులపంచాయితీ శిక్షకు భయపడి వేరే వ్యక్తి ఆ పనికి చెయ్యటానికి అంగీకరించడు. సాధారణంగా తండ్రి నుండి కుమారునికి హక్కులు సంక్రమిస్తాయి. కామిన్‌కు కుమారులు లేని సందర్భాలలో ఆ హక్కులు కుమార్తె భర్తకు అంటే అల్లుడికి సంక్రమిస్తాయి. ఈ విధంగా యాజమాన్య హక్కులు అనువంశికంగా వర్తిస్తాయి.

3. జజ్‌మాని పద్ధతి ప్రధాన లక్షణం కామిన్‌లు అందించిన సేవలకు ప్రతిఫలంగా ధనానికి బదులు ధాన్యరూపంలో చెల్లిస్తారు. ముఖ్యంగా వరి, గోధుమలు గింజ ధాన్యాలను యజమాని (జజ్‌మాని) నుంచి పొందుతారు.

4. జజ్‌మాని విధానంలో కామిన్‌లకు భద్రత ఉంటుంది. కామిన్‌లకు నిరుద్యోగ సమస్యలేదు. ఉద్యోగం వెతుక్కోవాలనే ఆలోచన లేక పోవటంతో నిరాశాకు లోనుకారు. శాంతితో తృప్తిగా జీవించగల్గుతారు.

## 6.4 జజ్‌మాని వ్యవస్థ - పనితీరు :

జజ్‌మాని వ్యవస్థలో జజ్‌మాని, కామిన్‌ల సంబంధాల పనితీరుని సమాజ శాస్త్రజ్ఞులు వివిధ విధాలుగా వివరించారు. ఎస్.సి. దూబే (1955) తన గ్రంథం 'భారతీయ గ్రామాలు' లో క్రింది విధంగా వివరించారు.

1. వ్యవసాయ దార్లకు, అనేక ఇతర వ్యవసాయేతర ప్రజలకు వారి సామాజిక, మత సంబంధమైన అవసరాల కోసం అందించే సేవలు.
2. కుల వృత్తులు కలిగిన ఇతర కులాలకు, వారి నుండి లభించే సంప్రదాయ బద్ధంగా ఉండే సేవలకు బదులుగా అందించే సేవలు పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ఈ సేవలలో ద్రవ్య రూపేణా చెల్లింపు ఉండదు.
3. వ్యవసాయ దార్లకు వ్యవసాయ కార్యక్రమాలలో ప్రత్యేక సంబంధంగల సేవలు, వెంటనే చెల్లింపులు ఆశించడం దీనిలో జరగదు.
4. ద్రవ్య సంబంధమైన చెల్లింపు కోసం చేసే సేవలు.

**బీడల్‌మన్ (1959) జజ్‌మాని పద్ధతిలో సంబంధాలను మూడు రకాలుగా విభజించారు.**

1. భూస్వాములకు మాత్రమే సేవలను అందించే చేతి పనివారు, శ్రామికులు ప్రత్యేకమైన సేవలందించే వారుగా పరిగణిస్తారు. ఉదా- వ్యవసాయానికి సంబంధించి కొడవళ్లను కమ్మరి అందిస్తాడు.
2. భూస్వాములు, భూస్వామేతర ప్రజలకు కూడా సేవలను అందించే క్షురకులు, రజకులు, కుమ్మరులు, కమ్మరులు మొదలైన వారు పాక్షికంగా పరోక్షమైన సేవలు అందించే వారుగా గణిస్తారు.
3. స్థానికంగా వివిధ చేతి పనివారు పరస్పరం సేవలను అందించుకునే సంబంధాలు 'పరోక్షమైన సేవలు'గా లెక్కిస్తారు.

ఈ విధంగా బీడల్‌మన్ భూమిపై ఆధారపడి ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని విభజించారు.

## 6.5 జజ్‌మాని వ్యవస్థలో వచ్చిన మార్పులు :

క్రింది కారణాలు వల్ల జజ్‌మాని వ్యవస్థ క్షీణించినదని చెప్పవచ్చు.

1. ధరల పెరుగుదల
2. వస్తు సేవలకు నగదు రూపంలో చెల్లింపు
3. పట్టణాలు త్వరితంగా వృద్ధి చెందడం.
4. పాఠశాల విద్య విస్తరించడం
5. నూతన ఉద్యోగావకాశాలు
6. జాగిరీదారీ, జమిందారీ విధానాల రద్దు
7. కుల పంచాయితీల ప్రాబల్యం తగ్గిపోవడం
8. కులం వృత్తి సంబంధమైన విలువలలో మార్పులు
9. భూమి యాజమాన్యానికి సంబంధించి చట్టాలలో మార్పులు
10. వాణిజ్య పంటల పెరుగుదల
11. నగరీకరణ
12. పారిశ్రామికీకరణ
13. వ్యవసాయ ఆధునికీకరణ

**సారాంశం :**

సంప్రదాయ గ్రామీణ సామాజిక, ఆర్థిక వ్యవస్థలో జజ్‌మాని పద్ధతి ప్రధానమైనది. వృత్తి పరంగా వైవిధ్యం కలిగిన గ్రామీణ సమాజంలో ఒక వృత్తిలో నైపుణ్యం ఉన్న వ్యక్తి ఇతర వృత్తులలో నిపుణులైన వారి నుంచి వస్తువులు లేదా సేవలను పొందే పద్ధతిని జజ్‌మాని లేదా యజమాని విధానమంటారు.

జజ్‌మాని పద్ధతిలో సేవలు పొందేవారిని జజ్‌మాని లేక యజమాని అని సేవలు అందించే వాళ్లను కామిన్‌లని అంటారు. సేవలు అందించే వారు వారి సేవకు ప్రతి ఫలంగా వస్తురూపేణా తీసుకుంటారు. జజ్‌మాని - కామిక్‌ల మధ్య శాశ్వత సంబంధాలుంటాయి. కామిన్‌లు ఉద్యోగాన్నే వెదుక్కొనే పనిలేదు. అనువంశకంగా వచ్చేది కాబట్టి ఆందోళన ఉండదు. పైగా భద్రత ఉంటుంది. జాజ్‌మాని పద్ధతి గ్రామీణ చరిత్రలో సామాజిక ఆర్థిక అంశంగా ప్రాముఖ్యత ఉంది. అయితే కుల పంచాయితీల ప్రాబల్యం కోల్పోవడం, పట్టణాలు త్వరితంగా వృద్ధి చెందడం, ధరల పెరుగుదల మొదలైన కారణాలవల్ల జజ్‌మాని వ్యవస్థ క్షీణించినదని చెప్పవచ్చు.

**6.7 ముఖ్యపదాలు :**

జజ్‌మాని

కామిన్

**6.8 నమూనా ప్రశ్నలు :**

1. జజ్‌మాని విధానాన్ని నిర్వచించి, దాని లక్షణాల్ని తెల్పండి.
2. జజ్‌మాని - కామిన్‌కు మధ్య సంబంధాలను వివరించండి.
3. జజ్‌మాని విధానంలో మార్పులకి కారణాల్ని వివరించండి.

**6.9 చదువదగిన గ్రంథాలు :**


1. The Hindu Jajmani System - Wiser W.H.
2. Indian Village - S.C. Dube
3. Toward a model of the Hindu Jajmani System - Kolenda P. M.
4. A comparative Analysis of Jajmani System - Biedelman Thomes.D


ఆచార్య. ఆర్. విజయకృష్ణ నాయుడు

పాఠం - 7

# భూమి యాజమాన్యం - ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలు

## 7.0 లక్ష్యం :

భూమి యాజమాన్య సంబంధాలు, భూ సంస్కరణల ఆవశ్యకత, లక్ష్యాలు విజయాలు, వైఫల్యాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణల గురించి తెలుసుకోవడమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానోద్దేశం.

**విషయక్రమం :**

7.1 పరిచయం
7.2 భూమి యాజమాన్య సంబంధాలు
7.3 భూకమతాల రకాలు
7.4 భూసంస్కరణల ఆవశ్యకత
7.5 భూసంస్కరణల లక్ష్యాలు
7.6 భూసంస్కరణల అమలు, విజయాలు, వైఫల్యాలు
7.7 భూసంస్కరణలు - గ్రామీణ ఆర్థిక విధానంలో మార్పులు
7.8 ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణలు
7.9 సారాంశం
7.10 ముఖ్య పదాలు
7.11 నమూనా ప్రశ్నలు
7.12 చదువదగిన గ్రంథాలు

## 7.1 పరిచయం :

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అధ్యయనం చేయడానికి గ్రామీణ భూమి యజమాన్య సంబంధాలను పరిశీలించవలసి ఉంది. దానికి గల ప్రధాన కారణం గ్రామీణ ఆర్థికవ్యవస్థ ప్రధానంగా వ్యవసాయంలో ఉత్పత్తి రంగం ముడిపడి ఉండటమే. గ్రామీణ సమాజంలో భూస్వాములు, రైతులు, కూలీలు మొదలైన అన్ని వర్గాల వారికి వ్యవసాయం లేదా భూములతో సంబంధం ఉంది. కాబట్టి భూకమతాలకు సామాజిక వ్యవస్థ స్వరూపానికి గల సంబంధాలు ఆచరణలో గ్రామీణ సమాజానికి వర్తిస్తాయి. భూ ఆదిపత్య విధానం గ్రామీణ సామాజిక, ఆర్థిక రంగాలపై అత్యధిక ప్రభావం చూపుతుంది.

## 7.2 భూమి యాజమాన్య సంబంధాలు :

గ్రామీణ ప్రజల జీవన ప్రమాణ స్థాయి భూమి యాజమాన్యం పై ఆధారపడి ఉంటుంది. భూ స్వాముల స్థాయి సమాజంలో ఉన్నతమైనది భూమి లేని వారి అంతస్థు తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా భూ యాజమాన్య అసమానతలే ఆర్థిక సామాజిక అసమానతలకు కారణమవుతాయి. రాజకీయ నిర్మితిని సైతం భూవ్యవస్థ ప్రభావితం చేస్తుంది. వీటిని సవరించటానికి సమాజంలో సమానత్వ సాధనకు భూ సంస్కరణలు ప్రాధాన్యతనంతరించుతున్నాయి. భూ సంస్కరణల ద్వారా న్యాయమైన, స్థిరమైన భూమి యాజమాన్య విధానం రూపొందుతుంది.

## బ్రిటీష్ పాలనలో వ్యవసాయక సామాజిక వ్యవస్థ :

భారతదేశంలో బ్రిటీష్ పాలనకు చాల కాలం క్రితమే భూస్వాములు, కౌలుదారులు, చిన్న రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలతో కూడిన అస్పష్ట వ్యవస్థ ఉంది. ఇటువంటి వర్గ పునాదులను ఆంగ్లేయులు మరింతగా విస్తరించారు. నేటి వరకు ఏదో ఒక రూపంలో కొనసాగుతున్న దానిని ఒక విధంగా వ్యవస్థీకృతం చేశారు.

## బ్రిటీష్ కాలంలో ఉన్న విభిన్న భూకమతాలు :

బ్రిటీష్ పాలకులు 1873లో భూకమతాల శాశ్వత పరిష్కార పద్ధతిని ప్రవేశపెట్టారు. అంతవరకు రైతులు వంశపారం పర్యంగా అనుభవించిన హక్కులు దీనితో రద్దయ్యాయి. దీని స్థానంలో యావత్ భూమి ప్రభుత్వానికి చెందుతుందని బ్రిటీష్ పాలకులు ప్రకటించారు. ఫలితంగా మూడు వర్గాలు భారత వ్యవసాయ రంగంలో ఏర్పడ్డాయి అవి ఫ్యూడల్ భూస్వాములు రైతులు మరియు భూమిలేని రైతులు.

## 7.3 భూకమతాల రకాలు :

మూడు రకాల భూకమతాలు లేదా భూస్వామ్యం బ్రిటీష్ పాలనలో అమలులో ఉన్నాయి. అవి జమీందారి, రైత్వారి మరియు మహల్వారి పద్ధతి భూకమతాలు.

**1. జమీందారి పద్ధతి భూకమతాలు -** జమిందారీ విధానంలో ఒక వ్యక్తి కాని కొందరు వ్యక్తులు కాని గ్రామ యాజమాన్యాన్ని వహించి భూమిపై శిస్తు వసూలు చేసి నేరుగా ప్రభుత్వానికి చెల్లిస్తుంటారు.

బ్రిటీష్ వారు రాకపూర్వం భారతదేశంలో ఒక విధమైన జమీందారీ విధానం అమలులో ఉండేది. కొందరు వ్యక్తులు అడవులను నరికి వాటిని వ్యవసాయిక భూములుగా మార్చి ఆ భూములమ వారే స్వంతం చేసుకొనేవారు. దీనిని ఇతరులుకిచ్చి శిస్తు వసూలు చేసేవారు. ఆంగ్లేయుల పాలవలో వీరి హక్కులను ప్రభుత్వం వారు గుర్తించి ప్రభుత్వానికిశిస్తు చెల్లించవలసిందిగా ఆదేశించారు. వీరు తమ భూమిని ఇతర రైతులకు కౌలుకిచ్చి తమ గుమస్తాలు లేదా దళారీలు ద్వారాశిస్తు వసూలు చేసి దానిలో కొంత భాగాన్ని మాత్రమే బ్రిటీష్ ప్రభుత్వానికి కట్టేవారు.

**2. రైత్వారి పద్ధతి భూకమతాలు -** ఈ పద్ధతిలో భూమి హక్కును కలిగిన రైతు శిస్తును నేరుగా ప్రభుత్వానికే చెల్లిస్తాడు. రైతు తన భూమినితాకట్టు పెట్టడానికి, దాన విక్రయానికి, అన్యాక్రాంతం చేయడానికి హక్కులను కలిగి ఉంటాడు. రైతు ప్రభుత్వానికి శిస్తు చెల్లిస్తున్నంత కాలం రైతును భూమి నుంచి తొలగించే హక్కు ప్రభుత్వానికి ఉండదు. దీనిలో ప్రభుత్వ, భూమిని ఆక్రమించుకున్న రైతులకు యాజమాన్యపు హక్కును శాశ్వతంగా ప్రసాదిస్తుంది. ఈ పద్ధతిని మొదట్లో మద్రాసు రాష్ట్రంలోను బొంబాయి రాష్ట్రంలోను ప్రవేశపెట్టారు.

**3. మహల్వారి పద్ధతి భూకమతాలు -** మొదట ఈ పద్ధతిని ఆగ్రా, జౌధ్ ప్రాంతాలలోను, తర్వాత పంజాబ్ రాష్ట్రంలోను అమలు పరిచారు. దీని ప్రకారం గ్రామీణ సముదాయాలు గ్రామంలోని భూమి, భవనాలు, గడ్డి, చెట్లు మొదలగువాటిపై ఉమ్మడి యాజమాన్యం కలిగి ఉంటాయి. ఉమ్మడి యాజమాన్య అధికారం చట్టబద్ధంగా కాని సాంప్రదాయకరంగా కాని సంక్రమించవచ్చు.

**స్వతంత్ర్య భారతంలో వ్యవసాయ వ్యవస్థ స్వరూపం :**

స్వతంత్ర్యం సిద్ధించాక దేశంలో వ్యవసాయ వ్యవస్థలో భూకమతాలు, ఉత్పత్తి విధానాలలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. లక్షలాది మంది కౌలుదార్లకు భూమిపైన యాజమాన్య హక్కులు కల్పించడం, భూమిలేని వ్యవసాయ కూలీలకు మిగులు భూమిని పంపిణీ చేయడంతో భూకమతాల్లో పెనుమార్పులు వచ్చాయి. సరికొత్త వ్యవసాయక వ్యవస్థ ఏర్పడింది.

## 7.4 భూ సంస్కరణల ఆవశ్యకత :

భారతదేశం ప్రధానంగా వ్యవసాయక దేశం దేశ జనాభాలో 7.5వ శాతం గ్రామీణ ప్రాంతాలలోనే ఉండటం వారిలో ఎక్కువ మందికి వ్యవసాయమే ప్రధాన వృత్తికావడం వల్ల వ్యవసాయానికి అత్యధిక ప్రాముఖ్యత కలిగింది. గ్రామీణ జనాభాలో ఎక్కువమంది దారిద్రరేఖకు దిగువన ఉన్నారు. భూమిలేని పేదలుగా జీవితాన్ని గడుపుతున్నారు. ఏ నైపుణ్యత లేని వారు వ్యవసాయం మీదే ఆధారపడ్డారు. గ్రామీణ నిరుద్యోగాన్ని పేదరికాన్ని వ్యవసాయేతర రంగాలు పరిష్కరించలేవు. ఆకలి సమస్యను తొలగించాలన్న ఆర్థిక అసమానతలను లేకుండ చూడాలన్న, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలన్న భూ సంస్కరణల ద్వారానే సాధ్యమవుతుంది. సామాజిక న్యాయాన్ని అందించే వీలు కలుగుతుంది. దేశంలోని భూ యాజమాన్య విధానంలోని లోపాలను సరిదిద్దుతూ భూసంస్కరణలను అమలు జరపవలసిన అవసరం ఎంతైనా ఉంది. భూ సంస్కరణల ద్వారా న్యాయమైన, స్థిరమైన భూయాజమాన్య విధానాన్ని రూపొందించడంతో ప్రగతిని సాధించవచ్చు.

## 7.5 భూ సంస్కరణల లక్ష్యాలు :

భారతదేశంలో ఆర్థికాభివృద్ధిని సాధించటానికి భూ సంస్కరణలు ప్రధానంగా దోహదపడతాయని ప్రణాళిక వేత్తలు భావించి అత్యధిక ప్రాధాన్యత నివ్వడం జరిగింది. మిగులు భూమిని పంచటాన్ని భూసంస్కరణలుగా పేర్కొంటారు. మిగులు భూమి లభించాలంటే వ్యవసాయకమతాలపై పరిమితులను విధించాలి. ఫలితంగా చిన్న రైతులు, భూమిలేని శ్రామికులు ప్రయోజనాన్ని పొందుతారు. భూ సంస్కరణలంటే మిగులు భూమి పంపిణీ మాత్రమే కాదు. వ్యవసాయ పరిమితులు, సహకార వ్యవస్థలు వంటి వాటిని అభివృద్ధి చెయ్యటం, కౌలు విధానాలను మెరుగు పర్చటం వంటివి కూడ భూ సంస్కరణ పరిధిలోకి వస్తాయి.

**భారతదేశంలో భూ సంస్కరణల ఉద్దేశాలు, లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి :**

1. భూ కమతాలపై గరిష్ఠ పరిమితి విధించడం ద్వారా భూములను మరింత సమానంగా పంపిణీ చేయడం మిగులు భూములను భూమిలేని ప్రజలకు పంపిణీ చేయడం.
2. భూమిపై సరియైన హక్కులను, అద్దెలను రూపొందించడం.
3. న్యాయ ప్రాతిపాదికత వ్యవసాయక, సామాజిక వ్యవస్థను, సామాజిక సంబంధాలను పునర్వ్యవస్థీకరించడం.
4. దోపిడిని, అన్యాయాన్ని తొలగించి దున్నేవాడికి భూమినిచ్చి భద్రతను కల్పించడం.
5. కౌలు దారుకు రక్షణ ఏర్పరచడం.
6. కౌలు వారి కాలపరిమిత నిర్ణయం.
7. భూమిశిస్తుని నిర్ణయించడం.
8. వ్యవసాయ అభివృద్ధి ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను, ఉపాధి అవకాశాలను పెంపొందించడం.

దేశంలో వీటిని సాధించటానికి అనేక భూసంస్కరణ చట్టాలు అమలులో ఉన్నాయి.

## 7.6 భూ సంస్కరణల అమలు - విజయాలు - వైఫల్యాలు :

భూ సంస్కరణల విషయం రాష్ట్రాల పరిధిలో ఉంది. దీనిని అమలు పరచే బాధ్యత రాష్ట్రాలదే. భూ సంస్కరణల చట్టాలు స్థానిక పరిస్థితులు కారణంగా రాష్ట్రానికో తీరుగా ఉన్నాయి. భూ సంస్కరణలపై భారత ప్రభుత్వం జాతీయ విధానాన్ని రూపొందించి తరచూ ప్రగతిని, సమీక్షిస్తు అవసరమైన సూచనలనందిస్తుంది. భూ సంస్కరణను అమలు చెయ్యటం వల్ల అనేక విజయాలు సాధించటం జరిగినా వైఫల్యాలు కూడ ఉన్నాయి.

**విజయాలు :**

**ఫ్యూడల్ భూస్వాముల తొలగింపు -** స్వాతంత్ర్యనంతరం తొలిసారిగా ప్రధానమైన భూ సంస్కరణల చట్టాన్ని ప్రవేశపెడుతూ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు చట్టాన్ని చేశాయి. జమీందార్లు, జాగీదార్లు, ఇనాన్‌దార్లు వంటి ఫ్యూడల్ భూస్వాములందరిని తొలగించారు. జమీందారీ భూములను సాగుచేస్తున్న కౌలుదారులందరికి యాజమాన్య హక్కులు కల్పించారు. ప్రభుత్వం అధీనంలోని అరవై లక్షల ఎకరాల బీడు భూములను భూమిలేని పేదలకు, కొద్దిపాటు భూములన్న రైతులకు పంపిణీ చేశారు.

భూ సంస్కరణల అమలులో భాగంగా జమీందారీ వ్యవస్థ రద్దు చేసినప్పటికి ఇంకా పలు ప్రాంతాలలో ఫ్యూడల్ వ్యవస్థ ఏదో ఒక రూపంలో ఇప్పటికి కొనసాగుతుంది. కొంతమంది జమీందార్లు చట్ట పరిధి నుంచి తప్పించుకోవడానికై తమ భూములను, బంధువులు వారసపాత్రులైన కౌలుదారుల పేరిట బూటకపు బదలాయింపులకు పాల్పడారు.

**భూపరిమిత చర్యలు -** వ్యవసాయ కమతాల పరిమతుల గురించి చట్టాలు చేసి అన్ని రాష్ట్రాలలోను అమలు పరుస్తున్నారు. కేవలం భూములు కొందరి చేతుల్లో మాత్రమే ఉండకుండా వాటిని మరింత సమ ప్రాతిపదికపైన పంపిణీ చెయ్యడం భూసంస్కరణ లక్ష్యాలలో ప్రధానమైనది. వ్యవసాయ భూములపై గరిష్ఠ పరిమితి విధింపు ద్వారా దీనిని సాధించాలి. అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, గోవాలు తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాల్లో భూగరిష్ఠ పరిమితి చట్టం అమలులో ఉంది. భర్త, భార్య, మైనర్ పిల్లలతో సహా మొత్తం ఐదుగురు సభ్యులను ఒక కుటుంబ యూనిట్‌గా పరిగణిస్తారు. ప్రతి కుటుంబ యూనిట్ ఒక్కంటికి పరిమితులు విభిన్నంగా ఉంటాయి. ఏటా రెండు పంటలు పండే నీటి పారుదల సౌకర్యం బాగా ఉన్న భూముల విషయంలో పరిమితి 10 నుంచి 18 వరకు ఉండగా మెట్ట భూముల విషయంలో అది 54 ఎకరాలుగా ఉంది, అయితే ఎడారులు, కొండలు ఉన్న ప్రాంతాలలో మరింత అధికంగా నిర్ణయించారు.

**కౌలుదారీ సంస్కరణలు -** కౌలుదారులకు కల్పించే భూకమతాల స్వాధీన హక్కుక నిశ్చితంగా భద్రత ఉంటుంది. కౌలు చెల్లించినంత కాలం ఆ భూముల నుండి వారిని భూస్వాములు ఖాళీ చేయించలేరు. సాగు చేసుకున్న కౌలుదారులకు, యజమాన్య హక్కులిచ్చే అవకాశాన్ని కొన్ని చోట్ల కల్పించారు. వికలాంగులకు, విధవలకు, మైనర్లకు రక్షణ దళాల వారికి ఈ విషయంలో మినహాయింపు కల్పించారు. భూస్వాములు ఎక్కువ కౌలు తీసుకోకుండా కౌలుదార్లకు రక్షణ కల్పిస్తూ కౌలు నిర్ధారిస్తారు.

**భూమి రికార్డుల ఆధునీకరణ -** దేశంలో తూర్పు ప్రాంతాల్లో తప్ప మిగిలిన ప్రదేశాలలో భూమి రికార్డులు ఆధునాతనం అయ్యాయి. దీనివల్ల భూసంస్కరణలు అమలు చెయ్యడానికి, వ్యవసాయ దారునికి ఋణాలు లభించడానికి భూమి రికార్డులు ఎంతగానో తోడ్పడతాయి. భూ గరిష్ఠ పరమితి, కౌలు చట్టాల పరిధి నుంచి భూస్వాములు తప్పించుకోకుండా గ్రామ మండల స్థాయిలో భూముల రికార్డులు అడ్డుకుంటాయి.

## వైఫల్యాలు :

**భూ సంస్కరణలు విఫలమవ్వటానికి ప్రధానకారణాలు :**

1. లోప భూయిష్టమైన చట్టాలు - భూ సంస్కరణల చట్టాల నుండి భూస్వాములు ఎలా తప్పించుకోవాలో ఆ చట్టాలలోనే ఉండటం ప్రధాన కారణం. ఉదాహరణకు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడం, దొంగ విడాకులు బహుమానాలు, దత్తతలు వంటి చర్యలు భూస్వాములు చేపట్టడానికి భూసంస్కరణల చట్టాలే కారణమనక తప్పదు.
2. రాజకీయ పట్టుదల, చిత్తశుద్ధి లోపించటం - పాలకవర్గాలు భూ స్వాములు కావడం లేదా వారి ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల పాలకులకు భూసంస్కరణల అమలులో పట్టుదలలేదు. చిత్తశుద్ధి లోపించడం వల్ల సరిగా అమలు చేయలేకపోతున్నారు.
3. పరిపాలనా యంత్రాంగం - దేశంలో చాలా రాష్ట్రాలలో భూసంస్కరణల అమలుపై సరియైన పరిపాలనా యంత్రాంగంలేదు గ్రామ, మండల స్థాయిలో ఎట్టి యంత్రాంగం లేక పోవటంతో జిల్లా స్థాయిలో ఉన్న యంత్రాంగానికి భూసంస్కరణలు పెనుభారంగా ఉన్నాయి.
4. ఉద్యోగుల పాత్ర - ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ప్రగతి కార్యక్రమాలు ప్రభుత్వం తలపెట్టినప్పుడు వాటిని ఉద్యోగ వర్గాలు విధిగా అమలుచేయాలి ఉద్యోగుల ఉదాసీన వైఖరి కూడ భూసంస్కరణల అమలుకి అడ్డంకుగా ఉంది, ఉద్యోగ వర్గాలలోని వారే యాజమానులైనప్పుడు భూ సంస్కరణ అమలుకు వారు పూనుకోవటం లేదు.
5. సరైన భూమి రికార్డులు లేకపోవటం - సమగ్రమైన, సరైన భూమి రికార్డులు రూపొందించక పోవటం, ఆధునీకరించకపోవటం వల్ల కౌలుదారు హక్కును రక్షించలేకపోవడం అతనికి యాజమాన హక్కుని కల్పించకపోవటం జరుగుతుంది.
6. సామాజిక కారణాలు - జమీందారీ విధానం రద్దుయైన ఇంకా గ్రామాలకు ఫ్యూడల్ వ్యవస్థ లక్షణాలు పోలేదు. ప్రాబల్య కులాలకు చెందిన భూస్వాములే ఆధిపత్యం వహించటం, అధికార యంత్రాంగంలో ఉండటం, హరిత విప్లవ ఫలితాలను అనుభవించడం వల్ల భూమిలేని పేద ప్రజలు ఇంకా వారి నీడలో జీవితాన్ని గడపవలసి వస్తుంది. వారి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడవలసి వస్తుంది.
7. క్రింది స్థాయి నుండి ఒత్తిడి లేకపోవటం, దేశంలో చాలా ప్రాంతాలలో కౌలుదారులు, పేదరైతులు, వ్యవసాయ కూలీలు ఉదాసీనంగా ఉండటం, సంఘటితం కాకపోవడం, సమిష్టిగా పోరాడక పోవటం కూడ భూసంస్కరణల అమలు సరిగా జరగకపోవటానికి కారణంగా చెప్పవచ్చు.
8. నిధులకొరత - భూ సంస్కరణలు అమలుపై ప్రత్యేకంగా తగిన నిధులను కేటాయించలేదు. యజమానులకు నష్టపరిహారం చెల్లింపు, భూమి రికార్డుల తయారీ మొదలగు వాటికి కూడా తగినన్ని నిధులు లేవు.

## 7.7 భూ సంస్కరణల - గ్రామీణ ఆర్థిక విధానంలో మార్పులు :

1. జమీందారీ విధానం రద్దయ్యింది.
2. ప్రభుత్వానికి, రైతులకి మధ్యనున్న దళారీ వ్యవస్థ తొలగిపోయింది.
3. కౌలుదారీ వ్యవస్థలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయి. కౌలుని తగ్గించటం యాజమాన్య హక్కులు కల్పించడం జరిగింది.
4. ఆధునిక పరికరాలు, ఎరువులు వాడటం, నీటి పారుదల సౌకర్యాలు లభ్యంకావటం వల్ల వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగింది.
5. సహకార సంఘాలూ, బ్యాంకులు రైతులకు ఋణాల మంజూరి చెయ్యటం జరిగింది.
6. సమిష్టి వ్యవసాయం చాలా చోట్ల అమలులో ఉంది.

## 7.8 ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలు :

దేశానికి స్వతంత్రం వచ్చే నాటికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సన్నకారు రైతులు, చిన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. భూస్వాముల దోపిడికి బలయ్యారు. వీరి జీవితాలను బాగు చెయ్యాలని పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలనే సదుద్దేశంతో స్వతంత్రం వచ్చాక అనేక ప్రయత్నాలు జరిగాయి. పథకాలు ప్రారంభమయ్యాయి. వీటిలో ప్రధానమైనది భూ సంస్కరణలను అమలు చెయ్యటం. మొదటి పంచవర్ష ప్రణాళికలోనే భూసంస్కరణల అమలుకై తీసుకోవలసిన చర్యలను తెలియజేసింది. భూ విధానాన్ని రూపొందించింది. ప్రణాళికలలో సూచించిన విధంగా శాసనాలను ఏర్పరిచి అమలు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించింది. ఫలితంగా వివిధ రాష్ట్రాలు భూసంస్కరణల శాసనాలను రూపొందించాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శిక సూత్రాలను అనుసరించి భూ యజమాన్య సరళులను, భూ సంబంధాలను క్రమబద్ధీకరిస్తు చట్టాలు చేసింది. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో భూ యజమాన్య సరళల్లో సంక్లిష్టతను దృష్టిలో పెట్టుకొని రెండు ప్రాంతాలకు విడివిడిగా జమీందారి రద్దు, కౌలుచట్టాలను తెచ్చారు.

1. జమీందారీ రద్దు చట్టాలు

1) ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) ఎస్టేట్‌ల రద్దు మరియు రైత్వారీ పద్ధతిగా మార్పిడి చట్టం 1948

2) ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) ఇనాముల రద్దు మరియు రైత్వారీ పద్ధతిగా మార్పిడి చట్టం 1955

3) ఆంధ్రప్రదేశ్ (తెలంగాణా ప్రాంతం) ఇనాముల రద్దు చట్టం 1955

ఈ చట్టాల క్రింద జమీందార్లు, జాగీర్దార్లు, ఇనాముదార్లు వంటి మధ్యవర్తి వ్యవస్థలను తొలగించారు. జమీందారీ భూములతో వ్యవసాయం చేస్తున్న కౌలుదార్లు రైతులకు యాజమాన్యం హక్కులు కల్పించటం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో భూసంస్కరణలను మూడు ముఖ్యమైన చట్టాలు ద్వారా అమలు చేస్తున్నారు.

1) ఆంధ్రప్రదేశ్ (తెలంగాణ ప్రాంతం) కౌలు చట్టం 1950

2) ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలు చట్టం 1956

3) ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల పరిమితి చట్టం 1961

మొదటి చట్టం తెలంగాణాకు, రెండవ చట్టం ఆంధ్రాకు మూడో చట్టం రెండు ప్రాంతాలకు వర్తిస్తుంది.

### తెలంగాణా ప్రాంత కౌలుదారీ - వ్యవసాయ భూముల చట్టం :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతంలో ఉండే ఫ్యూడల్ వ్యవస్థ రైతాంగాన్ని దోపిడి చేయడం జరిగింది. వీటివల్ల రైతులు, రైతు కూలీలూ ఎక్కువగా నష్టపోవటంతో 1946 నుండి 1950 వరకు తెలంగాణా ప్రాంతంలో భూమిలేని వ్యవసాయ కూలీలు, రైతులు భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించారు. పోరాటానికి ప్రధానకారణం భూ సంబంధాలేనని, భూమికి సంబంధించిన అసమానతలేనని గుర్తించిన ప్రభుత్వం రైతుల తిరుగుబాటును అదుపు చేసేందుకు, వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చేటందుకు 1950లో తెలంగాణా కౌలుదారీ వ్యవసాయ భూముల చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టానికి 1951, 1956లలో సవరణలు జరిగాయి.

**చట్ట నిబంధనలు :**

1. చట్ట ప్రకారం కౌలుదార్లు రెండు రకాలుగా విభజించారు.
   (ఎ) రక్షిత కౌలుదార్లు (బి) అరక్షిత కౌలుదార్లు

1950 ముందు అనగా కౌలుదారి చట్టం రాసడానికి ముందు నుంచి ఆరేళ్ళకాలం పాటు వరుసగా కౌలుదారులుగా ఉన్నవారికి రక్షిత కౌలుదార్లుగాను 1950 అనంతరం భూముల్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న రైతులను అరక్షిత కౌలుదార్లుగా పరిగణించారు. రక్షిత కౌలుదార్లకు చట్టంలో వంశపారంపర్య హక్కులు కల్పించారు.

2. అరక్షిత కౌలుదార్లు భూమి స్వాదీన హక్కు గడువు 50 ఏళ్ళ వరకు ఉంటుంది. గడువు పూర్తి అయిన పిదప మరొక ఐదేళ్లు కౌలు కాల పరమితిని పొడిగించుకోవచ్చు.
3. నీటి పారుదల సౌకర్యం ఉన్న భూమికి చెల్లించు అద్దె భూమిశిస్తుకంటే మూడు రెట్లు మించకూడదని, మెట్ట భూమి విషయంలో ఐదు రెట్లకి మించకూడదని నిర్ణయించారు.
4. రక్షిత కౌలుదారు భూమిని మార్కెట్ విలువలో 60 శాతం చెల్లించడం ద్వారా యాజమాన్య హక్కులు పొందవచ్చు. ఈ మొత్తాన్ని ఇరవై వార్షిక వాయిదాలలో చెల్లించవచ్చు.
5. చట్టంలోని సెక్షన్ 18 (ఇ) నిబంధన ప్రకారం నోటి ఫైడ్ ప్రాంతాల్లో రక్షిత కౌలుదార్లకు (భూమిని కొనగలిగే అర్హత ఉన్నవారు) భూ యాజమాన్య హక్కులు ప్రకటించే హక్కు ప్రభుత్వానికి ఉంటుంది.

1954లో రక్షిత కౌలుదార్లు 32, 377 ఎకరాల భూమిని కొని యాజమాన్య హక్కులు పొందారు. 1964-68 మధ్య కాలంలో వీటి సంఖ్య 85, 409 ఎకరాలకు పెరిగింది.

**ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ప్రాంతం) కౌలు చట్టం 1956 :**

ఆంధ్ర ప్రాంతంలో కూడా కౌలుదారీ సమస్యల్ని పరిష్కరించడం కోసం కౌలుదారీ చట్టాన్ని 1956లో రూపొందించబడింది. 1974 లో దీనిని సవరించారు. చట్టంలోని ముఖ్యనిబంధనలు.

1. కౌలు ఒప్పందం లిఖిత పూర్వకంగా ఉండవలె
2. కాల పరిమితి - చట్టం కౌలు తీసుకోవడానికి కనీస కాల పరిమితిని నిర్ణయించింది. 1974 సవరణను బట్టి ఆ నాటికి ముందు కౌలుదారు హక్కులు శాశ్వతమైనవిగాను తరువాత వచ్చిన కౌలుదార్ల కాలపరిమితి ఆరు సంవత్సరములు తక్కువ కాకుండా ఉండవలెను. గడువు ముగిసిన తరువాత ప్రతి ఆరు సంవత్సరాలకు కౌలు యొక్క కాల పరిమితిని పొడిగించవచ్చు.
3. గరిష్ట కౌలు - నీటి పారుదల సమీపంలో వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములకు కౌలు దారి చెల్లించే గరిష్ఠ కౌలు ఆ భూములలో సాధించిన మొత్తం ఉత్పత్తిలో ముప్పయి శాతాన్ని మించరాదు. ఇతర భూముల విషయంలో ఈ గరిష్ట పరమితి ఇరవై ఐదు శాతం ఉంటుంది. అయితే వ్యవసాయానికి అయ్యే ఖర్చుల్ని కౌలుదార్లే భరించాలి. భూస్వాములు భూమిశిస్తు, నీటి పన్నునూ చెల్లించాలి.
4. న్యాయ పూరితకౌలు - భూస్వామి కాని, కౌలుదారు కాని కౌలు మొత్తం సరిగా లేదని బావించిన పక్షంలో వీరిలో ఎవరైనా ప్రత్యేకాధికారి దగ్గరకు వెళ్లి న్యాయపూరితమైన కౌలును నిర్ణయించాలని దరఖాస్తు పెట్టుకోవచ్చు. పంట కోతకు కనీసం పదిహేను రోజులు ముందు ఈ దరఖాస్తు ప్రత్యేకాధికారికి చేరాలి.

5. కౌలు మినహాయింపు - అతివృష్టి, అనావృష్టి, భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట పూర్తిగా లేదా పాక్షికంగా నష్టం కలిగినప్పుడు కౌలు మొత్తాన్ని తగ్గించేందుకు లేదా పూర్తిగా మూసేందుకు కౌలుదారు ప్రత్యేకాధికారికి దరఖాస్తు పెట్టుకోవచ్చు.

6. కౌలుదారునికి అనువంశిక హక్కులుంటాయి. కౌలుదారుని వారసులకు ఈ హక్కులు సంక్రమిస్తాయి.

7. భూస్వామి స్వంత వ్యవసాయ నిమిత్తం తన భూమిని కౌలుదారు నుంచి తీసుకొనే హక్కు ఉంది.

8. కౌలు రద్దు - కౌలు కాలపరిమితి పూర్తికాకముందే క్రింది పరిస్థితులలో కౌలు ఒప్పందాన్ని భూస్వామి రద్దు చేయవచ్చు.
   (ఎ) గడువు తేది తరువాత నెల రోజులు దాటిననూ కౌలు చెల్లించనప్పుడు
   (బి) భూసారానికి నష్టం వాటిల్లే విధంగా భూమిని ఉపయోగించినప్పుడు
   (సి) కౌలుదారు భూమిని తిరిగి ఇతరులకు కౌలుకిచ్చినప్పుడు

9. యాజమాన్య హక్కులు - సరియైన ధరకు భూమినికొనుక్కునే హక్కును కూడా చట్టం కౌలుదారునికి ప్రసాదించింది. భూస్వామి తన భూమిని అమ్మే పక్షంలో నోటీసు ద్వారా అట్టి నిర్ణయాన్ని తెలియజేయ్యాలి. భూమి ధర ఆ భూమికి చెల్లించాల్సిన భూమి శిస్తుకు ఐదు రెట్లకు ఎట్టి పరిస్థితులలోను మించరాదు. ఈ మొత్తాన్ని వార్షిక వాయిదాలలో చెల్లించవచ్చు.

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూముల పరిమితి చట్టం 1973 :

1961లో మొట్ట మొదట ఈ చట్టాన్ని చెయ్యటం జరిగింది. 1973లో అంతకు ముందున్న చట్టాన్ని రద్దు చేసి సమగ్ర భూగరిష్ఠ పరిమితి చట్టాన్ని రూపొందించారు.

## చట్టంలో ముఖ్య నిబంధనలు :

1. కుటుంబ యూనిట్ అంటే భర్త, భార్య వారి మైనర్ పిల్లలు, అవివాహిత కుమార్తెలు మొత్తం ఐదుగురు సభ్యులుగల కుటుంబం.

   (బి) ప్రతి కుటుంబ యూనిట్‌కు ఒక ప్రామాణిక గరిష్ఠ పరిమితి స్థాయిని మించకుండా భూములను కలిగి ఉండవచ్చు.
   (సి) కుటుంబ యూనిట్ ఐదుగురు సభ్యులకు మించినట్లయితే ప్రతి అదనపు వ్యక్తికి అదనపు భూమిలో ఐదింట ఒకటో వంతు భూమిని కలిగి ఉండవచ్చు. కుటుంబ యూనిట్ ఎట్టి పరిస్థితులలోను రెండు ప్రామాణిక భూగరిష్ఠ పరిమితి స్థాయిలను మించి భూములు ఉండకూడదు.

2. కమతాలగరిష్ఠ పరిమితి - భూస్వామి యొక్క భూమి స్వభావాన్ని బట్టి గరిష్ఠ పరిమితిని నిర్ణయిస్తారు. ఈ చట్టంలో పల్లపు భూములను ఆరు తరగతులుగా (ఎ నుండి ఎఫ్) మెట్ట భూములను ఐదు తరగతులుగా (జి నుండి కె) విభజించారు. మాగాణి భూములను ప్రామాణిక గరిష్ఠ పరిమితి 10 నుండి 27 ఎకరాల మధ్య, మెట్ట భూములకు 30 నుండి 54 ఎకరాల వరకూ ఉంటుంది.

వివరాలు క్రింది పట్టికలో పొందుపరచడమైనది.

**ఆంధ్రప్రదేశ్‌లో భూగరిష్ఠ పరిమితికి హద్దులు**

| భూమి | భూమి రకం | రెండు పంటలు పండే నీటి పారుదల సౌకర్యం ఉన్న భూమి (ఎకరాలను) | ఒక పంట పండే నీటి పారుదల సదుపాయం గల భూమి |
|---|---|---|---|
| మాగాణి | ఎ | 10 | 15 |
| (పల్లపు భూమి) | బి | 12 | 18 |
| | సి | 13.5 | 20 |
| | డి | 15 | 22.5 |
| | ఇ | 16.5 | 25 |
| | ఎఫ్ | 18 | 27 |
| మెట్ట భూమి | జి | - | 35 |
| | హెచ్ | - | 40 |
| | ఐ | - | 45 |
| | జె | - | 50 |
| | కె | - | 54 |

### 3. భూమి బదలాయింపుల నిషేధం - 1971 :

జనవరి 30వ తేది తర్వాత ఎలాంటి అవకతవకలు లేదా దురుద్దేశంతో చేయబడిన భూముల బదలాయింపులు (విక్రయం, బహుమానం, తనిఖీ) అనుమతించదు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చడం, బూటకపు విడాకులు, దత్తత, వివాహాలకు పాల్పడటం వంటి వాటిని నిషేధించారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారికి శిక్ష రెండు సంవత్సరాల కారాగారం లేదా రెండు వేల రూపాయల జరిమాన లేక రెండు శిక్షలు కలసి ఉంటాయి.

4. 1971 జనవరి 24వ తేది తర్వాత నిర్దేశిత భూగరిష్ఠ పరిమితికి మించి భూములు గల భూస్వాములు ఏదైనా భూ బదలాయింపులు జరిపితే వారి మిగుల భూముల గురించి పూర్తి సమాచారంతో భూముల ట్రిబ్యునల్‌లో డిక్లరేషన్ దాఖలా చెయ్యాలి. దాఖలు చేయకున్న తప్పుడు ప్రకటన చేసిన చట్ట ప్రకారం శిక్షింపబడతారు.

5. చట్టం అమలు బాధ్యత - భూగరిష్ఠ పరిమితి చట్టాన్ని అమలు చేసే అధికారం భూముల ట్రిబ్యునల్ ఇన్‌చార్జ్జియైన ఆర్.డి.ఓకు ఉంటుంది.

6. మిగుల భూములకు నష్ట పరిహారం చెల్లింపు - చట్టంలోని 2వ షెడ్యూలు ప్రకారం ధర నిర్ణయించు భూస్వామికి ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న మిగుల భూములకు సంబంధించి ధనం లేదా ప్రజల రూపంలో చెల్లించాలి. మిగులు భూములకు చెల్లించిన భూమి శిస్తుతో ఆధారపడి నష్ట పరిహారం ఎకరం ఒక్కంటికి 5000 రూపాయలు నుండి ఒక లక్ష రూపాయులకు

ఆంధ్రప్రదేశ్‌లో భూగరిష్ఠ పరిమితి చట్టం అమలు వల్ల 1994 సెప్టెంబర్ నాటికి 7.2 లక్షల ఎకరాల భూములను మిగుల భూములుగా ప్రకటించారు. మిగిలిన భూములను సన్నకారు, చిన్నకారు రైతులు భూమిలేని పేద వ్యవసాయ కార్మికులకు 4.35 లక్షల ఎకరాల మిగులు భూములను పంపిణీ చేశారు. మిగుల భూముల పంపిణీని 3.5 లక్షల నుంచి సన్నకారు, కౌలుదార్లు ప్రయోజనం పొందటం జరిగింది.

## 7.9 సారాంశం :

గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో భూమి యాజమాన్య సంబంధాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. భూములన్నీ ప్రాబల్య కులాల చేతిలో కేంద్రీకృతం కావటం, అది సమాజంలో ఆర్థిక అసమానతలకు దారి తియ్యడం వల్ల భూ సంస్కరణలు వెలుగులోకి వచ్చాయి. మిగులు భూమిని పంచటమే భూ సంస్కరణగా చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో కూడ భూ సంస్కరణలు అమలు జరిగాయి. వైఫల్యాలు ఎదురైన భూ సంస్కరణల వల్ల కలిగే మేలుని దృష్టిలో పెట్టుకోని ముందుకు సాగిపోవాలి. చట్టాలు చిత్తశుద్ధితో పట్టుదలతో అమలు జరిపితే తప్ప ఫలితం కనిపించదు.

## 7.10 ముఖ్య పదాలు :

భూగరిష్ఠ పరిమితి చట్టం

## 7.11 నమూనా ప్రశ్నలు :

1. భూమి - యాజమాన్య సంబంధాలు గురించి వివరించండి.
2. భూకమతల రకాలను విశదీకరించండి.
3. భూ సంస్కరణల ఆవశ్యకత, లక్ష్యాలను వివరించండి.
4. భూ సంస్కరణల అమలు ఎదురయ్యే సమస్యలను తెలియజేయండి.
5. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన భూసంస్కరణ చట్టాల గురించి వ్రాయండి.
6. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన కౌలుదారి చట్టాల ముఖ్య నిబంధనలను వివరించండి.

## 7.12 చదువదగిన గ్రంథాలు :


1. Rural sociology in India - A.R. Desai
2. Land reforms in India, trends and prospects - P.C. Joshi
3. Ararian Problems in India - Thormer Daniel
4. Rural Development - Gopal Lal Jain


ఆచార్య. ఆర్. విజయకృష్ణ నాయుడు

పాఠం - 8

# భారతదేశంలో గ్రామీణ జనాభా

## 8.0 లక్ష్యం :

భారతదేశంలో గ్రామీణ జనాభాకి సంబంధించిన వివిధ అంశాలు జనసాంద్రత, అక్షరాస్యత, లింగభేద నిష్పత్తి శ్రామికులు వివాహ వయోపరిమితి మొదలైన వాటిని గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధాన లక్ష్యం

## విషయక్రమం :

8.1 పరిచయం
8.2 గ్రామీణ జనాభా - తీరుతెన్నులు
8.3 జనన - మరణాల రేట్లు
8.4 వివాహ వయోపరిమితి
8.5 లింగ భేద నిష్పత్తి
8.6 జనసాంద్రత
8.7 అక్షరాస్యత
8.8 శ్రామికులు
8.9 సారాంశం
8.10 ముఖ్య పదాలు
8.11 నమూనా ప్రశ్నలు
8.12 చదువదగిన గ్రంథాలు

## 8.1 పరిచయం :

భారతదేశం ప్రధానంగా గ్రామీణదేశం. దేశంలో ఆరు లక్షల ముప్పై ఎనిమిది వేల గ్రామాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో జనాభా పరిమాణము అతి స్వల్పం అంటే వందలోపు జనాభా కలిగిన గ్రామాలు మొదలుకొని పది, పదిహేను వేలు జనాభా కలిగిన అతి పెద్ద గ్రామాలు వరకు ఉన్నాయి. ఆచారాలు, సంప్రదాయాలు విలువలు, ప్రమాణాలు, విశ్వాసాలు, జానపద రీతులు మొదలైన వాటిలో భౌగోళిక ప్రాంతాల మధ్య కొంత తేడా ఉన్నప్పటికి దేశంలో గ్రామీణ జీవనమంతా ఒకే రీతిలో ఉంటుంది. గ్రామీణ జనాభాలో వివిధ కారణాలవల్ల మార్పులు కలుగుతున్నాయి. ప్రధానంగా గ్రామాల నుండి నగరాలకు వలసపోవడం, కొన్ని గ్రామాలు, నగరాలలో కలసి పోవడం, కొన్ని గ్రామాలు సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకొని ధృడమైన గ్రామాలుగా మారి పోవటం జరుగుతుంది. నగర జనాభాకి గ్రామీణ జనాభాకి వివిధ అంశాలలో వ్యత్యాసముంది.

## 8.2 గ్రామీణ జనాభా - తీరుతెన్నులు :

భారతదేశంలో ప్రతి పది సంవత్సరాలకోసారి జనాభా లెక్కల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దీనిని బట్టి గ్రామీణ జనాభా తీరుతెన్నులు వెల్లడవుతాయి.

## గ్రామీణ జనాభా - నగర జనాభా :

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 1027 మిలియన్లు ఉండగా, అందులో గ్రామీణ జనాభా 742 మిలియన్లు కాగా, నగర జనాభా 285 మిలియన్లు అంటే దేశ జనాభాలో 72.7 శాతం ప్రజలు గ్రామాలలో నివసించగా 27.8 శాతం మంది నగర వాసులు. ఆంధ్రప్రదేశ్‌లో కూడ గ్రామీణ జనాభా, నగర జనాభా కంటే ఎక్కువగానే ఉంది.

గ్రామీణ మరియు నగర జనాభా వివిధ సంవత్సరాలలో ఏ విధంగా పెరిగిందో కింది పట్టికలో గమనించవచ్చు.

**గ్రామీణ మరియు నగర జనాభా (1901 -2001)**

| జనాభా లెక్కలు | గ్రామీణ | నగర |
|---|---|---|
| 1901 | 89.2 | 10.8 |
| 1911 | 89.7 | 10.3 |
| 1921 | 88.8 | 11.2 |
| 1931 | 88.0 | 12.0 |
| 1941 | 86.1 | 13.9 |
| 1951 | 82.1 | 17.3 |
| 1961 | 82.0 | 18.0 |
| 1971 | 80.1 | 19.1 |
| 1981 | 76.7 | 23.3 |
| 1991 | 74.3 | 25.7 |
| 2001 | 72.2 | 27.8 |

గ్రామీణ జనాభా - నగర జనాభా నిష్పత్తిని తెలుసుకోవటం ద్వారా గ్రామీణ ప్రజలు లేదా నగర ప్రజల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితిగతులు వెల్లడవుతాయి. దేశ సామాజిక, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతి పై గ్రామీణ జనాభా - నగర జనాభాలోని వ్యత్యాసాలు ప్రభావాన్ని కలిగిస్తాయి. సంపన్న దేశాలు అన్ని రంగాలలోను అభివృద్ధిని సాధించటానికి ముఖ్య కారణం. నగర జనాభా అత్యధికంగాను గ్రామీణ జనాభా అల్పంగా ఉండటమేనని వివిధ పరిశోధనలలో వల్ల రుజువైయింది. గ్రామీణ జనాభా అధికంగా ఉన్న భారతదేశంలో వెనకబాటు తనానికి, త్వరితగతిన ప్రగతిని సాధించకపోవటానికి, వేగంగా గ్రామాలలో సామాజిక పరివర్తన కలగకపోవడానికి గ్రామీణ జనాభా అధికంగా ఉండటమే ప్రధానకారణమంటే అతిశయోక్తి కాదు.

## 8.3 జననాల రేటు :

గ్రామీణ ప్రాంతాలలో జననాల రేటు అధికంగా ఉంటుంది. బాల్య వివాహాలు, ఉమ్మడి కుటుంబం, పేదరికం, నిరక్షరాస్యత మతపరమైన నమ్మకాలు దీనికి కారణాలుగా చెప్పవచ్చు. 1971 జనాభా లెక్కల ప్రకారం ప్రతి 1000 మందికి 36.9 జననాలు కాగా, 1981లో ఈ రేటు 33.9 కి 1991లో 31కి 2001లో 25కి తగ్గించటం జరిగింది. దీని వెనక కుటుంబ నియంత్రణ కార్యక్రమాల అమలు ప్రభావం చాలా ఉంది. గ్రామీణ జనాభాను తగ్గించటం ఏమంత సులభంకాదని తెలిసిన ప్రభుత్వం మరింతగా చురకుగా వ్యవహరిస్తే ఫలితాలు ఆశాజనంగా ఉంటాయని గణాంకాలు రుజువు చేస్తున్నాయి.

మరణాలు రేటు - మరణాల రేటు దేశంలో 1951లో 27.4 ఉండగా, 1971 నాటికి 16కు 1991 నాటికి 10 2001 నాటికి 8.1కి తగ్గించటం జరిగింది. అంటే మరణాల రేటు ఐదు దశాబ్దాల కాలంలో ప్రతి 1000కి 15కి తగ్గించటం జరిగింది. వివిధ ప్రణాళికల ద్వారా ప్రజారోగ్యానికి కోట్లాది రూపాయలు ఖర్చు చెయ్యడం ద్వారా దీనిని సాధించటం జరిగింది.

మొత్తం మీద దేశ వ్యాప్తంగా జనన, మరణాల రేట్ల లో తగ్గుదలను గమనించవచ్చు.

## 8.4 వివాహ వయోపరిమితి :

చట్ట ప్రకారం స్త్రీలకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలగా నిర్ణయించబడినప్పటికి గ్రామీణ ప్రాంతాలలో మాత్రం అది అమలుకావటం లేదు. బాల్య వివాహాలు నిషేదించినప్పటికి ఇంకా మారుమూల పల్లెలలో కొనసాగడాన్ని గమనించవచ్చు. పారిశ్రామికీకరణ, స్త్రీ విద్య, నగరీకరణ మొదలైన కారణాలవల్ల స్త్రీ పురుషుల వివాహ వయస్సు పెరిగినప్పటికి గ్రామీణ ప్రాంతాలకు ఇది వర్తించదు. నిరక్షరాస్యత, పేదరికం, అంధ విశ్వాసాలు/ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మొదలైన కారణాల వల్ల ఇంకా గ్రామీణ ప్రాంతాలలో బాల్య వివాహాల పట్ల మొగ్గుచూపుతున్నారు.

## 8.5 లింగభేద నిష్పత్తి :

దేశంలో ప్రతి 1000 మంది పురుషులకు 927 మంది స్త్రీలు ఉండగా. గ్రామీణ జనాభాలో ప్రతి 1000 మంది కి 939 మంది స్త్రీలు ఉన్నారు. నగర జనాభాలో ప్రతి 1000 మంది పురుషులకు 894 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారని గణాంక వివరాలును బట్టి తెలుస్తుంది. అంటే నగరాలలో కంటే గ్రామాలలోనే స్త్రీ, పురుష నిష్పత్తిలో స్త్రీల సంఖ్య ఎక్కువ ఇది మొత్తం దేశ జనాభాలోని స్త్రీ పరుష నిష్పత్తి కంటే కూడా ఎక్కువే. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం జనాభాలో ప్రతి 1000 మంది పురుషులకు 972 స్త్రీలు ఉండగా, గ్రామీణ జనాభాలో (48.60 మిలియన్లు) ప్రతి 1000 మంది పురుషులకు 977 మంది స్త్రీలు ఉన్నారు. ఇక నగరాలను పరిశీలిస్తే నగర జనాభాలో (17.90 మిలియన్లు) ప్రతి 1000 మంది పురుషులలో 959 స్త్రీలు ఉన్నారు. మొత్తం మీద గ్రామీణ ప్రాంతాలకు స్త్రీ, పురుషుల మధ్య లింగభేద నిష్పత్తి, తక్కువగాను నగరాలలో అది ఎక్కువగాను ఉన్నట్లు తెలుస్తుంది.

## 8.6 జనసాంద్రత :

ఒక నిర్ణీత ప్రదేశంలో అంటే ప్రతి చదరపు మైలు లేదా చదరపు కిలో మీటరు స్థలంలో నివసించే ప్రజల సంఖ్యను తెలియజేసేదే జనసాంద్రత. 1981 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జనసాంద్రత 216 ఉండగా, 1991 నాటికి అది 267 కి, 2001 నాటికి 324 కి పెరిగింది, ఒక గ్రామం లేదా నగరం లో నివసించే ప్రజల జనసాంద్రిత వారి జీవన ప్రమాణాలను, ఆర్థిక విధానాన్ని ముఖ్యంగా ఉత్పత్తి విధానం వినిమయం, ద్రవ్య చలామణి మొదలైన సామాజిక, ఆర్థిక అంశాలను నిర్దేశిస్తుంది.

## 8.7 అక్షరాస్యత :

ప్రజలలో అక్షరాస్యత శాతం పెంచటానికి స్వాతంత్ర్యం వచ్చాక పలు పథకాలు ప్రారంభించిన ఆశించినంతగా ఫలితాలు రాలేదు. 1951 నాటికి 16.67 శాతం అక్షరాస్యత ఉండగా 1971 నాటికి 29.46 శాతానికి 1981లో 43.56 శాతానికి 1991లో 52.21 శాతానికి 2001లో 64.5 శాతానికి పెరిగింది. అక్షరాస్యత స్త్రీలలో కన్న పురుషులలోను గ్రామాలలో కన్న నగరాలలోను ఎక్కువగా ఉంది.

## 8.8 శ్రామికులు :

1991 గణాంక వివరాల ప్రకారం దేశ జనాభాలో 34.18 శాతం మంది వివిధ రంగాలలో శ్రామికులుగా ఉన్నారు. వీరిలో 51 శాతం మంది పురుషులు కాగా 17.36 శాతం మంది స్త్రీలు ఉన్నారు. గ్రామీణ జనాభాలో 35.84 శాతం మంది మాత్రమే శ్రామిక వర్గానికి చెందినవారు అంటే 64.16 శాతం మంది శ్రామికులపై ఆధారపడి జీవించే బాలురు వృద్ధులు, శ్రామిక రంగానికి చెందిన స్త్రీలుగా పేర్కొనవచ్చు.

## 8.9 సారాంశం :

ప్రతి పదేళ్లకోసారి జనాభా వివరాలు సేకరిస్తారు. గణాంక సమాచారం ప్రణాళిక రూపకల్పనలో తోడ్పడుతుంది. గ్రామీణ జనాభా నగరజనాభా కంటే అధికంగా ఉన్నట్లు తెలుస్తుంది. స్త్రీ పరుష నిష్పత్తిలో పురుషుల కన్న స్త్రీలు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడవుతుంది. అక్షరాస్యతలో గ్రామాలు చాలా వెనకబడి ఉన్నాయి. శ్రామికులలో కూడ పురుషులదే పై చేయిగా కనిపిస్తుంది. అంథ విశ్వాసాలు, నిరక్షరాస్యత, పేదరికం మత నమ్మకాలు గ్రామీణ ప్రాంతాలలో అధిక జనాభాకు కారణమవుతున్నాయి.

## 8.10 ముఖ్య పదాలు :

లింగభేద నిష్పత్తి
జనసాంద్రత
జననాల రేటు
మరణాల రేటు

## 8.11 నమూనా ప్రశ్నలు :

1. గ్రామీణ జనాభాకు నగర జనాభాకు గల వ్యత్యాసాలను పేర్కొనండి.
2. గ్రామీణ జనాభాకి సంబంధించి జననాల రేటు, మరణాల రేటు వయో పరిమితి గురించి వివరించండి.
3. గ్రామీణ జనాభాలో లింగ బేధ నిష్పత్తి, జనసాంద్రత, అక్షరాస్యత మరియు శ్రామిక శక్తి, విశదీకరించండి.

## 8.12 చదువదగిన గ్రంథాలు :

1. Census 1991, 2001

డా॥ జి.వి. రమణ

పాఠం - 9

# గ్రామీణ సమస్యలు ఆరోగ్యం పారిశుద్ధ్యం - నిరుద్యోగిత

## 9.0 లక్ష్యం :

గ్రామీణ సమస్యలలో ప్రధానమైన గ్రామీణ ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామీణ ఆరోగ్య సమస్యలు, జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం వంటి అంశాలను, గ్రామీణ పారిశుద్ధ్యాన్ని మరియు గ్రామీణ నిరుద్యోగిత గురించి వివరంగా తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## విషయక్రమం :

9.1 పరిచయం

9.2 గ్రామీణ ఆరోగ్యం

- 9.2.1. ఆరోగ్యం - నిర్వచనం
- 9.2.2. ఆరోగ్యాన్ని నిర్ణయించే అంశాలు
- 9.2.3. జాతీయ ఆరోగ్య విధానం - గ్రామీణ ఆరోగ్యం
- 9.2.4. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు
- 9.2.5. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - విధులు
- 9.2.6. గ్రామీణ ఆరోగ్య సమస్యలు
- 9.2.7. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం

9.3 గ్రామీణ పారిశుద్ధ్యం

9.4 గ్రామీణ నిరుద్యోగిత

- 9.4.1. నిరుద్యోగిత - నిర్వచనం
- 9.4.2. నిరుద్యోగిత - రకాలు
- 9.4.3. నిరుద్యోగిత - కారణాలు
- 9.4.4. నిరుద్యోగిత - పరిణామాలు
- 9.4.5. నిరుద్యోగిత - పరిష్కార మార్గాలు

9.5 సారాంశం

9.6 ముఖ్యపదాలు

9.7 నమూనా ప్రశ్నలు

9.8 చదువదగిన గ్రంథాలు

## 9.1 పరిచయం :

భారతదేశంలో 75 శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలల్లో జీవిస్తున్నారు. వీరిలో 40 శాతం మంది పేదరికంతో బాధపడుతున్నారు. వివిధ వ్యాధుల బారినపడుతున్నారు. కేవలం ఆరోగ్య సమస్యలతోనే కాకుండా పారిశుద్ధ్యం కూడ పల్లె ప్రాంతాలలో

పెద్ద సమస్య. వీటికి తోడు నిరుద్యోగిత కూడా మరో ముఖ్య సమస్య. దేశాభివృద్ధికి మూలం గ్రామీణాభివృద్ధి. గ్రామీణాభివృద్ధి లేకుంటే, గ్రామీణ సమస్యలు పరిష్కారం కాకుంటే దేశస్వాతంత్ర్యానికి అర్థం లేదు. ప్రభుత్వం గ్రామీణ సమస్యలైన ఆరోగ్యం, పారిశుద్ధ్యం మరియు నిరుద్యోగిత విషయములో ఎన్నో చర్యలు చేపట్టింది.

## ఎ) గ్రామీణ ఆరోగ్యం :

భారతదేశంలో అధిక సంఖ్యాకులు గ్రామాలలో నివసిస్తున్నారు. వీరు ఎదుర్కొంటున్న సమస్యలలో ఆరోగ్యం అతి ప్రధానమైనది. ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. కాని ఆ భాగ్యానికి నోచుకొని అభాగ్యులు గ్రామీణ ప్రాంతాలలో కొకొల్లలు. ఇతర దేశాలతో పోల్చి చూచినట్లయితే జననాల రేటు మరణాల రేటు రెండు కూడ అధికంగా భారతదేశంలో ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మరీ ఎక్కువగా ఉన్నాయి. శిశు మరణాల విషయంలో భారతదేశానిదే ప్రథమ స్థానం. గర్భంలో ఉండగా మరియు ప్రసవానంతరం బిడ్డకి సరైన పోషకాహారాన్ని అందించలేని దౌర్భాగ్య స్థితిలో గ్రామీణ స్త్రీలు ఉన్నారు. సకాలంలో అంటు వ్యాధులను అరికట్టలేని స్థితి, అందుబాటులోలేని వైద్యులు, వైద్య సదుపాయలు వైద్యశాలలు పల్లె ప్రాంతాలలో సర్వ సాధారణం.

అనావృష్టి, కరువు, అంటువ్యాధులు, ప్రబలినపుడు గ్రామీణ ప్రజలు మరణిస్తున్నారని గ్రామీణ ప్రజల ఆరోగ్య స్థితిగతుల పైన బోర్ కమిటి ప్రకటించింది. దేశానికి స్వాతంత్రం వచ్చాక గ్రామీణ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగింది. బ్రిటీష్ పాలనలో గ్రామాలు నిరాదరణకు గురైయ్యాయి. ఫలితంగా ప్రగతికి నోచుకోలేదు. వివిధ సమస్యలతో పాటు ఆరోగ్య సమస్యను గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్నారు. మలేరియా, న్యూమోనియా, కలరా, క్షయ, తట్టువంటి అంటు వ్యాధులు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలలో అధిక మరణ రేటు, అనారోగ్య స్థితికి కారణమవుతున్నాయి. గ్రామీణ ప్రజలలో దారిద్రరేఖ దిగువన జీవించే వాళ్లే ఎక్కువగా ఉన్నారు. అధిక శాతం ప్రజలు నిరక్షరాస్యులు కావటం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకోకుండటం సంప్రదాయ జీవన విధానం నుండి బయటపడక పోవటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారు. వీరిలో పౌష్టకాహార లోపం కూడ ఎక్కువగా ఉంది. నీటి సరఫరా, పారిశుద్యం వంటి అంశాలు గ్రామీణ ఆరోగ్యం పై అమితంగానే ప్రభావాన్ని కలిగిస్తాయి. మూఢనమ్మకాల వల్ల అశాస్త్రీయమైన పద్ధతులు అనుసరించడం వల్ల వ్యాధి తగ్గకపోవడమే కాకుండ తీవ్ర రూపం దాల్చి మరణాలకి కారణమవుతున్నాయి.

యునెస్కో వారి పరిశీలన ప్రకారం దేశంలో ఏ వ్యాధి వచ్చిన మొదట గ్రామీణ ప్రజలకు కలుగుతుందనేది కాదనని వాస్తవం. అంధ విశ్వాసాలు, అజ్ఞానం, పేదరికం గ్రామీణ ప్రజలను ఆరోగ్యానికి దూరం చేస్తున్నాయి. ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు ఏర్పరచిన, పలు అభివృద్ధి కార్యక్రమలు చేపట్టిన ఫలితం ఆశించినంతగా ఉండడం లేదు. సరైన ప్రణాళిక లేకపోవడం భారీగా నిధుల కేటాయించకపోవడం అధికారుల సిబ్బంది అలక్ష్యం గ్రామీణ ప్రాంతాల పట్ల చిన్నచూపు వంటి లోపాలవల్ల గ్రామీణ ఆరోగ్యం కుంటుపడింది.

### 9.2.1. ఆరోగ్యం నిర్వచనం :

ఆరోగ్య సంస్థలల్లోకెల్లా అత్యధిక ప్రాచుర్యం కల్గిన "ప్రపంచ ఆరోగ్య సంస్థ" నిర్వచనం ప్రకారం,

"ఆరోగ్యం అనేది మనిషి శారీరకంగా, మానసికంగా, సాంఘికంగా బాగుండే స్థితి అంతేకాని కేవలం ఏ వ్యాధి లేదా అంగవైకల్యం లేకపోవడమే కాదు".

ఈ నిర్వచనంగల మూడు పార్శ్వాలు పరస్పర అంతర్గత సంబంధాన్ని కల్గి ఒక దాన్నొకటి ప్రభావితం చేసుకుంటాయి.

**శారీరకారోగ్యం** - మానవ శరీరంలోని సర్వాంగాలు సరిగ్గా సక్రమంగా పనిచేస్తూ మంచి రంగు, మెరిసే కళ్లు, నిగనిగలాడే వెంట్రుకలు, శుభ్రమైన చర్మం, కొవ్వులేని బిగువైన కండరాలు, వయస్సుకు తగ్గ బరువు, పొడవు మొదలగునవి కలిగిన మనిషిని శారీరకంగా ఆరోగ్య వంతుడనవచ్చు.

**మానసికారోగ్యం** - మానవుడు తనకూ, ఇతరులకు, పరిసరాలకు సంబంధించిన వాస్తవాలను గ్రహించ కలిగే స్థితిలో ఉండి తన చుట్టూగల ప్రపంచంలో పొందికగా ఉండగల స్థితి.

**సాంఘికంగా ఆరోగ్యంగా ఉండటం** - వాస్తవానికి ఆరోగ్యానికి సంబంధించిన వైద్యేతర పార్శ్వం మానవుడు తనకుగల సృజనాత్మక శక్తులలో పరిమాణాత్మకంగాను, గుణాత్మకంగానూ, ఇతర వ్యక్తులలో కలిగి ఉండే సంబంధము సంఘంలో అతని చొరవ యొక్క స్థాయిని ఆరోగ్యం యొక్క సాంఘిక పార్శ్వంగా నిర్వచించారు.

**9.2.2 ఆరోగ్యాన్ని నిర్ణయించే అంశాలు** : ఆరోగ్యాన్ని అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. వాటిలో ప్రధానమైనవి.

1. వంశపారంపర్యత
2. పరిసరాలు (గాలి, నీరు, పరిశుభ్రత)
3. సామాజిక కట్టుబాట్లు ఆచారాలు
4. సాంఘిక, ఆర్థిక స్థితిగతులు
5. వైద్య సదుపాయాల అందుబాటు
6. వ్యక్తిగత జీవన విధానం (ధూమపానం, మద్యపానం, లైంగిక అలవాట్లు, ఆహారం, నిద్ర, వ్యాయామం మొదలైనవి)

ఆరోగ్యంపై ఇవి వేరు వేరుగా ప్రభావితం చేయగల్గినా సాధారణంగా ఒకటికంటే ఎక్కువ అంశాలు కనిపిస్తాయి.

## భారతదేశంలో గ్రామీణ ఆరోగ్య విధానం :

సంపూర్ణ ఆరోగ్యవంత జీవితాన్ని గడపడం ప్రతి వ్యక్తి ప్రాథమిక హక్కు. ఈ హక్కు పొందటానికి కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతం, రాజకీయ, సామాజిక, ఆర్థిక స్థాయిలు అంతరాయం కాకూడదు. దేశపురోగతికి ప్రగతికి, శాంతి సౌభాగ్యలకు భద్రతకు ఆరోగ్యమే మూలం. ఈ ఆరోగ్యాన్ని పొందటానికి రాష్ట్ర ప్రభుత్వాల, వ్యక్తుల సంపూర్ణ సహకారం ఉండాలి. ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వాల భాద్యత - ముఖ్యంగా అంటువ్యాధి నివారణ కార్యక్రమాల నిర్వహణలో తేడాలుంటే అన్ని ప్రాంతాలకు అది ప్రమాదమే. అందుచేత నిర్వహణలో వ్యత్యాసం ఉండకూడదు.

బ్రిటీష్ వలస పాలనలో గ్రామీణ ఆరోగ్య సేవలు నామ మాత్రంగా ఉండేవి. కలరా, ప్లేగు, మశూచి వంటి అంటు వ్యాధులు ప్రబలినపుడు మాత్రమే వైద్య సేవలందించేవారు. గ్రామీణ ఆరోగ్యం తీవ్రమైన నిర్లక్ష్యానికి గురైంది. 1951లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రాధాన్యమిస్తూ దేశ వ్యాప్తంగా గ్రామీణ ఆరోగ్య పథకం భోర్‌కమిటి (1946) సిఫార్సుల మేరకు ప్రారంభమయింది. దేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భావన బోర్ కమిటీదే. అంటువ్యాధులను అదుపు చేయడానికి, నిర్మూలించటానికి అనేక దేశ వ్యాప్త కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామీణ ప్రాంతాలలో కార్యకర్తల పథకంను కేత్కార్ సింగ్ సంఘం (1972) సిఫార్సులపై ఏర్పాటు చేయడమైనది. గ్రామీణ ప్రాంతాలకు కమ్యూనిటి ఆరోగ్య కార్యకర్తల నియమానికి శ్రీవాత్సవ సంఘం (1974) శ్రీకారం చుట్టింది.

### 9.2.3 జాతీయ ఆరోగ్య విధానం - గ్రామీణ ఆరోగ్యం :

'అందరికి ఆరోగ్యం' అనే నినాదం ప్రధానంగా 1983 జాతీయ ఆరోగ్య విధానాన్ని ప్రారంభించారు. గ్రామీణ ఆరోగ్య రంగంలో నూతన శకం మొదలైనది. గ్రామీణ ఆరోగ్య పంపిణీ విధానాల్ని చక్కగా వికేంద్రీకరించడానికి కొత్త వ్యూహం అందించింది. నిరోధక చర్యల ద్వారా ఆరోగ్య రక్షణ కోసం సమగ్ర విధానాల్ని జాతీయ ఆరోగ్య విధానం చేపట్టింది. పారిశుద్ధ్యం, రక్షణ, మంచి నీరు, పౌష్టికాహారాలతో సహా, నిరోధాత్మక, అభివృద్ధాత్మక చికిత్సాత్మక చర్యల ద్వారా ఆరోగ్య సంరక్షణ కల్పించడం ఆరోగ్య విధానంలో ఉంది. ప్రజలు, స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యాన్ని ఆరోగ్య సేవలు అందించడానికి అవసరమని గుర్తించారు. ఆరోగ్య వైద్య భారతీయ వైద్య విధానల సమీకరణ వంటి అంశాలను సూచించారు. అసుపత్రుల నిర్వహణ నియంత్రణలో పంచాయతీ రాజ్ వ్యవస్థకు ప్రాధాన్యత లభించింది.

అందరికీ ఆరోగ్యం అనే కార్యక్రమ ప్యాకేజి 1986లో కనీస అవసరాల కార్యక్రమం కింద ప్రారంభించారు. దీని కింద గ్రామీణ ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనకు దిగువ తెలిపిన నియమాలు అనుసరిండమైనది.

1. 20,000 నుంచి 30,000 జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.
2. 3,000 నుంచి 5,000 జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం.
3. ఒక లక్ష జనాభాకు సంపూర్ణ సదుపాయాలతో కూడిన కమ్యూనిటి ఆరోగ్య కేంద్రం.
4. ఒక వెయ్యి జనాభా కలిగిన గ్రామానికి ఒక గ్రామ ఆరోగ్య గైడు.

ప్రపంచ బ్యాంకు సహాయంతో మలేరియా, కుష్ఠు, క్షయ వ్యాధుల నియంత్రణకు పరివర్తిత వ్యూహాలను చేపట్టడమైనది. మలేరియా నియంత్రణకు పరివర్తన నిర్వహణ ప్రణాళికను ప్రవేశపెట్టడమైంది. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం కింద బహుళ ఔషద చికిత్సని కూడా ప్రవేశపెట్టడమైనది. జాతీయ క్షయ కార్యక్రమాన్ని నేరుగా పరిశీలించి చికిత్సతో పాటు ప్రవేశ పెట్టడమైంది. ఎయిడ్స్‌ను అరికట్టడానికి అధిక వ్యయంతో ఓ కార్యక్రమం చేపట్టడమైంది. జాతీయ కుష్ఠు నియంత్రణ కార్యక్రమాన్ని జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంగా మార్చడమైంది. మాత శిశు, ఆరోగ్య పథకాన్ని కుటుంబ సంక్షేమ కార్యక్రమాన్ని, పునరోత్పత్తి శిశు ఆరోగ్య కార్యక్రమంగాను, కమ్యూనిటి ఆరోగ్య కార్యకర్తల పథకాన్ని ఆరోగ్య శిశు సంరక్షణ సురక్షిత మాతృత్వం పథకం కింది మార్చడమైయింది.

### 92.4. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు :

ప్రజారోగ్య స్థాయి మరియు ఆరోగ్య సంస్థల పనితీరుపై సర్‌జోసెఫ్ బోర్ అధ్యక్షతన ఆరోగ్య సర్వే మరియు అభివృద్ధి కమిటి సమిష్టి వైద్య చికిత్సకు, వ్యాధి నివారణకుగాను ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పాలని సిఫార్సు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సంఘం ఆరోగ్య నిపుణులు కూడా గ్రామీణ ప్రాంతాలకు వైద్య ఆరోగ్య సదుపాయాలను మెరుగు పరచటానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పాలని సూచించారు. దీనితో దేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 1952లో నెలకొల్పారు. గ్రామీణ ప్రాంతాలన్నిటికి, ఆరోగ్య వైద్య సదుపాయాలను విస్తృతం చేయటానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కీలకస్థానం కల్పించారు.

గ్రామీణ ప్రజల సమగ్ర ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం వ్యాధినివారణ, రోగ చికిత్స కార్యక్రమాలను నిర్వహించే వ్యవస్థను "ప్రాథమిక ఆరోగ్య కేంద్రం" అంటారు. జాతీయ ఆరోగ్య ప్రణాళికా రచనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాపనకు ప్రత్యేక స్థానాన్ని ఇచ్చారు.

దేశానికి స్వాతంత్రం వచ్చిన ఏభయి సంవత్సరాలలో గ్రామీణ ప్రజారోగ్యానికి సంబంధించిన మౌలిక ప్రాథమిక సౌకర్యాలు గణనీయంగా పెరిగాయి. ఈ ప్రాథమిక సౌకర్యాల సముదాయంలో 1,45,000 ఉపకేంద్రాలు 5000 జనాభాకు 3,222 సముదాయ ఆరోగ్య కేంద్రాలు 1,00,000 జనాభాకు సేవలు చేస్తున్నాయి (షెడ్యూల్డు తెగలు నివసించే ప్రాంతాల్లో ఎడారి ప్రాంతాలల్లో ఈ జనాభా గణాంకాలు వరుసగా 3000, 20000, 80,000 గా ఉన్నాయి.

జనాభాలో 70 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో జీవనం సాగిస్తూ వైద్య సదుపాయాలకు దూరంగా ఉంటే ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటులోని ప్రధాన ఉద్దేశం. ప్రాథమిక ఆరోగ్యం కోసం వచ్చే గ్రామీణులకు ఈ కేంద్రాలు వైద్య సలహాలను, చికిత్సను అవసరమైన ఔషదాలను అందిస్తున్నాయి. గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నయంకాని రోగులను మండల, డివిజన్, జిల్లా స్థాయి ఆస్పత్రులకు పంపిస్తుంటారు. సాధారణ జబ్బులతో పాటు క్షయ, మలేరియా, ఫైలేరియా, కుష్టు రోగాలకు చికిత్సతోపాటు ఔషదాలను ఉచితంగా అందజేస్తారు. హెపటైటిస్, (కామెర్ల వ్యాధి) ఎయిడ్స్ రోగులను ఆస్పత్రి స్థాయి కేంద్రాలకు పంపించి ప్రత్యేక వైద్య సేవలను కల్పిస్తారు. మహిళలకు మండల స్థాయి ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు గర్భిణులకు ఉచితంగా ఔషదాలు, కాన్పు సేవలు కలగజేస్తున్నారు. ఉచితంగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రాణాంతక వ్యాధులనుండి పసి పిల్లలను రక్షించటానికి బి.సి.జి, పోలియో, హెపటైటిస్, మెదడువాపు వ్యాధి మొదలైన వాటికి వ్యాధి నిరోధక టికా సూదు మందులను ఉచితంగా అందిస్తున్నారు. అంధులకు అవసరమైన పరికరాల్ని సరఫరా చేస్తున్నారు. కుక్క కాటుకు గురైన వారికి రేబిస్ వ్యాధి రాకుండా ఉండేందుకు యాంటీ రేబిస్ సూది మందులను ఖరీదైనప్పటికి ఉచితంగానే అందిస్తున్నారు. ఔషదాల విషయానికొస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 94 రకాలు, డివిజన్ జిల్లా స్థాయి ఆస్పత్రుల్లో 149 రకాలు, బోధనా స్పత్రుల్లో 245 రకాలను అందుబాటులో ఉంచింది. వీటిలో ఎక్కువగా వృధా అవుతుండడం జరుగుతుంది.

## 9.2.5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రం - విధులు :

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం క్రింది విధులను నిర్వహించాలి.

1. వైద్య చికిత్స సదుపాయాలు : వ్యాధి నియంత్రణ, వ్యాధి నివారణ కార్యక్రమాలకు ప్రాముఖ్యతనివ్వాలి. వైద్య సదుపాయాలను ఆరోగ్య కేంద్ర పరిధిలోగల అన్ని గ్రామాలకు వర్తింప చేయాలి. వ్యాధి నిర్ధారణకు వీలుగా సాధారణ పరీక్షలు నిర్వహించాలి. తీవ్ర వ్యాధితో ఉన్న వారి ఇళ్ళను సందర్శించాలి. చికిత్సకు వీలులేని రోగులను సమీపంలోగల వైద్యశాలకు పంపాలి. రోగులకు ఆరోగ్య విద్యనందించడం, సామాన్య శస్త్ర చికిత్సలను చేయడం వంటివి చేపట్టాలి.

2. పరిసర పారిశుద్ధ్యము - సమాజంలోని వ్యక్తుల ఆరోగ్య రక్షణకు పరిసర పారిశుద్ధ్యం ఎంతైన దోహదపడుతుంది. రక్షిత మంచినీటిసరఫరా, శాస్త్రీయ మరుగు దొడ్ల నిర్మాణం, ఆహర నియంత్రణ, గృహ వసతి నిర్మాణాల పర్యవేక్షణ పండుగలలో తీర్థయాత్రలలో పారిశుద్ధ్య ఏర్పాట్లు, మురికి నీటి తొలగింపు, వాతావరణ కాలుష్య నియంత్రణ చెత్త చెదారం వెలికి తీనవంటి చర్యలు చేపట్టడం ద్వారా పరిసరాలకు పారిశుద్ధ్యం.

3. అంటు వ్యాధుల నియంత్రణ - దీనిలో ప్రధానంగా వ్యాధి కారక కీటకాలు లేదా క్రిములను నాశనం చేయుటం, వ్యాధి వ్యాప్తిని అరికట్టడం, పోషకాహర విలువలను గుర్తించి చర్యల తీసుకోవడం, వ్యాధి సోకిన వెంటనే చికిత్స సదుపాయలు ఏర్పాటు చేయ్యటం వ్యాధి తీవ్రం కాకుండా చర్యలు చేపట్టింది. ముఖ్యంగా కలరా, మలేరియా ఫైలేరియా, క్షయ, కుష్టు వ్యాధి, ధనర్వాత్త గొంతు, కోరింతదగ్గు, గొంతు వాపు, గజ్జి మరియు పోషకాహర లోప వ్యాధుల నివారణ, నియంత్రణ చికిత్స చర్యలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలో చేపట్టాలి.

4. పాఠశాల ఆరోగ్యం - దీనిలో ప్రధానంగా పాఠశాల బాలబాలికల (6-11 సం॥లోపు) కు ఆరోగ్య పరిరక్షణ, వైద్య చికిత్స, వ్యాధి నివారణ చర్యలు చేపట్టడం ఆరోగ్య విద్యనందించడం పరిసర పరిశుభ్రత పాఠశాలలో నిర్వహించడం జరుగుతుంది.

5. పోషకాహారం, కుటుంబ నియంత్రణ, మాతా శిశు సంరక్షణ : స్త్రీలకు, పిల్లలకు పోషకాహార లోప వ్యాధులు రాకుండా చూడటం, దీనికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. పరిమిత కుటుంబం వల్ల కలిగే ప్రయోజనాలను సమాజంలోని దంపతులకు, స్థానిక నాయకులకు బోధించటం అర్హతగల దంపతులకు శాశ్వత లేదా తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులను తెలియజేయ్యటమే కాకుండా, కావలసిన వారికి వాటిని ఏర్పాటు చేస్తారు. మాతా శిశు సంరక్షణ ప్రధానమైన అంశం. బాలింతల, చూలింతల ఆరోగ్యం, ప్రసూతి సేవలు, సదుపాయాలు కల్పన, శిశు సంరక్షణ, తల్లులకు, పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు వేయడం చేస్తారు.

6. ఆరోగ్య విద్య - ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాలను ప్రజలకు తెలియజేయటం ఆరోగ్య విద్యా కార్యక్రమాలకు సంబంధించిన సాహిత్యాన్ని పంపిణీ చేయ్యడం - వివిధ వర్ణాలతో కలిసి పని చేయ్యటం జరుగుతుంది.

7. ప్రాణిగణాంకాలు సేకరణ, రికార్డుల తయారీ - జనన మరణాలకు సంబంధించి విషయం సేకరించడం జనాభాకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం, అంటువ్యాధులకు సంబంధించి నివేదకల తయారీ మొదలైన పనులు నిర్వహిస్తారు.

8. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు - జాతీయ స్థాయిలో నిర్వహించే వ్యాధి నియంత్రణ మరియు నిర్మూలన కార్యక్రమాలన్నింటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర స్థాయిలోనే నిర్వహిస్తారు.

### 9.2.6 గ్రామీణ ఆరోగ్య సమస్యలు :

వ్యాధులలో రెండు రకాలున్నాయి. సాంక్రమిక (అంటు) వ్యాధులు, సాంక్రమికేతర వ్యాధులు. సాంక్రమిక వ్యాధులవల్లె ఎక్కువగా అనారోగ్యనికి గురైయ్యింది, మరణాలు సంభవించేది జరుగుతుంది.

గాలి, నీరు, ఆహారం అనే మధ్యమాల ద్వారా వ్యాధికి గురైన ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి సంక్రమించే వ్యాధులను సాంక్రమిక వ్యాధులు అంటారు. ఒక మనిషి మరో మనిషిని తాకటం ద్వారా లేదా దోమలు, ఈగలు నల్లులు, మొదలగు వాహకాల ద్వారా కూడా ఒక వ్యక్తికి చెందిన వ్యాధి ఇతరులకు చేరుతుంది. వీటిని కూడా సాంక్రమిక వ్యాధులంటారు. పరిసరాల పరిశుభ్రత, మంచినీరు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు వైద్య సదుపాయాల అందుబాటు వంటి అంశాలు సాంక్రమిక వ్యాధుల నియంత్రణలో ప్రధాన పాత్ర వహిస్తాయి. ఎక్కువగా గ్రామీణ ప్రజలు వీటి బారిన పడి ప్రాణాలు కోల్పోవటం జరుగుతుంది. సాంక్రమికేతర వ్యాధుల్లో గుండె, మూత్రపిండాలు, కాలేయం, జీర్ణాశయం రక్త ప్రసరణ సంబంధిత వ్యాధులు, నోటి, ఊపరి తిత్తుల క్యాన్సర్ మొదలైనవి ప్రధాన వ్యాధులు. వీటి బారిన పడిన వారు అకస్మాతుగా చనిపోవటం లేదా జీవితకాలం కుదింపబడి, బాధపడటం జరుగుతుంది. వీటి విషయంలో వ్యక్తిగత అలవాట్లు జీవనశైలి ముఖ్యపాత్ర వహిస్తాయి.

అజ్ఞానం, అంధవిశ్వాసాలు, పారిశుద్ధ్య లోపం, వైద్య సదుపాయాలు కొరత వల్ల గ్రామీణ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో సాంక్రమిక లేదా అంటు వ్యాధులు ప్రబలంగా ఉంటాయి. వీటిలో ముఖ్యమైనవి మలేరియా, అతీసార వ్యాధి, క్షయ, అంతేకాకుండా మెదడు వ్యాపు వ్యాధి, ఎయిడ్స్ కూడ పల్లెలలో రాజ్యమేలుతున్నాయి. ఇక పోషకాహారలోపంలో రక్త హీనతతో బాధపడే వారి సంఖ్య సరేసరి.

ముఖ్యమైన వ్యాధులను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**మలేరియా** - మలేరియాని చలి జ్వరం అని కూడా అంటారు. ఇది దోమ కాటు వల్ల వస్తుంది. ఏటా పది మిలియన్ల మంది మలేరియా వ్యాధితో బాధపడుతున్నారు. పల్లెలు పట్టణాలు అనే బేదం లేకుండా అన్ని ప్రాంతాల్లోను వ్యాధి ప్రబలంగా ఉన్నప్పటికి గిరిజన ప్రాంతాలలో అధికంగా ఉంది. ఏటా వేలాది మంది ఈ వ్యాధి బారిన పడి మరణిస్తున్నారు. 1953లో ప్రప్రథంగా జాతీయ మలేరియా నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మలేరియాని అదుపుచేయ్యటానికి ప్రభుత్వం అనేక చర్యల్ని తీసుకుంటుంది. దోమల్ని నిర్మూలించడం, పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవటం, మలేరియాకి ఇచ్చే మందులను గడువు పూర్తయ్యే వరకు ఉపయోగించడం ప్రజలు ప్రధానంగా నిర్వర్తించవలసిన విధులు.

**అతిసార వ్యాధి** - ముఖ్యంగా వర్షాకాలంలో అతిసార వ్యాధి ఎక్కువగా ఉంటుంది. ఇది గిరిజనులకు, గ్రామీణ పేద ప్రజలకి, పట్టణ మురికి వాడల్లోని వారికే ఎక్కువగా వస్తుంది. ఆహారం, తాగునీరు కలుషితం కావడం వల్ల అతిసార వ్యాధి వస్తుంది. ఇదే కాకుండా కామెర్లు, టైఫాయిడ్, అమీబియసీస్ వంటివి కూడా కలుషిత నీటివల్ల కలుగుతాయి. రక్షిత తాగునీరు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా సరఫరా చేయ్యకపోవటమే వ్యాధి ప్రబలటానికి ప్రధాన కారణం. ప్రభుత్వ చర్యలతోపాటు వ్యక్తిగత రక్షణ చర్యలు చేపడితే వ్యాధిని నివారించవచ్చు.

**క్షయ** : క్షయ మైకోబాక్టీరియ ట్యుబర్కులోసిస్' అనే బాక్టీరియా గాలి (దగ్గు, తుమ్ముల) ద్వారా ఇతరులకు వ్యాపిస్తుంది. ప్రపంచంలో మొత్తం క్షయ రోగుల్లో 30 శాతం మన దేశంలోనే ఉన్నారు. ఏటా ఐదు లక్షల మంది దీని వల్ల మృత్యువాత పడుతున్నారు. పేదరికం, సకాలంలో వ్యాధి నిర్ధారణ జరగక చికిత్సలో జాప్యం వల్ల వ్యాధి ప్రబలతుంది. క్షయను అరికట్టడానికి దేశ వ్యాప్తంగా బి.సి.జి టీకా కార్యక్రమం ప్రారంభించారు. వివిధ ఆసుపత్రులలో క్షయ రోగులకు చికిత్స సౌకర్యం ఉంది. విస్తృత ప్రచారం లేకపోవడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ తీరు వల్ల నియంత్రణ వేగం కావడం లేదు.

## మెదడు వ్యాపు వ్యాధి (జపనీస్ ఎన్‌సెఫలైటిస్) :

పందులు, దోమల ద్వారా వ్యాపించే వైరస్ వల్ల మెదడు వాపు వ్యాధి వస్తుంది. జపనీస్ ఎన్‌సెఫలైటిస్ వైరస్ అనే సూక్ష్మ క్రిమి వల్ల వ్యాధి కలుగుతుంది. దేశంలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల్లో మెదడు వాపు వ్యాధి పసి పిల్లల ప్రాణాల్ని తీస్తుంది. ఈ విషయంలో అన్ని రాష్ట్రాల్లోకెల్లా ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. పసి పిల్లలను పొట్టను పెట్టుకుంటున్న మెదడువాపు వ్యాధి ఇంకా శాశ్వతంగా అరికట్టే చర్యలు చేపట్టేలేదు.

మలేరియా (చలిజ్వరం) ఫైలేరియా (బోదకాలు) డెంగ్, కాలా అజార్, మెదడువాపు వ్యాధి వంటి అన్ని వివిధ రకాల దోమలవల్ల వ్యాప్తి చెందుతాయి. దోమలు ఈ వ్యాధులకు వాహకాలుగా పని చేస్తాయి. వీటి నిర్మూలన జరిగితే కాని వ్యాధులను నిర్మూలనం జరగదు.

## ఎయిడ్స్, .. చ్.ఐ.వి. (HIV) :

ప్రస్తుత సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఆరోగ్య సమస్యలలో అతి ప్రమాదమైనది ఎయిడ్స్ (ఎక్వైర్డ్ ఇమ్యూనో డెఫీషియన్సీ సిండ్రోమ్) కోట్ల మందిని మృత్యువుకి కారణమవుతున్న ఎయిడ్స్ గ్రామీణ, నగరాలతో బేదం లేకుండా అన్ని ప్రాంతాలలోను వ్యాపించింది. సహజ సిద్ధమైన రోగనిరోధక శక్తిని తగ్గించి మనిషిని పీల్చిపిప్పి చేస్తుంది. నివారణలేని ఎయిడ్స్‌ని అరికట్టాలంటే నైతిక విలువలు పాటించాలి.

నయం చెయ్యటానికి వీలుకాని ఎయిడ్స్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రచార సాధనాల ద్వారా ప్రభుత్వం హెచ్చరిస్తుంది. దేశంలో అన్ని రాష్ట్రాలలో ఎయిడ్స్ సలహా కేంద్రాలను ప్రారంభించడమైంది. ఇతరులతో లైంగిక సంబంధం, రక్త

మార్పిడి, మత్తుమందులు, డిస్పోజబుల్ సిరంజీలు, నీడిల్స్ వాడక పోవటం వంటివి ఎయిడ్స్ రావటనాకి ప్రధాన కారణాలు. నానాటికి ప్రబలుతున్న ఎయిడ్స్‌ని అడ్డుకోకుంటే భవిష్యత్‌నే కబలిస్తుంది.

**పోషకాహార లోప వ్యాధులు** - దేశ జనాభాలో ఎక్కువ శాతం మంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పోషక ఆహార లోపాల వల్ల వచ్చే వ్యాధితో బాధపడుతున్నారు. ప్రధానంగా ఐదేండ్లలోపు పిల్లలు గర్భిణీ స్త్రీలు (చూలింతలు) బాలింతలు వీటి బారినపడుతున్నారు. పాఠశాల మధ్యాహ్న భోజన కార్యక్రమం, పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పోషకాహార సరఫరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అంథత్వ నివారణకుగాను ఐదేళ్లలోపు పిల్లలకు 'ఏ' విటమిన్ ద్రావణాన్ని పంపిణీ చేస్తారు. దీనిని ఆరు నెలల కొకసారి ఇస్తారు. గర్భిణీ స్త్రీలకు 'ఐరన్ పోలిక్ యూసిడ్' మాత్రలు కూడా పంపిణీ చేస్తారు.

**మాతా శిశు ఆరోగ్యం** - గ్రామీణ ప్రాంతాలలో మాతా శిశు మరణాల రేటు ఎక్కువగా ఉంది. వైద్య సేవలు సకాలంలో అందకపోవటం వల్ల గర్భవతిగా ఉన్నప్పుడు, ప్రసవ సమయంలో అనేక మంది తల్లులు, పిల్లలు మరణిస్తున్నారు. ప్రభుత్వం వీటిని అరికట్టడానికి చర్యలు తీసుకుంది.

గ్రామీణ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక చర్యల్ని చేపట్టింది. అధిక జనాభాను అదుపు చేయడానికి, పోషకాహార విలువలు పెంచటానికి, కుటుంబ సంక్షేమానికి, జాతీయ నిర్మూలన కార్యక్రమాలు అమలు జరపడం, రక్షిత త్రాగు నీటిని అందించటానికి అనేక కార్యక్రమాలు అమలు జరుపుతున్నారు.

### 9.2.7 జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం :

ప్రజారోగ్య పథకాలలో అసమర్థత చోటు చేసుకోవడం, ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాన్ని సరిగా నిర్వహించకపోవడం, ప్రవేటు వైద్యరంగంలో ఖర్చు మీద నియంత్రణ లేకపోవటం, క్షేత్ర స్థాయిలో నిర్వీర్యమయ్యే ఆరోగ్య పథకాలు కొకొల్లలుగా ఉండటం వల్ల గ్రామీణలకు సరిగా వైద్య సేవలు అందడం లేదు. వైద్య సేవలు పేదవారిగా అందకుండ అందుబాటులో లేకుండా ఉన్నాయి, దూరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2005 ఏప్రిల్ 12న భారత ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని ప్రవేశపెట్టింది.

జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఒరిస్సా, ఉత్తరాంచల్, జార్ఖండ్, చత్తీసుఘడ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలండ్, సిక్కిం, త్రిపుర, జమ్మూ-కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లో గ్రామీణ ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధను కనపరుస్తుంది.

అందరికి సమగ్ర, సంపూర్ణ, సత్ఫలిత ప్రాథమిక వైద్య సేవలు అందించటమే ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం. దీనివల్ల అందరికి అందుబాటులో నాణ్యమైన, బాధ్యతాయుతమైన వైద్య సేవలు లభ్యమవుతాయి. ముఖ్యంగా పేద ప్రజలకు, మహిళలకు, శిశువులకు వైద్య సేవలు అందుతాయి. ఈ మహపథక కాలం 2005 నుండి 2012 వరకూ ఏడేళ్లు కొనసాగుతుంది.

ఆరోగ్యరంగంలో ప్రాంతీయ అసమానతలను తొలగించడమే ప్రధానోద్దేశ్యంగా పథకం ప్రారంభమైయినది. ఇందుకుగాను ఆరోగ్య పరిస్థితులను కల్పించే పారిశుద్ధ్యం, రక్షిత త్రాగునీరు, పౌష్టికాహారం వివిధ వైద్య విధానాలను అనగా ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధలను పూర్తిగా వినియోగించుకోవడం, వనరుల సమీకరణ, సంస్థాగత నిర్మాణాలను కేంద్రీకరించటం, సర్వ శిక్ష అభిమానకీ అనుసంధానమైన ఆరోగ్య కార్యక్రమాలను వికేంద్రీకరించి జిల్లాల వారిగ యాజమాన్యాలకు అప్పగించటం, సముదాయ భాగస్వామ్యం, ఆస్తులను స్వంతంగా కలిగి వుండటం జరుగుతుంది. దేశంలోని ప్రతి బ్లాక్‌లో భారత ప్రజారోగ్య ప్రమాణాలకు అనుగుణంగా పి.హెచ్.సి. స్థాయిలో సమర్థవంతమైన అస్పత్రి సేవలను నిర్వహించటం వంటి వాటిని చేపట్టింది.

**జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకంలో కీలకమైన వ్యూహాలు క్రింది విధంగా ఉన్నాయి :**

**ఆశా** - భోరి కమిటి మూడంచెల గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాల చట్రాన్ని జనాభా ప్రాతిపదికన సిఫార్స్ చేసినది. అయితే అమలలో అది వీలుకాలేదు. ప్రత్యేకించి ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా, రాజస్థాన్, జార్ఖండ్, ఉత్తరాంచల్, చత్తీస్‌ఘడ్, జమ్ము కాశ్మీర్, అస్సాంలలో జనాభా విపరీతంగా పెరిగి పోవటం, ఉపకేంద్రాల స్థాయిలో సిబ్బంది కొరత వల్ల ఆరోగ్య పథకాలను ప్రధానంగా మాతా శిశు సంక్షేమ పథకాలను నీరుకార్చాయి. దీనిని గుర్తించిన ఈ పథకం ఉపకేంద్ర స్థాయి నుండి గ్రామస్థాయికి ఆరోగ్య పథకాలను సక్రమంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు గుర్తింపు పొందిన సముదాయ ఆరోగ్య కేంద్ర కార్యకర్త (మహిళ)ను, వెయ్యి జనాభాకు ఒకరి చొప్పన నియమించింది. ఈమెను అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ ఏక్టివిస్ట్ - 'ఆశా' అంటారు.

ఆశా మహిళా కార్యకర్త, వివాహిత, స్థానిక సముదాయానికి చెందినది అయి గ్రామ సభకు బాధ్యురాలిగా వుంటుంది. సముదాయ స్థాయి సేవలైన అందరికి టీకా పథకం, మాతాశిశు ఆరోగ్యానికి సంబంధించిన ఆరోగ్య పథకాలను వారికి అందజేయటం, సముదాయంలోని వారికి పౌష్టికాహారం, పారిశుధ్ద్యం, వ్యాధి నిరోధకాలు, మంచి అలవాట్లు మొదలైన అంశాలపై అవగాహన కలిగించటం, ఆరోగ్య సూత్రాలను వివరించడం అంటు వ్యాధులు ప్రబలకుండ ఉండేందుకు గ్రామస్థాయిలో రూపొందించే గ్రామ ఆరోగ్య ప్రణాళిక తయారీలో సభకు సహాయం చెయ్యటం, ఇంటింటా పాయిఖానాల ఏర్పాటుకు కృషి చేయ్యడం మొదలైన వాటిని ఆశా చేస్తుంది. ఆశా కార్యకర్తకు ప్రభుత్వం నుండి శిక్షణ లభిస్తుంది. పని తీరును బట్టి ప్రోత్సాహకాలు ఉంటాయి, జీత భత్యాలు ఉండవు. సముదాయంలో ఆరోగ్య సేవలు అందక నిర్లక్ష్యానికి గురైన జనాభాలో ప్రధానంగా మాతాశిశువులకు ఆరోగ్య పరమైన సమస్యలు ఎదురయినప్పుడు ఆశా కార్యకర్త వారి వద్దకు వెళ్లే మొట్టమొదటి వ్యక్తిగా వుంటుంది.

జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం జనాభా ప్రాతిపదికను కొత్త ప్రాథమిక సౌకర్య చట్టాన్ని మంజూరు చేసి తద్వారా కనీస ఆరోగ్య ప్రాథమిక సౌకర్యాలను బలోపేతం చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకుగాను ఒక డాక్టరు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇద్దరు డాక్టర్లను నియమించి ఆశా కార్యకర్తలను ఏర్పాటు చేస్తారు.

జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం రాజ్యాంగంలోని 73వ సవరణ చట్టంలో తెలిపిన ప్రకారం పంచాయితీరాజ్ సంస్థలు ప్రధానపాత్ర వహించాలని కోరుతుంది. జిల్లా ఆరోగ్యరంగ యంత్రాంగానికి జిల్లా పరిషత్ చైర్మన్ నాయకత్వం వహించగా గ్రామ పారిశుధ్ద్యం కమిటిలో 'ఆశా' లను ఎంపిక చేసి నియంత్రిస్తారు. ఆరోగ్య పథకాలను అమలు జరపటానికి పంచాయితీ రాజ్ సంస్థలకు అధికారాన్ని కల్పిస్తుంది.

గ్రామస్థాయిలో నిర్లక్ష్యానికి గురైనవారికి ఈ పథకం ఒక ఆశాజ్యోతి. పేదవారి పాలిట ఆరోగ్యపరంగా ఆశా అండగా ఉంటుంది. మందులు పెట్టెతో వారి ముంగిటకు వెళ్తుంది. పిహెచ్‌సి స్థాయిలో మెరుగైన ఆస్పత్రి సౌకర్యాలు లభిస్తాయి. ఆరోగ్య కేంద్రాలలో సాధారణ జబ్బులకు ఔషధాలు దొరుకుతాయి. గ్రామీణ ప్రజల ఆరోగ్య అవసరాలు తీర్చటంలో జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం కీలకమైనది.

## 9.3 గ్రామీణ పారిశుధ్ద్యం :

ఆరోగ్యం పారిశుధ్ద్యంతో ముడిపడి ఉంది. పరిసరాల పారిశుధ్యం సవ్యంగా ఉంటే ప్రజల ఆరోగ్యం బాగుంటుంది. పచ్చని చెట్లతో, పంట పొలాలతో పల్లెలు కళకళ లాడుతుంటాయి. స్వచ్ఛమైన గాలి, వెలుతురూ గ్రామీణ ప్రాంతాలలో లభ్యమవుతాయి. కాలుష్యానికి దూరంగా సహజ వాతావరణంలో గ్రామీణ ప్రజలు నివసిస్తుంటారు. అజ్ఞానం, నిర్లక్ష్యం, స్వార్థం అశ్రద్ధతో గ్రామీణ

ప్రజలు వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. పరిసరాలను పాడుచేస్తున్నారు. పరిశుభ్రత విషయంలో పల్లె ప్రాంతాలు చాలా వెనకబడి ఉన్నాయి. ఇంటి చుట్టు పక్కలు చెత్తా చెదారంతో నిండి ఉంటాయి. పశువులు ఉండే స్థలాలైతే అసలు పరిశుభ్రత కనిపించదు. ఇక మరుగుదొడ్ల విషయంలో కూడ అంతంతమాత్రమే. ఊరి బయటకు వెళ్లడానికి గ్రామీణ ప్రజలు అలవాటుపడ్డారు. ప్రభుత్వం సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు ఉన్న వినియోగం లేకపోవటంతో పరిసరాలు కలుషిత మవుతున్నాయి. దీనికి తోడు గ్రామాలలోని చెరువులు, కాలువలు, బావులు, పశువుల్ని కడగటానికి, బట్టలు ఉతకటానికి, స్నానాలు చేయడానికి, మలమూత్ర విసర్జన శుద్ధికి ఉపయోగించడంతో నీటి కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని బలికుంటుంది. అతిసార వ్యాధి, కామెర్లు మొదలైన రోగాలు కాలుష్య నీటి వల్లే కలుగుతాయి. వీధి కుక్కలు, పందుల బెడదకూడ గ్రామాలలో ఎక్కువగానే ఉంటుంది. ఇక దోమలు ఈగలు యద్దేచ్ఛగా తిరుగుతాయి. మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధికి ఇవి కారణమవుతాయి. కుప్పుతెప్పలుగా చెత్తాచెదారం ఉండటంలో పరిసరాలు ప్రమాద కారకులవుతాయి. పారిశుద్ధ్యంలోపానికి ఇవన్నీ కారణాలుగా చెప్పవచ్చు.

## గ్రామీణ ఆరోగ్యం, పారిశుద్యం మెరుగు పడాలంటే క్రింది చర్యలు చేపట్టాలి :

1. గ్రామీణ ప్రజలలో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు కావటం వల్ల ఆరోగ్య పద్ధతులు, సూత్రాల పట్ల ఏ మాత్రం అవగాహన ఉండదు. వయోజన విద్యతోపాటు, జానపద కళారూపాలు, సినిమాలు, వీడియోలు, మొదలైన ప్రచార సాధనాల ద్వారా ఆహరం, దుస్తులు, తాగునీరు, స్నానం, మంచిఅలవాట్లు సాధారణ వ్యాధుల లక్షణాలు వీటి గురించి వివరించాలి.
2. కలుషిత ఆహరం, నీరు వల్ల వివిధ రోగాలు కలుగుతాయి. ఈగలు, దోమలు రోగాల వ్యాప్తిలో కీలకపాత్ర వహిస్తాయి. ముఖ్యంగా మలేరియా, ఫైలేరియా రోగాలకి దోమలే కారణం. వీటి నిర్మూలన విషయంలో ప్రభుత్వం శ్రద్ధ చూపించాలి. ప్రజలను చైతన్యవంతుల్ని చెయ్యాలి.
3. త్రాగునీటి విషయంలో చాల జాగ్రత్త అవసరం. కలుషిత నీటి వల్ల రోగాలు కలుగుతాయి. గ్రామాలలో ఎక్కువగా నూతులు (బావులు), చెరువులు, గుంటలు మీదే ప్రజలు ఆధారపడతారు. వీటిని శుభ్రంగా ఉంచాలి. మురికి నీరు పోవటానికి, నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలి.
4. గ్రామీణ ప్రాంతాలలో బహిరంగ మలవిసర్జనను అరికట్టాలి. మరుగు దొడ్ల నిర్మాణాన్ని ప్రోత్సాహించాలి.
5. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, చనిపోయిన మృతదేహాల్ని పిల్లులు, ఎలుకలు, ఆవులు, కుక్కలు, పందులు మొదలైన మృత కళేబరాలను తొలగించాలి. వీటివల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.
6. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెరుగుపరచాలి. వైద్యులు సకాలంలో వచ్చేటట్లు సరైన వైద్యం అందించేటట్లు చర్యలు తీసుకోవాలి.

ముఖ్యంగా అంటువ్యాధులను అరికట్టాలంటే వాటి వ్యాప్తిని నిరోధించాలి. మానవుల, జంతువుల వ్యర్థ పదార్థాలను, వ్యర్థ జలాలను, ఇతర వ్యర్థాలను సురక్షితంగా పారవేయాలి. రక్షిత మంచి నీటిని ప్రజలకు అందివ్వాలి, పొగరాని పొయ్యిలులను, మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సాహించాలి. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజలలో అవగాహన కల్పించాలి. గ్రామీణ పారిశుధ్యంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. సెప్టిక్, లెట్రిన్‌లు, మురుగు నీటిపారుదల, గుంటలు, చెత్తకుండీలు, పొగరాని పొయ్యిలు, గోబర్‌ప్లాంట్లు రక్షిత మంచినీరు మొదలైన అనేక పారిశుధ్యాన్ని పెంచే పథకాలను చేపట్టింది.

గ్రామీణ ప్రజలు పేదరికంలో బాధపడుతున్నారు. నిరక్షరాస్యతలో జీవిస్తున్నారు. అపరిశుభ్రతతో, అజ్ఞానంతో రోగాల బారిన పడుతున్నారు. అనావృష్టి, కరువుకోరల్లో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా అంటువ్యాధులవల్ల అధిక సంఖ్యాకులు మరణిస్తున్నారు.

ప్రజారోగ్యం పారిశుధ్యం పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటే తప్ప గ్రామీణ ఆరోగ్యం, పారిశుధ్యం మెరుగుపడదు.

## 9.4. గ్రామీణ నిరుద్యోగిత :

ప్రపంచంలో అనేక దేశాలలో ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాలను పట్టిపీడిస్తున్న సమస్యలలో నిరుద్యోగిత ఒకటి. భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ముఖ్యమైనది నిరుద్యోగిత. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల రెండింటిలోను నిరుద్యోగిత సమస్య తీవ్రంగా ఉంది. నిరుద్యోగిత అంటే కేవలం విద్యావంతులలో ఉన్న నిరుద్యోగం కాదు. నిరక్షరాస్యులపై కూడా దీని ప్రభావం ఉంది. నిరక్షరాస్యులు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా ఉండటంవల్ల గ్రామీణ సమాజపై నిరుద్యోగిత సమస్య ప్రభావం అధికంగా ఉంది.

### 9.4.1. నిరుద్యోగిత - నిర్వచనం :

నిరుద్యోగితను నిక్కచ్చింగా నిర్వచించడానికి వీలుకాదు. అది కాలమాన పరిస్థితులను బట్టి మారుతుంది. ప్రొ॥ పిగూ అభిప్రాయములో పని చెయ్యడం ఇష్టంలేకపోవట వలన నిరుద్యోగులుగా ఉన్న వ్యక్తులను నిరుద్యోగులుగా లెక్కించవలెనా లేదా అనేది ఒక సమస్యయైతే, భిక్షకులు (యాచకులు) రోగులు భూస్వాములు, స్త్రీలు, సాధువులు, శారీరక లోపాలున్నవారు నిరుద్యోగులుగా పరిగణించడం అవసరమా, లేదా అనేది మరో సమస్య. అందువలన "శరీరధారుఢ్యం ఉండి కూడ పని చేయడానికి ఇష్టపడిన వ్యక్తులకు పని లేకపోవడమే, ఏదో ఒక వృత్తిని స్వీకరించే అర్హత ఉన్నప్పటికి ఆ వృత్తి లభించకపోవడమే నిరుద్యోగిత.

ఉద్యోగం చేయడానికి తగిన వయస్సు, యోగ్యత, అర్హత, కోరిక ఇవన్నీ వుండి కూడా ఉద్యోగాన్ని పొందలేదని పరిస్థితిని నిరుద్యోగితగా నిర్వచించవచ్చు. సాధారణంగా ఉద్యోగం చేయడానికి అనువయిన వయస్సు 15 నుంచి 60 సంవత్సరాలు భారత రాజ్యంగం ప్రకారం 14 సంవత్సరాలలోపు పిల్లలు ఉద్యోగాలకు అనర్హులు. ఇక 58 లేదా 60 సంవత్సరాల వయస్సు వారు పదవీ విరమణ చేయవలసి ఉంటుంది. కాబట్టి శరీర దారుఢ్యం, అర్హతలు ఉండి ఉద్యోగాన్ని అవసరమైన శిక్షణను పొంది కూడ ఉద్యోగం లేని వారిని నిరుద్యోగులుగా గుర్తించడం జరుగుతుంది. శారీరకలోపాలున్న వార్ని, సోమరులను సాధువులను, యాచకులను, భూస్వాములను, కుటుంబంలోని స్త్రీలను నిరుద్యోగుల లెక్కలలోకి చేర్చలేదు. ఎక్కువ అర్హతలు ఉండి కూడా తాత్కాలికంగా తక్కువ వేతనాలకు అంగీకరించిన ఉద్యోగులను కూడ నిరుద్యోగుల జాబితాలో చేర్చలేదు.

ఒక నిర్ణీత సమయంలో శ్రామిక మార్కెట్లో ఉన్న వేతనస్థాయి వద్ద పని చేయటానికి సిద్ధంగా ఉన్నప్పటికి కూడా ఒక వ్యక్తికి ఉపాధి దొరకనపుడు, అట్టి స్థితిని నిరుద్యోగిత అని చెప్పవచ్చు. కీన్స్ తన ఆదాయ ఉద్యోగితా సిద్ధాంతంలో సమర్థ డిమాండు లేకపోవటం చేత నిరుద్యోగిత ఏర్పడుతుందన్నారు. కాని భారతదేశంలో ఉన్న నిరుద్యోగితకు ముఖ్య కారణం మూలధన వనరుల కొరత, పరస్పర పూరకాల కొరత అని చెప్పవచ్చు.

### 9.4.2. నిరుద్యోగిత - రకాలు :

నిరుద్యోగిత ఏర్పడటానికి గల కారణాలను బట్టి దీనిని వివిధ విధాలుగా వర్గీకరించడం జరుగుతుంది.

1. **నియతకాలిక లేదా ఋతువపరమైన నిరుద్యోగిత** - ఋతువులను బట్టి ఆర్థిక విధానాలలో వచ్చిన మార్పులవల్ల ఏర్పడే నిరుద్యోగితను నియతకాలిక లేదా ఋతుపరమైన నిరుద్యోగిత అంటారు. దీనిలో ప్రధానంగా వ్యవసాయదారులకు సంవత్సరమంతా పని ఉండదు. గృహ నిర్మాణ పనివారు. జనుము, చక్కెర, శీతలపానీయాల తయారీ కర్మాగారాలలో పనివారికి సంవత్సరంలో కొంత కాలం మాత్రమే పని ఉంటుంది. మిగిలిన కాలమంతా వారు పని లేకుండ ఉండటం జరుగుతుంది.

2. **సాంకేతిక నిరుద్యోగిత :** శాస్త్రసాంకేతిక విజ్ఞానం వల్ల ఉత్పత్తి ప్రక్రియలు, విధానాలలో పెను మార్పులొచ్చాయి. పురాతన పద్ధతులకి, విధానాలకి, మంత్రాలకి స్వస్తి చెప్పి ఆధునిక యంత్ర సామగ్రిని విధానాలను అనుసరిస్తున్నారు. ఈ ప్రక్రియలో పాత పద్ధతులలో పని చేసేవారు. ఆధునిక పద్ధతులకు అలవాటు పడే వరకు తాత్కాలిక నిరుద్యోగితను ఎదుర్కొంటారు. దీనినే సాంకేతిక నిరుద్యోగిత అంటారు. ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్ర పరికరాలు, విధానాలవల్ల చాల మంది వ్యవసాయపు పనివారు నిరుద్యోగులవుతున్నారు.

3. **ప్రతి ఘర్షి నిరుద్యోగిత :** నేటి సమాజంలో మార్పులు వస్తున్నాయి. ప్రజల అలవాట్లు అభిరుచులు, పద్ధతులలో సైతం మార్పుకనిపిస్తుంది. వినియోగదారుల కోరిక మేరక వస్తువుల ఉత్పత్తి జరుగుతుంది. దీనివల్ల కొన్ని వస్తువులకు డిమాండ్ తగ్గటం తద్వార ఆ వస్తువులను తయారు చేసే వారిలో నిరుద్యోగిత కలుగుతుంది. వస్తువులు డిమాండ్‌లలో వచ్చిన మార్పులవల్ల ఏర్పడిన తాత్కాలిక నిరుద్యోగానికి ప్రతి ఘర్షి నిరుద్యోగిత అని అంటారు.

4. **నిర్మితిపరమైన నిరుద్యోగిత** - కులవ్యవస్థలో చోటు చేసుకున్న మార్పులు, వారసత్వపు వృత్తులలో మార్పుల వల్ల చిన్న తరహ, కుటీర పరిశ్రమలు విచ్ఛిన్నం కావటం, గ్రామీణులు అధికంగా పట్టణాలకు, నగరాలకు తరలివెళ్లటం వల్ల జనాభా పెరుగుదల సామాజిక ఆర్థిక నిర్మితులలో మార్పుల వల్ల నిరుద్యోగిత అధికమవుతుంది. దీనిని నిర్మితిపరమైన నిరుద్యోగిత అంటారు.

5. **చక్రీయ నిరుద్యోగిత :** వాణిజ్య, వ్యాపార, వర్తకరంగంలో కూడా నిరుద్యోగిత ఏర్పడుతుంది. సమృద్ధి కాలంలో వినియోగదారుల కొనుగోలు శక్తి ఉండటంతో. వస్తువుల డిమాండ్ పెరగటం తద్వారా ఎక్కువ ఉద్యోగాలు రావటం జరుగుతుంది. అయితే కొనుగోల శక్తి సన్నగిల్లినపుడు డిమాండ్ కంటే సప్లయి ఎక్కువగా ఉంటుంది. దాంతో కర్మాగారలు మూతపడతాయి. ఫలితంగా ఉద్యోగాల లేకపోవటంలో నిరుద్యోగిత ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటే నిరుద్యోగిత తగ్గుతుంది. లేకుంటే ఎక్కువవుతుంది. ఇట్లా చక్రీయంగా కలిగే నిరుద్యోగితను చక్రీయ నిరుద్యోగిత అంటారు.

6. **అనైచ్ఛిక నిరుద్యోగిత / అపూర్ణ ఉద్యోగిత** - అసలు వేతనం కంటే తక్కువ వేతనానికి పని చేయడానికి వ్యక్తి సిద్ధపడితే ఆ పరిస్థితిని అపూర్ణ ఉద్యోగిత అంటారు. దీనిలో వ్యక్తులు ఆసక్తితో సంపూర్ణ సామర్థ్యంతో పని చేయలేని స్థితి కనిపిస్తుంది. వ్యక్తులు సరియైన ఉద్యోగాన్ని చేపట్టలేనప్పుడు పాక్షిక ఉద్యోగాలనుగాని, అల్పమయిన ఉద్యోగాలను కాని చేయవలసి ఉంటుంది. దీనినే ప్రచ్ఛన్న నిరుద్యోగిత అని కూడ పేర్కొంటారు.

నిరుద్యోగితను ప్రధానంగా గ్రామీణ, పట్టణ నిరుద్యోగితగా వర్గీకరించవచ్చు. గ్రామీణ నిరుద్యోగితను ముఖ్యమైనది. ప్రచ్ఛన్న, పాక్షిక నిరుద్యోగిత ప్రచ్ఛన్న నిరుద్యోగితకు ప్రధాన కారణం బ్రిటీష్ వారి స్వేచ్ఛా వ్యాపారం. దీని ఫలితంగా కులవృత్తులు పోయాయి. విదేశీ వస్తువులను దిగుమతి చేసుకున్నారు. కులవృత్తులు మూలనపడగ, అన్ని వృత్తులవారు వ్యవసాయ కూలీలుగా, ఉపాంత రైతులుగా మారటం అవసరాన్నిమించి భూమిపై శ్రామిక ఒత్తిడి అదనపు శ్రామికుల ఉపాందభౌతిక ఉత్పాదకత శూన్యమైనది. దేశంలో సేద్యపు భూమిలో దాదాపు 75 శాతం భూమి వర్షాధారం కావటం చేత సంవత్సరానికి దాదాపు 3,4 నెలలు వ్యవసాయ దారులు నిరుద్యోగులుగా ఉండటం పాక్షిక నిరుద్యోగితకు ముఖ్యకారణం.

### 9.4.3. నిరుద్యోగిత కారణాలు :

గ్రామీణ నిరుద్యోగిత వివిధ కారణాల వల్ల కలుగుతుంది.

1. **కుటీర పరిశ్రమల విచ్ఛిన్నత** - గ్రామీణ ప్రజల పాలిట వరంగా ఉపాధి సౌకర్యాలను కుటీర పక్రియలు కల్పించేవి. కాని పారిశ్రామికీకరణతో ప్రాచీన గ్రామీణ కుటీర పరిశ్రమల కుంటుపడ్డాయి. దీనివల్ల సాంప్రదాయంగా వివిధ వృత్తులలో ఉన్న

6

వాళ్లు తమ ఉపాధి అవకాశాలను కొల్పోయ్యారు. వీరికి మరెక్కడ ఉద్యోగాలు లభించడం లేదు.

2. **లోప భూయిష్టమైన విద్యా విధావం** - గుమాస్తాల తమారీకై అనువుగా ఉండె బ్రిటీష్ పద్దతిని పూర్తిగా మార్పులు చేయకుండ కొనసాగిస్తున్నారు. వృత్తి విద్యకు ప్రాదాన్యత లేదు - సామాజిక ఆర్థిక అవసరాలను ప్రస్తుత విద్యా విధానం తీర్చలేకపోతుంది. ప్రతిభావంతులు పుష్కలంగా ఉన్న వీరిని వినియోగించుకోవటం లేదు. గ్రామీణ ప్రజలలో వృత్తి విద్యను ప్రోత్సహించటం లేదు.

3. **అభివృద్ధికి నోచుకొని గ్రామీణరంగం** - పల్లెల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుంది. మన ప్రణాళికలు నగరాలు, పట్టణ ప్రాంతాలలో పారిశ్రామిక అభివృద్ధి మీదనే వాటి దృష్టిని కేంద్రికరించడంతో గ్రామీణ ప్రాంతాలు వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి నోచుకోలేదు. దీనివల్ల గ్రామీణ రంగం చెప్పకోదగ్గ ప్రగతిని సాధించలేదు.

4. **వ్యక్తిగత కారణాలు** : వ్యక్తిగత కారణాలు కూడ నిరుద్యోగులు కావడానికి దారి తీస్తాయి. శారీరిక లోపాలున్నవారు పని పట్ల అయిష్టత, సోమరితనం ఉన్నవాళ్లు ఉద్యోగం పట్ల శ్రద్ధ చూపకపోవడంతో నిరుద్యోగులుగా మారుతున్నారు. కర్మాగారాలలో, గనులలో ప్రమాదాల మూలంగా వికలాంగులైన వాళ్లు ఇతరిత్రా పని చేయడానికి సంసిద్ధులైన వారికి ఉద్యోగం లభించదు.

5. **అధిక జనాభా** - నానాటికి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న జనాభా భూతం. నిరుద్యోగులను కబళిస్తుంది. నిరుద్యోగులు సంఖ్య అపారంగా పెరగడానికి దోహదపడుతుంది. పంచవర్ష ప్రణాళికలను అమలు జరుగుతున్న ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ఇంకా సమస్యకి పరిష్కారం లేకపోవడానికి పెరుగుతున్న జనాభాయే కారణం.

6. ఆధునీకరణ పేరుతో వ్యవసాయాన్ని యంత్రీకరణ చెయ్యటంతో అనేక మంది గ్రామీణులు జీవనోపాధిని కోల్పోతున్నారు. కుటుంబ కమతాలలో యంత్రీకరణ వలన ఆదాయాలు రాకపోగా నిరుద్యోగిత పెరుగుతున్నది.

7. గ్రామాలలో దీర్ఘకాలిక సామాజిక వనరుల ఏర్పాటుకు తద్వారా ఉపాధి పెంపుదలకు ప్రభుత్వ పథకాలు జవహర్ రోజుగార్ యోజన, పనికి ఆహారపథకం, మొదలైన గ్రామీణ అభివృద్ధి పథకాలకు మంజూరు చేయబడిన విధుల దుర్వినియోగం వల్ల కూడ ఉద్యోగిత పెరగడం లేదు.

### 9.4.4. నిరుద్యోగిత - పరిణామాలు :

నిరుద్యోగిత వల్ల ఎన్నో దుష్పరిణామాలు కలుగుతాయి. దీని ప్రభావం వ్యక్తి, కుటుంబంతోపాటు సమాజం మీద కూడా ఉంటుంది.

1. **వైయక్తిక అవ్యవస్థత** - నిరుద్యోగం వల్ల వ్యక్తి జీవిత వ్యవస్థ దెబ్బతింటుంది. తాను ఆశించినది పొందలేదనే బాధతో కృంగి పోతాడు. విద్య, శిక్షణ పూర్తి అయిన తర్వాత ఉద్యోగం రాకపోతే ఆత్మవిశ్వాసాన్ని కొల్పోతాడు. దీనిలో మానసికంగా, నైతికంగా పతనమయ్యే ప్రమాదముంది. ప్రతిభా సామర్థ్యం ఉన్న ఉపాధి లేనందుకు తనలోతాను కుమిలిపోతాడు. ఫలితంగా నిరాశవాదిగా విప్లవవాదిగా తయారయ్యే అవకాశముంది. దుర్వసవాలకు లోనుకావడం, కొన్ని సందర్భాలలో ఆత్మహత్యకు సైతం పాల్పడతాడు.

2. **కుటుంబ అవ్యవస్థత** - నిరుద్యోగం వల్ల వ్యక్తి శారీరిక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. దీని ప్రభావం వ్యక్తి కుటుంబ మీద ఉంటుంది. తనకే ఉపాధి లేనముడు తన మీద ఆధారపడిన కుటుంబ పరిస్థితి ఘోరంగా ఉంటుంది. అప్పులపాలవుతారు. ఆత్మహత్యలకు పాల్పడతారు. నైతికంగా దిగజారతారు. సమాజంలో అంతస్తును కొల్పోతారు. జీవితం భయంకరంగా, బాధకరంగా భారంగా గడపటం జరుగుతుంది. వ్యక్తి నిరుద్యోగి కావడంతో కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. అవ్యవస్థతకు లోనవుతుంది.

**3. సముదాయక అవ్యవస్థత :** నిరుద్యోగిత వల్ల వ్యక్తి గతంగా, కుటుంబ పరంగానే కాకుండా సముదాయ మొత్తం మీద నష్టాన్ని కలిగిస్తుంది. సామర్థ్యం ఉండి కూడ వ్యక్తి పని లేని స్థితి వల్ల జాతీయ ఉత్పత్తి కుంటుపడుతుంది. దీనివల్ల జాతీయ ఆదాయానికి నష్టం కలుగుతుంది. నిరుద్యోగి సోమరిగా ఉండటం సమాజానికి ప్రమాదం. జీవితంపై విరక్తి కలిగినప్పుడు సమాజ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే ప్రమాదం ఉంది. నిరాశా, నిస్పృహ, నిస్తేజ, నిర్వీర్యంతో నిరుద్యోగ యువత కృంగి, కుమిలి పోవటం సమాజంలో ఆశాంతికి, అంధోళనలకి అలజడులకి దారి తీస్తుంది. ఫలితంగా సముదాయక అవ్యవస్థత ఉత్పన్నమవుతుంది.

## 9.4.5 నిరుద్యోగిత - పరిష్కార మార్గాలు :

గ్రామీణ సమాజంలో నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించవలెనంటే ప్రభుత్వం, ప్రజలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు పట్టుదలతో చిత్తశుద్ధితో కృషి చేయ్యాలి. క్రింది పరిష్కర మార్గాలు సమస్య పరిష్కారానికి ఉపకరిస్తాయి.

1. సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి.
2. పెద్ద తరహ, చిన్న తరహ, సేద్యపు నీటి ప్రాజెక్టులను నిర్మించాలి. దీని ద్వారా భూసారాన్ని అధికం చేసే ఆధునిక పద్ధతుల వల్ల విస్తృతమైన సాగుబడి వల్ల కూరగాయలు, పూలు, పండ్ల తోటల పెంపకం వల్ల ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు.
3. ప్రకృతి పై ఆధారపడకుండ వ్యవసాయన్ని అభివృద్ధి చేసే మార్గాలని అన్వేషించాలి. వ్యవసాయన్ని పూర్తిగా ఆధునీకరణ చేయ్యాలి.
4. చిన్న తరహ, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి.
5. ప్రాంతీయ అసమానతలను తొలిగించాలి. వ్యవసాయ ఆధారపరిశ్రమలను స్థాపించాలి.
6. కోళ్లు, మేకలు, గొర్రెలు పెంపకాన్ని ప్రోత్సహించాలి. వారికి సాయం అందించాలి.
7. పంటలు భీమా పథకాన్ని అమలుచేయ్యాలి.
8. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పరచాలి.
9. రవాణా సౌకర్యాలను కల్పించాలి.
10. నిరుద్యోగ యువతకు వృత్తి విద్యలలో శిక్షణ నివ్వాలి.

## 9.5 సారాంశం :

భారతదేశంలో 75 శాతం జనాభా గ్రామాలో నివసిస్తున్నారు. 40 శాతం గ్రామీణ ప్రజలు దారిద్యరేఖ దిగువన ఉన్నారు. గ్రామీణులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటిలో ప్రధానమైనవి ఆరోగ్యం, పారిశుద్ధ్యం మరియు నిరుద్యోగిత.

పేదరికం అజ్ఞానం వల్ల గ్రామీణ ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అనావృష్టి, కరువు, అంటువ్యాధుల వల్ల గ్రామీణ ప్రజలు ఎక్కువగా మరణిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్న నిధులు, సిబ్బంది కొరతవల్ల సరైన వైద్య సేవలు లభ్యం కావడం లేదు. అరకొర చర్యలు సమస్యలను పరిష్కరించకోకపోవడంతో జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం ప్రారంభమైంది. గ్రామీణ ప్రజలకిది నిజంగానే ఆశాజ్యోతి.

గ్రామీణ ప్రాంతాలలో ప్రధానంగా నిరుద్యోగం, ప్రచ్ఛన్న నిరుద్యోగం నెలకొన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఆశించినంత వేగంగా ఉపాధి లభించడంలేదు. గ్రామీణ యువతలో నిరాశ నిస్పృహలు తొలగాలంటే ఉపాధి అవకాశాలు పెంచాలి. గ్రామీణ అభివృద్ధి పథకాలు అమలును చిత్తశుద్ధితో వేగవంతం చెయ్యాలి.

## 9.6 ముఖ్య పదాలు :

ప్రాథమిక అవశ్యకాలు
జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం
ప్రచ్ఛన్న నిరుద్యోగిత
పాక్షిక నిరుద్యోగిత

## 9.7 నమూనా ప్రశ్నలు :

1. ఆరోగ్యాన్ని నిర్వచించి, ఆరోగ్యాన్ని నిర్ధారించే అంశాలను తెల్పండి.
2. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై వ్యాసాన్ని వ్రాయండి.
3. గ్రామీణ ఆరోగ్య సమస్యలను ముఖ్యమైన వాటిని వివరించండి.
4. జాతీయ ఆరోగ్య గ్రామీణ పథకం గురించి తెలియజేయండి.
5. గ్రామీణ పారిశుద్ధ్యం మెరుగు పడటానికి సూచనలివ్వండి.
6. నిరుద్యోగితను నిర్వచించి వీటి రకాలను వివరించిండి.
7. గ్రామీణ నిరుద్యోగితకు కారణాలను, పరిష్కార మార్గాలను తెలియజేయండి.

## 9.8 చదువదగిన ప్రశ్నలు :

1) Rural Sociology in India - Desai A.R.
2) Village Development in India - Madan
3) Rural Development institution and strategies - Jain SC

డా॥ జి.వి. రమణ

# భారతదేశంలో గ్రామీణాభివృద్ధి

## 10.0 లక్ష్యం :

గ్రామీణాభివృద్ధి అంటే ఏమిటి? భారతదేశంలో దాని ఆవశ్యకత, స్వాతంత్ర్యానికి పూర్వం - గ్రామీణాభివృద్ధి, స్వాతంత్రానంతర కాలంలో గ్రామీణాభివృద్ధి - గ్రామీణాభివృద్ధికి సంబంధించి వివిధ కార్యక్రమాల గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## విషయక్రమం :

10.1 పరిచయం
10.2 గ్రామీణాభివృద్ధి - నిర్వచనం
10.3 గ్రామీణాభివృద్ధి - ఆవశ్యకత
10.4 స్వాతంత్ర్యానికి పూర్వం గ్రామీణాభివృద్ధి
10.5 స్వాతంత్ర్యానంతర కాలంలో గ్రామీణాభివృద్ధి
10.6 గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు
10.7 సారాంశం
10.8 ముఖ్య పదాలు
10.9 నమూనా ప్రశ్నలు
10.10 చదువదగిన గ్రంథాలు

## 10.1 పరిచయం :

భారతదేశంలో మూడవ వంతు ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. వ్యవసాయమే వీరి ప్రధాన వృత్తి. అధిక జనాభా గ్రామ వాసులే కాబట్టి గ్రామీణాభివృద్ధినే దేశాభివృద్ధిగా పేర్కొనవచ్చు. దేశాభివృద్ధిలో గ్రామాలు కీలకపాత్ర వహిస్తాయి. పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక సామాజిక అసమానతల వల్ల గ్రామీణ ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. వీటిని పరిష్కరిస్తే తప్ప గ్రామీణాభివృద్ధి సాధ్యపడదు. గ్రామీణాభివృద్ధి ప్రాముఖ్యాన్ని చాలాకాలం కిందటే గుర్తించారు. స్వాతంత్ర్యానికి పూర్వమే గ్రామీణాభివృద్ధికి అంకురార్పణ జరిగింది. వివిధ వ్యక్తులు, సంస్థలు అనేక ప్రయత్నాలు చేసి వివిధ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామీణాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అనేక పథకాలను రూపొందించి అమలు చేస్తుంది. సమగ్ర గ్రామీణాభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ప్రణాళికల్ని ఏర్పరుస్తుంది. ప్రాంతీయ అభివృద్ధి విధానం (Area Development Approach) సంస్థాపరమైన అభివృద్ధి విధానం (Institutional Development Approach) ప్రధానంగా ఈ రెండు విధానాలతో గ్రామీణాభివృద్ధి సాధించటానికి వీటిని ఏకకాలంలో అనుసరించడం ప్రారంభమయింది. ఈ విధానాలు సముదాయక వికాస కార్యక్రమం రూపంలో అమలు అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా అనేక సముదాయ వికాస బ్లాకులను నిర్ణయించి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పర్యవేక్షణలో పనులను చేపట్టారు. 1952లో ప్రారంభమైన సముదాయ వికాస కార్యక్రమం ఒక సమగ్ర కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. గ్రామీణ ప్రజారోగ్యం, విద్య, మహిళ, శిశు సంక్షేమం, వ్యవసాయం గ్రామీణ పరిశ్రమలు, రవాణా,

భావప్రసారాలు వంటి గ్రామీణ జీవితానికి సంబంధించి వివిధ అంశాలను ఏకకాలంలో చేపట్టడం జరిగింది. గ్రామీణాభివృద్ధికి వివిధ పథకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

## 10.2 గ్రామీణాభివృద్ధి - నిర్వచనం :

సమాజ, ఆర్థిక శాస్త్రజ్ఞుల గ్రామీణాభివృద్ధిని వివిధ విధాలుగా నిర్వచించారు.

గ్రామీణ పేద ప్రజల భౌతిక, మానవ వనరులను ఉపయోగించుకొని జీవన పరిస్థితులను మెరుగు పరచడానికి తగిన అవకాశం కల్పించడమనేదే గ్రామీణాభివృద్ధి అనే ప్రక్రియలో కీలకమైన అంశంగా పార్థసారధి భావించాడు.

మైకెల్ టొడారో అభిప్రాయంలో గ్రామీణాభివృద్ధి ప్రక్రియలో ప్రధానాంశాలు

1. జీవన ప్రమాణాల్ని బాగుచేయడం - విద్య, ఉద్యోగిత, పౌష్టికత ఆరోగ్యం, గృహ వసతి అనేక ఇతర సామాజిక సేవలు.
2. గ్రామీణ ఆదాయాల పంపిణీలో అసమానతల తొలగింపు, ఆర్థిక అవకాశాలకు సంబంధించి గ్రామాల, నగరాల మధ్య సమతౌల్యం సాధించడం.
3. అభివృద్ధిని పోషించి వేగవంతం చేయగల శక్తిని సమకూర్చడం.

గ్రామీణ పేద ప్రజల ఒక నిర్దిష్ట సమూహపు ఆర్థిక, సామాజిక జీవితాన్ని మెరుగు పరచడానికి ప్రత్యేకంగా రూపొందించిన వ్యూహమే గ్రామీణాభివృద్ధి వ్యూహమని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయ పడింది.

గ్రామీణాభివృద్ధి అంటే గ్రామ ప్రాంతాల అభివృద్ధికి తగిన వ్యూహాలు, విధానాలు, పథకాలు అని గ్రామ ప్రాంతాలలో వ్యవసాయం, అడవుల పెంపకం, చేపల పెంపకం, హస్త కళలు పరిశ్రమలు, సామాజిక ఆర్థిక అవసరాల కల్పన వంటి కార్యక్రమం సామాజిక ఆర్థిక అవసరాల కల్పన వంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం వీటి అంతిమ లక్ష్యమని, లభ్యమవుతున్న భౌతిక, మానవ వనరులను సంపూర్ణంగా వినియోగించుకొని ప్రజలకు అధిక ఆదాయాలు కలిగేటట్లు, జీవన పరిస్థితులను చక్కదిద్దమని అంకర్ గ్రామీణాభివృద్ధిని నిర్వచించారు.

వివిధ నిర్వచనలను పరిశీలించాక గ్రామీణాభివృద్ధికి క్రింది అంశాలు ముఖ్యమైనవిగా గుర్తించవచ్చు.

1. వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాలను అభివృద్ధి పరచడం.
2. గ్రామీణ పరిశ్రమలను అభివృద్ధి చెయ్యడం.
3. లభ్యమవుతున్న భౌతిక, మానవ వనరులను సంపూర్ణగా వినియోగించుకోవడం.
4. పర్యావరణ పై పట్టు సాధించడం.
5. గ్రామీణ పేద ప్రజల అభివృద్ధి పై దృష్టి.
6. గ్రామీణ ప్రజల ఆదాయాలను, జీవన స్థితిగతులను మెరుగు పరచడం.

## 10.3 గ్రామీణాభివృద్ధి - ఆవశ్యకత :

కింది కారణాల వల్ల భారతదేశంలో గ్రామీణాభివృద్ధి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. గ్రామీణాభివృద్ధి అనేది కీలకమైన అంశంగా మారింది.

1. గ్రామీణ ప్రాంతాలలో అధిక జనాభా నివసించడం.
2. దారిద్ర రేఖకు దిగువ జీవితాన్ని గడిపేవారు గ్రామాలలో అధికంగా ఉండటం.
3. నిరుద్యోగిత, అల్పోద్యోగితలు గ్రామాలలో ఉండడం.
4. వ్యవసాయ రంగంలో భూమిలేని శ్రామికులు, సన్నకారు, చిన్న కారు రైతులు పరిస్థితి అధ్వానంగా ఉండటం.
5. పరిశ్రమలు గ్రామీణా ప్రాంతాలలో లేకపోవడం.
6. లభ్యమవుతున్న వనరులను సరిగా సక్రమంగా వినియోగించుకోకపోవడం.
7. మహిళ శిశు సంక్షేమం లేకపోవడం.
8. గ్రామీణ ప్రాంతాల కనీస సౌకర్యాలు లేకపోవడం.

పై కారణాలవల్ల భారతదేశంలో గ్రామీణాభివృద్ధి ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## స్వాతంత్రానికి పూర్వం గ్రామీణాభివృద్ధి :

స్వాతంత్రానికి పూర్వం గ్రామీణాభివృద్ధి కోసం ప్రముఖ నాయకులు స్థాపించిన స్వచ్ఛంద సంస్థలు అంకిత భావంతో అనేక కార్యక్రమాలు చేపట్టి గ్రామ పునర్నిర్మాణానికి పూనుకున్నారు.

వీటిలో ముఖ్యమైనవి.

1. రవీంద్రనాథ్ ఠాగూర్ - శ్రీనికేతన్ గ్రామీణ పునర్నిర్మాణ పథకం.
2. స్పెన్సర్ హచ్ - మార్తాండం ప్రయోగం
3. పి.ఎల్. బ్రెయిన్ - గురుగామ్ జిల్లా అభివృద్ధి కార్యక్రమం
4. బరోడాలోని గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమం
5. టంగుటూరు ప్రకాశం పంతులు - ఫిర్కా అభివృద్ధి పథకం.

**1. శ్రీనికేతన్ ప్రయోగం** - శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ 1908 లోనే పశ్చిమ బెంగాల్‌లోని కలింగ్రామ్ పరిగణాలోని ఎనిమిది గ్రామాలలో గ్రామ పునర్నిర్మాణ కేంద్రాలను ప్రారంభించారు. తరువాత 1921లో ఠాగూర్ గ్రామీణ జీవనంలో సరికొత్త మార్పు కోసం శాంతినికేతన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ పథకానికే శ్రీనికేతన్ గ్రామ పునర్నిర్మాణ పథకం అని పేర్కొంటారు. ఆర్థిక, సామాజికాభివృద్ధిని సాధించడమే. ప్రథమ లక్ష్యంగా ఠాగూర్ భావించారు. గ్రామీణ సమస్యలను అధ్యయనం జరిపి వాటి పరిష్కారానికి పూనుకోవడం దీనిలో గమనించవచ్చు. వ్యవసాయం, పశుపోషణ, పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి వాటికి సహకారం అందివ్వడం, చేతి వృత్తులను ప్రోత్సహించడం రాత్రి పాఠశాలలతో పాటు భోజన వసతులున్న పాఠశాలలు కూడా స్థాపించారు. పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ పెరటి తోటలు వడ్రంగి వంటి వృత్తులతో శిక్షణ సౌకర్యాలు కల్పించారు. టాగూర్ గ్రామీణ పునర్నిర్మాణానికి ఎనలేని ప్రాధాన్యత నిచ్చారు.

**మార్తాండం ప్రయోగం** - వై.యమ్. సి.ఏ కు చెందిన స్పెన్సర్ హెచ్ 1921 లో ట్రావెన్ కూర్‌లోని మార్తాండం గ్రామంలో గ్రామీణ పునర్నిర్మాణ పథకాన్ని ప్రారంభించాడు. ఈ పథకం కొన్ని సూత్రాలపై ఆధారపడి పని చేస్తుంది. వాటిలో ప్రధానమైనవి.

1. గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాలన్నీ అక్కడి ప్రజలే రూపొందించుకోవాలి. కార్యకర్తలు కేవలం మార్గ దర్శకులుగా మాత్రమే ఉంటారు.

3. ప్రతి పథకానికి ఆధ్యాత్మికతే ఆధారం కావాలి.
4. కుటీర పరిశ్రమలు, బుట్టలు, చాపలు అల్లడం, తేనెటీగలు, కోళ్ల పెంపకం వంటి వాటిని చేపట్టే పథకాలలో చేర్చాలి.
5. పథకం అమలులో అన్ని స్థాయిలలో నిరాడంబరతను పాటిస్తూ తక్కువ ఖర్చుతో ఆశించిన ఫలితాలను సాధించాలి.

వివిధ అభివృద్ధి పనులను హనీక్లబ్స్, ఎగ్‌క్లబ్స్, బుల్ క్లబ్స్, వీవర్ క్లబ్స్ మొదలైన క్లబ్బుల ద్వారా నిర్వహించడానికి ప్రయత్నించడం జరిగింది. వీటి ద్వారా గ్రామీణ ప్రజలకు కూరగాయలు పండించడం, ఊరగాయలు తయారు చేయడం, బెల్లం తయారీ, అమ్మడం వంటి అంశాలలో శిక్షణనిస్తారు.

**గుర్‌గావ్ ప్రయోగం** - పంజాబ్‌లోని గుర్‌గావ్‌లో ఒక గ్రామీణాభివృద్ధి కార్యక్రమాన్ని బ్రిటీష్ ప్రభుత్వోద్యోగి ఎఫ్.ఎల్ బ్రెయన్ ప్రారంభించాడు. ఇది "గుర్‌గావ్ పథకంగా పేరు పొందింది. గ్రామీణలే స్వయంగా తమ సమస్యల పట్ల, అభివృద్ధి పట్ల శ్రద్ధ తీసుకోవాలని అప్పుడే గ్రామీణాభివృద్ధి సాధ్యపడుతుందని బ్రెయిన్ భావించాడు. గ్రామ స్థాయిలో గ్రామోద్ధరణకు శ్రమిస్తున్న గైడ్‌లకు తగిన శిక్షణ ఇవ్వడానికి గుర్‌గార్ పథకం ఏర్పాటు చేసింది. సహకార సంఘాల అభివృద్ధి, వ్యాక్సీ నేర్‌లు గ్రామాలలో తనిఖీకి రావడం మేలు రకపు విత్తనాలు అమ్మకం, వ్యవసాయ పదర్శన నివ్వడం, పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడం వ్యాధులకు టీకాలు వేయ్యడం, సహకార ప్రాతిపదికన కమతల సంఘటనను ఈ పథకం చేపడుతుంది. సహకార పద్ధతి ఆధారంగా వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

**బరోడాలోని గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమం** - మహరాజా శివాజీరావ్ 1890లో బరోడాలో గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట్లో దీనిని కొన్ని గ్రామాలకే పరిమితం చేశారు. 6 నుంచి 11 సంవత్సరాల వయసుగల పిల్లలకు విద్య తప్పనిసరి చేయడం దీని ప్రధాన లక్ష్యం. గ్రామాలలో గ్రంథాలయాలు నెలకొల్పి గ్రామీణులు వాటిని సద్వినియోగం చేసుకొనే విధంగా ప్రోత్సాహించారు. నీటి పారుదల సౌకర్యాలను, భూసార పటిష్ఠ చేయడం, వ్యవసాయోత్పత్తులను పెంచడం ఈ కార్యక్రమాలను జరిగాయి. ఈ కార్యక్రమం గ్రామ పంచాయితీ, తాలుకా, జిల్లా బోర్డులను నెలకొల్పడంలో ఆసక్తి కనబరిచింది. ఈ ప్రయోగంలో గ్రామ స్థాయి కార్యకర్తలు ఎవరూలేరు. గ్రామాలలోని పంచాయితీలు, సహకార సంఘాలు గ్రంథాలయాలు పాఠశాలల అభివృద్ధి కార్యకలాపాలకు కేంద్రాలుగా పనిచేశాయి.

**ప్రకాశం పంతులు, ఫిర్కా అభివృద్ధి పథకం** - ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 1946లో మద్రాస్ (చెన్నై) రాష్ట్రంలోను 34 ఫిర్కాలలో ఫిర్కా అభివృద్ధి పథకాన్ని ప్రారంభించారు. గ్రామ ప్రజల సమిష్ఠ కృషి ద్వారానే స్వయం సమృద్ధత సాధించడమే దీని ముఖ్యోద్దేశ్యం. 1950 ఏప్రిల్ 1న ఈ పథకం ఇతర ఫిర్కాలకి విస్తరించడం జరిగింది. వివిధ సమస్యలను స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పరిష్కరించాలన్నదే లక్ష్యంగా పథకం కృషి చేసింది. గ్రామీణ నీటి సరఫరా, గ్రామ పంచాయితీలు సహకార సంఘాల ఏర్పాటు భావప్రసార సదుపాయాలు, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటివి స్వల్పకాలిక కార్యక్రమాలుగా వ్యవసాయం, నీటి పారుదుల, వైద్యం పశు గ్రామీణాభివృద్ధి పరిశ్రమలు వ్యవసాయం మొదలైనవి దీర్ఘకాలిక పథకాలలోను ఉన్నాయి. వివిధ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను ఫిర్కాడెవలప్‌మెంట్ కమిటీ ద్వారా నిర్వహించడం జరిగింది. ఈ కమిటీ ఫిర్కా డెవలప్‌మెంట్ అధికారి ప్రత్యక్ష పర్యవేక్షణలో పని చేసేది.

## 10.5 స్వాతంత్ర్యానంతర కాలంలో గ్రామీణాభివృద్ధి :

స్వాతంత్ర్యానంతరం గ్రామీణాభివృద్ధి పట్ల ప్రభుత్వం దృష్టి సారించింది. కేంద్ర స్థాయిలోని వ్యవసాయం, సహకారం ఆరోగ్యం, పశుగణాభివృద్ధి, విద్య మొదలైన శాఖలు విడివిడిగా నిర్వహించే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయ పరచడం

వల్ల సత్ ఫలితాలు కలుగుతాయని భావించడం వల్ల సముదాయ వికాస ప్రణాళికను ఏర్పరిచింది. పైన పేర్కొన్న శాఖల సంఘటిత కృషి ద్వారా గ్రామీణాభివృద్ధి సాధించవచ్చని గుర్తించడం జరిగింది. దేశంలో ఉన్న అపారమైన మానవ వనరుల వినియోగం, ప్రజలలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించడం, సామాజిక పరివర్తనను తీసుకురావడం సమాజ వికాస ప్రణాళిక ప్రధానోద్దేశం గ్రామీణ ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి కరమైన మార్పును తీసుకురావడానికి సమాజ వికాస కార్యక్రమము ఒక ముఖ్యసాధనంగా ప్రథమ పంచవర్ష ప్రణాళికలో సమాజ వికాస కార్యక్రమాన్ని గురించి పేర్కొన్నారు.

సముదాయ వికాస కార్యక్రమాన్ని అక్టోబర్ 2, 1952లో దేశ వ్యాప్తంగా ప్రారంభించడం జరిగింది. తొలిసారి ఈ కార్యక్రమం క్రింద 55 సాముదాయక పథకాలను ప్రారంభించారు. ప్రతి ప్రాజెక్టు సుమారు 1300 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి 300 గ్రామాలకు విస్తరిస్తూ రెండు లక్షల జనాభా కల్గిన ప్రాంతాలకు పరి వ్యాప్తమైన అధికార క్షేత్రాన్ని కల్గి ఉండేది. దీనిని 1958లో సవరించారు. సాముదాయ అభివృద్ధి బ్లాకు 100 గ్రామాలను కలిగి 400-500 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణత కలిగి ఒక లక్ష జనాభా ఉండేది. 1977వ సంవత్సరం ప్రకారం ఈ సాముదాయక బ్లాకుల సంఖ్య 5208కి పెరిగింది. ఈ బ్లాకుల కింద 47 కోట్ల జనాభా ఆరు లక్షల గ్రామాలు ఉండేవి.

సముదాయ వికాస కార్యక్రమాలకు అవసరమయ్యే నిధుల్ని మంజూరు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. మూడో పంచవర్ష ప్రణాళిక కాలం నాటి వరకూ ఈ విధంగా జరిగింది. అయితే నాల్గవ పంచవర్ష ప్రణాళిక బదిలీ చేయడం వల్ల నిధుల్ని రాష్ట్రాలే మంజూరు చేయాలి. కార్యక్రమాల పరిపాలనా వ్యవస్థ రాష్ట్రస్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ బ్లాకు స్థాయిలోనూ గ్రామ స్థాయిలోనూ ఉంటాయి. కార్యక్రమాలన్నీ బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. బి.డి.ఓ. క్రింద ఆయా శాఖలు వ్యవసాయం, ప్రజారోగ్యం, సహకారం, విద్య పరిశ్రమలు, ఇంజనీరింగ్, స్త్రీ మహిళాభివృద్ధి మొదలైన గ్రామీణ శాఖల విస్తరణాధికారులుంటారు. వీరితో పాటు ప్రతి పది గ్రామాలకు ఒక్కొక్కరు చొప్పున గ్రామ సేవకులు (గ్రామ స్థాయి సిబ్బంది) ఉంటారు. జిల్లా అభివృద్ధి కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడిగా ఉంటాడు. సముదాయ వికాస కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు పర్యవేక్షణ చేస్తు ఉంటాడు. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి కేంద్ర స్థాయిలో ప్రధాన మంత్రి సముదాయ వికాస కార్యక్రమాల పరిపాలనా అజమాయిషీలు చూడటంతో ప్రధానమైన పాత్రను నిర్వహిస్తూ ఉంటారు.

సముదాయ వికాస కార్యక్రమాలు వల్ల ప్రజలలో కొంత చైతన్యం కలిగింది. ఆశించిన స్థాయిలో ప్రజల భాగస్వామ్యం లేకపోవడం ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో దీనిని పూర్తిగా విస్తరించలేని పరిస్థితి కలిగింది. ఇదే దశలో 1953లో భారత ప్రభుత్వం జాతీయ విస్తరణ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. వాస్తవానికి సముదాయ వికాస కార్యక్రమాలని, జాతీయ విస్తరణ కార్యక్రమాలని పెద్దగా తేడా లేదు.

సముదాయ వికాస కార్యక్రమాల వల్ల పెద్దగా ప్రయోజనం కలగలేదు సరికదా ధనికులు మరింత ధనికులుగా పేదవారు మరీ పేదవారుగా ఉన్నారు. సాంకేతిక రంగంలోని లోపాలు కూడ అభివృద్ధికి కొంత ఆటంకంగా ఉన్నాయి. ప్రజలలో మొదటిలో ఉన్నంత చైతన్యం లేకపోవడం, వారు భాగస్వామ్యులుగా ఉండకపోవడం, భావ ప్రసార సాధనాల వినియోగం లోపం వల్ల సమాచార లోపం ఎక్కువగా ఏర్పడింది. వీటివల్ల సాముదాయక వికాస కార్యక్రమంలో పై నుండి గ్రామ స్థాయికి చేరుకోవలసిరావడం జరిగేది. గ్రామీణుల పాత్ర దీనిలో నామమాత్రంగా ఉంది. బల్వంతరాయ్ మెహతా కమిటి కార్యక్రమలు అభివృద్ధి పరిశీలన జరిపి దీనిని మెరుగు పరచడానికి నూతనంగా పంచాయితీ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచడానికి మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థను అమలు చేస్తున్నారు.

## 10.6 గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు :

పేదరికం, నిరక్షరాస్యత వెనకబడినతనం అధికంగా గ్రామాలలో ఉన్నందున గ్రామీణ వనరులను గరిష్ఠ స్థాయిలో ఉపయోగించి గ్రామీణుల జీవన ప్రమాణాన్ని పెంచి ఆర్థికాభివృద్ధి పెంపొందించాలనే ముఖ్యోద్దేశ్యంతో పంచవర్ష ప్రణాళికల్ని ప్రవేశపెట్టారు. వీటిలో భాగంగా అనేక గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారు.

మొదటి పంచవర్ష ప్రణాళిక రెండో సంవత్సరంలో (1952) సమాజ వికాస కార్యక్రమాన్ని అమలు చేశారు. కొంతవరకు ప్రజలలో చైతన్యం కలిగించారు. 1953 లో జాతీయ విస్తరణ సర్వీసులను ప్రారంభించారు. స్త్రీలు, పిల్లల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని కూడ ప్రవేశపెట్టారు. ఆరోగ్యం, పోషకాహారం అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించే కార్యక్రమాలను చేపట్టారు. వీటివల్ల గ్రామీణ ప్రజలలో కొంత చైతన్యం కల్గింది. 1960 సం॥లో వ్యవసాయాభివృద్ధికై అవస్థాపన సదుపాయల కల్పనతో "సమగ్ర పద్ధతిలో వ్యవసాయాభివృద్ధి పథకం" ప్రారంభించారు. ఎంపిక చేసిన 15 జిల్లాలలో దీనిని అమలు చేశారు. 1956 లో వ్యవసాయ పని ముట్ల మంచి విత్తనాలు, ఎరువులు క్రిమి సంహారక మందుల వినియోగాన్ని అధికం చేసే వ్యవసాయ ఉత్పత్తులను పెంచే ప్రయత్నాలు జరిగాయి.

నాలుగో ప్రణాళికా కాలంలో స్త్రీల, పిల్లల సంక్షేమ పథకాలు ప్రాధాన్యతను పొందాయి. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అమలు చేసిన పథకం ద్వారా మహిళా మండలుల ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజల పురోగతికి కృషి చేసింది. 1969 - 70 సంవత్సరంలో చిన్న, సన్నకారు రైతుల అభివృద్ధి సంస్థలు స్థాపించి వారి సమస్యలను పరిశీలించి, ప్రత్యేక చర్యలు ద్వారా వారి ప్రగతికి పాటు పడింది. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులు ఆచరించడానికి ఈ పథకాలే దోహదపడ్డాయి. క్షామపీడిత ప్రాంతాల రైతుల కోసం 1970-71 లో గ్రామీణ పనుల పథకాన్ని ప్రవేశపెట్టారు. గ్రామాలలో ఉపాధికల్పన కోసం దీని కింద చిన్నతరహా, మధ్య తరహా నీటి పారుదల, అడవుల పెంపకం, భూసార పరిరక్షణ గ్రామీణ రోడ్ల నిర్మాణం వంటి పనులను చేపట్టారు.

1973లో దీనిని క్షామ పీడిత ప్రాంతాల పథకంగా మార్చి భూ మరియు నీటి వనరుల అభివృద్ధి, పాడిపరిశ్రమకు ప్రాముఖ్యత నిచ్చారు. మెట్ట భూములలో వ్యవసాయభివృద్ధికి కృషి జరిగింది.

నాల్గవ పంచవర్ష ప్రణాళికలో కనీస అవసరాల పథకం ప్రారంభమయింది. దీని కింద ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్యం తాగునీరు, రోడ్లు, విద్యుచ్ఛక్తి సౌకర్యాలను అభివృద్ధి చెయ్యాలని గ్రామీణుల తలసరి వినియోగాన్ని 30 శాతం పెంచాలని నిర్ణయించారు.

1975లో గరీబీ హఠావో (పేదరికాన్ని తొలగించండి) అనే నినాదంతో ఇరవై సూత్రాల పథకాన్ని ప్రారంభించారు. 1977లో ఎడారి అభివృద్ధి పథకం ఎడారులుగా మారుతున్న ప్రాంతాల రక్షణ కోసం ప్రారంభించారు. ఈ ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పాదకతను పెంచి, ఉపాధి కల్పన సౌకర్యాలు చేపట్టారు వ్యవసాయాభివృద్ధికి కమాండ్ ఏరియా, డెవలప్‌మెంట్ పథకాన్ని కూడా ప్రవేశపెట్టారు. 1977లో గ్రామీణ పేదలకు పనిలేని సమయాలలో పని కల్పించటానికి "పనికి ఆహార పథకాన్ని ప్రారంభించారు. 1980 లో జాతీయ గ్రామీణ ఉద్యోగిత పథకంగా (National Rural Development Programme) మార్చారు. అదనపు ఉపాధిని కల్పించటమే ప్రధాన ధ్యేయంగా దీనిని రూపొందించారు. రోజు వారీ వేతన కార్మికుల కోసం, ఇతర బలహీన వర్గాల కోసం కార్యక్రమాలు అమలు చేశారు. పేదరిక నిర్మూలనకు 1978లో అంత్యోదయ పథకాన్ని ప్రారంభించారు.

### సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం (1978-79) :

గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేదల ఆర్థిక, స్థితిగతులను మెరుగు పరచాలనే లక్ష్యంతో సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్ని ప్రారంభించారు. సమగ్ర గ్రామీణాభివృద్ధిని సాధించాలనే ప్రధాన లక్ష్యంగా సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. దీనిని సూక్ష్మంగా ఐ.ఆర్.డి.పి. (IRDP) అని పిలుస్తారు. 1978-79 లో ముందుగా దీనిని దేశంలోని 2,300 బ్లాకులలో ప్రారంభించారు. 1980 అక్టోబరు 2వ తేది నాటికి మొత్తం 5,011 బ్లాకులలో ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 1,091 మండలాలలో దీనిని అమలు జరుపుతున్నారు.

ఐ.ఆర్.డి.పి ప్రవేశ పెట్టిన వివిధ కార్యక్రమాలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ గ్రామ స్థాయిలో సమితి సిబ్బంది అమలు చేస్తారు. కేంద్రం నిర్వహించే ఈ కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో ఖర్చులను, సబ్సిడీలను భరిస్తాయి. కేంద్ర పాలిత ప్రాంతాలలో కేంద్రమే మొత్తం ఖర్చును భరిస్తుంది. దీని ద్వారా దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న లబ్ధిదారులకు లభించే ప్రభుత్వ సహాయం బ్యాంకులు తదితర సంస్థలు ఇచ్చే ఋణాల ద్వారా లభిస్తుంది. గ్రామ సర్పంచ్, సమితి స్థాయి అధికారుల సహాయంతో కుటుంబాలను ఎంపిక చేసి వారికి సహాయం అందిస్తారు. ఎంపిక చేసుకున్న వ్యక్తికి అనుకూలమైన పథకాన్ని ఎంపిక చేస్తారు. సబ్సిడి, పరపతుల సమ్మేళనం ద్వారా సొమ్మును ఏర్పాటు చేస్తారు. దీనితో పంపుసెట్లు, పశువులు, కుటీర పరిశ్రమల ఏర్పాటుకు అవసరమయ్యే పరికరాలు, టీదుకాణం, మొదలగు వాటిని సహాయం పొందవచ్చు. గ్రామీణాభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది.

### గ్రామీణ యువతకు స్వయం ఉపాధిశిక్షణ (Trysem) :

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 1979 ఆగస్టు 15న ప్రారంభించింది. దీనిని ట్రైసం అని కూడా పిలుస్తారు. దారిద్ర రేఖకు దిగువున ఉండి 18-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న గ్రామీణ యువతకు స్వయం ఉపాధిని ఏర్పరచుకోడానికి అవసరమయ్యే నైపుణ్యాల్ని, సాంకేతిక పరిజ్ఞానాన్ని కలుగజేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాల్ని ప్రవేశపెట్టారు. స్వయం ఉపాధికే కాకుండా వేతనోపాధికి కూడ దీనిని విస్తరించారు. ఇందులో కనీసం 50 శాతం షెడ్యూల్డ్ కులాలవారు, తెగలవారు, 40 శాతం మహిళలు ఉండాలి. దీనికయ్యే ఖర్చుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయి. ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రింటింగ్, బైండింగ్, టైలరింగ్, రేడియో, టి.వి., రిపేరుతోనే పరిశ్రమ, పండ్ల మొక్కలు పెంపకం, కోళ్ల పెంపంకం పట్టు పరిశ్రమ మొదలైన వాటిలో శిక్షణనిస్తారు. ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన వారికి స్వంత ఊర్లో అయితే నెలకు 100 రూపాయలు, గ్రామంలో యైతే వసతి సదుపాయం కల్పిస్తే 200 రూపాయలు వసతి సదుపాయం లేకుంటా 250 రూపాయలు చొప్పన స్టైపెండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక 500 రూపాయలు విలువ చేసే వివిధ పరికరాల గల కిట్టును ఉచితంగా ఇస్తారు.

### జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం (National Rural Employees Programme) :

దీనిని 1980 అక్టోబరు 2వ తేదిన ప్రారంభించారు. 1977లో ప్రారంభించిన పనికి ఆహార పథకంలోని లోపాలను సవరిస్తూ పేదవారికి ప్రధానంగా భూమి లేని వారికి పనులు కల్పించటానికి వేతన ఉద్యోగితా పథకం ద్వారా పేదరిక నిర్మూలన దృష్టితో దీనిని ప్రవేశపెట్టారు. దీనికయ్యే ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 సమానంగా భరిస్తాయి. కేంద్రం, తన వాటిలో కొంత భాగాన్ని ఆహార ధాన్యాల రూపంలో ఇస్తుంది. మిగులు ఆహార ధాన్య నిల్వలను మానవవనరుల అభివృద్ధికి ఉపయోగించడం జరుగుతుంది. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగులు పాఠశాల భవనాలు, బావులు, రోడ్లు మొదలైనవి నిర్మించడం వంటి పనులు చేపట్టడం ద్వారా గ్రామీణ ఆర్థిక పరిస్థితి బాగుండటమేకాక నిరుద్యోగుల ఆదాయాలు పెరుగుతాయి.

**భూమిలేని గ్రామీణ ప్రజల ఉపాధి హామీ పథకం (Rural Landless employment Guarantee Programme)**

గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉపాధిని కల్పించడం కోసం గ్రామీణ భూమిలేని ప్రజల ఉపాధి హామి పథకాన్ని 1983 ఆగస్టు 15న ప్రవేశపెట్టారు. ప్రతి భూమి లేని శ్రామికునికి లేదా వ్యవసాయ శ్రామికునికి 100 రోజుల పాటు పని కల్పించడమే దీని ప్రధానోద్దేశ్యం దీనికయ్యే ఖర్చు మొత్తం కేంద్రమే భరిస్తుంది. గ్రామీణుల జీవనస్థాయిని పెంచటానికి కృషి చేయడం జరుగుతుంది.

ఈ పథకంలోని నిధులలో 20 శాతం వరకు సామాజిక అడవుల పెంపకానికి, 10 శాతం వరకు షెడ్యూల్డ్ తరగతుల ప్రయోజనానికి ఖర్చు పెట్టాలి.

అనావృష్టి పీడిత ప్రాంత కార్యక్రమం (Drought Prone area programme) దేశంలో 13 రాష్ట్రాలలో దీనిని అమలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ కార్యక్రమం ఎనిమిది జిల్లాలలో జరుగుతుంది. రాయలసీమ (అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు) తెలంగాణా (నల్గొండ, రంగారెడ్డి మండలము) మహబూబ్‌నగర్, కోస్తా ఆంధ్ర ప్రాంతం - ప్రకాశం జిల్లాలో అమలవుతుంది. మెట్ట సాగుకు అనువైన పద్ధతుల్ని అనుసరించడం, అడవుల పెంపకం, పచ్చిక బయళ్ళ పెంపకం పశుగణాభివృద్ధి నీటి పారుదలకు సంబంధించిన వనరుల్ని నిర్వహించడం మొదలైన అంశాలు దీనిలో ఉన్నాయి.

ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమం (Desert Development Programme) రాజస్థాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో అమలు పరిచారు.

వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి సన్నకారు, పేదరైతుల అభివృద్ధి పథకం (Small farmers development programme ‿ Marginal terminal agriculture labour )

దీనిని 1983-84 సంవత్సరాలలో ప్రవేశపెట్టి ఉంచడానికి వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన సౌకర్యాల్ని కల్పించే లక్ష్యంతో సన్నకారు, పేదరైతులకు ఉపయోగపడాలన్నే ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనిలో మూడు అంశాలుంటాయి.

1. చిన్న నీటి వనరుల్ని సమకూర్చడం.
2. సేద్యానికి వీలుకాని ప్రాంతాలలో వర్షాలవల్ల ఏర్పడిన తేమను వినియోగించు కోవటానికి వీలుగా వ్యవసాయాన్ని అనుకూలంగా భూమిని అభివృద్ధి పనులను చేపట్టడం.
3. పప్పులు, ముదకధాన్యం, ఉత్పత్తి పెంచడానికి మినీ కిట్లను సరఫరా చేయడం.

**గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు - పిల్లలు అభివృద్ధి (Development of Women & Children in Rural areas)**

దీనిని కేంద్ర ప్రభుత్వం 1983 -84లో ప్రవేశపెట్టింది. దీనినే డ్వాక్రా (ఈఇజ్ఞుష్ఠజు) అని పిలుస్తారు. ఈ పథకాని కయ్యే ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరసగం భరిస్తాయి. ఈ పథకం కింద బహుళార్థ సాధక సామాజిక కేంద్రాలను నెల కొల్పుతారు. వీటిలో గుర్తించిన లబ్ధిదారులైన మహిళలను 10-15 మందిని బృందాలుగా ఏర్పరచి ఆదాయాన్ని ఇచ్చే కార్యక్రమాలు చేపట్టేందుకు అనువైన శిక్షణను అందజేస్తారు. ఈ కేంద్రంలో ఒక చాలవాడే కూడా ఉంటుంది. కేవలం ఆదాయాన్ని పెంచే శిక్షణేగాక మహిళలకు అక్షరాస్యత కల్పించే మాతాశిశు, ఆరోగ్యం మొదలైన అంశాలను అవగాహన కల్పించేందుకు కూడ కార్యక్రమాలు చేపడతారు. యూనిసెఫ్ సహకారంతో ఈ పథకం నడుస్తుంది.

**జవహర్ రోజ్‌గార్ యోజన** - గతంలో ఉన్న జాతీయ గ్రామీణ ఉద్యోగితా పథకం మరియు భూమిలేని గ్రామీణ ప్రజల ఉపాధి హామి పథకాన్ని విధానం చేసి జవహర్ రోజ్‌గార్ యోజనను ప్రవేశపెట్టారు. గ్రామీణ కుటుంబంలోని కనీసం ఒక వ్యక్తికైన ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో 1989 ఏప్రిల్ 1వ తేదిన దీనిని ప్రారంభించారు. దీనిని గ్రామ పంచాయితీల ద్వారా అమలు పరుస్తారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెట్టి చాకిరి నుంచి విముక్తులైన వారికి, మహిళలకు 30 శాతం ప్రాధాన్యత నిస్తారు. దీని కయ్యే ఖర్చుతో కేంద్ర ప్రభుత్వం 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం భరిస్తాయి. 3000 జనాభా నుంచి 4000 జనాభా వరకు ఉన్న పంచాయితీలకు ఏటా ఎనభై వేల రూపాయల నుంచి లక్ష రూపాయల వరకూ ఆర్థిక సహాయాన్ని అందిజేయడం జరుగుతుంది.

**ఇందిరా ఆవాస్ యోజన్ పథకం** (Indira Awas Yojan) :

జవహర్ రోజ్‌గార్ యోజనలోని ఉపపథకం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన నిరు పేదలకు, విముక్తి పొందిన వారి గృహ నిర్మాణాన్ని చేపట్టడానికి దీనిని ప్రవేశపెట్టారు. చిన్న ఇండ్లను నిర్మించి వాటికి అవసరమైన అన్ని వసతులను కల్పించడం జరుగుతుంది.

**గ్రామీణ పేద ప్రజల ఉద్యోగ హామి పథకం** - దీనిని 1993 అక్టోబరు 2న దేశంలోని షెడ్యూల్డ్ తెగలుండే కొండ ప్రాంతాలు క్షామ ప్రాంతాలు, ఎడారి ప్రాంతాలకు సంబంధించి మొత్తం 1752 బ్లాకులలో ప్రారంభించారు. వ్యవసాయ కూలీలకు పనిలేని కాలంలో నిరుద్యోగులుగా ఉండకుండ చేయడమే దీని ప్రధానలక్ష్యం. ఈ పథకం 30 లబ్ధిదారులు 18 సం॥ల నుండి 60 సం॥ల మధ్య వయస్సులై ఉండాలి. ఈ పథకం ద్వారా 30 మందితో కనీసం 20 మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. వంద రోజులు ఖచ్చితంగా పని లబ్ధిదారులకి కల్పించాలన్నదే దీని ఆశయం.

వివిధ ప్రధాన గ్రామీణాభివృద్ధి పథకాల వివరాలు క్రింది ఇవ్వబడినవి.

## వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలు

| పథకం పేరు | ప్రారంభించిన సంవత్సరం | పథకం యొక్క ఉద్దేశ్యం |
|---|---|---|
| 1. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (CDP) | 1952 | ప్రజల భాగ్యస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాలలో సమగ్రాభివృద్ధి |
| 2. ఇంటెన్సివ్ అగ్రికల్చర్ ఏరియా ప్రోగ్రామ్ (IAAP) | 1964-65 | ప్రత్యేక పంటల అభివృద్ధి |
| 3. హై ఈల్డింగ్ వెరైటీస్ ప్రోగ్రామ్ (HYVP) | 1966-67 | పంటలకు కొత్తరకం విత్తనాల వినియోగం ద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచడం |
| 4. డ్రాట్ - ప్రోన్ ఏరియా ప్రోగ్రామ్ (DPAP) (కరవు ప్రాంతాల అభివృద్ధి పథకం) | 1973 | పర్యావరణ సమతుల్యతను మరియు భూగర్భ జలాలను అభివృద్ధి చేయడం ద్వారా కరువు ప్రాంతాలలో కరువు నుండి రక్షణ పొందడం. |
| 5. క్రాష్ స్కీమ్ ఫర్ రూరల్ ఎంప్లాయిమెంట్ (CSRE) | 1972-73 | గ్రామీణ ప్రాంతాలలోని వారికి ఉద్యోగాల కల్పన |

| | | |
|---|---|---|
| 6. మార్జినల్ ఫార్మర్ అండ్ అగ్రికల్చర్ లేబర్ ఏజెన్సీ (MFALA) | 1973-74 | చిన్న, సన్నకారు రైతులకు మరియు వ్యవసాయ కూలీలకు సాంకేతిక మరియు ఆర్థిక సహకారం |
| 7. స్మాల్ ఫార్మర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (SFDA) (చిన్న రైతుల అభివృద్ధి సంస్థ) | 1974-75 | సన్నకారు రైతులకు సాంకేతిక మరియు ఆర్థిక సహకారం. |
| 8. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (CADP) (ఆయకట్టు ప్రాంతాల అభివృద్ధి పథకం) | 1974-75 | భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల కింద నీటిపారుదల వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం |
| 9. ఇరవై సూత్రాల పథకం | 1975 | పేదరిక నిర్మూలన మరియు జీవన ప్రమాణాలను పెంపొందించడం |
| 10. డెజర్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (DDP) (ఎడారి అభివృద్ధి పథకం) | 1977-78 | ఎడారి విస్తరణను అదుపు చేయడం మరియు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం |
| 11. పనికి ఆహార పథకం (ఫుడ్ ఫర్ వర్క్ ప్రోగ్రామ్) | 1977-78 | పనుల అభివృద్ధికి కూలీలకు ఆహార ధాన్యాలు పంపిణీ |
| 12. అంత్యోదయ యోజన | 1977-78 | గ్రామాలలోని పేద కుటుంబాలను ఆర్థికంగా స్వతంత్రులను చేయడం |
| 13. ట్రైనింగ్ రూరల్ యూత్ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ (TRYSEM) | ఆగస్టు 15, 1979 | గ్రామీణ యువతకు స్వయం ఉపాధికై శిక్షణనిచ్చు కార్యక్రమం |
| 14. ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (IRDP) (సమగ్ర గ్రామీణాభివృద్ధి పథకం) | అక్టోబర్ 2, 1980 | స్వయం ఉపాధి, ఆస్తుల కల్పన ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధికి కృషి చేయడం |
| 15. నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్ (NREP) (జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం) | 1980 | గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడం |
| 16. డెవలప్‌మెంట్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ ఇన్ రూరల్ ఏరియాస్ (DWCRA) | సెప్టెంబర్ 1982 | గ్రామీణ ప్రాంతాలలోని పేద కుటుంబాలకు చెందిన(గ్రామీణ ప్రాంతాల స్త్రీలు, శిశువుల అభివృద్ధి పథకం) మహిళలకు వారికి అనువైన స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం |
| 17. రూరల్ ల్యాండ్‌లెస్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రామ్ (RLEGP) | ఆగస్టు 15, 1983 | భూమిలేని రైతులకు మరియు కూలీలకు ఉపాధి కల్పించడం |
| 18. కాంప్రహెన్సివ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్ (సమగ్ర పంటల బీమా పథకం) | ఏప్రిల్ 1, 1985 | వ్యవసాయ పంటలకు బీమా |

| | | |
|---|---|---|
| 19. కౌన్సిల్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ పీపుల్స్ యాక్షన్ అండ్ రూరల్ టెక్నాలజీ (CAPART) | సెప్టెంబర్ 1, 1986 | గ్రామాభ్యుదయం కోసం సహకారాన్ని అందించడం |
| 20. జవహర్ రోజ్‌గార్ యోజన (JRY) | ఏప్రిల్ 1989 | గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పన |
| 21. అగ్రికల్చర్ అండ్ రూరల్ డ్రౌట్ రిలీఫ్ స్కీమ్ (ARDRS) | 1990 | గ్రామీణ ప్రాంతాలలోని పనివృత్తుల వారికి మరియు నేత పనివారికి రూ॥ 10,000 వరకు బ్యాంక్ ఋణాలు మాఫీ |
| 22. ఎంప్లాయిమెంట్ అస్యూరెన్స్ స్కీమ్ (EAS) (ఉపాధి హామి పథకం) | అక్టోబర్ 2, 1993 | గ్రామాలలోని వారికి ఒక సంవత్సరంలో కనీసం 100 రోజుల ఉపాధి కల్పన |
| 23. డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఏజన్సీ (DRDA) (జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీ) | 1993 | గ్రామీణాభివృద్ధికి ఆర్థిక సహకారాన్ని అందించడం |
| 24. మహిళా సమృద్ధి యోజన | అక్టోబర్ 2, 1993 | పోస్ట్ ఆఫీస్ సేవింగ్ అకౌంట్‌లలో డిపాజిట్ కోసం గ్రామీణ మహిళలకు ప్రోత్సాహమివ్వడం |
| 25. గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్ ఇన్ రూరల్ ఏరియాస్ | 1995-96 | గ్రామీణ ప్రజలకు తక్కువ ప్రీమియమ్‌పై భీమా సౌకర్యాలను కల్పించడం |
| 26. గంగా కళ్యాణ్ యోజన (దీనిని SGSY లో కలిపారు) | 1997-98 | అంతర్జల మరియు ఉపరితల వనరుల అన్వేషణకు మరియు అభివృద్ధికి రైతులకు ఆర్థిక సహకారం అందించడం |
| 27. స్వర్ణ జయంతి గ్రామ్ స్వరోజ్‌గార్ యోజన (SGSY) | ఏప్రిల్ 1999 | స్వయం ఉపాధిని పెంపొందించడం ద్వారా గ్రామీణ పేదరికాన్ని మరియు నిరుద్యోగాన్ని తొలగించడం |
| 28. సమగ్ర ఆవాస్ యోజన్ | 1999-2000 | పారిశుద్ధ్యం మరియు త్రాగునీటి కల్పన |
| 29. జవహర్ గ్రామ సమృద్ధి యోజన (JGSY) | ఏప్రిల్ 1999 | గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పన |
| 30. జనశ్రీ భీమా యోజన | ఆగస్టు 10, 2000 | దారిద్ర్యరేఖ దిగువన ఉన్న ప్రజలకు భీమా రక్షణను కల్పించడం |
| 31. ప్రధాన మంత్రి గ్రామోదయ యోజన | 2000 | గ్రామీణ ప్రాంతాలలోని ప్రాథమికావసరాలను తీర్చడం |
| 32. అంత్యోదయ అన్న యోజన | డిసెంబర్ 25,2000 | నిరుపేదలకు ఆహార భద్రతను కల్పించడం |
| 33. ఆశ్రమ భీమా యోజన | జూన్ 2001 | ఉపాధి కోల్పోయిన కూలీలకు నష్టపరిహారాన్ని అందించడం |

| | | |
|---|---|---|
| 34. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన (PMGSY) | అక్టోబర్ 2, 2000 | వెయ్యికి పైగా జనాభాగల గ్రామాలను 2003 నాటికి 500కు పైగా జనాభాగల గ్రామాలను 2007 నాటికి అనుసంధానించడం |
| 35. ఖేతిహార్ మజ్దూర్ భీమా యోజన | 2001-2002 | భూమిలేని వ్యవసాయ పనివారికి భీమా |
| 36. శిక్షా సహయోగ్ యోజన | 2001-2002 | దారిద్ర్యరేఖ దిగువన ఉన్న పిల్లలకు విద్య |
| 37. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన 2001 | సెప్టెంబర్ 25, | ఉపాధి మరియు ఆహార భద్రతను కల్పించడం |
| 38. స్వయం సిద్ధ పథకం | నవంబర్, 2001 | స్వయం సహాయక బృందాలుగా (ఐకమ్య) ఏర్పడే మహిళలకు ఆర్థికపరమైన అధికారాలు కల్పించడం |
| 39. సర్వశిక్షా అభియాన్ (ఐ.ఐ.జు) | 2002 | ప్రాథమిక విద్యను అందరికి అందించడం |
| 40. ప్రధాన మంత్రి గ్రామోదయ యోజన | 2002 | గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యరేఖకు దిగువన నివసించే పేదవారికి గృహ వసతిని కల్పించడం |
| 41. జయప్రకాశ్ రోజ్‌గార్ గ్యారంటీ యోజన | 2002 | బాగా వెనుకబడిన జిల్లాలోని నిరుద్యోగులకు ఉపాధి హామీ |
| 42. జనరక్షా బీమా పథకం | 2002 | గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్యరక్షణ అందించడం |
| 43. సంపూర్ణ గ్రామీణ ఉపాధి పథకం | 2002 | గ్రామీణ ప్రాంతాల్లో అదనపు వేతన ఉపాధికల్పన, ఆహార భద్రత |
| 44. స్వజలధార పథకం | 2002 | దేశవ్యాప్తంగా గ్రామసీమలకు తాగునీరందించుట |
| 45. హరియాలి పథకం | 2003 | గ్రామీణ ప్రాంతాలలో వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ కోసం |
| 46. జనని సురక్షా యోజన నిరుపేద అందించడం | 2003 | ప్రసూతి మరణాలను అరికట్టేందుకు గాను గర్భిణీలకు ఉచిత వైద్య సహాయం |
| 47. గ్రామీణ సంచార్ సేవక్ పథకం | 2003 | వైర్‌లెస్ టెలిఫోన్‌ల ద్వారా గ్రామీణులకు టెలిఫోన్ సౌకర్యం కల్పించడం |

ఈ పథకాలే కాకుండా ఇంకా మరెన్నో పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. సమగ్ర గ్రామీణాభివృద్ధి ధ్యేయంగా ఈ పథకాలన్ని ప్రవేశపెట్టడం అమలు చేయడం జరుగుతుంది.

## 10.7 సారాంశం :

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి జరుగుతుంది. ఎందుచేత నంటే దేశ జనాభాకు 75 శాతం గ్రామాలలోనే ఉంటున్నారు. గాంధీజీ గ్రామీణాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. గ్రామీణాభివృద్ధి ఆవశ్యకతను గుర్తించి దేశ స్వాతంత్రానికి ముందు ఆ తరువాత ఎన్నో పథకాలను అమలు పరచడం జరుగుతుంది. దేశానికి స్వాతంత్ర్యానికి ముందు చేపట్టిన గ్రామీణాభివృద్ధి పథకాలలో టాగూర్ శ్రీనికేతన్ ప్రయోగం స్పెన్సర్ హెచ్ - మార్తాండమ్ ప్రయోగం, పి.ఎల్. బ్రెయిన్ గారి గుర్‌గాల్ ప్రయోగం, బిరోడాలోని గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమం ప్రకాశం పంతులుగారి ఫిర్కా అభివృద్ధి పథకం చెప్పుకోదగినవి.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామీణాభివృద్ధి పథకాలను 1952 సం॥లో ప్రారంభించిన సముదాయక వికాస కార్యక్రమం అతి ప్రధానమైనది. అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వామ్యం ఉన్నప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమనే వాస్తావాన్ని ప్రభుత్వం గుర్తించింది. తలపెట్టిన పథకాల వ్యయంలో 50 శాతం స్థానిక ప్రజలు భరించడం మిగిలిన 50 శాతం కేంద్ర ప్రభుత్వం వాటాగా నిర్ణయించి వివిధ పనులను ప్రారంభించడం జరిగింది. మొదట్లో ప్రజలు ఉత్సాహంతో సహకరించడంతో ఫలితాలు ఆశాజనకంగా, ప్రోత్సాహకరంగా ఉండటంతో ఈ కార్యక్రమాన్ని జాతీయ విస్తరణ సేవలు అన్న పేరుతో దేశంలో అన్ని ప్రాంతాలకు విస్తరించారు. 1953 లో జాతీయ విస్తరణ సేవాబ్లాకులను ఏర్పరచడం గ్రామీణాభివృద్ధిని కొంత మేర ఉపకరించిన ప్రజల భాగస్వామ్యం లేకపోవడం వల్ల అనుకున్న పురోగతిని సాధించలేదు. వీటిలోని లోపాలని సవరించటానికి బలవంతరాయ్ మెహతా కమిటి కొన్ని సిఫార్సుల వ్యవస్థను ప్రవేశపెట్టారు. గ్రామీణాభివృద్ధి ప్రధానంగా స్థానిక స్వపరిపాలనకు శ్రీకారం చుట్టారు.

గ్రామీణాభివృద్ధి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు చేపట్టారు. పేదరికం, నిరుద్యోగిత, నిరక్షరాస్యత గ్రామీణ సమాజం నుండి తొలగిపోవటానికి సమగ్ర గ్రామీణాభివృద్ధి ప్రధాన లక్ష్యంగా అనేక పథకాల్ని ప్రవేశపెట్టారు.

## 10.8 ముఖ్య పదాలు :

గ్రామీణాభివృద్ధి
సాముదాయక వికాస కార్యక్రమం
సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
జవహర్ రోజ్ గార్ యోజన
ఇందిరా ఆవాస్ యోజన్

## 10.9 మాదిరి ప్రశ్నలు :

1. గ్రామీణాభివృద్ధి అంటే ఏమిటి? భారతదేశంలో గ్రామీణాభివృద్ధి అవశ్యకతను వివరించండి.
2. స్వాతంత్ర్యానికి పూర్వ గ్రామీణాభివృద్ధికి సంబంధించి జరిగిన కృషిని తెలియజేయండి.
3. భారతదేశంలోని సముదాయ వికాస కార్యక్రమాన్ని గురించి విశదీకరించండి.
4. కింది వాటి గురించి సంక్షిప్తంగా తెలపండి.
   a) సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (ఐ.ఆర్.డి.పి)
   b) గ్రామీణ యువత స్వయం ఉపాధి పథకం (ట్రైసం)
   బీ) జాతీయ గ్రామీణ ఉద్యోగిత పథకం

పాఠం - 11

# నగర సమాజ శాస్త్రం - ఆవిర్భావం, అభివృద్ధి - పరిధి

## 11.0. లక్ష్యం :

నగర సమాజ శాస్త్రం యొక్క పరిధిని, అధ్యయన అంశములను వివరించుట

## విషయసూచిక :


11.1. పరిచయం

11.2. నగర సమాజశాస్త్రం - నిర్వచనం

11.3. నగర సమాజ శాస్త్ర లక్ష్యాలు

11.4. నగర సమాజ శాస్త్ర పరిధి

11.5. అధ్యయన పద్ధతులు

11.6. నగర సమాజ శాస్త్ర ప్రాముఖ్యత

11.7. ముగింపు

11.8. నమూనా ప్రశ్నలు

11.9. చదువదగిన గ్రంథాలు


## 11.1. పరిచయం

సమాజశాస్త్రము 1837 వ సంవత్సరంలో 'ఆగస్ట్‌కామ్టే'చే రూపొందించబడినది. సామాజిక నిర్మితిని, ప్రగతిని శాస్త్రీయంగా అధ్యయనం చేసేదే సమాజశాస్త్రం.

ప్రత్యేక అధ్యయనం దృష్ట్యా, శాస్త్రాభివృద్ధి దృష్ట్యా సమాజశాస్త్రాన్ని అనేక విభాగాలుగా రూపొందించారు. వాటిలో "నగర సమాజ శాస్త్ర" విభాగము ఒకటి.

సమాజశాస్త్రంలో నగర సమాజశాస్త్రం ఒక అంతర్భాగం. సమాజంలో వ్యక్తుల మధ్య నెలకొని వున్న సామాజిక సంబంధాలను అధ్యయనం చేయడం సమాజశాస్త్ర లక్ష్యం. అదే ప్రత్యేకంగా నగర సమాజంలోని సామాజిక సంబంధాలను మాత్రమే అధ్యయనం చేస్తే దానిని నగర సమాజశాస్త్రంగా వివరిస్తాము. సమాజశాస్త్రంలో నగర సమాజశాస్త్రం ఒక ముఖ్యమైన శాస్త్ర విభాగం. సమాజశాస్త్రంలో 'సమాజం' ఏవిధంగా అధ్యయన విషయమో, నగర సమాజశాస్త్రంలో 'నగరం' అధ్యయన విషయము.

## 11.2. నగర సమాజ శాస్త్రము నిర్వచనము :

నాగరిక సమాజశాస్త్రాన్ని ఏ విధంగా నిర్వచించాలి అనేది ఒక ప్రశ్న. నగరాలను పరిశీలించే నాగరిక సమాజశాస్త్రం అని నిర్వచించవచ్చు. అయితే ఈ నిర్వచనము స్పష్టంగా లేదు.

నాగరిక సమాజశాస్త్ర నిర్మితిని, దాని ప్రవృత్తిని ఆ సమాజంలోని పరివర్తననూ విశ్లేషించు శాస్త్రమును నగర సమాజశాస్త్రముగా నిర్వచించవచ్చును.

నగర సముదాయంలోని వివిధ సంస్థలను వాటి నిర్మితి, ప్రకార్యములను శాస్త్రీయ పద్ధతులలో విశ్లేషించే శాస్త్రమే నగర సమాజశాస్త్రం.

నగర సమాజాన్ని అధ్యయనం చేయుటమే నగర సమాజశాస్త్రము యొక్క ముఖ్య లక్ష్యం.

నగర ప్రజల జీవనాన్ని, నగర సమాజాన్ని, అందులోని అనేక సమస్యలను అధ్యయనం చేయునది నగర సమాజశాస్త్రము. నగర సమాజశాస్త్రము పట్టణ, నగర సమాజ జీవనమును అధ్యయనము చేయు శాస్త్రమని ప్రొఫెసర్ ఆండర్సన్ (Prof. Anderson) అభిప్రాయము.

పై నిర్వచనాలను బట్టి నగర సమాజశాస్త్రము నగర జీవనాన్ని, పట్టణ జీవనాన్ని వాటిలో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలను అధ్యయనము చేస్తుందని చెప్పవచ్చును.

## 11.3. నగర సమాజ శాస్త్రము - ఆవిర్భావము - అభివృద్ధి :

నగర సమాజశాస్త్రం 1925వ సంవత్సరములో అమెరికా దేశంలో ప్రారంభమయినది. దీనిపై విస్తృతంగా పరిశోధనలు కూడా అమెరికా దేశంలోనే జరిగినాయి. Burgen రచించిన 'నగర సముదాయం', పార్క్ మెకంజీ రచించిన 'The City' అనే గ్రంథాలు నగర సమాజశాస్త్రానికి పునాది వేసినాయి. భారతదేశంలో ఘుర్రే, రాధా కమల్ ముఖర్జీ, డిసోజా మొదలగువారు ఢిల్లీ, బెంగుళూరు, చండీఘర్, విజయవాడ, హైదరాబాదు మొదలగు నగరాలను సమాజశాస్త్ర అధ్యయన దృష్ట్యా పరిశీలించి గ్రంథాలను వ్రాసినారు.

నగర జనాభా పెరుగుదల, నగరీకరణము మొదలైన సామాజిక ప్రక్రియలు ఆధునిక సమాజాలను ప్రభావితం చేస్తున్నాయి. గ్రామీణ-నగర వలస ప్రాధాన్యత రోజు రోజుకు పెరుగుచున్నది. నగరాలలో నివసించే జనాభా అధికమవుతున్నది. నగరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. చిన్న చిన్న నగరాలు పెద్ద నగరాలుగా మారుతున్నాయి. నగరీయత ప్రభావంగా గ్రామీణ, నగర సముదాయాలలో నివసిస్తున్న ప్రజల ఆచారాలు, విలువలు, ప్రవర్తనారీతులలో అనేకమైన మార్పులు చోటు చేసుకొనుచున్నవి. నగరీకరణ, పారిశ్రామికీకరణ ప్రభావం వలన సాంప్రదాయిక, వ్యవసాయిక సమాజాలు పారిశ్రామిక సమాజాలుగా మార్పు చెందుతున్నాయి.

రోజు రోజుకు ఉధృతమవుతున్న నగరీకరణ, నగర జనాభా పెరుగుదల వలన, నగరాలలో వాతావరణ కాలుష్యం, మురికివాడలు, గృహ సమస్య వంటి అనేక సమస్యలు బయలుదేరినాయి. నేరము, బాలనేరము, మదిరావ్యసనము, పడుపు వృత్తి మొదలైన సమస్యలకు నగరాలు కేంద్రాలుగా తయారయినవి. గ్రామీణ సముదాయాలతో పోలిస్తే నగర సముదాయాలలో సాముదాయిక అవ్యవస్థ ఎక్కువగా కనబడుతుంది. అమెరికా, బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలుకూడా నగర సముదాయాలలో గల సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శాస్త్రజ్ఞులు, ప్రణాళికావేత్తలు, పరిపాలకులు నగర సమస్యలపై తమ దృష్టిని నగర జీవితంలోని అనేక అంశాలను శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం మొదలు పెట్టినారు. వీరి కృషి ఫలితంగా ఈనాడు సమాజశాస్త్రంలో నగర సమాజశాస్త్రం ఒక ప్రత్యేక భాగంగా రూపొంది, అభివృద్ధి చెందింది.

## 11.4. నగర సమాజశాస్త్ర లక్ష్యాలు :

1) నగర సముదాయములో నున్న అనేక సమస్యలకు కనుగొనడానికి, ప్రయత్నిస్తుంది.

2) నాగరిక ప్రజలపై నగర సమస్యల ప్రభావాన్ని, సమస్యల వలన కలుగు లాభనష్టాలను అధ్యయనం చేస్తుంది.

3) నగర సమాజాభివృద్ధికి ప్రతిబంధకముగానున్న అనేక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది.

4) నగర సముదాయాభివృద్ధికి అవసరమైన అనేక సూత్రాలను రూపొందిస్తుంది.

5) నగర ప్రణాళికలను రూపొందించి అనేక దీర్ఘకాలిక, స్వల్పకాలిక కార్యక్రమాలను రూపొందించి అమలు పరుస్తుంది.

6) నగర సముదాయ నిర్మాణాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడం జరుగుతుంది.

## 11.5. నగర సమాజశాస్త్ర పరిధి :

నగర సమాజశాస్త్రము యొక్క పరిధి రోజురోజుకూ విస్తృతమవుతున్నది. గ్రామీణ సమాజములో నివసించే జనాభా తగ్గుతూ, పట్టణ జనాభా పెరుగుతున్నందువలన నగర సమాజశాస్త్రము యొక్క పరిధికూడా విస్తృతమవుతుంది. నగర సమాజశాస్త్రం నగర సముదాయాన్ని, నగర జీవిత పద్ధతులను అధ్యయనం చేస్తుంది. సమాజశాస్త్రం ఏ విధంగా సమాజ నిర్మితి, ప్రకార్యాలను సామాజిక సంబంధాలను పరివర్తనను అధ్యయనం చేస్తుందో, అదే విధంగా నగర సమాజశాస్త్రం నగర సముదాయం యొక్క నిర్మితి, ప్రకార్యాలను, సంబంధాలను పరివర్తనలను అధ్యయనం చేస్తుంది. నగర జీవితంలోని వివిధ అంశాలను నగర సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. ఆధునిక నగరం యొక్క మూలము, దాని అభివృద్ధిని నగర సమాజ శాస్త్రజ్ఞులు అధ్యయనం చేస్తారు. నగర సమాజ శాస్త్రజ్ఞులు నగర జనాభాలోని లైంగిక, వైవాహిక, వయస్సు, వృత్తిపరమైన అంతస్తులను విశ్లేషిస్తారు. వివిధ కాలాలలోను, వివిధ సమాజాలలోను నగరీకరణను ప్రభావితం చేసే కారకాలను అధ్యయనం చేస్తారు.

నగర సమాజశాస్త్రము నాగరిక సమాజశాస్త్ర సాధారణ సూత్రాలు, పట్టణాల అభివృద్ధి సామాజిక ఆర్థిక వ్యవస్థలలో పాటు, పట్టణ జీవితము యొక్క సమస్యలను మరియు పట్టణ ప్రణాళికలను కూడా అధ్యయనం చేస్తుంది. ఈ శాస్త్రము నగర పరిసరాలకు మరియు మానవమూర్తిమత్వ అభివృద్ధికి మధ్య గల సంబంధాన్ని అధ్యయనం చేస్తుంది. అంతేకాక నగర కుటుంబ నిర్మితి, కుటుంబ విధులలో వస్తున్న మార్పులు, నాగరిక సమాజంలో స్త్రీల అంతస్తు, కుటుంబ అవ్యవస్థకు దోహదం చేయు కారకాలను పరిశోధిస్తుంది. నగర సముదాయంలో ఉత్పన్నమయ్యే నేరం, బాల నేరం పడుపువృత్తి, కాలుష్యం, మురికివాడలు, నిరుద్యోగ సమస్య, పేదరికము, వర్గ పోరాటము, జూదము, గృహ సమస్య వంటి అనేక సామాజిక సమస్యలను, వాటికి గల కారణాలను, నగర జీవనంపై వాటి యొక్క ప్రభావాన్ని నగర సమాజశాస్త్రం అధ్యయనం చేస్తుంది. నగర ప్రణాళికలు, నగరాభివృద్ధి కార్యక్రమాలు ఆవశ్యకతను కూడా నగర సమాజ శాస్త్రజ్ఞులు చర్చిస్తారు.

పార్క్, లూయిస్‌వర్త్ నగర సమాజశాస్త్ర పరిధిని మూడు వర్గాలుగా విభజించినారు. అవి

**1) నగర ఆవరణ వ్యవస్థాపన :** ఈ విభాగంలో నగర జనాభా, పరిసరాలు, వ్యవస్థాపన వీటి మధ్య గల పరస్పర సంబంధాలను అధ్యయనం చేస్తారు. అంటే నగరంలోని విభిన్న నివాస ప్రాంతాలలో గల వ్యత్యాసాలను, నగర జీవితంపై వాటి ప్రభావం ఆయా ప్రాంతాలలోని వివిధ సంస్థలు, సమూహాలు తీసుకునే చర్యలను పరిశీలిస్తారు.

**2) నగర సాంఘిక వ్యవస్థాపన :** ఈ విభాగంలో నగరవాసులు సామాజిక జీవితంలోని వివిధ అంశాలను, వాటి సమస్యలను గూర్చి అధ్యయనం చేయడం జరుగుతుంది. ఉదాహరణకు నేరం, బాల నేరం, పడుపువృత్తి, మురికివాడలు మొదలైన సాంఘిక సమస్యల ప్రభావం నగరవాసుల జీవితంపై ఏ విధంగా ఉంటుందో చర్చిస్తారు.

3) మూడవ విభాగంలో నగరవాసుల ప్రవర్తన, వారి విలువలు వైఖరులు అధ్యయనం చేయడం జరుగుతుంది.

మొదట నగర సమాజశాస్త్రంలో నగర సమస్యలను మాత్రమే అధ్యయనం చేసేవారు, కానీ ఈనాడు నగర జీవితానికి సంబంధించిన అనేక అంశాలను కూడా అధ్యయనం చేస్తున్నారు. నగర సమస్యలతో పాటు నగరాలలోని సామాజిక సంబంధాలు, సామాజిక వ్యవస్థలు, సామాజిక స్తరీకరణ, సామాజిక పరివర్తన, గతిశీలత, నగర ప్రణాళికలు, నగరాభివృద్ధి మొదలైన వివిధ అంశాలపై నగర సమాజశాస్త్రజ్ఞులు తమ దృష్టిని కేంద్రీకరిస్తారు.

నగర సమాజశాస్త్ర పరిధి ప్రధానంగా మూడు విభాగాలుగా సాగుతుంది. అవి.

1) నగర సమాజశాస్త్ర పరిచయ విభాగం

2) విశ్లేషాత్మక నగర సమాజశాస్త్ర విభాగం

3) పంస్కరణాత్మక నగర సమాజశాస్త్ర విభాగం

**1) నగర సమాజశాస్త్ర పరిచయ విభాగం :** నగర సమాజశాస్త్ర పరిధి విస్తృతమైనది. నగర జీవనానికి సంబంధించిన ప్రతి అంశాన్ని ఈ శాస్త్రం పరిశీలిస్తుంది. ముఖ్యంగా ఆధునిక కాలంలో నగరాల ప్రాధాన్యత పెరిగింది. నగరాలను ఆధునికతకు ప్రతీకలుగా భావిస్తున్నందువలన నగరాలపై దృష్టి కేంద్రీకరింపబడుతోంది. నగర సమాజశాస్త్ర పరిచయ విభాగంలో నగర జీవనానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను పరిశీలిస్తారు. నగరాల, పట్టణాలలోని వ్యక్తుల జీవనం నగర సమాజశాస్త్రానికి ప్రధానమని ఆండర్సన్ పేర్కొన్నారు. నగర సమాజ నిర్మాణం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంస్థల స్వరూప స్వభావాలు, నగర జన సాంద్రత మొదలైన మౌలిక విషయాలను ఈ విభాగంలో అధ్యయనం చేయడం జరుగుతుంది. వీటితో పాటు నగర సమాజంలోని వ్యక్తుల మానసిక విశ్లేషణ అవసరం. నగర సమాజాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే వ్యక్తుల మానసిక రీతులను పరిశీలించాలి. వారి భాష, ఆలోచనా సరళి, వారి ప్రతిస్పందనలు, మానసిక వికాసం వంటి అంశాలను అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. నగరవాసుల గమనాన్ని అర్థం చేసుకోవటానికి ఈ రకమైన అధ్యయనం అవసరం. ఒకే రకమైన సంఘటనకు గ్రామీణులు ఒక రకంగాను, నగరవాసులు మరొక రకంగాను ప్రతిస్పందిస్తుంటారు. అందువలన నగర జీవనంలో ఒక ప్రత్యేకత ఉన్నది. దీనిని అర్థం చేసుకోవడానికి మానసిక విశ్లేషణ అవసరం.

**2) విశ్లేషాత్మక నగర సమాజశాస్త్ర విభాగం :** నగరాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి విశ్లేషించడం ఈ విభాగం లక్ష్యం. అంటే ఒక సమాజాన్ని పరిశీలిస్తున్నప్పుడు అది గ్రామీణ సమాజంకంటే ఏ విధంగా విభిన్నంగా ఉన్నది ? దానిని పట్టణంగా, లేక నగరంగా పరిగణించాలా ? అన్న అంశాలను ముందుగా పరిశీలిస్తారు. నగర సమాజంగా దానిని గుర్తించిన తర్వాత అది నగరంగా పరివర్తన చెందడానికి దోహదం చేసిన వివిధ అంశాలను గుర్తిస్తారు. ఇటువంటి విశ్లేషణ ఫలితంగా భవిష్యత్తులో ఆ సమాజం ఏ రీతిలో మార్పు చెందుతుందనే విషయం గమనించే అవకాశం ఉంటుంది.

**3) సంస్కరణాత్మక నగర సమాజశాస్త్ర విభాగం :** నగర సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలను ఈ విభాగంలో చర్చిస్తారు. ముందుగా ఆ సమస్యలకు కారణాలను కనుగొంటారు. తర్వాత ఆ సమస్యల పరిష్కారానికి మార్గాలు అన్వేషిస్తారు. ఉదాహరణకు, నేటి నగరాలలో మురికివాడల విస్తరణ ముఖ్య సమస్య, ఈ మురికివాడలే నిరుద్యోగం, దారిద్ర్యం వ్యభిచారం, నేరం మొదలైన అనేక సమస్యలకు నిలయాలు. ఇటువంటి సమస్యల నిర్మూలనకు నగర సమాజశాస్త్రం పరిష్కార మార్గాలు అన్వేషిస్తుంది. దీనితోపాటు నగర సమాజాభివృద్ధికి ప్రణాళికా రచన చేస్తుంది. భవిష్యత్తులో నగర జీవనాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికా రచన సాగుతుంది.

నగర సమాజశాస్త్రంలో ఈ మూడు ముఖ్య విభాగాలు ద్వారా జన జీవనాన్ని అధ్యయనం చేస్తారు. అనేక వాస్తవాలను బహిర్గతం చేస్తారు. నగర సమాజశాస్త్ర అధ్యయనంలో సామాజిక జీవన అధ్యయనం అన్నింటికంటే ముఖ్యమయినది.

## 11.6. అధ్యయన పద్ధతులు :

నగర సమాజశాస్త్రము ఇటీవలే పుట్టిన శాస్త్రమయినప్పటికీ ఈ శాస్త్రము యొక్క ఆవశ్యకత రోజురోజుకు పెరుగుచున్నది. ప్రభుత్వ యంత్రాంగము, ప్రభుత్వ నిర్వహణ నగరాలలోనే ఉంటుంది. పరిశ్రమలు ఎక్కువగా నగరాలలోనే ఏర్పాటుచేస్తారు. అక్షరాస్యతలోను, నాగరికతలోను, అధికారము కలిగియుండుటలోను, నగరవాసులు మొదటిస్థానాన్ని కలిగియుంటారు. అందువలన నగర సముదాయాన్ని శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడానికి కొన్ని పద్ధతులను నగర సమాజశాస్త్రంలో ఉపయోగిస్తారు. అవి.

**సాధారణ శాస్త్రీయ పద్ధతి :** ఒక విషయాన్ని పరిశీలించడానికి సాధారణంగా సమజశాస్త్రం సాధారణ శాస్త్రీయ పద్ధతి ఉపయోగిస్తుంది. ఇందులో పరిశీలించవలసిన విషయాన్ని గూర్చి సమగ్ర అధ్యయనం చేయడం, తరువాత ప్రశ్నాపత్రంద్వారా గానీ ఇంటర్వ్యూ పద్ధతిలో గానీ విషయసేకరణ చేయడం జరుగుతుంది. తదనంతరం గణాంక పద్ధతిని ఉపయోగించుకొని విశ్లేషించడం, జరుగుతుంది.

**చారిత్రక పద్ధతి :** నగర సముదాయం ఎట్లా అభివృద్ధి చెందినదీ, మొదట ఏ రూపంలో ఉండేదీ, ఇప్పటి పరిస్థితికి రావడానికి ఎంత కాలం పట్టిందీ, ఏయే కారణాలు వాటికి దోహదం చేసాయి, అనే విషయాలు గ్రహించవలెనంటే చారిత్రక పద్ధతిని ఉపయోగించుకోవాలి. చారిత్రక పద్ధతిలో గౌణ దత్తాంశం (Secondary data) ఉపయోగించుకుంటారు. పాత రికార్డులు, ఇంతకు పూర్వం పరిశోధించిన గ్రంథాలు, వార్తా పత్రికలు మొదలైనవి గౌణ దత్తాంశంగా ఈ పరిశోధనలో ఉపయోగపడతాయి.

**జనాభా శాస్త్ర పద్ధతి :** జనాభా స్వభావాన్ని, వనరులకు తగినట్లుగా జనాభా అభివృద్ధి జరుగుతున్నదా ? లేదా ? మొదలయిన విషయాలు, ఈ పద్ధతిలో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇందుకు జననరేటు, మరణరేటు, వలస విధానం, వివాహ వయస్సు, సంతానోత్పత్తి కాలం పరిశీలిస్తారు. దీని వలన నగర ప్రణాళిక సాధ్యపడుతుంది.

**ఆవరణ శాస్త్ర పద్ధతి :** నగర సముదాయాలలోని జనాభా లక్షణాలను గురించి, జనాభా కార్యక్రమాలను గురించి, నివాస ప్రాంతాల స్థితిగతుల గురించి, నివాస ప్రాంతాల విభజన గురించి పరిశీలించడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిలో కొంత భూగోళశాస్త్రం యొక్క జ్ఞానాన్ని పద్ధతులను ఉపయోగించుకోవలసి ఉంటుంది.

**సాంస్కృతిక విలువల పద్ధతి :** ఒక సముదాయంలోని సాంస్కృతిక విలువల దృష్ట్యా పరిస్థితులను వివరించవచ్చును. ఈ పద్ధతిలో సాంస్కృతిక విశ్లేషణ జరుగుతుంది. ప్రజల ఉద్దేశ్యాలు, కోర్కెలు, మనఃప్రవృత్తులు తెలుసుకోవడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.

**సాంఘిక మనో వైజ్ఞానిక పద్ధతి :** నగరంలో భిన్న మనస్తత్వాలు ఉన్న వ్యక్తులు నివసిస్తుంటారు. వారి మనఃప్రవృత్తులను, ప్రవర్తనలను అర్థం చేసుకోవాలెనంటే మనస్తత్వ శాస్త్ర దృక్పథంతో సముదాయాన్ని విశ్లేషించడం అవసరం. నగరంలో అనేక మార్పులు వస్తుంటాయి. అంతేకాక నగరాలలోని వ్యక్తులు గౌణ సంబంధాలను కలిగియుండుట చేత వ్యక్తులు సాన్నిహిత్యం, ప్రేమాభిమానాలు లేక మానసిక సమస్యలకు గురి అవుతుంటారు. అందువలన నగర వ్యక్తుల మనస్తత్వాలను, ప్రవర్తనలను అర్థం చేసుకోవడానికి, నియంత్రించడానికి సాంఘిక మనోవైజ్ఞానిక పద్ధతులు ఉపయోగపడతాయి.

## 11.7. నగర సమాజశాస్త్ర ప్రాముఖ్యత :

ఈనాడు నగర సమాజశాస్త్రం ఒక ప్రత్యేక శాస్త్రంగా సమాజశాస్త్రంలో చోటు చేసుకున్నది. నగర సమాజశాస్త్రం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది గుర్తించారు. నగర సమాజశాస్త్రం నగర జీవితం, నగర సముదాయాలకు సంబంధించిన అనేక అంశాలను అధ్యయనం చేస్తుంది. నేరము, బాల నేరము, మద్యపానము, మురికివాడలు, పరిసరాల కాలుష్యం, మొదలైన సమస్యలను పరిష్కరించుటలో నగర సమాజశాస్త్రం తోడ్పడుతుంది. వివిధ రకాలైన వినోద కార్యక్రమాల ప్రభావం నగర యువకులపై ఏ విధంగా ఉందో అధ్యయనం చేస్తుంది. నగరాలలో గల పరిశ్రమలు, పారిశ్రామిక సంబంధాలు, యజమాన్యానికి కార్మికులకు మధ్యగల వివాదాలకు కారణాలు మొదలగు సమస్యలను కూడా నగర సమాజశాస్త్రం అధ్యయనం చేయడం వలన పారిశ్రామిక ఉద్రిక్తతలను తగ్గించే అవకాశముంటుంది. నగరాలలో స్త్రీల ఆర్థిక స్థితిని అధ్యయనం చేసి, స్త్రీల సమస్యలకు పరిష్కారాలను సూచిస్తుంది. నగర సమాజ నిర్మాణాన్ని, పరిసరాలలో వచ్చే మార్పులను అనేక రకాలైన కాలుష్యాలను, వాటి ప్రభావాన్ని అధ్యయనం చేసి ప్రజలకు వివరిస్తుంది. అంతేకాక నగరాభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రణాళికలను రూపొందించడానికి, వాటిని అమలు పరచడంలోను, నగర సమాజశాస్త్రజ్ఞులు ప్రభుత్వానికి ప్రణాళికా వేత్తలకు తోడ్పడతాయి. గ్రామీణ నగర సముదాయాల మధ్య అధికమవుతున్న వ్యత్యాసాలను తొలగించి, వాటి మధ్య సదవగాహన పెంపొందించుటలో నగర సమాజశాస్త్రం ప్రధాన పాత్ర వహిస్తుంది.

## 11.8 ముగింపు :

స్వాతంత్ర్యానంతరం నగరీకరణ ప్రక్రియ తీవ్రమయినది. పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, మొదలయిన ప్రక్రియల వలన నేడు నగరాల సంఖ్య అధికమయింది. గ్రామీణ నగర వలస పెరిగింది. విద్యావ్యాప్తి, రవాణా, భావ ప్రసారాల సౌకర్యాలు, ఆధునిక సౌకర్యాలు, చేనేత, కుటీర పరిశ్రమల పతనము యాంత్రికీకరణ మొదలైనవాటివలన గ్రామీణ ప్రజలు అధికంగా నగరాలకు వలసపోతున్నారు. ఈ అధిక జనాభా వలన నగరాలలో ఉత్పన్నమయ్యే సమస్యలను చర్చించి వాటిని పరిష్కరించుటకు, ప్రణాళికలను తయారుచేయడంలోను, నగర సమాజశాస్త్రం ప్రముఖపాత్ర వహిస్తుంది.

## 11.9 నమూనా ప్రశ్నలు

1. నగర సమాజశాస్త్రమును నిర్వచించి, పరిధిని వివరింపుము. ?
2. నగర సమాజశాస్త్ర పరిధిని, అధ్యయన పద్ధతులను వివరింపుము. ?
3. నేటి ఆధునిక సమాజములో నగర సమాజశాస్త్రము యొక్క ప్రాధాన్యత వివరింపుము ?

## 11.10. చదువదగిన గ్రంథాలు


1. గ్రామీణ, నగర సమాజ శాస్త్రము - తెలుగు ఎకాడమి
2. అర్బన్ సోషియాలజీ - Anderson


డా॥ వి. వెంకటేశ్వర్లు

పాఠం - 12

# నగర సముదాయం దాని లక్షణాలు
## (Urban Community and its characteristics)

**12.0 లక్ష్యం:**

నగర సముదాయమంటే ఏమిటో నిర్వచించి వాటి లక్షణాలు తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క లక్ష్యం

**విషయసూచిక:**


12.1 పరిచయం

12.2 నగర సముదాయం

12.3 నగర సముదాయం - లక్షణాలు

- 12.3.1. అధిక జనసాంద్రత
- 12.3.2. వైవిధ్య వృత్తులు
- 12.3.3. గౌణ సంబంధాలు
- 12.3.4. సాంఘిక వైధర్మ్యం (Social Heterogeneity)
- 12.3.5. సామాజిక పరివర్తన (Social Change)
- 12.3.6. సామాజిక స్తరీకరణ (Social Stratification)
- 12.3.7. సామాజిక గతిశీలత (Social Mobility)
- 12.3.8. సామాజిక నియంత్రణ (Social Control)
- 12.3.9. సామాజిక విలువలు (Social values)
- 12.3.10. స్వచ్ఛంధ సంస్థల పాత్ర
- 12.3.11. సామాజిక సహనం (Social Tolerance)
- 12.3.12. కృత్రిమ వాతావరణం
- 12.3.13. యాంత్రిక జీవనం (Mechanical Life)
- 12.3.14. అధికమైన పోటీతత్త్వం
- 12.3.15. కుటుంబ వ్యవస్థ
- 12.3.16. నాయకత్వం

12.4. సారాంశం

12.5. ముఖ్యపదాలు

12.6. నమూనా ప్రశ్నలు

12.7. చదువదగిన గ్రంథాలు

## 12.1. పరిచయం:

ఒక నివాస ప్రాంతాన్ని ఉద్దేశించి సముదాయం అనే పదాన్ని సాధారణంగా ఉపయోగించటం జరుగుతుంది. సముదాయమంటే నిర్దేశిత ప్రదేశంలో కలసి నివసించే జనసమూహం. వారి మధ్య ఐకత్య భావం ఉంటుంది. ఎక్కడైతే ఒక సమాజంలోని ప్రజలు కలిసి మెలిసి నివసిస్తూ ఒక నిర్దిష్ట కార్యకలాపానికీ పరిమితం కాకుండా సామాజిక జీవనానికి తగినట్లు వారిలో ఆసక్తి, సహకారం పెంపొందించుకునే దానిని సముదాయంగా ఆర్.ఎమ్. మెకైవర్, పేజ్ సముధాయాన్ని నిర్వచించారు. ఒకే రకమైన భౌగోళిక ప్రదేశాన్ని అక్రమించుకొని వారి నిత్య జీవన చర్యలను కొనసాగించే వ్యక్తుల కలయికనే సముదాయంగా పార్సన్స్ అభిప్రాయపడ్డాడు. సమాజశాస్త్ర పరంగా సముదాయమంటే కొన్ని భౌగోళిక హద్దుల నడుమ ప్రాంతంలో నివసించే ప్రజలు పరస్పరాధారాలైన శ్రమ విభజనను కలిగి ఉండి, వారంతా ఒకే సంస్కృతితో ఉంటూ, తాము ఆ సముదాయానికి చెందిన వారమనే భావంతో కలిసికట్టుగా, వ్యవస్థాపన పూర్వకంగా పనిచేస్తూ ఉంటే ప్రజా సమూహం సముదాయాలను ప్రధానంగా రెండు విధాలుగా విభజించవచ్చు. అవి గ్రామీణ సముదాయం మరియు నగర సముదాయం. భౌగోళిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక లక్షణాల్ని బట్టి వీటి మధ్య తేడాలుంటాయి. జనాభా ఆధారంగా వీటి మధ్య విభజన జరుగుతుంది. జనసాంద్రత, సామాజిక వైవిధ్యత వృత్తి కూడా జనాభాతో పాటు వీటి వర్గీకరణలో ముఖ్య పాత్ర వహిస్తాయి.

వివిధ నిర్వచనాలను బట్టి ప్రతి సముదాయానికి ప్రధానంగా నాలుగు లక్షణాలుంటాయి. ప్రజా సమూహం, స్థానిక ప్రాంతం, ఒకే జీవన విధానం మరియు మేమంతా ఒక్కటే అనే భావన (We feeling) వీటితో పాటు ఉమ్మడి భౌగోళిక హద్దులు కలిగి ఉండడం ఉమ్మడి సంస్కృతి, వ్యవస్థాపన, పరిస్పరాధారితమైన శ్రమ విభజన వంటి లక్షణాల్ని కూడా సముదాయం కలిగి ఉండి ఇటువంటి లక్షణాలున్న ప్రతి మానవ సమూహాన్ని సముదాయంగా చెప్పవచ్చు.

## 12.2. నగర సముదాయం:

జనాభా సంఖ్య, జనసాంద్రత, వైవిధ్యత, జీవన విధానాల్ని బట్టి నగర సముదాయాలు గ్రామీణ సముదాయలకంటే భిన్నంగా ఉండటాన్ని గమనించవచ్చు. నగరం ప్రత్యేకీకరణ కేంద్రం, వ్యవసాయేతర వృత్తుల గల జనాభాల సమీకరణగా జేమ్స్ ఎ. క్వీన్ అభిప్రాయపడ్డాడు. ఒక నిర్ణీత భౌగోళిక ప్రాంతం, దానిలో అధిక స్థిర జనాభాతో, వారికి ఉమ్మడి ఆవశ్యకతలు, సంస్థలు ఉండి, చట్టబద్ధమైన స్థానిక ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. అని హోవార్డ్ వూల్‌స్టన్ భావించాడు.

జానాభా లెక్కలు వర్గీకరణ ప్రకారం నగరాల ప్రాంతాలు క్రింది విధంగా ఉన్నాయి.

(ఎ) మున్సిపల్ కార్పోరేషన్, మున్సిపల్ ప్రాంతం, నోటిఫయిడ్ ప్రాంతం కంటోన్‌మెంట్ బోర్డ్‌లలో ఏదైనా

(బి) ఏదైనా ఈ క్రింది ప్రమాణాలకు అనుగుణమైన ప్రాంతం

1. కనీసం 5000 జనాభా
2. జనసాంద్రత ఒక చదరపు మైలుకు 1000 జనాభా
3. కనీసం 75 శాతం వ్యవసాయ వృత్తులవారై ఉండటం

భారతదేశంలో నగర ప్రాంతాలు ఒక లక్షకన్నా తక్కువ ఉంటే వాటిని పట్టణాలని లక్షకంటే ఎక్కువగా ఉంటే వాటిని నగరాలని పరిగణిస్తారు. నగర సముదాయాలలో అధిక జనాభాతో పాటు జనసాంద్రత కూడా ఎక్కువగానే ఉంటుంది.

## 12.3. నగర సముదాయం - లక్షణాలు:

మెకైవర్, పేజ్, సోరోకిన్, జిమ్మర్‌మన్, జార్జిసిమ్మెల్, లూయిస్‌వర్త్ వంటి సమాజశాస్త్రజ్ఞులు నగర సముదాయపు వివిధ లక్షణాల్ని వివరించారు.

నగర సముదాయ లక్షణాల్ని క్రింది గమనించవచ్చు.

**12.3.1. అధిక జనసాంద్రత** - నగర సముదాయంలో జనసాంద్రత అధికంగా ఉంటుంది. గ్రామీణ సముదాయాలకంటే ఎక్కువ జనసాంద్రత నగరాలలో కనిపిస్తుంది. పార్కులు మొదలుకొని పరిశ్రమల వరకు ఎక్కడ చూసిన జనం కనిపిస్తారు. నగరంలో నివాస ప్రాంతాలు అన్ని ప్రదేశాలలోను ఉంటాయి. అధిక జనాభా వల్ల మురికి పేటలు, పర్యావరణ కాలుష్యం వంటి సమస్యలు నగరాలలో పెరగడానికి దోహదపడుతుంది. జనసాంద్రత వల్ల వివిధ సమస్యలు కలుగుతున్నాయి.

**12.3.2. వైవిధ్య వృత్తులు** - నగర ప్రాంతాలలో పారిశ్రామికీకరణ ఫలితంగా వృత్తులలో వైవిధ్యం కనిపిస్తుంది. వ్యవసాయేతర వృత్తులపైనే అధిక శాతం ప్రజలు ఆధారపడటం నగర సముదాయ ప్రధాన లక్షణం. వ్యక్తుల శక్తి, సామర్థ్యాలను బట్టి, విద్యార్హతలు, నైపుణ్యతల ఆధారంగా వృత్తులను ఎంచుకోవటం జరుగుతుంది. వృత్తి ప్రత్యేకీకరణ ద్వారా వ్యక్తులు వివిధ రంగాలలో విధులను నిర్వర్తించడం జరుగుతుంది.

**12.3.3. గౌణ సంబంధాలు** - గ్రామీణ సముదాయాలలో వ్యక్తుల మధ్య ప్రాథమిక సంబంధాలు ఉంటాయి. నగర సముదాయాలలో మాత్రం వ్యక్తుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు ఉండవు. నగర సముదాయాలలో పరోక్ష లేదా గౌణపరమైన సంబంధాలు చోటు చేసుకుంటాయి. నగర సముదాయాలతో వ్యక్తుల మధ్య సంబంధాలు కృత్రిమంగా ఉంటాయే తప్ప ఆప్యాయత, ప్రేమ, స్నేహానికి అవకాశం ఉండవు. ఒకరిలో ఒకరు కొన్ని నిర్దిష్ట, పరిమిత లక్ష్యాలకోసం పరస్పర చర్య కలిగి ఉంటారు. వ్యక్తులు నిర్వహించే పాత్రలకే కానీ, వారి వ్యక్తిగత లక్షణాలకు ప్రాముఖ్యత ఇవ్వరు. నగరాలలో క్లబ్బులు, కార్మిక, ఉపాధ్యాయ సాంస్కృతిక, క్రీడా, సంఘాలు గౌణ సమూహాలకు ఉదాహరణగా పేర్కొనవచ్చు. వ్యక్తుల అర్హతలు, అభిరుచులను అనుసరించి అయాసంఘాలకు సభ్యులవుతారు. వీటి ద్వారా వ్యక్తుల వైయుక్తిక ప్రయోజనాలు నెరవేరతాయి. అయితే ఏ సమూహం కూడా తన సభ్యుల మధ్య గౌణ సంబంధాల మీదనే పూర్తిగా ఆధారపడటం జరగదు.

**12.3.4. సాంఘిక వైధర్మ్యం** - నగర సముదాయంలో సంస్కృతి, వృత్తి, అంతస్తు, భాష, నివాసస్థలం వంటి విషయాలలో వైధర్మ్యత చోటు చేసుకుంటుంది. అధిక జనసాంద్రిత వల్ల అనేక సౌకర్యాల కోసం నగరంలో వ్యక్తుల మధ్య పోటీ నెలకొంటుంది. భారీ పరిశ్రమల వల్ల శ్రమ విభజన ఎక్కువై ప్రత్యేకతలను ప్రోత్సహిస్తున్నాయి. దీనికై అర్హత, నైపుణ్యత, సాధనలో, ఉద్యోగ సంపాదనలో వ్యక్తుల మధ్య వ్యవస్థా పూర్వకమైన పోటీ ఏర్పడుతుంది. ఫలితంగా వర్గ సమాజానికి దారి తీస్తుంది. పలు ప్రత్యేకతలు నగరాలలో ఉండటంతో సాంఘిక వైధర్మ్యం నగర సముదాయ లక్షణంగా చెప్పవచ్చు. నగరాలలో తరచుగా సంభవించే మత సంఘర్షణలకు సాముదాయక అలజడలకు సాంఘిక వైధర్మ్యం కారణంగా చెప్పవచ్చు.

**12.3.5. సామాజిక పరివర్తన** - మార్పు అనేది ఏ సముదాయంలోనైన సహజమైనప్పటికి నగర సముదాయం నిరంతరం మారుతునే ఉంటుంది. సామాజిక పరివర్తన నగర సముదాయంలో అధికంగా ఉంది. పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునికీకరణ ఫలితంగా నగర సముదాయంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఉత్పత్తి చేసుకున్నాయి. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఉత్పత్తి రంగంలోనే కాదు ప్రజల జీవన విధానంలోను గణనీయమైన మార్పును గమనించవచ్చు.

సంస్కృతి, సంప్రదాయాలు, వేషభాషలు ఆహార అలవాట్లు, వస్త్రధారణ వంటి వాటిపై పాశ్చాత్య ప్రభావం కొట్టు వచ్చినట్టు కనిపిస్తుంది. నగరీకరణ ఫలితంగా కాలుష్యం, మురికి పేటలు, గృహ సమస్యవంటి అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి.

**12.3.6. సామాజిక స్తరీకరణ** - సామాజిక స్తరీకరణ కులం వర్గం ద్వారా ఏర్పడుతుంది. నగర సముదాయాలలో కుల ప్రాబల్యం గ్రామీణ సముదాయంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది. కుల వ్యవస్థ ఆధారితమైన క్రమ శ్రేణికి బదులు వర్గ వ్యవస్థ ఆధారమైన స్తరాలు ఏర్పడతాయి. నగర సముదాయంలో మతం, కులం బంధుత్వం, వంటి వ్యవస్థల ప్రాముఖ్యత అంతగా ఉండదు. ఆచారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలు, విలువలకు సంబంధించిన విషయాలు కూడ నగర సముదాయంలో పట్టించుకోవటం తక్కువనే చెప్పవచ్చు.

**12.3.7. సామాజిక గతిశీలత** - వ్యక్తులు, సమూహాలు తమ ప్రతిభా పాటవాలను, ప్రజ్ఞను, శక్తి సామర్థ్యాల అభిరుచులకు అనుగుణంగా నిరూపించుకోవటానికి అనేక అవకాశాలు నగర సముదాయంలో లభిస్తాయి. వాటి వల్ల వారు ఉన్నత స్థాయికి చేరుకొనే వీలు కలుగుతుంది. సమస్తరీయ గతిశీలతతో పాటు విషయ స్తరీయ గతిశీలత కూడా ఉంటుంది. పోటీ ప్రపంచంలో ప్రతిభ ఉన్న వాళ్లదే పై చేయిగా ఉండటాన్ని నగర సముదాయంలో గమనించవచ్చు. అంతస్థులు వ్యక్తుల పుట్టుకను బట్టి కాకుండా సాధన మీద ఆధారపడి నిర్ణయింపబడటాన్ని నగర సముదాయంలో చూడవచ్చు.

**12.3.8. సామాజిక నియంత్రణ** - సామాజిక నియంత్రణ నగర సముదాయంలో అంతగా ఉండదు. వ్యక్తుల ప్రవర్తన పై ప్రాథమిక సమూహాల ప్రభావం పరిమితంగా ఉంటుంది. సామాజిక నియంత్రణ పటిష్టంగా లేకపోవడంతో సామాజిక అవ్యవస్థ నగర సముదాయంలో ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా నేర ప్రవృత్తి, పడుపువృత్తి, జూదం వంటి సామాజిక సమస్యలు ఉత్పన్నమవుతాయి. సామాజిక కట్టుబాట్లు విలువల విషయంలో సడలింపు కనిపిస్తుంది. వీటిని పాటించేవారు తక్కువగా ఉంటారు. నగర సముదాయంలో వ్యక్తుల ప్రవర్తన అనేది అనియత సంస్థలచే కాకుండా నియత సంస్థలైన పోలీసు, కోర్టులు, ప్రభుత్వం వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది.

**12.3.9. సామాజిక విలువలు** - నగర సముదాయంలో బహిరంగ జీవనంలో అధికంగా ఆధువిక లౌకిక విలువలకు, కుటుంబ స్థాయిలో సంప్రదాయక విలువలకు ప్రాధాన్యత నివ్వటం జరుగుతుంది.

**12.3.10. స్వచ్ఛంద సంస్థల పాత్ర** - నగర సముదాయంలో అధిక జనాభావల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతైన ఉంది. ప్రధానంగా రోటరీ క్లబ్‌లు, లయన్స్‌క్లబ్‌లు, మహిళ, కార్మిక, యువజన సంఘాలు, సాంస్కృతిక సంస్థలు వారి వారి స్థాయిలతో వ్యక్తుల అవసరాలను తీర్చటానికి కృషి చేస్తున్నాయి. నగర సమస్యలను ఎదుర్కొనటంతో స్వచ్ఛంద సంస్థల పాత్ర గణనీయమైనది.

**12.3.11. సామాజిక సహనం** - నగర సముదాయంలో విద్యావంతులు ఎక్కువగా ఉండటం వల్ల శాంతిగా ఉండటం సహనంతో మెలగటం జరుగుతుంది. విభేదాలకు, వివాదాలకు దూరంగా ఉండటం వీరిలో చూడవచ్చు. వ్యక్తిగత విభేదాలున్న వృత్తి రీత్య ప్రగతిని సాధించటానికే ప్రయత్నిస్తారు. మొత్తం మీద గ్రామీణ సముదాయంకన్న సామాజిక సహనం నగర సముదాయంలో అధికంగా ఉంటుంది.

**12.3.12. కృత్రిమ వాతావరణం** - ప్రకృతి సౌందర్యం కాని ప్రశాంత వాతావరణం కాని నగర సముదాయంలో కనిపించదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల నగరాలలో పెను మార్పులు వచ్చాయి. దాంతో నగర రూపు రేఖలతో మార్పు వచ్చింది.

ఆకాశాన్నంటే భవనాలు, భారీ పరిశ్రమలు, ఉద్యానవనాలు (పార్కులు) ప్రదర్శనశాలలు (మ్యూజియంలు)ను నగర సముదాయంలో చూడవచ్చు. కృతిమ వాతావరణంలో నగర సముదాయంలో అధికంగా ఉంటుంది.

**12.3.13. యాంత్రిక జీవనం** - పారిశ్రామికీకరణ, ఆధునికీకరణ, పాశ్చాతీకరణ ప్రభావంతో పూర్తిగా నగర జీవితం యాంత్రికపరంగా మారింది. ఉదయం లేచింది మొదలుకొని రాత్రి నిదురపోయే వరకు ఆయా సమయాలలో ప్రకార్యలను నిర్వర్తించటంతోనే వ్యక్తికి సమయం సరిపోతుంది. దాంతో వ్యక్తి జీవితం యాంత్రికంగా ఉంటుంది. మానవ సంబంధాలు అంతంత మాత్రమే మానసిక ఒత్తిడికి నగర వాసులే అధికంగా లోనవుతారు.

**12.3.14. అధికమైన పోటీతత్త్వం** - గ్రామీణ సముదాయంలో కన్న పోటీ మనసత్త్యం నగర సముదాయంతోనే అధికంగా కనిపిస్తుంది. రేయి పగళ్లు కృషించిన అనుకున్నది లభించినపుడు అసంతృప్తి కలుగుతుంది. కోరికలు ఎక్కువగా ఉండటం, అవి ఎంత శ్రమించిన నెరవేరకపోవటం వల్ల మానసిక సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. అవకాశాలకోసం పోటీ పడేవారి సంఖ్య నగర సముదాయంలో అధికంగానే ఉంది.

**15. కుటుంబ వ్యవస్థ** - నగర సముదాయంలో వృష్టి కుటుంబాలే అధికంగా ఉంటాయి. పారిశ్రామికీకరణ, నగరీకరణ, ఆధునీకీకరణ, పాశ్చాతీకరణ ఫలితంగా ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు కావటం గ్రామలకే పరిమితం కావటం జరుగుతుంది. వ్యక్తిగత ప్రయోజనాలనే ముఖ్యమని భావించే నగరవాసులు పరిమిత, కుటుంబం పట్ల ఆసక్తి చూపుతారు. చిన్న కుటుంబానికే ప్రాధాన్యతనిస్తారు.

**16. నాయకత్వం** - నగర సముదాయంలో గ్రామీణ సముదాయంలో ఉండే ముఠా తగాదాలు, ఆధిపత్య కులాల నాయకత్వం ఉండదు. ప్రజాస్వామ్య, లౌకిక నాయకత్వమే ప్రధానంగా నగర సముదాయంలో కనిపిస్తుంది.

**సారాంశం :**

సముదాయమంటే నిర్దేశిత ప్రదేశంలో కలిసి నివసించే జనసమూహం. సముదాయానికి మూలాలు స్థానికత, ఒకే సముదాయానికి చెందిన వారమనే భావన. ప్రధానంగా సముదాయంలు రెండు రకాలు. అవి గ్రామీణ మరియు నగర సముదాయం జనాభా సంఖ్య, జనసాంద్రిత, వైవిద్యత వంటి అంశాలు నగర సముదాయాన్ని గుర్తించటానికి ఉపకరిస్తాయి. అధిక జనాభాతో ఎక్కువ జనసాంద్రతను నగర సముదాయం కలిగివుంటుంది. వ్యవసాయేతర వృత్తులే నగర సముదాయంలో ప్రధానంగా ఉంటాయి. పారిశ్రామిక వృత్తులలోను, వర్తక, వాణిజ్య సంస్థలల్లోను కార్యాలయాలలోను వ్యక్తులు పని చేస్తారు. నగరాలలో గౌణ సంబంధాల ప్రభావం అధికంగా ఉంటుంది. అంతస్తు, భాష, సంస్కృతి మతపరంగా సమూహాల మధ్య వైధర్మ్యం నగర సముదాయంలో ఉంటుంది. సామాజిక పరివర్తన నగర సముదాయంలో అధికంగా ఉంటుంది. వివిధ రంగాలలో అభివృద్ధికి అది దోహదపడుతుంది. వ్యక్తుల ప్రతిభతో అభిరుచులకు అనుగుణంగా అవకాశాలను పొంది ఉన్నత అంతస్తును పొందటానికి అనువైన మార్గాలు నగర సముదాయంలో లభిస్తాయి. సమస్తరీయ గతిశీలతతో పాటు విషయ స్తరీయ గతిశీలత కూడా ఉంటుంది. సామాజిక నియంత్రణ నగర సముదాయంతో ధృడంగా లేకపోవటంతో నేర ప్రవృత్తి జూదం, పడుపువృత్తి , అవినీతి వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. నగర సముదాయంలో ఉమ్మడి కుటుంబాలకన్న వృష్టి కుటుంబాలే అధికంగా ఉంటాయి. నగర సముదాయంలో కృత్రిమ వాతావరణం కనిపిస్తుంది. యాంత్రికమైన సంబంధాలే నగర సముదాయంలో ప్రధానంగా ఉంటాయి. ప్రజాస్వామ్య, లౌకిక నాయకత్వమే నగర సముదాయంలో ఉంటుంది.

**ముఖ్యపదాలు:**

సముదాయం (Community)

గౌణ సంబంధాలు (Secondary Relations)

సామాజిక స్తరీకరణ (Social Stratification)

సామాజిక గతిశీలత (Social Mobility )

సాంఘిక వైధర్మ్యత (Heterogeneity)

## 12.6. నమూనా ప్రశ్నలు :

1. నగర ప్రాంతాలను నిర్వచించి, నగర సముదాయపు లక్షణాలను విశదీకరించుము.
2. వృత్తి సామాజిక గతిశీలత, సామాజిక సంబంధాలకు సంబంధించి నగర సముదాయం యొక్క లక్షణాలను వివరించుము.

## 12.7 చదువదగిన గ్రంథాలు :


1) Urban Sociology - James A Quinn

2) The Urban Community - Anderson

3) Urban Sociology - Begel


**డా. జి.వి. రమణ**

పాఠం - 13

# నగరాలు - వర్గీకరణ
# (Types of Cities)

## 13.0 లక్ష్యం:

నగరాలు - వర్గీకరణ, రకాలు, నగరాభివృద్ధికి దోహదపడే అంశాలను గురించి తెలుసుకోవడమే ప్రస్తుతపాఠం యొక్క ప్రధానోద్దేశం.

## విషయసూచిక :


13.1. పరిచయం

13.2. నగరాలు - వర్గీకరణ, రకాలు

13.2.1. ఉత్పత్తి లేదా పారిశ్రామిక కేంద్రాలు ( Production or industrial Centres )

(ఎ) ప్రాథమిక ఉత్పత్తి కేంద్రాలు (Primary Production Centres)

(బి) గౌణ ఉత్పత్తి కేంద్రాలు (Secondary Production Centres)

13.2.2. వర్తక, వాణిజ్య కేంద్రాలు ( Centres of trade and commerce)

13.2.3. రాజధాని నగరాలు (Capital Cities)

13.2.4. ఆరోగ్య, వినోదకేంద్రాలు (Health and recreation centres)

13.2.5. సాంస్కృతిక, విద్యాకేంద్రాలు (Cultural Centres)

13.2.6. సైనిక కేంద్రాలు (Military Centres)

13.2.7. వైవిధ్య నగరాలు (Diversified cities)

13.3. నగరాభివృద్ధి - కారణాలు

13.3.1. పారిశ్రామికీకరణ

13.3.2. వ్యాపారీకరణ

13.3.3. ప్రసార సాధనాల వ్యాప్తి

13.3.4. రవాణా సౌకర్యాల అభివృద్ధి

13.3.5. విద్య, వైద్య సౌకర్యాలు

13.3.6. వినోద, వికాస కార్యక్రమాలు

13.3.7. రాజకీయ కారణాలు

13.3.8. ఆర్థిక భద్రత

13.4. సారాంశం

13.5. ముఖ్యపదాలు

13.6. నమూనా ప్రశ్నలు

13.7. చదువవదగిన గ్రంథాలు

## 13.1. పరిచయం :

సమాజ శాస్త్రవేత్తలు నగర సముదాయాలను సామాజికంగా పరిశీలించి ఆ సముదాయానికి ఉండే వ్యవస్థాపన, సంస్కృతిని బట్టి విశ్లేషిస్తారు. నగరాల అధ్యయనం వివిధ రకాలుగా ఉంటుంది. చారిత్రకంగా వివిధ కాలాలలో నగరాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో పరిశీలించే వారు కొందరైతే భౌగోళిక స్థితిగతులు, ప్రకార్యాలను దృష్టిలో అధ్యయనం చేసేవారు మరికొందరు. స్వరూప, స్వభావాలలో ప్రత్యేక లక్షణాలతో, ప్రకార్యాలలో నగరాల మధ్య తేడాలు ఉంటాయి. నగరాభివృద్ధికి అనేక అంశాలు దోహదపడతాయి.

## 13.2. నగరాల వర్గీకరణ, రకాలు :

ప్రకార్యాలను అనుసరించి నగరాలను వర్గీకరించే ముందు జనాభా ప్రాతిపదికగా దేశంలోని నగరాలను గణాంక అధికారులు ఆరు ప్రధాన తరగతులుగా వర్గీకరించటాన్ని క్రింది పట్టికలో పేర్కొనడమైంది.

భారతదేశంలో నగరాల వర్గీకరణ

| నగర తరగతి | నగర జనాభా |
|---|---|
| క్లాస్ 1 | 1 లక్షమించిన జనాభా |
| క్లాస్ 2 | 100000 - 50,000 |
| క్లాస్ 3 | 50000 - 20000 |
| క్లాస్ 4 | 20000 - 10000 |
| క్లాస్ 5 | 10000 - 5000 |
| క్లాస్ 6 | 5000 లోపు |

నగర సముదాయాలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, విద్య, చారిత్రక, వాణిజ్యం వంటి రంగాలలో ప్రగతిని బట్టి వివిధ విధాలుగా వర్గీకరించవచ్చు నగరాలను ప్రధాన ప్రకార్యాలను బట్టి ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

**13.2.1. ఉత్పత్తి లేదా పారిశ్రామిక కేంద్రాలు** - ప్రపంచంలో ప్రసిద్ధ పట్టణాలను పారిశ్రామిక పట్టణాలుగా పరిగణిస్తున్నారు. నగరీకరణకు పారిశ్రామికీకరణకు అవినాభావ సంబంధం వుంది. ఒక దానిని వేరొకటి ప్రభావితం చేస్తుంది. పారిశ్రామిక విప్లవం తర్వాత వచ్చిన నగరాలే నేడు ప్రముఖ నగరాలుగా పేరు తెచ్చుకున్నాయి. గ్రామీణ సముదాయంలో వ్యవసాయం ఎంత కీలకమైనదో నగర సముదాయంలో పరిశ్రమలు అంతే ప్రధానం. పరిశ్రమలే నగరానికి ప్రాణం. దేశంలో లక్ష జనాభాకు మించి వున్న నగరాలను పరిశీలిస్తే పారిశ్రామిక నగరాలే ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి నగరాలను తిరిగి రెండు విధాలుగా విభజించవచ్చు.

**(ఎ) ప్రాథమిక ఉత్పత్తి కేంద్రాలు** - పరిశ్రమకు అవసరమైన పనిముట్లను ప్రాథమిక ఉత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి చేస్తారు. ఉదహరణకు ఇనుము, బొగ్గు, నూనె మొదలైన వాటికి సంబంధించిన పరిశ్రమలను ప్రాథమిక ఉత్పత్తి కేంద్రాలని చెప్పవచ్చు. ఇక్కడ పనిచేసే జనాభా ప్రధానంగా ముడిసరకు ఉత్పత్తి లో సిబ్బందిగా పని చేస్తున్నవారే. ముడి సరకు లభించే ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు ఉంది. భారతదేశంలో డెహ్రాడూన్, బారెల్లీ ప్రాంతం నుంచి అడవుల కలపను గౌణ ఉత్పత్తి కేంద్రాలకు పంపడం జరుగుతుంది. ప్రాథమిక పారిశ్రామిక నగరాలుగా అస్సాంలోని గౌహతి నూనె బావులు, బీహారులోని రాంచీ బొగ్గు గనులు, కర్ణాటకలోని కోలార్ బంగారు గనులు వంటి వాటిని చెప్పవచ్చు.

**(బి) గౌణ ఉత్పత్తి కేంద్రాలు** - ప్రాథమిక ఉత్పత్తి నగరాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి సరుకులతో తయారయ్యే వస్తువులను గౌణ ఉత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి చేస్తారు. అధికోత్పత్తికి అనుగుణంగానే సిబ్బంది కూడ ఉంటుంది. ఉదాహరణకు ఫిరోజ్‌బాద్ గాజు పరిశ్రమ, ఆలీఘర్ తాళాలు, రాంపూర్ కత్తెరలు, కత్తులు, కాన్పూరు తోలు వస్తువులు, జంషెడ్‌పూర్ ఇనుము, ఉక్కు పరిశ్రమ, బెంగుళూరు, బెనారస్ సిల్క్ చీరలు మొదలైనవి కొన్ని ఉత్పత్తి నగరాలు. నగర వాసులు సామాజిక, ఆర్థిక రంగాలలో అనేక మార్పులు పరిశ్రమలు, ఉత్పత్తి పెరుగుదల వల్ల చోటు చేసుకుంటాయి. అనేక రకాలైన ఉత్పత్తులు అభివృద్ధి కొన్ని నగరాలలో జరుగుతుంటాయి. ఉదహరణకు ముంబాయి కేవలం బట్టల పరిశ్రమకే కాకుండా విద్యుచ్ఛక్తి మరియు ఇంజనీరింగ్ పనిముట్ల తయారీలో ముందజలో ఉంది. ఇట్లాంటి నగరాలలో ఉపాధి అవకాశాల అంశంలో వ్యక్తులమధ్య గట్టి పోటీ వుంటుంది.

**13.2.2. వర్తక, వాణిజ్య కేంద్రాలు** - సాధారణంగా నగరాలు ఉత్పత్తి కేంద్రాలుగా ప్రసిద్ధి పొందాయి. సముద్రపు ఒడ్డున ఏర్పడిన నగరాలు, ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతుల విషయంలో రేవు పట్నాలుగా పేరుగాంచినవి. పోరుబందరు, సూరత్, కాండ్లా, ముంబాయి, మంగుళూర్, మార్మగోవా, కాలికట్, కొచ్చిన్, అల్లెపి, క్విలాన్, టుటికోరన్, ధనుష్కోడి, నాగపట్నం, కరైకాల్, కడలూర్, పాండిచ్చేరీ, చెన్నై, మచిలీపట్నం (బందరు) కాకినాడ, విశాఖపట్నం మరియు కోల్‌కత్తా పట్నాలు భారతదేశంలో ప్రధాన రేవు పట్నాలు చెన్నై, ముంబాయి, కోల్‌కత్తా తప్ప మిగిలినవన్ని, పూర్తిగా వర్తక, వాణిజ్యానివే ఉన్నాయి. కొన్ని నగరాలు హోల్‌సేల్ వ్యాపారానికి కొన్ని రిటైల్ వ్యాపారానికి ప్రసిద్ధి పొందాయి. మన రాష్ట్రంలో కూడా కొన్ని ప్రాంతాలు వ్యాపార వాణిజ్య కేంద్రాలుగా ఉన్నాయి. ఉదాహరణకు బెల్లం తయారీకి అనకాపల్లి, బట్టల వ్యాపారానికి చీరాల విజయవాడ, రాజమండ్రిని చెప్పవచ్చు.

**13.2.3. రాజధాని నగరాలు** - పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య పరంగా కాకుండా నగరాలు రాజధాని నగరాలుగా కూడ ప్రసిద్ధి పొందినవి అనేక నగరాలు భారతదేశంలో ఉన్నాయి. సాధారణంగా పార్లమెంటు, అసెంబ్లీ, హైకోర్టు, సుప్రీంకోర్టు ప్రభుత్వ కార్యాలయాలు, సంచాలకుల, పోలీసు ఉన్నతాధికారుల కార్యాలయాలు వంటి రాజకీయ, న్యాయ, పరిపాలనా సంబంధమైన వ్యవస్థలు ముఖ్యపట్టణాలలోనే ఉంటాయి. ప్రభుత్వ విధానాలవల్ల ముఖ్యపట్టణాలు వ్యాపార వాణిజ్య ఉత్పత్తి నగరాలుగా అభివృద్ధి చెందాయి. పాలనపరంగానే రాజధాని నగరాలకి గుర్తింపు ఉంది. దేశంలో రాజధాని నగరాలుగా ఢిల్లీ, ముంబాయి, చెన్నై, కోల్‌కత్తా, హైదరాబాద్, భువనేశ్వర్, బెంగుళూర్, తిరువనంతపురం, చండీఘర్ శ్రీనగర్, జైపూర్, లక్నో ప్రసిద్ధి పొందాయి.

**13.2.4. ఆరోగ్య, వినోదకేంద్రాలు** - భౌగోళిక, స్థానిక శీతోష్ణస్థితిననుసరించి ఆరోగ్య వినోద కేంద్రాలుగా కొన్ని నగరాలు ప్రసిద్ధికెక్కాయి. ఈ కేంద్రాలు దేశ, విదేశ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వినోద, వికాస కేంద్రాలుగాను, వేసవి విడుదులుగా పేరుపొందాయి. ప్రభుత్వం వీటి విషయంలో పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని హంగులను సమకూరుస్తుంది. వస్తు ప్రదర్శనశాలలు (మ్యూజియం), ఉద్యానవనాల (పార్కులు) హెల్త్ క్లబ్‌లు, డాన్స్ క్లబ్‌లు వంటివి ఏర్పాటు చేస్తారు. ఆరోగ్యానికి, ఆనందానికి అనుకూలంగా ఉండటం వల్ల వీటి ప్రాముఖ్యత పెరిగింది. ఉత్తరాంచల్‌లోని డెహరాడూన్, లాండ్స్ డౌని, ముస్సోరి, రాణికేట్, నైనిటాల్, అస్సాంలోని చిరపుంజి, షిల్లాంగ్, రాజస్థాన్‌లోని మౌంట్‌అబూ, బెంగాల్‌లోని డార్జిలింగ్, కలింపాంగ్ తమిళనాడులో కూనూరు, కొడైకెనాల్, ఊటి, మహారాష్ట్రలో మహాబలేశ్వరం, బీహార్‌లో రాంచీ, మధ్యప్రదేశ్‌లో పంచ్‌మహల్ వంటి ప్రాంతాలు భారతదేశంలో ప్రసిద్ధి పొందిన ఆరోగ్య, వినోద కేంద్రాలుగా చెప్పవచ్చు.

**13.2.5. సాంస్కృతిక, విద్యా కేంద్రాలు** - భారతదేశంలో మతం పట్ల ప్రగాడ విశ్వాసం కనిపిస్తుంది. ఆచారాలు, సంప్రదాయాలు, నమ్మకాలు కూడ ప్రజలలో ఎక్కువగా ఉన్నాయి. మత సంబంధమైన ప్రాధాన్యత ఉన్న నగరాలు సాంస్కృతిక కేంద్రాలుగా, మరికొన్ని విద్యాపరమైన సంస్థలు ఉండటంతో విద్యా కేంద్రాలుగా ఏర్పడ్డాయి. వివిధ మతాలు దేశంలో ఉన్నాయి వాటికి సంబంధించిన చారిత్రక కేంద్రాలు కూడ నెలకొన్నాయి. అయోధ్య, హరిద్వార్, బెనారస్, పూరి, మధుర, రామేశ్వరం, ప్రయాగ, తిరుపతి, శ్రీశైలం,

హిందూ పుణ్యక్షేత్రాలుగా ప్రసిద్ధి పొందాయి. అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయం సిక్కులకు కేంద్రంగాను, అజ్మీర్ ముస్లింల కేంద్రంగాను, బోధగయ, సారనాథ్ బౌద్ధులకు పవిత్ర స్థలాలుగాను శ్రావణ బెల్‌గోల జైనులకు పేరుపొందాయి. ఆగ్రా, బీజాపూర్, ఢిల్లీ వంటి నగరాలు చారిత్రకంగా పేరుగాంచాయి. అలహాబాద్, ముంబాయి, కోల్‌కత్తా, లక్నో, ఢిల్లీ, మీరట్, చెన్నై, నాగపూర్, రూర్కీ, కురుక్షేత్ర, సాగర్, కటక్, శాంతినికేతన్, పాండిచ్చేరి, బెనారస్ హైదరాబాద్ మొదలైనవి విశ్వవిద్యాలయాలతో, విద్యాసౌకర్యాలతో విద్యాకేంద్రాలుగా వాసికెక్కాయి.

**13.2.6. సైనిక కేంద్రాలు -** సైనికులకు శిక్షణ ఇవ్వటంలోను, రక్షణ సామాగ్రిని ఉత్పత్తి చేయటంలోను, కొన్ని ప్రత్యేక పరిశోధనలు జరిపేటందుకు ప్రయోగశాలలు కలిగి ఉండే నగరాలని సైనిక నగరాలుగా పేర్కొనవచ్చు. భారతదేశంలో రక్షణ సైనిక నగరాలుగా కొన్ని నగరాలు ఉన్నాయి. ఆగ్రా, డెహ్రాడూన్, విశాఖపట్నం, సికింద్రాబాదు వంటివి ఈ తంహాకి చెందినవిగా చెప్పవచ్చు.

**13.2.7. వైవిధ్యనగరాలు** - ప్రకార్యాలను బట్టి నగరాలను ఆయా కేంద్రాలుగా వర్గీకరించిన కొన్ని నగరాలు మాత్రం అన్ని రంగాలలోను పేరు ప్రఖ్యాతలను కలిగి ఉంటాయి. అయితే పరిశ్రమలతో, వర్తక, వాణిజ్య కేంద్రాలుగా, సాంస్కృతికపరంగా చారిత్రకంగా, పర్యాటక స్థలంగా , రాజధాని నగరాలుగా దేశంలో కొన్ని నగరాలు ఉన్నాయి. సమాజ శాస్త్రజ్ఞులు వీటిని ఒక తరగతి కింద అధ్యయనం చెయ్యటం సరికాదంటారు. ఇలాంటి నగరాలను ప్రత్యేక వర్గీకరణతో వైవిధ్య నగరాలుగా పేర్కొంటారు. ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నగరం దీనినే కాశీ అని బెనారస్ అని అంటారు. హిందువులకు పవిత్ర యాత్రస్థలంగా ప్రసిద్ధ విశ్వవిద్యాలయ కేంద్రంగా, వాణిజ్య, వ్యాపార కేంద్రంగా ప్రత్యేకించి పట్టుచీరలకు ప్రసిద్ధిపొందిన నగరంగా పేరుగాంచినది.

పైన వివరించిన వివిధ రకాలైన నగరాలేకాకుండా సమాజ శాస్త్రజ్ఞులు నగరాలను అనేక విధాలుగా విభజించడం జరిగింది.

| సమాజశాస్త్రజ్ఞులు | నగర విభజన |
|---|---|
| ఫిలిఫ్ యం. హోసర్ (Philip M. Houser)<br>లియో ఏఫ్. స్కెనోర్ (Leo. F. Schuore) | 1. ప్రాచీన నగరాలు (Primilitive Cities)<br>2. అదిమ నగరాలు (Feudal Cities)<br>3. మధ్యయుగ నగరాలు (Medievel Cities) |
| గెరాల్ట్ బ్రీజ్ (Gerald Breeze) | 1. పారిశ్రామిక నగరాలు (Industrial Cities)<br>2. వ్యాపార నగరాలు (Market Cities)<br>3. పరిపాలనా నగరాలు (Administrative Cities)<br>4. ఆర్థిక రాజకీయనగరాలు (Colonial Cities) |
| బెర్టెహస్‌విజ్ (Best Hosilitz) | 1. ఉత్పాదక నగరాలు (Generation Cities)<br>2. ఆధారత నగరాలు (Parasitic Cities) |
| రాబర్ట్‌రెడ్ ఫీల్ట్ (Robert Redfield)<br>మిల్టన్ సింగర్ (Milton Singer) | 1. ఆర్థోజనిక నగరాలు (Orthogen cities)<br>2. వైధర్మ్యతా నగరాలు (Heterogene Cities) |

రోసియర్ (Rosier) ——
1. ఉత్పత్తి కేంద్రాలు (Production Cities)
2. వినిమయ కేంద్రాలు (Cities of Consumption)
3. మిశ్రమ కార్యకలాపాలు కలిగిన నగరాలు (Mixed activities Cities)
4. గోడాములు, సరఫరా నగరాలు (Cities of Storage and distant Cities)
5. సముద్రనదే పరివాహక నగరాలు (River & Seaport Cities)
6. దిగుమతి, ఎగుమతి నగరాలు (Receiving and forwarding Cities)
7. ఆర్థిక, అప్పు నగరాలు (Cities of Finance & Credit)
8. సిబ్బంది చేతి వృత్తులు (Cities of workers men or artisans)
9. సైనిక కేంద్రాలు (Military Cities)
10. ఆరోగ్య కేంద్రాలు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు (Health Centre Thermal cities)
11. వాతావరణ నగరాలు (Climatic cities)
12. పురావస్తు ప్రదర్శన నగరాలు (Musеum Cities)
13. విశ్వవిద్యాలయ నగరాలు (University Cities)

## 13.3. నగరాభివృద్ధి - కారణాలు:

ప్రపంచంలో వివిధ దేశాలలో నగరాల అభివృద్ధి వివిధ కాలాలలో జరగడానికి అనేక అంశాలు దోహదపడ్డాయి. నగరాభివృద్ధి ప్రధానంగా అధిక జనాభా, పారిశ్రామికీకరణపై ఆధారపడి ఉంటుంది. పారిశ్రామికాభివృద్ధి నగరాభివృద్ధికి ఉపకరిస్తుంది. భారతదేశంలో నగరాభివృద్ధి గణనీయంగానే జరిగింది. దీనికి అనేక కారణాలున్నాయి. కేవలం కొన్ని కారణాలవల్ల జరిగిందనడానికి వీలులేదు.

నగరాభివృద్ధిని ప్రభావితం చేసే కారకాలలో ప్రధానమైనవి.

**13.3.1. పారిశ్రామికీకరణ** - పారిశ్రామిక విప్లవ ఫలితంగా ఉత్పత్తిలో సాంకేతిక పద్ధతుల ద్వారా బారీ పరిశ్రమలు ఏర్పడడానికి దారి తీసింది. గ్రామీణ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో నగరాలకు పరిశ్రమలలో పని చేయడానికి వలసరావడంతో నగర జనాభా పెరిగింది. భారీ పరిశ్రమల వల్ల అధిక సంఖ్యలో కార్మికులు, పర్యవేక్షకులు, సాంకేతిక నిపుణులు అవసరం ఉంటుంది. రోడ్లు, భవనాలు, గృహ, విద్య వైద్య సదుపాయాలు పెద్ద మార్కెట్లు, వాణిజ్య కేంద్రాలు, రెస్టారెంట్లు, వినోద కేంద్రాలు మొదలైనవి రూపొందుతాయి. ఈ విధంగా నగరాభివృద్ధికి పారిశ్రామికీకరణ ఎంతగానో తోడ్పడుతుంది.

**13.3.2. వ్యాపారీకరణ** - పారిశ్రామికీకరణ వల్ల అధికోత్పత్తిని సాధిస్తే, వాటి వినియోగానికి వ్యాపార కేంద్రాల అవసరం ఎంతైనా ఉంది. హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, హోటళ్లు వ్యాపార కేంద్రాలకు అనుగుణంగా సహజంగానే అభివృద్ధి చెందుతాయి.

**13.3.3. ప్రసార సాధనాల వ్యాప్తి** - అన్ని దేశాలలోను, అన్ని ప్రాంతాలలోను వ్యాపార, వాణిజ్య లావాదేవీలకు ప్రధానంగా ప్రసార సాధనాల వ్యాప్తి ఎంతగానో ఉపకరిస్తుంది. ప్రసార సాధనాలైన టెలిఫోన్, టెలిగ్రామ్, పోస్టల్‌తో పాటు అందుబాటుతో ఉన్న ఇ.మెయిల్, సెల్‌ఫోన్లు, ఫాక్స్ వంటి ఆధునిక సౌకర్యాలు కూడా వ్యాపారాభివృద్ధికి సహకరిస్తాయి. వ్యాపారాభివృద్ధికి భావప్రసార సాధనాల తోడ్పడితే వ్యాపారభివృద్ధి నగరాభివృద్ధికి దోహదపడుతుంది.

**13.3.4. రవాణా సౌకర్యాల అభివృద్ధి** - నగరాభివృద్ధిలో రవాణా సౌకర్యాల కీలకపాత్ర వహిస్తాయి. పారిశ్రామికీకరణ ప్రధానంగా రవాణా వ్యవస్థ మీదే ఆధారపడి ఉంది. పారిశ్రామికులకు అవసరమైన ముడి సరకును దిగుమతి చేసుకోవాలన్న, తయారైన వస్తువులను ఎగుమతి చెయ్యాలన్న రవాణా సౌకర్యాల అవసరం ఎంతైనా ఉంది. ప్రజలు కూడ ఎక్కడికైన వెళ్లాలంటే రవాణా సౌకర్యాలు తప్పనిసరి. రైలు, బస్సు, లారీ మొదలైన వాటి వల్ల ప్రజలకు, పరిశ్రమలకు పలు ప్రయోజనాలున్నాయి. రవాణా సదుపాయాల అభివృద్ధి నగరాభివృద్ధికి ఉపకరిస్తుంది.

**13.3.5. విద్య, వైద్య సౌకర్యాలు** - వృత్తి విద్య శిక్షణ కళాశాలలు, వైద్య, ఇంజినీరింగ్ కళాశాలలు, ఐ.టి.ఐ. పాలిటెక్నిక్, విశ్వవిద్యాలయాలు వీటి వల్ల ఉన్నత విద్య అవకాశాలు లభ్యమవడం, ఉన్నత ప్రమాణాలున్న విద్యా సంస్థలు ఉండటం వల్ల విద్య కోసం నగరాలకి వచ్చేవారు ఎక్కువగా ఉంటారు. గ్రంథాలయాలు, కళాకేంద్రాలు, మ్యూజియంలు వంటివి కూడ అందుబాటులో ఉంటాయి. వీటివల్ల గ్రామీణులు వలస రావడం జరుగుతుంది. ఆరోగ్య విషయమై వైద్య నిపుణులు, ఉన్నత ప్రమాణాలతో ఉన్న వైద్యశాలలు ఉండటం కూడ నగరాభివృద్ధికి దోహదపడుతుంది.

**13.3.6. వినోద, వికాస కార్యక్రమాలు** - నగరాలలో వివిధ వర్గాల వారికి వారి వారి అభిరుచులకు అనుగుణంగా సాంస్కృతిక, వినోద, వికాస కార్యక్రమాలు అందుబాటులో ఉంటాయి. సినిమా థియేటర్లు, నృత్య, సంగీత కళాకేంద్రాలు, క్లబ్బులు, క్రీడా సౌకర్యాలు, హోటళ్లు, గుర్రపు పందేలు వంటివి వివిధ ఆదాయ వర్గాలకి లభిస్తాయి. వీటి కొరకు గ్రామాల నుండి ప్రజలు నగరాలకు రావడం జరుగుతుంది. వినోద, వికాస కార్యక్రమాలు ఎక్కువగా ఉన్న నగరాలలో అభివృద్ధి అధికంగా ఉంటుంది.

**13.3.7. రాజకీయ కారణాలు** - నగరాభివృద్ధి కొన్ని సందర్భాలకు రాజకీయ కారణాలు కూడ ఉపకరిస్తాయి. నగరాల పెరుగుదల, ప్రగతిలో రాజకీయ ఒత్తిడులు, నిర్ణయాల ప్రభావం ఉంటుంది. ముఖ్యపట్టణాలుగా కొన్ని ప్రాంతాల ఎంపిక దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. హైదరాబాద్, ఢిల్లీ, చండీఘర్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. ఉక్కు కర్మాగారాలను స్థాపించాలనే రాజకీయ నిర్ణయమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలోను తమిళనాడు రాష్ట్రంలోని సేలం నగరాల అభివృద్ధికి ఉపయోగపడటం మరో ఉదాహరణగా చెప్పవచ్చు.

**13.3.8. ఆర్థిక భద్రత** - నగరాలలో గ్రామీణ ప్రాంతాలకన్న డబ్బు దాచుకోవటానికి, డబ్బు సంపాదించటానికి, వివిధ పొదుపు పథకాలలో ఉంచటానికి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎక్కువగా ఉంటాయి. నగరాలలో వ్యక్తులకు ఆర్థిక భద్రత ఎక్కువగా ఉంటుంది. వ్యాపార, వాణిజ్యానికి నగరాలే అనుకూలంగా ఉంటాయి.

ఈ విధంగా వివిధ కారణాలవల్ల నగరాభివృద్ధి జరుగుతుంది.

## 13.4. సారాంశం:

నగర సముదాయలను సామాజిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక విద్య, చారిత్రక, అంశాల ఆధారంగా నగరాల ప్రధాన ప్రకార్యాలను బట్టి ఆరు రకాలుగా వర్గీకరించారు. ఉత్పత్తి లేదా పారిశ్రామిక కేంద్రాలు, వర్తక వాణిజ్య కేంద్రాలు, రాజధాని

నగరాలు, ఆరోగ్య, వినోదకేంద్రాలు సాంస్కృతిక, విద్యా కేంద్రాలు, సైనిక కేంద్రాలు, వైవిద్య నగరాలుగా విభజించారు. నగరాభివృద్ధికి అనేక అంశాలు దోహదపడతాయి. వాటితో ప్రధానమైనవి. పారిశ్రామికీకరణ, వ్యాపారీకరణ, ప్రసార సాధనాల వ్యాప్తి, రవాణా సౌకర్యాల అభివృద్ధి, విద్యా, వైద్య సౌకర్యాలు, వినోద వికాస కార్యక్రమాలు, రాజకీయ కారణాలు, ఆర్థిక భద్రత, భారతదేశంలో నగరాభివృద్ధి గణనీయంగా జరిగింది.

## 13.5. ముఖ్య పదాలు :

పారిశ్రామిక కేంద్రాలు
సైనిక కేంద్రాలు
పారిశ్రామికీకరణ

## 13.6. నమూనా ప్రశ్నలు :

1. జనాభా లెక్కల అధికారులు నగరాలను ఏ విధంగా వర్గీకరించారో తెలియజేయండి.
2. ప్రకార్యాల ఆధారంగా నగరాలలోని రకాలను వివరించండి.
3. నగరాభివృద్ధికి దోహదపడే వివిధ అంశాలను విశదీకరించండి.

## 13.7. చదువదగిన గ్రంథాలు :


1. Urban.Sociology - James A. Hun
2. Urban Sociology - Bergel
3. Urban Sociology - Rajendra K.Sharma


**డా. జి.వి. రమణ**

# గ్రామీణ, నగర సముదాయాల పరస్పర సంబంధం - తారతమ్యాలు
# (Rural - Urban Interaction and Contrast)

## 14.0 లక్ష్యం:

గ్రామీణ, నగర సముదాయాల పరస్పర సంబంధం - తారతమ్యాలను వివరించటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానోద్దేశం.

**విషయసూచిక :**


**14.1.** పరిచయం

**14.2.** గ్రామీణ నగర సముదాయాలు - తారతమ్యాలు

**14.3.** గ్రామీణ, నగర సముదాయాల పరస్పర సంబంధం

**14.4.** సారాంశం

**14.5.** ముఖ్యపదాలు

**14.6.** నమూనా ప్రశ్నలు

**14.7.** చదువదగిన గ్రంథాలు


## 14.1. పరిచయం:

ప్రతి సమాజంలో మూడు రకాల సముదాయాలు ఉంటాయి. గ్రామీణ, నగర మరియు గిరిజన సముదాయాలు. వీటిలో ముఖ్యమైనవి గ్రామీణ మరియు నగర సముదాయాలు. సమాజంలో భౌగోళిక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక లక్షణాల్ని బట్టి సముదాయాల మధ్య తారతమ్యాలుంటాయి. సమాజంలో వ్యక్తి జీవితం గ్రామీణ సముదాయంలో మొదలైనప్పటికి, వ్యవస్థ, సంస్కృతి, సామాజిక పరివర్తనతో పాటు వ్యక్తుల వైఖరుల పురోగతితో నాగరికత అభివృద్ధి చెంది నగర సముదాయలు ఆవిర్భవించాయని భావించవచ్చు.

## 14.2. గ్రామీణ, నగర సముదాయాల తారతమ్యాలు:

గ్రామీణ, నగర సముదాయాల వర్గీకరణ కాని పోలికల పరిశీలనలోకాని కొన్ని సమస్యలున్నాయి. ప్రధానంగా కాలాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అంటే ఒకే కాలానికి చెందిన సముదాయాలను పోల్చటం వీలుకాదు. దేశ, విదేశాలలో ఉండే సముదాయాలన్నీ ఒకే రీతిలో ఉండవు. ఒక దేశంలో గ్రామానికి మరో దేశంలో గ్రామానికి తేడా వుంటుంది. భారతదేశంలో అధిక శాతం జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తుంటే పాశ్చాత్య దేశాలలో అధిక జనాభా పట్టణ ప్రాంతాలలో జీవిస్తున్నారు. గ్రామాలైన నగరాలైన వివిధ దేశాలలో వివిధ విధాలుగా ఉన్నాయి. ఒక ప్రాంతంలో ఉన్న లక్షణాలు మరో ప్రాంతంలో లేకపోవచ్చు. అన్ని కాలాలకు స్థానిక పరిస్థితులకు వర్తించునట్లు నిర్వచనాన్ని ఏర్పరచటం సాధ్యంకాదు. ఏ సమాజంలోనైన గ్రామీణ సముదాయానికి నగర సముదాయానికి మధ్య అనేక అంశాలలో వ్యత్యాసాలు ఉన్నాయి. ఒకనాటి పల్లె ప్రాంతాలే నేటి నగరాలు. వలస, పారిశ్రామికీకరణ

వల్ల నగరాల వృద్ధి జరుగుతుంది.

నగర సముదాయ తారతమ్యాలనేవి నగర సమాజ శాస్త్రంలో ఒక ప్రాథమికాంశంగా గుర్తించవచ్చు. ఇటువంటి విశ్లేషణలో గ్రామీణ - నగర సముదాయాలకు సంబంధించి వివిధ సమస్యలు వెలుగులోకి రావడమే కాకుండా వాటిని ఎలా పరిష్కరించాలో చేపట్టవలసిన చర్యలు ఏ ఒక్క సముదాయానికీ పరిమితమై ఉండవు. కాబట్టి గ్రామీణ, నగర సముదాయాల మధ్య భేదాలలో పాటు సామీప్యత కూడా ఏర్పడి పరస్పర సంబంధాలను నెలకొల్పటానికి వీలవుతుంది.

నగర సమాజ శాస్త్రజ్ఞులైన లూయిస్ వర్త్, జార్జి సిమ్మెల్, సొరొకిన్, జిమ్మర్‌మన్, పీటర్‌మెన్, హాసర్ వంటి వారి రచనలు ఆధారంగా గ్రామీణ, నగర సముధాయాల మధ్య తేడాలు లేదా భేదాలను పరిశీలించవచ్చు. వీటిని క్రింది పట్టికలో చూడవచ్చు.

**గ్రామీణ - నగర సముదాయాల తేడాలు**

| లక్షణం | గ్రామీణ సముదాయం | నగర సముదాయం |
|---|---|---|
| 1. సముదాయ సంఖ్య | చిన్న సముదాయాలు వెయ్యికంటే తక్కువ జనాభా అనేక గ్రామాలలో ఉంది. | సముదాయాల సంఖ్య పెద్దవి చాలా పట్నాలలో ఐదు వేలకు మించిన |
| 2. జన సాంద్రత తక్కువ | నగర సముదాయల కంటే జనసాంద్రత మీటరుకు 400గా నగర ప్రాంతాన్ని | జనసాంద్రత ఎక్కువ చదరపు కిలో గుర్తించారు. |
| 3. వృత్తి | అధికశాతం వ్యవసాయం మీదే ఆధారపడతారు. | వ్యవసాయేతర వృత్తులలో ఉంటారు. వ్యాపార వాణిజ్య, రవాణా విద్యావైత్య పరిపాలణ రంగాలలో ఉంటారు. |
| 4. పరిసరము | ప్రకృతిలో ప్రత్యక్ష సంబంధం అధికంగా ఉంటుంది. | మానవ కల్పిత పరిసరాల ప్రభావం |
| 5. జనాభా వైవిధ్యత | నివాసం, సంస్కృతి పరంగా సాధర్మత ఎక్కువ | జాతి, వర్గం, ప్రాంతీయత భాష వృత్తి ప్రత్యేకరణ ద్వారా వైధర్మత ఎక్కువ |
| 6. శ్రమ విభజన | సామాన్యమైన శ్రమ విభజన తక్కువ ప్రత్యేకీకరణ యాంత్రిక సంఘీ భావం తక్కువగా పరస్పర ఆధారం | సంక్లిష్ట శ్రమ విభజన అధికం ప్రత్యేకీకరణ జైవిక సంఘీభావం ఎక్కువ పరస్పర ఆధారం. |
| 7. సామాజిక స్తరీకరణ | కుల, లింగ, బంధుత్వం వ్యవసాయ | స్వేచ్ఛ వర్గ వ్యవస్థ (System) కలిగి భూమి పరిమాణాన్ని బట్టి ఉంటుంది. ఉంటారు. |
| 8. సామాజిక సంబంధాలు | ముఖాముఖా ప్రాథమిక సంబంధాలు | గౌణ సంబంధాలు |
| 9. సామాజిక నిర్మాతి వ్యవస్థాపన | ప్రాథమిక అవసరాలను తీర్చుకోవటంతో ప్రధాన సంస్థల పాత్ర అధికంగా ఉంటుంది. | సామాజిక అవసరాలను తీర్చుకోవటానికి ఎక్కువ ప్రత్యేక సంస్థలు, ఏజన్సీలు ఉంటాయి. |
| 10. నాయకత్వం | ప్రాబల్య కులాలు ముఠాలు, నాయకత్వం | లౌకిక, ప్రజస్వామ్య నాయకత్వం |
| 11. సామాజిక నియంత్రణ | విలువలకు కట్టుబాట్లకు ప్రాముఖ్యత | నియంత్రణ నియత ఏజన్సీల ద్వారా అంటే పోలీసు కోర్టు ద్వారా నియంతణ |

| | | |
|---|---|---|
| 12. సామాజిక గతిశీలత | వృత్తి పరమైన గతిశీలత తక్కువ | సామాజిక గతిశీలతకు ఎక్కువ అవకాశాలు |
| 13. సాంస్కృతిక వ్యక్తీకరణ | జానపద రీతులకు అనుగుణంగా సామాన్య సాంస్కృతిక వ్యక్తీకరణ | సంక్లిష్ట, ఆధునాతన నవ్య సాంస్కృతిక వ్యక్తీకరణ. |
| 14. సామాజిక విలువలు | సంప్రదాయకమైనవి. | లౌకిక విలువలుకి ప్రాధాన్యత. |
| 15. సామాజిక పరివర్తన | తక్కువగా ఉంటుంది. | ఎక్కువగా ఉంటుంది. |

గ్రామీణ - నగర సముదాయల మధ్య తారతమ్యాల వల్ల ప్రతి సముదాయానికి సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక లక్షణాలను బట్టి కొన్ని ప్రత్యేకతలు ఉంటాయని తెలుస్తుంది. ఇలాంటి లక్షణాల్ని బట్టి గ్రామీణ - నగర సముదాయాల ప్రకార్యాలు, నిర్మితి, సంస్కృతి వ్యవస్థల తీరుతెన్నులు తెలుస్తాయి.

## 14.3. గ్రామీణ నగర సముదాయాల మధ్య పరస్పర సంబంధం:

గ్రామీణ సముదాయంలో ఎక్కువగా జరుగుతున్న నగరీకరణ ప్రక్రియ, చిన్న ప్రాంతాలలో సాంకేతికంగా అభివృద్ధి చెందిన పరిశ్రమలను నెలకొల్పడం వల్ల నగర లక్షణాల వ్యాప్తి వల్ల గ్రామీణ - నగర సముదాయల మధ్య తారతమ్యాలు తగ్గుతున్నాయి. నగరాలలో ఉండే పేద ప్రజానీకమంతా దాదాపుగా పల్లె ప్రాంతాలనుండి వలస వచ్చిన వారే దీనితో సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పరమైన సంబంధాలు గ్రామీణ, నగర సముదాయాల మధ్య నెలకొని వుంటాయి.

గ్రామీణ - నగర సముదాయాల పరస్పర సంబంధానికి కింది అంశాలు దోహదపడతాయి.

1. రవాణా మరియు భావ ప్రసార సాధనాలు
2. గ్రామీణ - నగర వలస
3. గ్రామీణ సముదాయం పై నగరీయత ప్రభావం

**1. రవాణా మరియు భావ ప్రసార సాధనాలు** - గ్రామీణ - నగర సముదాయాల మధ్య పరస్పర సంబంధాల పెరుగుదలతో రవాణా- భావ ప్రసార సాధనాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. నగరాలు ఆహరధాన్యాలలోనే కాదు పండ్లు కూరగాయల విషయంలో సైతం గ్రామీణుల మీద ఆధారపడక తప్పదు. నగరాలలో వాణిజ్య ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ ఉండటంతో గ్రామీణ రైతులు వాటిని పండించటానికి ఆసక్తి చూపుతున్నారు. వస్తువులు, ఆహారపదార్థాల రవాణాకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామాలలోని పనిలేని కూలీలు నగరాలలో పనికి రావటానికి రవాణా సౌకర్యాలు ఉపకరిస్తున్నాయి. భావ ప్రసారసాధనాలు గ్రామీణ - నగర సముదాయాల పరస్పర సంబంధాలలో కృషి చేస్తున్నాయి. ఆకాశవాణి, దూరదర్శన్‌తో పాటు చలన చిత్రాలు, వార్తాపత్రికలు కూడ రెండింటిని దగ్గర చెయ్యడంలో కీలక పాత్ర వహిస్తున్నాయి. వీటి మూలంగా గ్రామీణ ప్రజలలో వివిధ అంశాలలో ప్రత్యేకించి రాజకీయాలలో అవగాహన బాగా పెరిగింది. వాళ్లకున్న సౌకర్యాలు, పథకాలు, ప్రణాళికలు గ్రామీణులు తెలుసుకొనే వీలు కలిగింది. రవాణా - భావ ప్రసార సాధనాల వల్ల గ్రామీణులలో లౌకిక భావం పెరిగింది.

**2. గ్రామీణ-నగర వలస** - గ్రామీణ నగర సముదాయాలు దేనికదే ప్రత్యేక లక్షణాలతో ఉన్నప్పటికి ఈ రెండింటి మధ్య నిరంతర ప్రక్రియ వివిధ రకాలుగా ఉంటుంది. అలాంటి ప్రక్రియ పెంపొందించటంలో వలస పాత్ర చాలా ఉంది. భావ ప్రసార సాధనాలు రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందాక గ్రామీణ-నగర సముదాయల మధ్య సంబంధం వలస వలనే సాధ్యమైయ్యింది.

వ్యవసాయం కేవలం స్వల్పకాలానికి ఉపాధిని కల్పిస్తుంది. నియత కాలిక ఉద్యోగిత, స్వేచ్ఛన్న నిరుద్యోగిత వల్ల అనేక మంది ఉపాధికోసం నగరాలకు వలసపోవటం అక్కడ ఉద్యోగావకాశాల కోసం పోటీ పడటం జరుగుతుంది. నగరాలకు గ్రామాల నుండి వెళ్లిన వారు నగర జీవన విధానాన్ని అనుసరించటమే కాకుండా నూతన అలవాట్ల గురించి గ్రామాలలోని మిత్రులకు, సన్నిహితులకు తెలియజేయడం ద్వారా వీరు పరస్పర సామాజిక ప్రక్రియలో ఏజంట్లుగా ఉన్నరని భావించవచ్చు.

గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలస పోవటం వల్ల గ్రామీణ సముదాయంలో పెనుమార్పులు సంభవిస్తాయి. గ్రామీణులు నగరాలకు వలస రావడం తర్వాత వారి బంధువులకు కూడా అవకాశాలను కల్పించడం వారిని కూడ నగరాలకి తీసుకురావడానికి కృషి చేస్తారు. అదే విధంగా తరతరాల కులవృత్తుల వల్ల లాభం లేకపోవటంతో నగరాలలో నూతన వృత్తులను చేపట్టటానికి నగరాలకు తరలివస్తారు. అల్పాదాయ వృత్తులను వదలి పోవటం అత్యంత సహజంగా జరుగుతుంది.

నగరాలలో జనాభా అధికం కావటంతో నగర సరిహద్దులలో మార్పులు సంభవిస్తారు. నగర పొలిమేరలో ఉండే పల్లెలు సైతం పురపాలక సంస్థ అధీనంలోకి వస్తాయి. దాంతో సౌకర్యాలు పెరుగుతాయి. ప్రధానంగా రవాణా, భావప్రసార నీటి సదుపాయాలు గ్రామీణ ప్రజలకు లభిస్తాయి. శాటిలైట్ పట్టణాలకి దారి తీస్తుంది. గ్రామీణ-నగర వలస వల్ల గ్రామీణ సముదాయంలో నగర సంస్కృతి చోటు చేసుకోవటమే కాకుండా వీటి మధ్య సామాజిక, సాంస్కృతిక ఆర్థిక పరస్పర క్రియ ద్వారా సామీప్యత ఏర్పడుతుంది. ఫలితంగా వీటి మధ్య నిరంతర సంబంధాలు పెరుగుదలకు దోహదపడుతుంది.

**3. గ్రామీణ సముదాయంపై నగరీయత ప్రభావం** - గ్రామీణ సముదాయంపై నగర ప్రభావం చాలా ఉంది. కుటుంబం, విలువలు, విశ్వాసాలు, ఆచారాలు, సంస్కారాలు, మతం, ఆహారపు అలవాట్లు, సామాజిక నిర్మితి వంటి వాటిపై నగర ప్రభావాన్ని గమనించవచ్చు. భారతదేశంలో మహానగరాలు (Mega Cities) గా పేరుపొందిన దేశరాజధాని ఢిల్లీ, ముంబాయి, చెన్నై, కొలకత్తా నగరాల దగ్గరలో ఉన్న గ్రామాలలో నగర జీవన విధానం స్పష్టంగా తెలుస్తుంది. సాధారణంగా గ్రామాలలో ప్రజలు కులవృత్తికి పరిమితం కావటం, అల్పాదాయంతోనే జీవితాల్ని నెట్టుకురావడం చూస్తుంటాం. నగరీయత ప్రభావంతో కులవృత్తులకి స్వస్తి చెప్పి వారి వారి అభిరుచుల మేరకు ఏదీ అనుకూలమో, ఏదీ లాభదాయకమో దానిని చేపడుతున్నారు. గతంలో ప్రబలంగా ఉన్న సామాజిక దూరాచారాలైన అంటరాని తనం, కులబహిష్కరణ, వెట్టి చాకిరివంటివి కొంతమేర గ్రామాలలో తగ్గేయని చెప్పవచ్చు. గ్రామీణ సముదాయాలలో సైతం పరిమిత కుటుంబాల సంఖ్య పెరిగింది. వ్యక్తిగత పురోగతికే ప్రాధాన్యత నివ్వటం జరుగుతుంది. గ్రామీణ సముదాయంపై నగరీయత ప్రభావంతో విలువలు విషయంలో మార్పు వచ్చింది. ఆచారాలను సైతం నమ్మకం సడలింది. నీతి నియమాలకి తిలోదాకాలివ్వటంతో అవ్యవస్థ ఏర్పడింది. భావ ప్రసార సాధనాలు రేడియో, టెలిఫోన్, టెలివిజన్, టేప్‌రికార్డర్, వార్తా పత్రికలు వినియోగం గ్రామీణులలో పెరిగింది. ఆహారపు అలవాట్లలోనే కాదు వస్త్ర ధారణలో సైతం నగర ప్రజలను గ్రామీణులు అనుకరించటం, వాటిని అనుసరించడం వంటివి గ్యాస్, కుక్కర్ వంటి వాటిని వినియోగించడం వల్ల గ్రామీణ సముదాయంపై నగరీయత ప్రభావం కనిపిస్తుంది.

పైన వివరించిన అంశాలను బట్టి గ్రామీణ-నగర సముదాయాలనేవి పరస్పర సంబంధంలేని ప్రత్యేక వ్యవస్థలు కావని, రెండింటి మధ్య సంబంధం, పరస్పర ప్రక్రియ అనేది భావప్రసార, రవాణా సాధనాలు వృద్ధి, వలస, గ్రామీణ జీవనంలో నగరీయతా ప్రభావం వంటి వాటి ద్వారా సాధ్యమవుతున్నదని భావించవచ్చు.

## 14.4. సారాంశం:

సముదాయాలను సాధారణంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి గ్రామీణ సముదాయం మరియు నగర సముదాయం జనాభా జనసాంద్రత, సామాజిక వైవిధ్యత, వృత్తి వంటి అంశాలను బట్టి గ్రామీణ - నగర సముదాయాన్ని గుర్తించవచ్చు. గ్రామీణ - నగర సముదాయ తారతమ్యాలనేవి నగర సమాజ శాస్త్రంలో ఒక ప్రాథమిక అంశంగా పరిగణించవచ్చు. గ్రామీణ నగర సముదాయాల మధ్య పరస్పర సంబంధాలకి, రవాణా, భావ ప్రసార, సాధనాల పాత్ర, గ్రామీణ, నగర వలస పాత్ర గ్రామీణ సమాజంపై నగరీయత ప్రభావం వంటి అంశాలు దోహదపడతాయి.

## 14.5. ముఖ్యపదాలు :

సముదాయం
గ్రామీణ సముదాయం
నగర సముదాయం
సామాజిక గతిశీలత

## 14.6. నమూనా ప్రశ్నలు :

1. గ్రామీణ-నగర సముదాయల మధ్య తారతమ్యాలను వివరింపుము.
2. గ్రామీణ-నగర సముదాయల పరస్పర సంబంధాన్ని చర్చించుము.

## 14.7. చదువదగిన గ్రంథాలు

1. Urban Sociology - Fuadbaak and Joseph

2. Urban Sociology - James A Quinn

3. Cities and Society - Halt and Reiss

డా. జి.వి. రమణ

పాఠం - 15

# భారతదేశ నగర జనాభా సంయోజనం
# (Composition of Indian Urban Population)

## 15.0 లక్ష్యం:

భారతదేశ నగర జనాభా సంయోజనం గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

## విషయసూచిక:


15.1. పరిచయం

15.2. నగర ప్రాంత గుర్తింపు

15.3. నగర జనాభా సంయోజనం

- 15.3.1. వయోనిష్పత్తి
- 15.3.2. లింగ నిష్పత్తి
- 15.3.3. వృత్తిభేదం
- 15.3.4. గ్రామీణ నగర పంపిణీ
- 15.3.5. అక్షరాస్యత

15.4. సారాంశం

15.5. ముఖ్యపదాలు

15.6. నమూనా ప్రశ్నలు

15.7. చదువదగిన గ్రంథాలు


## 15.1. పరిచయం :

జనాభా అనగా ఒక నిర్ణీత స్థలం లేదా దేశమందు నివసించు మానవులు (జంతువులు, ఇతర జీవులు కూడా కావచ్చు) లేక ఒక తెగకు చెందిన వ్యక్తులు కావచ్చు. సాధారణంగా జనాభా అనుపదం ఒక భౌగోళిక పరిసరాలలో నివసించు ప్రజలకు లేక మత, భాషాపరమైన లేక సమాజంలోని ప్రజలను గుర్తించటానికి అధికంగా ఉపయోగిస్తారు. జనాభా అనేక జైవిక, సామాజిక లక్షణాలతో కూడుకొని ఉంటుంది. జాతి, వయస్సు, లింగభేదం, వంటివి జనాభా జైవిక లక్షణాలు. ఇవన్నీ వ్యక్తి పుట్టుకను బట్టి నిర్ణయింపబడతాయి. విద్య, వృత్తి, ఆదాయం, మతం, వైవాహిక అంతస్తు వంటి లక్షణాలు సామాజిక లక్షణాలు, సమాజాన్ని బట్టి నిర్ణయింపబడేవి. వివిధ జైవిక, సామాజిక లక్షణాల్లో భేదాలతో కూడిన జనాభా పంపిణీని జనాభా సంయోజనం అంటారు. జనాభా సంయోజన స్వరూపం రాబోవు భవిష్యత్‌కు దారి చూపుతుంది, వివిధ రంగాల ప్రగతి పథకాల రూపకల్పనలో ఉపకరిస్తుంది.

## 15.2. నగరప్రాంత గుర్తింపు:

భారతదేశ జనాభా లెక్కలు (census) వారు కొన్ని లక్షణాల ఆధారంగా ఒక ప్రాంతాన్ని నగరంగా గుర్తిస్తారు.

1. జనాభా పరిమాణం 5,000 కంటే అధికంగా ఉన్నప్పుడు.
2. చదరపు కిలో మీటరుకు 4,000 జనాభా లేదా చదరపు మైలుకు 1000 మంది జనసాంద్రత కలిగి ఉండటం.

3. జనాభాలో 75 శాతం పురుషులు వ్యవసాయేతర వృత్తులపై ఆధారపడి ఉండటం.
అయితే వీటికి కొన్ని మినహాయింపులు ఉన్నాయి.

**నగర ప్రాంతాలను జనాభాను బట్టి కింది విధంగా విభజించారు.**

2,500- 5,000 లోపు జనాభా కలిగి ఉన్న ప్రదేశాన్ని చిన్న పట్నమని
5000-10,000 మధ్య జనాభా ఉన్న ప్రాంతాలను పెద్ద పట్నమని
1000-100000 మధ్య జనాభా ఉన్న ప్రదేశాలను నగరాలని వర్గీకరించారు.

నగర ప్రాంతాలలో జనాభా ఒక మిలియన్ దాటినపుడు వాటిని మహానగరాలని పిలుస్తారు.

## 15.3. నగర జనాభా సంయోజనం:

2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 103 కోట్లు. ప్రపంచ జనాభాలో 16.8 శాతం కలిగి ద్వితీయ స్థానంలో ఉంది. ప్రపంచంలో ఉన్న ప్రతి ఆరుగురిలో ఒకరు భారతదేశంలో ఉన్నారు. 1971 నాటికి దేశ జనాభాలో ఎనభైశాతం గ్రామీణులైతే 2001 నాటికి 27 శాతానికి పైగా నగర జనాభా ఉంది. దేశ జనాభాలో నగర జనాభాను పరిశీలించగా 1951 గణాంకాల ప్రకారం 62.4 మిలియన్ల ప్రజలు నగర ప్రాంతాలలో ఉంటున్నారు. 1981 నాటికి ఈ సంఖ్య 162.2 మిలియన్లకు చేరింది. అంటే మూడు దశాబ్దాలలో దాదాపు నగర జనాభా వంద మిలియన్లు పెరిగింది. 1991-2001ల మధ్య గ్రామ జనాభా పెరుగుదల 11.3 కోట్లు కాగా నగర జనాభా పెరుగుదల 6.8 కోట్లు సగటున పట్టణ జనాభా 55,291.

భారతదేశ నగర జనాభా సంయోజనకి సంబంధించిన ముఖ్య అంశాలు క్రింది పరిశీలించవచ్చు.

### 15.3.1. వయో విస్తృతి :

జనాభా సంయోజనంలో వయో సమూహాల పంపిణీ ప్రధానపాత్ర వహిస్తుంది. నగర జనాభాను మూడు వయో సమూహాలు
మొదటిది - 0-14 సంవత్సరాలు దీనిలో పిల్లలు, ఆధారపడే జనాభా ఎక్కువ.
రెండవది - 15-59 సంవత్సరాల మధ్య వయో సమూహం దీనిలో వయస్సులు, ఉత్పాదక జనాభా అధికం
మూడవది 60 సంవత్సరాలపైబడి వయో సమూహం. వీరు ఇతరుల మీద ఆధారపడిన జనాభా.

ఎక్కువగా ఉత్పాదక స్థాయి వారు భారతదేశ నగర జనాభాలో ఉన్నారు. వీరు నగర జనాభాలో 61.2 శాతం ఉన్నారు. గ్రామాల నుండి నగరాలకు ఉపాధి కోసం వలస వచ్చిన వారి వల్ల ఈ పరిస్థితి ఉత్పన్నమైయింది. తరువాత ఎక్కువ వయోసమూహం పిల్లలు ఆధారిత జనాభా. వీరి శాతం 33 ఇక 5.8 శాతం వారు వృద్ధులు.

### 15.3.2. లింగభేద విస్తృతి :

జనాభా సంయోజనంలో లింగవిస్తృతి ముఖ్యమైయింది. లింగ భేదంతో కూడిన జనాభా పంపిణిని లింగభేద సంయోజనం అంటారు. లింగభేద విస్తృతి వెయ్యి మంది పురుషులకు ఎంతమంది స్త్రీలు ఉన్నారో తెలియజేస్తుంది. నగర జనాభాలో స్త్రీల శాతం తక్కువ. గర్భిణి స్త్రీల మరణాలు, గర్భస్థ పిండం స్త్రీ ఐతే గర్భస్రావం, స్త్రీ శిశువు పట్ల చిన్న చూపు వంటి కారణాలవల్ల స్త్రీల లింగ విస్తృతి తక్కువగా ఉంది. 1991లో 1000 పురుషులకు 894 స్త్రీలుగా నమోదు అయింది. దేశంలో 1991 జనాభా లెక్కల ప్రకారం

స్త్రీ పురుష నిష్పత్తి 1000 పురుషులకి 927 స్త్రీలు ఉన్నారు. 2001 జనాభా లెక్కలను పరిశీలిస్తే 1000 పురుషులకి 933 స్త్రీలుగా నమోదయింది. లింగ భేద నిష్పత్తి, పట్టణాలు, నగరాల వర్గాన్ని బట్టి మార్పు ఉంటుంది.

### 15.3.3. వృత్తి భేదం:

జనాభా సంయోజనంలో వృత్తి పంపిణి ముఖ్యపాత్ర వహిస్తుంది. దేశాభివృద్ధి మానవ వనరుల వినియోగం మీద ఆధారపడి ఉంది. నగర వాసులకు పని చేసే వారి సంఖ్య, వృత్తినిమగ్నత గ్రామీణులకన్న భిన్నంగా ఉంటుంది. స్త్రీల భాగస్వామ్యం నగర ప్రాంత పనులలో తక్కువ వృత్తిలో నైపుణ్యత, అవకాశాలు లేకపోవటమే దీనికి ప్రధాన కారణం. వృత్తి నిమగ్నత రీత్యాచూస్తే నగర పనివారు గౌణ, తృతీయ (Teritan) రకాల వృత్తులలో భాగస్వామ్యం ఎక్కువ వీటిలో కట్టడాలు (Construction) రవాణా (Transport) భావ ప్రసారాలు (Communications) ఉత్పాదకత (Manufacturing) తయారీ (Procession) వ్యాపారం వంటి వాటిని చేర్చవచ్చు. 1991 జనాభా లెక్కలను బట్టి 69.05 శాతం నగరాలలో పురుష పని వాళ్లలో అధికంగా గౌణ, తృతీయ రంగాలలో ప్రధాన పనివారు అంటే సంవత్సరానికి 183 రోజులుపై బడి వృత్తి జీవనం గడిపేవారు. పని భాగస్వామ్యంలో నగర పనివాళ్లు అధికంగా ఇతర సేవలలో తర్వాత వాణిజ్యా రంగాలలో (21.99 శాతం) ఉత్పాదక, తయారీ రంగాలలో (21.94 శాతం) ఉన్నారు. కొంత శాతం ప్రాథమిక రంగాంలో పని చేయటాన్ని గమనించవచ్చు. ప్రధానంగా చిన్న పట్టణాలలోను దీనిని చూడవచ్చు.

### 15.3.4. గ్రామీణ - నగర పంపిణి :

గ్రామాలలోకన్న నగరాలలోనే జనాభా - జనసాంద్రత అధికంగా ఉన్నట్లు గణాంక లెక్కల వివరిస్తున్నాయి.

కింది పట్టికలో గ్రామీణ - నగర జనాభా పెరుగుదలను గమనించవచ్చు.

భారతదేశంలో గ్రామీణ - నగర జనాభా వివరాలు 1901 - 2001

| సంవత్సరం | భారతదేశ జనాభా (మిలియన్లు) | నగర జనాభా (మిలియన్లు). | మొత్తం జనాభాలో శాతం గ్రామీణ | నగర |
|---|---|---|---|---|
| 1901 | 238.3 | 25.8 | 89.0 | 11.0 |
| 1911 | 252.0 | 25.9 | 89.6 | 10.4 |
| 1921 | 251.3 | 28.0 | 88.7 | 11.3 |
| 1931 | 278.9 | 33.5 | 87.8 | 12.2 |
| 1941 | 318.6 | 44.1 | 85.9 | 14.1 |
| 1951 | 316.0 | 62.4 | 82.4 | 17.6 |
| 1961 | 439.2 | 78.9 | 81.7 | 18.3 |
| 1971 | 548.1 | 108.9 | 79.8 | 20.2 |
| 1981 | 683.3 | 162.2 | 76.3 | 23.7 |
| 1991 | 844.3 | 217.2 | 74.3 | 25.7 |
| 2001 | 1002.7 | 285.0 | 72.2 | 27.5 |

## 15.3.5. అక్షరాస్యత:

నగర జనాభాలో అక్షరాస్యత అధికంగా ఉంది. 1991 జనాభా లెక్కల ప్రకారం 73.08 శాతంగా ఉంది. ఇది ప్రధానంగా వృత్తి సంబంధ భాగస్వామ్యం, మౌలిక సదుపాయాలవల్ల సాధ్యం అవుతుంది.

## 15.4. సారాంశం :

వివిధ జైవిక సామాజిక, లక్షణాలలో భేదాలతో కూడిన జనాభా పంపిణీని జనాభా సంయోజనం అంటారు. జనాభా సంయోజన స్వరూపం రాబోవు భవిష్యత్‌కు దారి చూపుతుంది. నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించటంలో ఉపకరిస్తుంది.

## 15.5. ముఖ్యపదాలు:

- వయోనిష్పత్తి
- లింగ నిష్పత్తి
- వృత్తిభేదం

## 15.6. నమూనా ప్రశ్నలు:

1. నగర ప్రాంతాన్ని జనాభా లెక్కల ప్రకారం నిర్వచించండి.
2. భారతదేశ నగర జనాభా సంయోజనం పై ఓ వ్యాసాన్ని రాయండి.

## 15.7. చదువదగిన గ్రంథాలు :

Census 1991, 2001

**డా. జి.వి. రమణ**

పాఠం - 16

# భారతదేశం లో నగరీకరణ స్థాయి, తీరుతెన్నులు

## (Levels and Trends of Urbanization in India)

### 16.0 లక్ష్యం:

నగరీకరణ అంటే ఏమిటి? నాగరికదశలు, నగరీకరణ తీరుతెన్నులను తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

### విషయసూచిక:

16.1. పరిచయం

16.2. నగరీకరణ - నిర్వచనం

16.3. నాగరిక దశలు

- 16.3.1. మొదటి నాగరిక దశ
- 16.3.2. రెండవ నాగరిక దశ
- 16.3.3. మూడో నాగరిక దశ

16.4. భారతదేశంలో నగరీకరణ - తీరుతెన్నులు

16.5. సారాంశం

16.6. ముఖ్యపదాలు

16.7. నమూనా ప్రశ్నలు

16.8. చదువదగిన గ్రంథాలు

### 16.1. పరిచయం:

నగరీకరణ అనే పదాన్ని సమాజశాస్త్ర వేత్తలేకాక అర్థశాస్త్ర వేత్తలు కూడ వాడుతుంటారు. గ్రామీణ ప్రాంతాలలోను నగర ప్రాంతాలుగా మార్చే ప్రక్రియగా నగరీకరణను భావించవచ్చు. నగర నివాసంతో ముడిపడి ఉన్న జీవన విధాన్ని నగరీయత సూచిస్తుంది. చారిత్రక పరిశోధనలను బట్టి నగరీకరణ ప్రక్రియ ప్రాచీనకాలం నుంచి చోటు చేసుకున్నదని చెప్పవచ్చు.

### 16.2. నగరీకర[illegible] ర్వచనం:

సమాజశాస్త్ర[illegible] నగరీకరణను వివిధ విధాలుగా నిర్వచించారు.

ప్రొ. ఫిలిప్. ఎమ్. హౌసర్ మరియు డంకన్‌లు నగరీకరణను "జనాభా పంపిణీ నమూనాలో వచ్చే మార్పు" గా నిర్వచించారు.

ప్రొ. బెర్జిల్ నిర్వచనం ప్రకారం "నగరీకరణ అనే పదం గ్రామీణ ప్రాంతాలను నగర ప్రాంతాలుగా మార్చే ప్రక్రియ".

ప్రధానంగా వ్యవసాయంతో సంబంధం ఉన్న చిన్న సముదాయాల్ల నుండి ప్రజలు పెద్దవైన సముదాయాలకు వలస పోవడం నగరీకరణ లక్షణంగా థాంప్సన్ అభిప్రాయపడ్డాడు.

పట్టణ జీవితాన్ని విస్తరించి త్వరితగతిని జీవన విధానాన్ని మార్చుకోవటమే నగరీకరణగా లూయిస్ వర్త్ అభిప్రాయపడ్డాడు.

జె.సి.మిచెల్‌ను ఆలోచనలను బట్టి వ్యవసాయం నుండి మారి, నగరాలకు పోయి, అక్కడ వృత్తులను స్వీకరించి తదనుగుణంగా ప్రవర్తనను మార్చుకోవటమే నగరీకరణ.

నగరీకరణ అంటే కేవలం నగరాలు పెరగటం, జనాభా కూడటమేకాదు. వ్యవస్థలోనూ, ప్రవర్తనలోనూ మార్పులు ముఖ్యం అంతేగాని, నగరంలో జనసాంద్రత పెరగటం ప్రధానంకాదు. నగరీకరణ అంటే స్థిరపడిన జనాభా, కేంద్రీకృత రీతులను అవలంబించటం అని కింగ్స్లే డేవిస్ పేర్కొన్నాడు.

నగరాలకు ప్రజలు వలసరావడాన్ని మాత్రమేకాకుండా ప్రవాసుల అభివృత్తులు, విలువలు, నమ్మకాలు, ప్రవర్తనా నమూనాలలో వచ్చే మార్పులను సైతం నగరీకరణ ప్రక్రియ వివరిస్తుందని అండర్సన్ భావించాడు.

ఎరిక్ లంపార్డ్ (Eric Lampard) అనే చారిత్రక శాస్త్రవేత్త నగరీకరణను నిర్మిత పరమైన (Structural) ప్రవర్తనా పరమైన (Behavioural) జనాభా (Demospaical) సంబంధమైన కోణాల్లో వివరించాడు.

పై నిర్వచనాలను పరిశీలిస్తే నగరీకరణ అంటే ఏమిటో తెలుస్తుంది. ఒక సముదాయం వంప్యాలి, పరివర్తన ప్రభావం వల్ల నగర సముదాయంగా వృద్ధి చెందే ప్రక్రియనే నగరీకరణగా భావించవచ్చు.

## నగరీకరణను ప్రోత్సహించే సముదాయ లక్షణాలు:

ఒక సముదాయాన్ని నాగరిక సముదాయంగా మార్చే ప్రక్రియనే నగరీకరణ అంటారు. దాదాపు 6,500 సం॥ల నుండి నగరీకరణ ప్రక్రియ ఉంది అయితే నగరీకరణ ప్రక్రియలో హెచ్చు - తగ్గులు కనిపిస్తున్నాయి. ఒక దశలో ఎక్కువగా మరి యొక దశలో తక్కువకావటం జరుగుతుంది. గ్రామీణ సముదాయాల నుండి నగరీకరణ ప్రక్రియ ఆవిర్భవిస్తుంది. అన్ని గ్రామీణ సముదాయాలు నగరీకరణ ప్రక్రియను ప్రోత్సహించవు. కొన్ని ప్రత్యేక లక్షణాలున్న గ్రామీణ సముదాయాలు మాత్రమే దీనివి ప్రోత్సహించటం జరుగుతుంది.

1. **వ్యవసాయం** - పశుపోషణ, ఇతర వృత్తులు - ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పద్ధతుల్ని వ్యవసాయంలో ఉపయోగించటం ద్వారా వర్తక, వాణిజ్య, వ్యాపార రంగాలలో ఆర్థికాభివృద్ధిని సాధించటం జరుగుతుంది. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, శక్తి సామర్థ్యాలుంటే తప్ప ఆధునిక పద్ధతుల్ని అనుసరించటానికి వీలుండదు. సాంకేతికాభివృద్ధి వల్ల ఉత్పత్తి అధికంకావటంతో చుట్టు ప్రక్కల ఉత్పత్తి కేంద్రాలు ఏర్పడతాయి. అందుబాటులో ఉన్న ఉత్పత్తి కేంద్రాలకు అనేక మంది నిరుద్యోగులు వలసరావడం జరుగుతుంది. దాంతో సముదాయంతో ఇతర వ్యవస్థలలో పురోగతి కనిపిస్తుంది.

2. **సాంకేతికాభివృద్ధి** - వ్యవసాయాభివృద్ధి వల్ల వ్యాపార, వాణిజ్య రంగాలతో పాటు సాంకేతికాభివృద్ధి కూడ జరుగుతుంది. భావ ప్రసార సాధనాల వినియోగం, రవాణా సౌకర్యాలు పెరగటం, సముదాయాల మధ్య వ్యక్తులు రాకపోకలు ఎక్కువగా జరగడంతో వివిధ ఉత్పత్తులకు ప్రోత్సాహం కలుగుతుంది. ఫలితంగా సముదాయం ఆర్థిక కేంద్రంగా స్థిరపడుతుంది.

**3. సామాజిక వ్యవస్థాపన** - అనేక ప్రాంతాల నుండి వలస వచ్చిన వారంతా ఒక ఆర్థిక కేంద్రంలో ఉండటం వల్ల సముదాయంలో సామాజిక వైధర్మ్యం కనిపిస్తుంది. వివిధ సామాజిక వర్గాలతో పాటు వ్యక్తుల మధ్య గౌణ సంబంధాలు ఏర్పడతాయి. వ్యక్తుల అభిరుచులు వైఖరులు భావాలు కూడ ఒకే విధంగా ఉండవు. ఫలితంగా స్తరీకరణ, విభేదీకరణ ఏర్పడతాయి. దీనికి అనుగుణంగా సామాజిక వ్యవస్థాపన సంప్రదాయక బంధుప్రీతిపై కాకుండా హక్కులు, విధులు, సమానత్వం వంటి వాటిపై ఆధారపడి పని చేస్తుంటుంది.

పైన ప్రస్తావించిన సాముదాయక పరమైన పరిణామాలు, మార్పులను వివరించడంతో పాటు నగరీకరణ స్థాయిలను తెలుసుకోవటానికి నగర సమాజ శాస్త్రజ్ఞులు అనేక నాగరిక దశలను తెలియజేశారు. వీటిని ముఖ్యంగా మూడు దశలుగా చెప్పవచ్చు.

## 16.3. నాగరికదశలు:

**16.3.1. మొదటి నాగరికదశ (క్రీ॥ పూ 4500-క్రీ.శ 500)** - చారిత్రకంగా చూస్తే మొదటి నగర కేంద్రాలు అనుకూల వాతావరణ పరిస్థితులున్న నదీలోయ ప్రాంతాలలో ఏర్పడ్డాయి. ఉదాహరణకు నైల్ (Nile) గంగా (Ganga) టైగ్రిస్ (Tiegris) యూఫ్రటిస్ (Euphrates) మొదలైన నదిలోయలలో నాగరిక కేంద్రాలు ఏర్పడ్డాయి. వ్యవసాయ రంగంలో ప్రగతి సాధించిన కొద్ది నగరాలు పుట్టుకొచ్చాయి. వాణిజ్యం, యుద్ధాలు, ప్రజలు వలస వెళ్లటం ద్వారా వివిధ నగరాల మధ్య సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు బలపడ్డాయి. తర్వాత మత సంస్థలు ద్వారా మందిరాలు నిర్మించటం, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు, రక్షణ సదుపాయల కల్పన మొదలైన వాటివల్ల ఆర్థికంగా నగరాలు అభివృద్ధిని సాధించాయి. లలిత కళలకు ఆదరణ బాగా పెరిగింది.

**16.3.2. రెండో నాగరిక దశ (క్రీ.శ. 500-1800)** - రెండో నాగరిక దశ ప్రారంభ కాలం నాటికి కొన్ని బార్బర సమూహాలు (Barberians) దండయాత్రలకులోనై అనేక నగరాలు అంతరించి పోయాయి. అయితే క్రీ.శ. పదవ శతాబ్దం నాటికి ఐరోపా ఖండంలో ప్రజల నష్టాన్ని చవి చూడటంతో వాణిజ్య వ్యాపార రంగాలను తిరిగి ప్రారంభించాలనే పట్టుదల వాళ్లతో కలిగింది. ఫలితంగా పాతనగరాలు తిరిగి కొత్త నగరాలుగా రూపుదిద్దుకున్నాయి. కొత్తగా ఏర్పాటైన నగరాలు ఈ రెండవ నాగరిక దశలో ఆరు రకాలైన నిర్మాణాల మీద పునవ్యవస్థాపన జరిగింది. అవి.

1. ఆర్థిక రంగం అభివృద్ధి
2. పెట్టబడి దారీ విధాన వ్యాప్తి
3. నాగరిక న్యాయ చట్టాలు
4. విశ్వవిద్యాలయాల స్థాపన
5. పారిస్థితిక నిర్మితి
6. కళల స్తరీకరణ

**16.3.3. మూడో నాగరిక దశ (క్రీ.శ. 1800 నుంచి నేటి వరకు)**-ఈ దశలో నగరాలు బాగా అభివృద్ధి చెందాయి. దీనికి అనేక కారణాలున్నాయి.

**ముఖ్య కారణాలు**

**1. పారిశ్రామిక వ్యవస్థలను వేరు చేసి అభివృద్ధి చేయటం** - ఈ దశలో నగరీకరణ పుంజుకుంది. నాగరిక సముదాయాలలో రాను రాను జనాభా అధికం కావటంతో సంక్లిష్టత ఏర్పడి శ్రమ విభజన జరిగినది. వివిధ రకాలైన మిల్లులను, పరిశ్రమలలో వేరు చేసి నగరాల వెలుపల ప్రారంభించారు. శక్తి సామర్థ్యాలు, ప్రత్యేక నైపుణ్యం వున్న కార్మికులతో, మంచి యంత్రాలను వినియోగించి అధికోత్పత్తిని పెంచి నేటి ఆధునిక భారీ పారిశ్రామి వ్యవస్థాపనలు ఏర్పడటం జరిగింది.

**2. సహకార సంస్థలు** - సహకార సంస్థలు కూడా నగరీకరణ చెందటానికి దోహదపడ్డాయి. భారీ పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద మొత్తంలో పెట్టుబడి కావలసివచ్చినది. కాబట్టి పారిశ్రామిక వేత్తలు సహకార సంస్థలను ఏర్పాటు చేసుకొని తద్వారా పెట్టుబడి, లాభాలను క్రమబద్ధీకరించుకోవటం జరిగింది. జాయింట్ స్టాక్ కంపెనీలు, బ్యాంకులు మొదలయినవి ఏర్పడి నగరీకరణకి తోడ్పడ్డాయి.

**3. నాగరిక - జాతీయ కక్ష్య** - ఆర్థిక ప్రగతితో పాటు రాజకీయ రంగంలో కూడా నాగరిక సముదాయం ముందంజ వేయటం ఈ దశలో కనిపిస్తుంది. నగరాలు రాజకీయ కేంద్రాలుగా ముఖ్య పట్టణాలుగా ఉండటవల్ల నగరీకరణ వేగవంతమవుతుంది. భావప్రసార సాధనాలు, రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెంది. దేశానికి, జాతికి నగరాలు అన్ని రంగాలలోను కేంద్రాలుగా విలసిల్లుతాయి.

**4. పారిస్థితిక సంక్లిష్టతలు** - ఆర్థిక, పారిశ్రామిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి ఫలితంగా నాగరిక సముదాయం సంక్లిష్టత ఏర్పడుతుంది. ఒక ప్రదేశంలో ఒక వర్గం ప్రజలు జీవిస్తుంటారు. ఒక ప్రదేశంలో ఉండే వారి సామాజిక, సాంస్కృతిక పద్ధతులు విలువలు, వేరొక ప్రదేశంలో నివసించే వారికి సరిపడవు. దీని వల్ల నాగరిక ప్రాంతం విభిన్న సామాజిక, సాంస్కృతిక ప్రదేశాలుగా విభజన చెంది దేనికదే ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఇది మూడో నాగరిక దశ లక్షణము.

పైన వివరించిన రీతిలో నగరాలు అనేక దశల ద్వారా అభివృద్ధి చెంది, నేటి సమాజంలో నగరాలు గాను, మహానగరాలుగాను, ఉపనగరాలగాను ఏర్పడ్డాయి.

## 16.4. భారతదేశంలో నగరీకరణ - తీరుతెన్నులు:

భారతదేశంలో నగరీకరణ ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే అతి తక్కువ స్థాయిలో ఉంది. నగరీకరణ ప్రక్రియ తక్కువేయైన నగరాల సంఖ్య పెరుగుతునే ఉంది. పెద్ద గ్రామాలు నగరాలుగా నగరాలు మహానగరాలుగా మారుతున్నాయి.

పట్టిక 1: భారతదేశంలో నగరీకరణం తీరుతెన్నులు (1901–1991)

| [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 1901 | 1,827 | 238.4 | 25.8 | 10.84 | - | - | . |
| 1911 | 1,815 | 252.1 | 25.9 | 10.29 | 0.03 | 0.06 | 0.51 |
| 1021 | 1,949 | 251.3 | 28.1 | 11.18 | 0.79 | 0.09 | 0.85 |
| 1931 | 2,042 | 279.0 | 33.4 | 11.99 | 1.75 | 0.08 | 0.72 |
| 1941 | 2,250 | 318.7 | 44.2 | 13.86 | 2.77 | 0.19 | 1.56 |
| 1951 | 2,843 | 361.1 | 62.4 | 17.29 | 3.47 | 0.34 | 2.47 |
| 1961 | 2,365 | 439.2 | 78.9 | 17.97 | 2.34 | 0.07 | 0.41 |
| 1971 | 2,590 | 548.2 | 109.1 | 19.91 | 3.21 | 0.19 | 1.01 |
| 1981 | 3,378 | 683.4 | 159.5 | 22.34 | 3.83 | 0.34 | 1.72 |
| 1991 | 3,768 | 844.3 | 217.2 | 25.72 | 3.09 | 0.24 | 1.02 |

(పట్టిక - 1) ని పరిశీలిస్తే 1901వ సంవత్సరంలో 25.8 మిలియన్లుండే నగర జనాభా 1931 నుంచి క్రమేణా పెరుగుతూ 1971 నాటికి 109.1, 1981 నాటికి చేరుతుంది. అంటే 25.85 మిలియన్ల జనాభా 1901గో ఉండే 191 నాటికి ఎనిమిది వంతులు పైగా పెరిగింది. 1931లో తొంబై శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతాలలో ఉంటే అది 1971లో ఎనబై శాతం కాగా 1991 జనాభా లెక్కల ప్రకారం 74 శాతం ఉన్నారు. రానురాను ప్రజలు నగరాలలో నివసించటానికే మొగ్గు చూపిస్తున్నారు. అయితే ఇవి భారతదేశంలో నగరీకరణ చరిత్రలో పోల్చినట్లయితే చాలా సాధారణమైన పెరుగుదల మాత్రమే.

పట్టిక -2: భారతదేశంలో నగరాలు అభివృద్ధి (తరగతి 1 నుండి 6)

| సంవత్సరం | అన్ని తరగతుల నగరాలు కలిపి | నగరాల తరగతులు | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | I | II | III | IV | V | VI |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 1901 | 1,811 | 24 | 43 | 130 | 391 | 744 | 479 |
| 1911 | 1,754 | 23 | 40 | 135 | 364 | 707 | 485 |
| 1921 | 1,894 | 29 | 45 | 145 | 370 | 734 | 571 |
| 1931 | 2,017 | 35 | 56 | 183 | 434 | 800 | 509 |
| 1941 | 2,190 | 49 | 74 | 242 | 498 | 920 | 407 |
| 1951 | 2,795 | 76 | 91 | 327 | 608 | 1,124 | 569 |
| 1961 | 2,270 | 102 | 129 | 437 | 719 | 711 | 172 |
| 1971 | 2,476 | 148 | 173 | 558 | 827 | 623 | 147 |
| 1981 | 3,245 | 216 | 270 | 738 | 1,053 | 739 | 229 |
| 1991 | 3,609 | 296 | 341 | 927 | 1,135 | 725 | 185 |

పట్టిక 2 ని పరిశీలిస్తే భారతదేశంలో నగరాల అభివృద్ధి తెలుస్తుంది. 1901 నుండి భారతదేశంలోని చాలా నగరాలు, పట్టణాలు పెరుగుదల తీరు ఒకే రీతిలో లేదు. దీనికి అనేక కారణాలున్నాయి. 1951లో పట్టణాలు వర్గీకరణను తొలగించడం, 1961లో మళ్ళీ పట్టణాలు, నగరాలను వర్గీకరించడం 1971లో కొన్ని నూతన నగరాలను కలపడం మరి కొన్నింటికి హోదా పెంచడం ప్రధాన కారణాలు. దేశ స్వాతంత్ర్యానంతరం 1951లో నగరాల సంఖ్య గణనీయంగా పెరిగింది (2,843) అయితే 1961 జనాభా లెక్కల ప్రకారం నగరాలను పునర్విభజించడం వల్ల 2,364కు తగ్గి 1971, నాటికి 2,590 నగరాలకు పెరిగింది. 1981 లో దాదాపు 800 పట్టణాలు కలిపి 3,378 నగరాలుగాను, 1991లో ఇవి 3,768గా గ్రామాలు పెరుగుతూ వచ్చాయి.

పట్టిక -3: భారతదేశంలో తరగతివారీ నగర జనాభా శాతం (1901-1991)

| సంవత్సరం | అన్ని తరగతుల నగరాలు | తరగతివారీ నగరాలు | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | I | II | III | IV | V | VI |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 1901 | 100.00 | 26.00 | 11.29 | 15.64 | 20.83 | 20.14 | 6.10 |
| 1911 | 100.00 | 27.48 | 10.51 | 16.40 | 19.73 | 19.31 | 6.57 |
| 1921 | 100.00 | 29.70 | 10.39 | 15.92 | 18.29 | 18.67 | 7.03 |
| 1931 | 100.00 | 31.20 | 11.65 | 16.80 | 18.00 | 17.14 | 5.21 |
| 1941 | 100.00 | 38.23 | 11.42 | 16.35 | 15.78 | 15.08 | 3.14 |
| 1951 | 100.00 | 44.63 | 9.96 | 15.72 | 13.63 | 12.97 | 3.09 |
| 1961 | 100.00 | 51.42 | 11.23 | 16.94 | 12.77 | 6.87 | 0.77 |
| 1971 | 100.00 | 57.24 | 10.92 | 16.01 | 10.94 | 4.45 | 0.44 |
| 1981 | 100.00 | 60.42 | 11.63 | [illegible] | 9.54 | 3.58 | 0.50 |
| 1991 | 100.00 | 65.20 | 10.95 | 13.19 | 7.77 | 2.60 | 0.29 |

పట్టిక-3 పరిశీలించగా నగర జనాభా శాతం ఆయా తరగతుల (క్లాస్ 1-6) ననుసరించి 1901-91 మధ్యకాలంలో పెరుగుతూ, తగ్గుతూండటం వల్ల నగరీకరణ తీరుతెన్నులు చూడవచ్చు. 1,00,000 మించి ఉండే జనాభా ఉన్న నగరాలే (Class-1 Cities) నానాటికీ అభివృద్ధి చెందుతున్నాయి. ఇలాంటి పెద్ద నగరాలలో ఉండే జనాభా 1901 నుంచి 91 వరకూ అన్ని తరగతులకంటే ఎక్కువనే చెప్పాలి. తరగతి-1 నగరాలలో ఉండే జనాభా శాతం 1901లో 26.0 శాతం ఉండగా 1991లో 65.20 శాతానికి పెరిగినది. 1931 వరకు నగర జనాభాలో రెండో స్థానాన్ని ఆక్రమించిన తరగతి 4,5 నగరాలు (క్లాస్ 4,5 నగరాలు) 1941 నాటికి రెండో స్థానంలో తరగతి -3 నగరాలున్నాయి. 1951-91 వరకు తరగతి 2 నగరాలు జనాభా విషయంలో రెండో స్థానాన్ని ఆక్రమించాయి. కాని తరగతి 4,5,6 నగరాలలో జనాభాశాతం క్రమేణా తగ్గుతూ వచ్చింది. కాబట్టి పెద్దనగరాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతున్నాయి. మొత్తం 3,609 నగర ప్రాంతాలలో 296 తరగతి 1 నగరాలైతే, 65.20 శాతం నగర జనాభా ఇలాంటి నగరాలలోనే ఉంటున్నారు.

పట్టిక -4 : మహానగరాల అభివృద్ధి 1901 - 1991

| సంవత్సరం | మిలియన్ జనాభా గల నగరాలు | జనాభా | సరాసరి జనాభా (మిలియన్లు) |
|---|---|---|---|
| 1901 | 1 | 1,510,008 | 1.51 |
| 1911 | 2 | 2,763,586 | 1.38 |
| 1921 | 2 | 3,129,518 | 1.56 |
| 1931 | 2 | 3,406,869 | 1.70 |
| 1941 | 2 | 5,307,540 | 2.65 |
| 1951 | 5 | 11,746,616 | 2.35 |
| 1961 | 7 | 18,101,748 | 2.59 |
| 1971 | 9 | 27,831,065 | 3.09 |
| 1981 | 12 | 42,121,100 | 3.51 |
| 1991 | 23 | 70,661,259 | 3.07 |

పట్టిక-4 లోని సమాచారం పరిశీలించి చూడగా 1991 జనాభా లెక్కల నాటికి దేశంలో 23 మహానగరాలు (మిలియన్ జనాభా మించిన నగరాలు) ఉన్నాయి. 1901లో కేవలం కలకత్తాయే మహానగరంగా ఉండేది. ఈ సంఖ్య 1911లో రెండుకు చేరి 1941 వరకు స్థిరంగానే ఉన్నది. తరువాత 1951లో అయిదు; 1961లో ఏడు; 1971లో తొమ్మిది; 1981లో పన్నెండుగాను అభివృద్ధి చెందాయి. అయితే 1981-91 దశాబ్దంలో ఇంచుమించుగా రెట్టింపు సంఖ్యలో మహా నగరాలు (23) పెరిగాయి. ఇలాంటి నగరాలలో జనాభా 1901లో, 1,510,008కాగా 1991లో 70,7661, 259కు పెరిగింది. అట్లాగే ఇలాంటి నగరాల సరాసరి జనాభా 1931వరకు ఒక మిలియన్‌కు మించి ఉండగా, అదే 1941 నుంచి రెండు మిలియన్లపైన; 1971 నుంచి మూడు మిలియన్లకు మించి చేరుకున్నది. కాబట్టి 1991 నాటికి దేశంలో నగర జనాభాలో 1/3 వంతుకుపైన (32.54) మహానగరాలలోనే నివసిస్తున్నారు.

## 16.5. సారాంశం:

ఒక సముదాయాన్ని నాగరిక సముదాయంగా తయారు చేసి దానిని అభివృద్ధి పరచే ప్రక్రియనే నగరీకరణ అంటారు. వ్యవసాయం, పశుపోషణ, ఇతర వృత్తులు సాంకేతికాభివృద్ధి, సామాజిక వ్యవస్థాపన వంటి ప్రత్యేక లక్షణాలున్న గ్రామీణ సముదాయలు మాత్రమే

నగరీకత ప్రక్రియకి దోహదపడతాయి. భారతదేశంలో నగరీకరణ ప్రక్రియ తక్కువే అయినప్పటికి నగరాల సంఖ్య పెరుగుతునే ఉంది. సంప్రదాయ, సాంస్కృతిక విలువలూ సంస్థలు కొనసాగుతున్నప్పటికి అవి బలపడుతూనే, ఆధునిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

## 16.6. ముఖ్య పదాలు :

నగరీకరణ

## 16.7. నమూనా ప్రశ్నలు :

1. నాగరీకరణ భావనను వివరించండి.
2. నాగరిక దశలను క్లుప్తంగా విశదీకరించుము.
3. భారతదేశంలో నగరీకరణ తీరుతెన్నులపై ఓ వ్యాసాన్ని వ్రాయండి.

## 16.8. చదువదగిన గ్రంథాలు :

1. Urban Sociology - Anderson N. Govardan K
2. Urban Sociology - Gist P. & Java
3. Urban Structure - Ralah Thompson
4. The city - R.E. Park, E.W. Burges Urban Sociology - Bergel E.V.
5. The State of Urbanization - Houses and Schnore

డా. జి.వి. రమణ

పాఠం - 17

# నగరీయత ఒక జీవనవిధానం

## (Urbanism as a way of life)

## 17.0 లక్ష్యం:

లూయిస్‌వర్త్ - నగరీయత ఒక జీవన విధానం గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ఏకైక లక్ష్యం.

## విషయసూచిక:


17.1. పరిచయం

17.2. నగరీయత ఒక జీవన విధానం

17.2.1. ప్రాంతపు పరిమాణం

17.2.2. జనసాంద్రత

17.2.3. జనాభాలో విభిన్నత

17.3. నగరీయత లక్షణాలు

17.4. సారాంశం

17.5. ముఖ్యపదాలు

17.6. నమూనా ప్రశ్నలు

17.7. చదువదగిన గ్రంథాలు


## 17.1. పరిచయం:

నేటి నగరాలు, పట్టణాలు ఒకనాటి గ్రామలే అనేక శతాబ్దాలుగా పరిణామము చెంది నేడు నగరాలుగా ఏర్పడ్డాయి. నగరాలు నాగరికతకు దర్పణాలు, అభివృద్ధికి ప్రతిబింబాలు. రవాణా సౌకర్యాల అభివృద్ధి, బావ ప్రసార సాధనాల వ్యాప్తి వలన గ్రామీణ సముదాయాలు అభివృద్ధి చెంది కాలక్రమేణ పట్టణాలుగా రూపాంతరం చెందాయి. నగరానికి నాగరిక జీవనానికి అవినాభావ సంబంధముంది.

నగర జీవితానికి సంబంధించి రెండు విరుద్ధభావాలు కనిపిస్తాయి. సంస్కృతి, నాగరికత, ప్రగతికి ప్రతి రూపంగా, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం జీవనం ఆధునీకరణకి దర్పణంగా ఒక వైపు మరో వైపు సనాతన సంప్రదాయ విశ్వాసాలు, విలువల్లు, మానవ సంబంధాలు క్షీణింపజేసే నిరాశా, నిస్పృహ, నిరాసక్తత, ఒంటరితనం వంటివి నగర జీవితాకి అనేక సామాజిక సిద్ధాంతాలు రావడానికి దారి తీసింది. వీటిలో ఆశావాదం - నిరాశావాదం రెండూ చోటు చేసుకున్నాయి. వీటికి సంబంధించిన సిద్ధాంతకర్తలలో సిమ్మెల్, లూయిస్ వర్త్, స్టాన్‌లిమిల్ గ్రామ్ ముఖ్యులు. వీరిలో లూయిస్ వర్త్ పరిశోధన వ్యాసం 'నగరీయత ఒక జీవన విధానం' చెప్పుకోదగినది.

## 17.2. నగరీయత - ఒక జీవిత విధానం :

లూయిస్ వర్త్ (1897-1952) అమెరికాలో చికాగో ప్రాంతంలో అభివృద్ధి చెందిన సమాజశాస్త్రజ్ఞులలో ప్రముఖ వ్యక్తి, నగర సమాజశాస్త్ర ప్రాముఖ్యతను పెంపొందించిన వారిలో ముఖ్యుడు నగర సమాజ శాస్త్రానికి సంబంధించి అంత వరకు ప్రచారంలో ఉన్న నిర్వచనాల అసంపూర్ణతను గుర్తించి నగరానికి సరికొత్త నిర్వచనమిచ్చాడు. నగర లక్షణాలను ప్రతిబింబించే సామాజిక జీవన క్రియలు

మరియు సామాజిక వ్యవస్థల ఆకృతులను వివరించే దిశలో వర్త్ నగరీకరణ ఒక జీవన విధానం అనే వ్యాసాన్ని సిద్ధాంతపరంగా వర్త్ సాధించాడు.

నగరీయత అంటే నగరం పలువురిని ఆకట్టుకొని వారిని తన జీవిత విధానంలోకి మార్చుకొనే ప్రక్రియ మాత్రమే కాదు. నగరం దానికి వున్న సంస్థల ద్వారా, సదుపాయాల ద్వారా ఒక వైపు ప్రగతిని సాధిస్తూ మరో వైపు ప్రగతికి సరిపడే మార్పులను జీవిత విధానాలలో తెచ్చుకుంటూ ఆ జీవిత విధానాన్ని బయటవారు ఓ ప్రత్యేక విధానంగా గుర్తించేటట్లు చేయడం.

నగరీయత అనే పదాన్ని అర్థాన్ని తొలిసారిగా వివరించినవాడు లూయిస్ వర్త్ 1938లో అమెరికన్ జర్నల్ ఆఫ్ సోషియాలజీలో నగరీయత ఒక జీవన విధానం అనే పరిశోధనాంశాన్ని ప్రచురించారు. వర్త్ అభిప్రాయంలో నగరీయతకు, నగరీకరణకు తేడా వుంది. నగరీకరణ ఒక ప్రక్రియ (Process), నగరీయత ఒక సామాజిక స్థితి (Social Condition) నగరీకరణ నగర వాసులకే పరిమితమైతే నగరీయత ఒక నగరవాసులకే కాకుండ గ్రామీణులలో కూడ ఉంటుంది. నాగరికత, ఆధునికత అధికంగా ఉన్నచోటు నగర సంస్కృతి, నగరీయత ఎక్కువగా ఉంటుంది.

ఇతర ప్రాంతాలతో పోల్చినపుడు విశాలంగాను, అధిక జనసాంద్రతగలదిగాను, విభిన్న తరహాల వ్యక్తుల స్థిర నివాస ప్రాంతంగా ఉన్నదే నగరంగా వర్త్ నగరాన్ని నిర్వచించాడు. వర్త్ నగరాన్ని నిర్వచించేటపుడు జనాభా పరిణామంశాలకంటే సామాజికాంశలకే ప్రాధాన్యతనిచ్చాడు.

వర్త్ నిర్వచనంలో మూడు ముఖ్య అంశాలను గుర్తించవచ్చు.

17.2.1. ప్రాంతపు పరిమాణము (Size)
17.2.2. జనసాంద్రత (Density of Population)
17.2.3. జనాభాలో విభిన్నత (Heterogenety)

ఈ మూడింటి ఆధారంగానే నగరాలలోని సామాజిక జీవితం, ఏ రీతిలో ప్రభావితమౌతుందో వర్త్ వివరించాడు.

1. జనసాంద్రత పెరిగేకొద్దీ ప్రత్యేకీకరణలు ఏర్పడతాయి.
2. సామాజిక జీవనం యొక్క సంప్రదాయక ఆధారాలైన మతం, ఉమ్మడి సంప్రదాయాలు, ఉమ్మడి వారసత్వం వంటి వాటికి భంగం కలిగిస్తాయి.
3. నగర జీవితంలో కనిపించే విభిన్నత వారిలో భేదాలను కలిగిస్తూ నిరాశా నిస్పృహలకు గురి చేస్తూ సామాజిక బంధాలను బలహీనపరుస్తుంది.
4. నగర పరిమాణం అధికమయ్యే కొద్దీ వ్యక్తిగత జీవితం భిన్న ఖండాలుగా విడిపోతుంది. అధిక జనాభావల్ల ప్రత్యక్ష సంబంధాలకు వీలు కలుగదు. వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించే వీలులేదు. నగరవాసుల జీవితాలు భిన్న ఖండాలుగా విడిపోవటానికి భిన్నత్వమే కారణం.
5. నగర వాసులలో ఉండే వాచాకుత్వనం, హేతుబద్ధతలు నగరత్వం వల్ల ఏర్పడినవే.
6. నగరత్వ ప్రభావం వలనే అనియత సామాజిక నియంత్రణకు బదులు నియత సామాజిక నియంత్రణ ప్రాముఖ్యం వహించడం జరుగుతుంది.

7. సామూహిక ప్రవర్తన నగరాలలోనే ఎక్కువగా కనిపిస్తుంది. జనం గుమిగూడటం ఏదో ఒక చర్యకు పూనుకోవడం సాధారణంగా జరుగుతుంది.

## 17.3. నగరీయత లక్షణాలు:

పరిణామాత్మకంగా నగరాలు ఆవిర్భవించిన నాటి నుంచే నగర జీవనం ప్రత్యేకమైనదిగా ఉంది. సామాజిక నిర్మితి ప్రకార్యాలలోను, వ్యక్తుల వైఖరుల్లోను సాంకేతిక పారిస్థితిక వ్యవస్థాపనలోను, భౌతిక నిర్మితిలోను నగరీయత గ్రామీణీయతకు భిన్నమైన ప్రక్రియగా ఉంటుంది. నగరీయత లక్షణాలను క్రింది విధంగా వివరించవచ్చు.

**1. సామాజిక గతిశీలత** - వ్యక్తిగతిశీలత నగర జీవనంలో అధికంగా వుంటుంది. నూతన పద్ధతులు, కొత్త అలవాట్లపై మక్కువ ఎక్కువ సంప్రదాయాలు, జానపదరీతులు, పాతపద్ధతులు వంటి వాటిని వదలి కొత్త వాటిపట్ల ఆసక్తిని కనపరుస్తారు. వ్యక్తుల నివాసగతిశీలత కూడ అభివృద్ధి చెందుతున్న నగరాలలో అధికంగా ఉంటుంది. వృత్తి గతశీలత వల్ల వ్యక్తుల సామాజిక వర్గ స్థాయిలో కూడా మార్పు వస్తుంది.

**2. యాంత్రిక శక్తి వినియోగం** - వర్త్ వినియోగించిన యాంత్రికత (Mechanism) అనేది నగర జీవనంలో వివిధ విషయాలలో కనిపిస్తుంది. నాగరికత సూచికగా విద్యుచ్ఛక్తి, రవాణా, తాగునీటి పథకాలు వంటివి ఉంటాయి. నగరీయతా ప్రభావానికి అనుగుణంగా వ్యక్తుల యాంత్రికశక్తిని అధికంగా వినియోగిస్తారు. వస్తు వినియోగంలో యాంత్రిక పరమైన జ్ఞానాన్ని కలిగి ఉండటం నగరీయత లక్షణంగా గుర్తించవచ్చు.

**3. అధికమైన శ్రమ విభజన, ప్రత్యేకీకరణ** - ఆధునిక పారిశ్రామిక విధానాలను బట్టి సంప్రదాయమైన వృత్తులు మార్పుచెందుతాయి. దీనివల్ల కొన్ని ప్రత్యేక వృత్తులు ఏర్పడతాయి. ఉత్పత్తి ప్రక్రియను బట్టి కొం ప కార్మికులకు ప్రత్యేకీకరణ ప్రభావంగా ఉండాలి. అధికమైన శ్రమ విభజన నగరీయత ముఖ్యలక్షణం.

**4. వ్యక్తి ఏర్పాటు** - నగర జీవనంలో వ్యక్తులు స్వతంత్రంగా జీవించాలని ఆరాటపడతారు. అనేక పాత్రలు నిర్వర్తిస్తుంటారు. వాటికితానే బాధ్యత వహిస్తాడు. కుటుంబాలు అధికంగా ఉండటం వల్ల వ్యక్తిగత బాధ్యత కలిగి ఉంటాడు. ఆధునిక రీతులకు బట్టి వాటివల్ల ఆసక్తి చూపడమే కాకుండా వ్యక్తి ఇష్టాన్ని బట్టి గౌణ సమూహాల సభ్యత్వం కలిగి ఉంటాడు.

**5. ప్రతీక్షణలు, మార్పు** - నగరం అన్ని రంగాలలో వైవిధ్యమున్నప్పటికి, వ్యక్తులకు గౌణ సమూహాల సభ్యత్వం, గౌణపరమైన సంబంధాలు ఉన్నప్పటికి నగరవాసులకు సహనం, ఓర్పు అధికంగా ఉంటాయి. అందుకే నగర వ్యవస్థలో మారుతున్న పరిస్థితులు ఊహించి, అంచనా వేసే అందుకు అనుగుణంగా నగరవాసులు సహనం కలిగి ఉంటారు. ఉదాహరణకు తల్లిదండ్రులు వారి పిల్లలకు మంచి భవిష్యత్తు కోసం చక్కని శిక్షణ అందించేటుందుకు పబ్లిక్ పాఠశాల వ్యవస్థను పటిష్ఠ పరిచేందుకు తగిన జాగ్రత్తలు వహిస్తారు.

**6. కాలం విలువ** - పాలనా, వాణిజ్య, వ్యాపార రంగాల ప్రాధాన్యత నగరాలలో ఉన్నప్పుడు కాలం విలువ పెరుగుతుంది. ఉదయం నిద్రలేచింది మొదలుకొని రాత్రి నిద్రపోయేవరకు వివిధ ప్రకార్యాల కోసం నిర్ణీత సమయం కేటాయించడం జరుగుతుంది. దాంతో వ్యక్తి కాలాన్ని బట్టి నడుచు కోవటం వల్ల కృత్రిమ జీవనంగా చెప్పుకుంటారు. పారిశ్రామికీకరణ వృద్ధివల్ల సమయం విలువ పెరిగింది.

**7. రికార్డులు వ్రాత ప్రతుల ప్రాముఖ్యత** - పారిశ్రామికీకరణ ఫలితంగా సంబంధాలు పెరుగుతాయి. వ్యాపార వాణిజ్య పరిశ్రమల సంస్థలు అభివృద్ధి చెందటం వల్ల రాతప్రతులు ప్రాముఖ్యత అధికమవుతుంది. కాగితం పనిలేనిదే ఈ సంస్థల ప్రకార్యాలు సజీవంగా

నిర్వహించడానికి వీలుపడదు, అట్లాగే నగర పురపాలక సంస్థల రికార్డుల పనిలేనిదే ముందుకు పోలేరు. నగర జీవితంలో దానపత్రాలు, రికార్డుల ప్రాధాన్యత వ్యక్తి జననధ్రువ పత్రంతో మొదలై లింగ మరణ ధృవపత్రం పొందే వరకు ఉంటుందనే చెప్పాలి. ఈ రెండిటి మధ్య వ్యక్తి విద్యా, ఉద్యోగ నగర పౌరునిగా ఇతర సంస్థలతో సభ్యత్వం మొదలైనవి ఉంటాయి.

**8. సృజనాత్మకత, పునప్రారంభం** - గతిశీలత ప్రాంతాలుగాను, నిరంతరం జనాభా ఒత్తిడితో అవిశ్రాంతంగాను ఉంటాయని చెప్పవచ్చు. గ్రామాలలో నిరుద్యోగితలో ఉన్న యువకులకు సామర్థ్యం కలిగిన వారికి, నగర జీవనమంటే మోజు ఉంటే వారికి నేడు నగరాలు ఎంతగానో ఆకరిస్తున్నాయి. అదే విధంగా క్రియాత్మకమైన వ్యక్తులను వ్యక్తులను కూడా పోటీతత్వం, అసాధరణమైన జీవన రీతుల ద్వారా నగరాలు ఆకర్షితులను చేస్తున్నాయి.

## 17.4. సారాంశం:

లూయిస్ వర్త్, నగరీయత ఒక జీవన విధానంగా భావించాడు. నగరీకరణ అనేది నగర వాసులకు పరిమితమైతే నగరీయత ఒక నగరవాసులకే కాక గ్రామీణ ప్రజలలో కూడా కనపడుతుంది. నగరమంటే పెద్దదైన పరిమాణం, సాంద్రత కలిగి, సామాజిక వైధర్యత కలిగిన వ్యక్తుల స్థిర నివాసమని వర్త్ నిర్వచించాడు.

## 17.5. ముఖ్యపదాలు:

సామాజిక వైదర్యత

నగరీయత

## 17.6. నమూనా ప్రశ్నలు:

1. నగరీయత అంటే ఏమిటి వివరించండి.

2. నగరీయత ఒక జీవన విధానం అనే భావనను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

## 17.7. చదువదగిన గ్రంథాలు


1. Urban Community - Thudipara, Z. Jacob

2. The city - R.E. Park, E.W. Burges

3. Urban Sociology - Bergel E.V.


**డా. జి.వి. రమణ**

# ప్రాక్ పారిశ్రామిక నగరాలు - పారిశ్రామిక నగరాలు లక్షణాలు

## (Characteristics of Pre-Industrial and Industrial Cities)

### 18.0 లక్ష్యం :

ప్రాక్ పారిశ్రామిక నగరాలు, పారిశ్రామిక నగరాల గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :


18.1. పరిచయం

18.2. ప్రాక్ పారిశ్రామిక నగరాలు

18.3. పారిశ్రామిక నగరాలు

18.4. సారాంశం

18.5. ముఖ్యపదాలు

18.6. నమూనా ప్రశ్నలు

18.7. చదవదగిన గ్రంథాలు


### 18.1. పరిచయం :

మానవ సమాజ అభివృద్ధికి నిదర్శనాలు నగర ప్రాంతాలు నగరాలు పదివేల సంవత్సరాల కిందటే ఆవిర్భవించాయి. అయితే నేడు విశ్వమంతా వేగవంతమైన నగరీకరణ చరిత్ర మాత్రం రెండు వందల సంవత్సరాలే. మానవ సమాజంలో ఇంత వరకు మూడు స్థాయిలలో ఉన్న మానవ వ్యవస్థాపన కనిపిస్తుంది. షోబెర్గ్ (Shoberg) తన గ్రంథం ది ప్రి ఇండస్ట్రియల్ సిటి (The Pre-Industrial City) లో ఈ మూడు స్థాయిలకు తమదైన సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంకేతిక తీరుతెన్నులున్నాయని, వెల్లడించాడు. మొదటి స్థాయిలోని మానవ వ్యవస్థాపన 'జానపద సమాజం' (Folk Society) దీనిలో ప్రత్యేకీకరణ అనేది అసలు లేకుండాగాని అతి తక్కువ స్థాయిలోగాని ఉండి వర్గభేదం లేకుండా ఉంటుంది. జనాభా స్వల్పంగా ఉంటూ, సారూప్యత, స్వయం సమృద్ధత లక్షణాలను కలిగియుంటుంది. ఆహార మిగులు అనేది దీనిలో లేదు ఆహార సేకరణ, ఉత్పత్తులతోనే నిమగ్నమై ఉంటుంది. నేటికి ప్రపంచంలో కొన్నిచోట్ల జానపద సమాజాలు కొనసాగటాన్ని గమనించవచ్చు.

రెండో స్థాయి, వ్యవస్థాపన - ఫ్యూడల్ లేదా నాగరిక పారిశ్రామిక పూర్వ సమాజం. కొన్ని వేల సంవత్సరాల కిందట వ్యవస్థా నిర్మితి, సాంకేతిక పురోగతిలు ఆధారంగా సారూప్యతగల మానవ సమూహాలు సంక్లిష్ట సమాజాలుగా రూపాంతరం చెందాయి. ఫ్యూడల్ సమాజంలో ఆహార మిగులు సాధ్యమవుతుంది. పశుపోషణ, అధికోత్పత్తిని అందించే విత్తన వినియోగం, వాటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంటుంది. ఆహార మిగులు పని ప్రత్యేకీకరణకు వర్ణ వ్యవస్థ వృద్ధికి దారి తీస్తుంది. వ్యవసాయ పనులకు ఉపకరించే లోహాల శుద్ధి నైపుణ్యం (Metallurgy) నాగళ్ళ వినియోగం, చక్రాలను వాడటం ఉంటుంది. ఈ స్థాయిలోని సమాజాలలో రెండు ప్రధాన అంశాలు కనిపిస్తాయి. వీటిలో మొదటిది అక్షరజ్ఞానం - దీనివల్ల వ్రాయడం, జమా ఖర్చులు వ్రాయడం చారిత్రిక సంఘటనల రికార్డు చేయడం, శాసనాల అభివృద్ధి మతం సాహిత్యం మొదలైనవి అభివృద్ధి చెందడానికి దోహదపడింది.

అక్షర జ్ఞానం శిష్టులకే పరిమితమవ్వడాన్ని గమనించవచ్చు. ఇక రెండవ అంశం జంతు సంబంధంలేని ఇంధన వనరుల వినియోగం, తర్వాతకాలంలో ఫ్యూడల్ సమాజాలు శక్తిని వినియోగించి సముద్రయానం చేయడం, ధాన్యాన్ని దంచడమే కాకుండా జలశక్తిని ఉపయోగించుకోగలిగాయి. ఇటువంటి సమాజం నుంచే ప్రపంచంలోని అతి ప్రాచీన నగరాల ఆవిర్భం జరిగింది.

మూడో స్థాయిలోని మానవ వ్యవస్థ నేడు మనం చూస్తున్న ఆధునిక పారిశ్రామిక నగరం అత్యధికులు అక్షరాస్యత కలిగి ఉండటం దీనిలో చూడవచ్చు. వర్గ వ్యవస్థ నిరంతరం మార్పులకు లోనవుతుంది. విద్యుచ్ఛక్తి, ఆవిరి వంటి వాటిని పారిశ్రామిక విప్లవం కొనసాగడానికి ఎంతో ఉపకరించాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి అధికంగా ఉంటుంది. మూడు అంచెల నిర్మిత పారిశ్రామిక విప్లవ పూర్వపు సమాజాల భూస్వామ్య వ్యవస్థ సమాజాలు పుట్టుకను అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది.

నగరాల అవిర్భావానికి శాస్త్ర సంకేతిక రంగాలలోని ప్రగతితో పాటు వ్యవసాయ ఉత్పత్తుల మిగులు, నీటిపారుదల వ్యవస్థలు కూడా దోహదపడ్డాయి.

## 18.2. ప్రాక్ పారిశ్రామిక నగరాలు:

షోబెర్గ్ తన గ్రంథం ది ప్రీ ఇండస్ట్రియల్ సిటి లో నగర వర్గీకరణ గురించి వివరించాడు. సామాజిక, రాజకీయ ఆర్థిక రాజకీయ పరిస్థితుల ఆధారంగా నగర వర్గీకరణ ఏర్పడుతుంది. షోబెర్గ్ నగరాలకు ఉండే కొన్ని ప్రత్యేక లక్షణాలను వివరించి, ప్రాక్ పారిశ్రామిక నగరాలకు, ఆధునిక పారిశ్రామిక నగరాలకు మధ్య వివిధ విషయాలలో భేదాలు ఉంటాయని వివరించాడు. ప్రాక్ పారిశ్రామిక నగరాల చరిత్ర ప్రారంభదశలోనే కాక, నేటికి కొన్ని కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా ఆసియాఖండంలోను, ఆఫ్రికా ఖండంలోని కొన్ని ప్రాంతాలలో ఉన్నాయని అభిప్రాయ పడ్డాడు. నేడు చాలా నగరాలలో పారిశ్రామిక నగర లక్షణాలతో పాటు ప్రాక్ పారిశ్రామిక నగర లక్షణాలు కూడా సమ్మేళనంగా ఉన్నాయని ఇతడు భావించాడు.

### ప్రాక్ పారిశ్రామిక నగర లక్షణాలు:

ప్రాక్ పారిశ్రామిక నగరాలు అనే దానికి ప్రాధాన్యత కల్గడానికి కారణ గిడియోన్ స్లోబెర్గ్ ప్రాక్ పారిశ్రామిక నగరాలు క్రింది లక్షణాల్ని కల్గియున్నాయి.

**1. పరిమానం (Size):** ఈ నగరముల యొక్క పరిమాణకు తక్కువగా ఉంటుంది. ప్రధానంగా వ్యాపార కేంద్రాలై ఉంటాయి.

**2. జనాభా (Population):** మొత్తం జనాభా లక్షకు మించి ఉండరు. నాగరిక జనుల సంఖ్య కన్న కర్షక జనుల సంఖ్య అధికంగా ఉంటుంది.

**3. వృత్తులు (Occupation):** ఆర్థిక వ్యవస్థ యంత్రశక్తి మీద కాకుండా మానవ, జంతు శక్తుల మీద ఆధారపడి ఉంటుంది. శ్రమ విభజన చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. వస్తు ఉత్పత్తి సైతం తక్కువగానే ఉంటుంది. వృత్తులు ప్రధానంగా వారి చుట్టూ ఉన్న పృష్ట భూమి (Hinterland) పై ఆధారపడి ఉంటాయి.

**4. సామాజిక ఏర్పాటు (Social seggregation):** ఈ నగరాలలో సామాజిక ఏర్పాటు చాలా దృఢంగా ఉంటుంది. నగరంలోని వీధులు వృత్తిని బట్టి, కులాన్ని మతాన్ని అనుసరించి విడివిడిగా ఉంటాయి.

**5. సంస్కృతి:** ఈ నగరాలలో సంస్కృతి పటిష్టంగా ఉంటుంది. సంస్కృతిపరంగా ఎటువంటి సమస్యలు కలగవు.

**6. సామాజిక గతిశీలత:** ఈ నగరాలలో సామాజిక గతిశీలత చాలా తక్కువగా ఉంటుంది.

**7. కుటుంబ వ్యవస్థ:** ఎక్కువ సంఖ్యలో విస్తృత, కుటుంబాలు, సమిష్టి కుటుంబాలు ఉంటాయి.

**8. బంధుత్వం :** బంధుత్వం, బంధుత్వ సంబంధాలు చాలా దృఢంగా ఉంటాయి. వంశాన్ని, వంశగౌరవాన్ని, కీర్తిని సాధించుకోవటానికి ప్రాధాన్యత చూపుతారు.

**9. మతం :** సర్వ మతాలకు చెందిన కార్యక్రమాలన్ని ఈ నగరాలలో జరుగుతుంటాయి. మతం చాలా ముఖ్యమైన పాత్రవహిస్తుంది. మతం సామాజిక నియంత్రణకి ఉపయోగపడుతుంది.

**10. స్త్రీ స్థాయి :** బాల్యవివాహాలు అధికంగా జరుగుతాయి. స్త్రీ పై పురుషాధిక్యత ఎక్కువగా ఉంటుంది. స్త్రీలు అన్ని సామాజిక కార్యకలాపాలలోను పాల్గొనరు.

ఈ విధంగా ప్రాక్ పారిశ్రామిక నగరాలు అనేక లక్షణాల్ని కలిగి వున్నాయి.

## 18.3. పారిశ్రామిక నగరాలు - లక్షణాలు:

పారిశ్రామిక నగరాలు ప్రాక్ పారిశ్రామిక నగరాలకంటే భిన్నంగా ఉంటాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా నగరీకరణ జరిగింది. యూరప్ దేశాలతోపాటు ఆసియా ఖండంలోని అనేక దేశాలలో నగరీకరణ జరిగింది. ఈ విధమైన పారిశ్రామికీకరణ నగరీకరణలో అనేక మార్పులకి శ్రీ కారం చుట్టింది.

**ముఖ్యలక్షణాలు:**

1. సంప్రదాయాలు, విశ్వాసాలు, ఆచారాలు మతం వంటి వాటి ప్రభావం అంతగా ఉండదు.
2. యంత్ర శక్తి ప్రభావం అధికంగా ఉంటుంది. శ్రమలో ప్రత్యేకత, నైపుణ్యం ఎక్కువగా ఉంటుంది.
3. వస్తువులన్ని ఒకే మూసలో ఉంటాయి వైవిధ్యం ఉండదు.
4. కళలు, అభిరుచులు, ఆచార వ్యవహారాలు, అభివృత్తులు దృక్పథాలలో ఎక్కువ వైవిధ్యం కనిపిస్తుంది.
5. సామాజిక వ్యవస్థాపన, ఆర్థిక వ్యవస్థాపన ఎక్కువ సంశ్లిష్టతతో కూడి ఉంటాయి.
6. సమిష్టి కుటుంబాలు కన్న వ్యష్టి కుటుంబాలే అధికంగా ఉంటాయి.
7. ఆలస్యంగా వివాహాలు జరుగుతాయి.
8. స్త్రీలు అన్ని రంగాలలోను పురుషులతో పాటు సమాన హోదాని అనుభవిస్తారు. అన్ని రంగాలలోను రాణిస్తారు.
9. విడాకులు సంఖ్య ఎక్కువగా ఉంటుంది.
10. సామాజిక గతిశీలత అధికంగా ఉంటుంది.

### ప్రాక్ పారిశ్రామిక నగరానికి పారిశ్రామిక నగరానికి మధ్య భేదాలు

| ప్రాక్ పారిశ్రామిక నగరాలు | పారిశ్రామిక నగరాలు |
| --- | --- |
| 1. విస్తృత, సమిష్టి కుటుంబాలు ఎక్కువగానే ఉంటాయి. బంధుత్వం, బంధుత్వ సంబంధాలు పటిష్టంగా ఉంటాయి. | వ్యష్టి కుటుంబాల అధికంగా ఉంటాయి. బంధుత్వ సంబంధాలు దృఢంగా ఉండవు. |
| 2. సామాజిక గతిశీలత తక్కువ. | సామాజిక గతిశీలత ఎక్కువ. |
| 3. సాంకేతిక పరిజ్ఞాన తక్కువ. యంత్రశక్తి వినియోగం వస్తు తక్కువ. ఉత్పత్తి తక్కువగా ఉంటుంది. | సాంకేతిక పరిజ్ఞానం అధికంగా ఉంటుంది. ఆధునిక యంత్రాలు వల్ల వస్తు ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. |
| 4. కుటీర పరిశ్రమలు ఎక్కువ. ఆర్థిక సంస్థలు, ఆర్థిక వ్యవస్థాపన చాలా తక్కువ. తూకాలు నిర్ణీత ప్రమాణాలలో తక్కువ. | శ్రమ విభజన శ్రమ విశిష్టన అధికంగా ఉంటాయి. సామాజిక పరివర్తన ఎక్కువగా ఉంటాయి. తూకాలు నిర్ణీత ప్రమాణాలలో ఉంటాయి. |
| 5. పరిపాలనా వ్యవస్థ సంప్రదాయ బద్ధంగా ఉంటుంది. ప్రజాభిప్రాయానికి విలువు ఉండదు. | పరిపాలనా వ్యవస్థ ప్రజాస్వామ్య పద్ధతి పై ఆధారపడి ఉంటుంది. ప్రజాభిప్రాయానికి విలువనిచ్చి నగర సమస్యల పరిష్కరించటం జరుగుతుంది. |
| 6. సంప్రదాయమైన నైతిక వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. నైతిక విలువలను పాటిస్తారు. | మారుతున్న సామాజిక విలువను బట్టి సంప్రదాయ విధానంలో సడలింపులు వచ్చి నైతిక పతనానికి దారి తీస్తుంది. ఈ విధంగా అవినీతి, అక్రమాలు నేర ప్రత్యుత్తి వ్యభిచారం వంటివి ప్రబలుతాయి. |

## 18.4. సారాంశం :

నగర ప్రాంతాలు మానవ సమాజ ప్రగతికి ప్రతిబింబాయి. విద్య వైజ్ఞానిక వ్యాపార, వాణిజ్య, వైద్య, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాలను కేంద్రాలు నగరాలు పోబేర్గ నగరాలను ముఖ్యంగా రెండు విధాలుగా విభజించాడు. అవి ప్రాక్ పారిశ్రామిక నగరాలు మరియు పారిశ్రామిక నగరాలు వేటికవే ప్రత్యేక లక్షణాల్ని కలిగి వున్నాయి.

## 18.5. ముఖ్యపదాలు:

నగరం

ప్రాక్ పారిశ్రామిక నగరం

పారిశ్రామిక నగరం

## 18.6. నమూనా ప్రశ్నలు:

1. ప్రాక్ పారిశ్రామిక నగర లక్షణాల్ని వ్రాయండి.

2. పారిశ్రామిక నగర లక్షణాల్ని వివరించండి.

3. ప్రాక్ పారిశ్రామిక నగరం మరియు పారిశ్రామిక నగర మద్యన నెలకొన్న బేదాలను లేదా తేడాలను వివరించండి.

## 18.7. చదువదగిన గ్రంథాలు:


1) Society, culture and Urbanization - Elsenstards SN & A. Shachar

2) Urbanization and Urban System in India - Ramachandran 1997

3) The Pre-industrial city in sandor Halehisky (ed)

4) The Sociology of city - Showberg Gidean


డా. జి.వి. రమణ

పాఠం - 19

# నగర ఆవరణ శాస్త్రం - నగర నివాస ప్రాంత నమూనాలు

## (Urban Ecology - Settlement Patterns in Cities)

### 19.0 లక్ష్యం :

నగర అవరణ శాస్త్రమంటే ఏమిటి? పారిస్థితిక వ్యవస్థలోని అంశాలు, ప్రక్రియలు. నగర పారిస్థితిక వ్యవస్థ, నగర నివాస ప్రాంత నమూనాలు గురించి తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానోద్దేశం.

### విషయక్రమం :


19.1 పరిచయం

19.2 నగర ఆవరణ శాస్త్రం ( Urban Ecology)

19.3 నగర నివాస ప్రాంత నమూనాలు

19.4 పారిస్థితిక వ్యవస్థలోని అంశాలు

19.5 పారిస్థితిక ప్రక్రియలు (Ecological Elements in Cities)

19.6 నగర పారిస్థితిక వ్యవస్థ

19.6.1 మహానగరాలు

19.6.2 ఉపనగరాలు

19.6.3 అనుషంగిక నగరము

19.7 సారాంశం

19.8 ముఖ్య పదాలు

19.9 నమూనా ప్రశ్నలు

19.10 చదువవదగిన గ్రంథాలు


### 19.1. పరిచయం:

ఆవరణ శాస్త్రం లేదా "పారిస్థితి" ని ఆంగ్లంలో ఎకాలజీ (Ecology) అంటారు. మానవ ఆవరణ శాస్త్రం అనే భావనను తొలిసారిగా 1921 సంవత్సరంలో పార్క్ (Park), బర్గెస్ ( Burges) అనే సమాజ శాస్త్రవేత్తలు ప్రవేశపెట్టారు. ఆవరణ శాస్త్రం సమూహాల, వ్యవస్థాపనల, పరిసరాల పరస్పర సంబంధాలను అధ్యయనం చేస్తుంది. ఆవరణ శాస్త్రం మొదట జీవశాస్త్రంలో ఒక ప్రత్యేక శాస్త్రంగా అభివృద్ధి చెందింది జీవశాస్త్రం లోని భాగమైన జంతుశాస్త్రం (Zoology)లో కన్నా వృక్ష శాస్త్రం (Botany)లో దీనిని వాడటం జరుగుతుంది. సమాజ శాస్త్రవేత్తలు వృక్ష ఆవరణ శాస్త్రం నుంచి గ్రహించిన భావనల పునాదిగా మానవ ఆవరణ శాస్త్రాన్ని అభివృద్ధి చెయ్యటం జరిగింది. సమాజశాస్త్రంలో మానవ ఆవరణ శాస్త్రం ఒక శాఖ. ఈ శాఖ మానవులు తమ పరిసరాలలో సామాజికంగా సర్దుబాటు చేసుకోవటం కోసం ఏ విధంగా వ్యవస్థాపన ఏర్పరచుకుంటాడో తెలియజేస్తుంది. ఈ శాఖ ముఖ్యంగా నగర నివాస ప్రాంతాలు, వాటి పరిసరాలను అధ్యయనం చేస్తుంది. పారిస్థితిక వ్యవస్థాపనలో ప్రతి చర్య ఒక ప్రత్యేక ప్రాముఖ్యతను

కలిగి ఉంటుంది. ఈ చర్యలు కొన్ని వేగవంతంగా, మరికొన్ని నిదానంగా జరుగుతుంటాయి. నగర పారిస్థితిక వ్యవస్థను తెలుసుకోవాలంటే నగరవాసుల అలవాట్లు, వారి జీవన విధానాలు, వారి పరిసరాలు, ఇరుగు పొరుగు వారితో ఉండే సంబంధాలను అధ్యయనం చెయ్యాలి.


## 19.2. నగర ఆవరణ శాస్త్రం :

ఆవరణ శాస్త్రం వ్యక్తుల యొక్కయు, సముదాయములోని వ్యవస్థల యొక్క, వారి మధ్య ఉన్న సాంకేతిక సంబంధాన్ని అధ్యయనం చేయు శాస్త్రంగా డూబర్ అభిప్రాయపడ్డాడు. జాండెన్ అనే సమాజ శాస్త్రవేత్త "ఒక ఆవరణ వ్యవస్థలో ప్రధానంగా, మానవ పరిసరాలలో జీవ, నిర్జీవాంశాల మధ్యగల పరస్పర సంబంధాల ఆధ్యయనమే మానవ ఆవరణ శాస్త్రంగా నిర్వచించాడు.

జిస్ట్, ఫావా (1974) శాస్త్రజ్ఞుల అభిప్రాయం ప్రకారం మానవ ఆవరణ శాస్త్రం ఒక నిర్ణీత ప్రదేశంలో నివసించే మనుష్యుల మధ్య పరస్పర సంబంధాలను, నగర ఆవరణ శాస్త్రం నగరాలలో కనిపించే పరస్పర సంబంధాలను అధ్యయనం చేస్తాయి. నగరాల పంపిణీ, వాటి అంతర్గత నిర్మితి, కూర్పువంటి ఆవరణపరమైన పరస్పర సంబంధాలను బహిర్గతంగా కనిపించే ఇతర ఆవరణ పరమైన సంబంధాలను నగర ఆవరణ శాస్త్రం అధ్యయనం చేస్తుంది.

నగర నిర్మితి కొన్ని ప్రత్యేక లక్షణాల్ని కలిగి ఉంటుంది. నగర ఆవరణ శాస్త్రం సాధారణ లక్షణాలైన వయస్సు, లింగ విభేదం, విద్య, ఆదాయం, వైవాహిక అంతస్థు, జాతి వంటి సమిష్టి లక్షణాలు గల వ్యక్తుల సమూహములను అధ్యయనం చేస్తుంది. నగర ఆవరణ శాస్త్రం వ్యక్తిగత వ్యాపార సంస్థలను, పరిశ్రమలను గురించి వివరించదు. అయితే సేవా సంస్థలు, ఉత్పత్తి సంస్థలు, వాణిజ్య సంస్థల వంటి వాటి గురించి వివరిస్తుంది. నగర ఆవరణ శాస్త్రం ఎప్పుడూ సమిష్టులను (Collectivites) అధ్యయనం చేస్తుంది.

పార్క్ మరియు బర్జెస్ అను సమాజశాస్త్రజ్ఞులు నగర పారిస్థితిక స్థితిని (నగరాల ఆవరణ) ని వృత్తాకృతి (Circle) లో ఉంటుందని వివరించారు.



ఒక వృత్తం కంటే దానిని చుట్టి వున్న వృత్తం పెద్దదిగా ఉంటుంది. వారు పేర్కొన్న వృత్తాలు కింది విధంగా ఉంటాయి.

1. వృత్తం - నగర కేంద్రం ముఖ్యమైన బజారు లేదా పారిశ్రామిక స్థలం
2. వృత్తం - చిన్న లేదా పెద్దపరిశ్రమలు (పారిశ్రామిక యూనిట్లు)
3. వృత్తం - పారిశ్రామిక యూనిట్లు చుట్టూ పేద ప్రజల నివాసాలు
4. వృత్తం - మధ్యతరగతి ప్రజల గృహాలు
5. వృత్తం - ధనవంతుల గృహాలు

ఈ నమూనా అన్ని నగరాలకు వర్తించనప్పటిని కొన్ని నగరాలకు మాత్రమే వర్తిస్తుంది.

## 19.4 పారిస్థితిక వ్యవస్థలోని అంశాలు:

పారిస్థితిక వ్యవస్థలో నాలుగు మౌలికాంశాలుంటాయని డంకన్ (Duncan) పేర్కొన్నాడు. అవి

1. జనాభా (Population)
2. వ్యవస్థాపన (Organization)
3. పరిసరాలు (Environment)
4. సాంకేతిక విజ్ఞానం (Technology)
5. సామాజిక - మనోవిజ్ఞాన కారకాలు (Socio - Psychological Factors)

డంకన్ తెలియజేసిన నాలుగు అంశాలతో పాటు సామాజిక మనో విజ్ఞాన కారకాల్ని అయిదో అంశంగా చేరుస్తారు. ఈ అయిదు అంశాలు కలిసి (Poets) గా పిలవబడతాయి.

**1. జనాభా** - మానవ ఆవరణ శాస్త్రం ఎప్పుడు స్థిరమైన నిర్దిష్టమైన జనాభాను పరిశీలిస్తుంది. జనాభా విభిన్న లక్షణాల్ని కలిగి ఉండటంతో వాటిలో సర్దుబాటు సమస్యగా ఏర్పడింది. అంతేకాకుండా జనాభా పెరుగుతూ, తరుగుతూ, పరివర్తన చెందుతూ ఉంటుంది. నగర ఆవరణ శాస్త్రానికి సంబంధించి జనాభా లక్షణాలలో ఒకటైన చలనం ప్రధానమైనది. చలనం అంటే నగరంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస పోవడం.

**2. వ్యవస్థాపన** - పారిస్థితిక వ్యవస్థలో వ్యవస్థాపన ప్రధానమైనది. వ్యవస్థాపన లేకుంటే సామాజిక సంక్షోభం కలుగుతుంది. సామాజిక వ్యవస్థాపన ముఖ్యంగా శ్రమ విభజన మీద ఆదారపడి ఉంటుంది. నగరాలలో వ్యక్తులు కార్యకలాపాలు అధికంగా ఆర్థిక పరంగా ఉంటాయి. అందువల్ల నగర పారిస్థితిక వ్యవస్థ వివిధ వృత్తుల మధ్య శ్రమల మధ్య ఉన్న పరస్పర సంబంధాలను అధ్యయనం చేస్తుంది.

**3. పరిసరాలు** - పరిసరాలలో వాతావరణం, సహజ సంపద, ప్రకృతి వనరులు, జంతు, వృక్ష జాలం మొదలైన ఉంటాయి. జనాభా పై పరిసరాల ప్రభావం అధికంగా ఉంటుంది. పరిసరాలతో సర్దుబాటు చేసుకొని ప్రగతిని పొందడం జరుగుతుంది. భౌగోళిక పరిసరాల ప్రభావం నగర జీవనంపై ఎక్కువగానే ఉంది. ఆహారపు అలవాట్లు మొదలుగుకొని గృహ నిర్మాణం వరకు పరిసరాల ప్రభావం కనిపిస్తుంది.

**4. సాంకేతిక పరిజ్ఞానం** - జనాభా తమ పరిసరాలలో ఏ విధంగా సర్దుబాటు చేసుకుంటారనేది లభ్యమయ్యే సాంకేతిక పరిజ్ఞానం పైన ఆధారపడి ఉంటుంది. సాంకేతిక పరిజ్ఞానంతోనే మానవుడు సమాజ పరిసరాలను మార్పు చేయగల్గుతాడు.

సాంకేతికతను బట్టి నగరాల స్థాయి ఆధారపడి ఉంటుంది. సాంకేతికతను బట్టి జనాభా పెరుగుదల ఉంటుంది. రోడ్లు, భవనాలు, రవాణా సౌకర్యాలు, భావప్రసార కేంద్రాలు ఉంటాయి. వస్తు ఉత్పత్తి మొదలైనవి సాంకేతిక పరిజ్ఞానాన్ని బట్టి అభివృద్ధి చెందుతాయి. సాంకేతికత నగరాల అభివృద్ధికి తోడ్పడుతుంది.

**5. సామాజిక - మనోవిజ్ఞాన కారకాలు** - మానవుడు తాను గ్రహించిన విశ్వాసాల ద్వారా, విలువల ద్వారా కొన్ని విధాలైన చర్యలు జరపగలడు. ప్రతి వ్యక్తికి కొన్ని ఇష్టాఇష్టాలు ఉంటాయి. వీటితో పాటు కొందరి పట్ల అభిమానం మరి కొందరి పట్ల దురభిమానం కూడా ఉంటాయి. వీటిన్నింటిని బట్టి వ్యక్తి ప్రవర్తనను నిర్ణయించడమే కాక, సముదాయములో పారిస్థితిక నిర్మితిలో అతనికి ఉన్న స్థితిని తెలుపుతుంది. చాలా మందికి అభిరుచులూ, విశ్వాసాలు, విలువలు ఒకే విధంగా ఉంటాయి. వీటిని బట్టి వారి చర్యలను, ప్రకార్యాలను జరుపుతుంటారు.

జనాభా, వ్యవస్థాపన, పరిసరాలు, సాంకేతిక విజ్ఞానం మరియు సామాజిక, మానసిక అంశాలు పరస్పరం ఒక దానినొకటి రూపాంతరం చెందుతాయి. ఈ అంశాలను ఒక క్రమంలో పరిశీలిస్తే వాటి మధ్యగల పరస్పర చర్య స్పష్టంగా కనిపిస్తుంది.

## 19.5 పారిస్థితిక ప్రక్రియలు (Ecological Process) :

నగరాభివృద్ధి, శీతోష్ణస్థితి, భూసారము, భౌగోళిక అంశాలు, నీటి సదుపాయం, రవాణా సౌకర్యాలు జనాభా సంఖ్య వంటి అంశాలపై ఆధారపడి జరుగుతుంది. ఒక ప్రదేశం యొక్క భౌగోళిక పరిస్థితులను పరిశీలించి పారిస్థితిక పద్ధతి నగర అంతర్గత నిర్మితికి సంబంధించిన ప్రణాళిక తయారీ లో ఉపకరిస్తుంది. సంకిష్టమైన నగర సముదాయం యొక్క అంతర్గత నిర్మాణాన్ని వాణిజ్యం, వ్యాపారం, నివాసం వంటి ప్రత్యేక ప్రకార్యాలు నిర్వహించేందుకు వీలుగా రూపొందించాలి. పారిస్థితిక పద్ధతి నగర ప్రజల సామాజిక, సాంస్కృతిక లక్షణాల్ని బట్టి గృహాల స్వభావాన్ని నివాస రూపాన్ని నిర్ణయిస్తుంది. నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దటంలోను, మంచినీరు, శుభ్రమైన గాలి, చక్కని వాతావరణం పచ్చని చెట్లతో కూడిన బహిరంగ ప్రదేశాలను ఎంపిక చేసుకోవటంలో పారిస్థితిక పద్ధతి ఉపయోగపడుతుంది.

నగర సముదాయ అధ్యయనానికి సంబంధించిన పారిస్థితిక వ్యవస్థాపన పద్ధతి నగర భౌతిక, నిర్మాణాత్మకమైన అంశాల గురించిన సమాచారాన్ని అందిస్తుంది. దీనితో కల్గిన ప్రోత్సాహంతో నగర సమాజ శాస్త్రజ్ఞులు నగరాభివృద్ధికి సంబంధించి అయిదు పారిస్థితిక ప్రక్రియలను ఏర్పరిచారు. వీటిని గురించి తెలుసుకుందాం.

**1. కేంద్రీకరణ** - సాధారణ అవసరాలను అభిరుచులను తీర్చుకోవటానికి, ఆర్థిక, సాంఘిక ప్రకార్యాలను నిర్వహించుకోవటానికి ప్రజలు నగరంలో కేంద్ర ప్రాంతం చుట్టూ చేరి జీవిస్తారు. ఉదాహరణకు వ్యాపారం ఎక్కువగా కేంద్ర ప్రాంతంలోనే కేంద్రీకృతమవుతుంది. దీనినే కేంద్రీకరణ అంటారు.

**2. వికేంద్రీకరణ** - ఈ ప్రక్రియలో కేంద్రీకరణ ద్వారా నగర జనాభా ఒత్తిడికి లోనవుతుంది. దీని ఫలితంగా ప్రజలు కేంద్ర ప్రాంతం నుండి దూరంగా తరలివెళ్లి స్థిరపడటానికి ప్రయత్నిస్తారు. పోటికి తట్టుకోలేని చిన్న వ్యాపారస్తులు సైతం అనుషంగిక నగరాలకు వెళ్లడం వల్ల అవి అభివృద్ధి చెందటం జరుగుతుంది. వికేంద్రీకరణ ఉపనగరాలు ఏర్పాటుకు దారి తీస్తుంది.

**3. దాడి (Invasion)** ఈ ప్రక్రియలో కొంతమంది ప్రజలు లేదా కొన్ని సంస్థలు తమ స్థావరాలను వదలి వేరొక ప్రాంతాలకు తరలిపోతారు. దీనినే పారిస్థితిక దాడిగా చెప్పవచ్చు. జీవన వ్యయం ఎక్కువకావటం వల్ల ప్రజలు తమ ప్రాంతాన్ని వీడి మరో

ప్రాంతానికి వెళ్లటం, కాలుష్యం కారణంగా కర్మాగారాల్ని వేరొక ప్రదేశానికి తరలించరావడం దీనికి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

**4. వేర్పాటు** (Segregation) ఈ ప్రక్రియలో ఒకే జాతి, ఒకే మతం, ఒకే వృత్తి ఒకే ఆదాయం కలిగి ఉన్న వారు ఒకే చోట ఉండటానికి జీవించటానికి ప్రయత్నిస్తారు. వీరు ఇతరులతో నివసించటానికి అంగీకరించరు. ఈ వేర్పాటు ప్రక్రియ ఫలితంగా నగరం అనేక ప్రాంతాలుగా విభజింపబడుతుంది. నగరాభివృద్ధికి ఈ ప్రక్రియ దోహదపడుతుంది.

**5. ఆక్రమణ** (Succession) ఒక ప్రాంతం వారు వేరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ ఉన్న స్థానిక ప్రజలను తొలగించి ఆ స్థానంలో దాడి చేసినవారు స్థిరపడతారు. దీనిని ఆక్రమణ అంటారు. ఇది నగర పారిస్థితిక ప్రక్రియలలో చివరిది దీని ద్వారా నగరం పెరుగుతుంటుంది.

## నగర నివాస ప్రాంత నమూనాలు (Settlement Patterns in Cities):

నగరంలోని ప్రజలు వివిధ ప్రాంతాలను ఆక్రమించుకొని తమ తమ ప్రత్యేక జీవన విధానాలతో జీవిస్తారు. నగర సముదాయాలలో వివిధ ప్రాంతాలు వివిధ రకాల, వర్గాల జనాభాకు, ప్రకార్యాలకు ఆలవాలమై ఉంటాయి. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క వర్గం ప్రజలు నివసిస్తూ ఉంటారు. వివిధ ప్రాంతాలలో ఉండే ప్రజలు వివిధ విధాలుగా ఉంటారు. సంస్కృతులు, వృత్తులు, ఆదాయాలు, అంతస్థులు, జీవనవిధానాలు, విలువలు, విశ్వాసాలు ప్రాంతాన్ని బట్టి, వర్గాన్ని బట్టి ప్రజలలో రకరకాలుగా ఉంటాయి. ఉదాహరణకు గుంటూరు ఒక నగర సముదాయంగా తీసుకుంటే దీనిని వివిధ నివాస ప్రాంతాలుగా వర్గీకరించవచ్చు. అని వ్యాపార వాణిజ్య ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం, విశ్వ విద్యాలయ ప్రాంతం, ఉద్యోగి నివాస ప్రాంతం, అధికారుల నివాస ప్రాంతం కార్మికులు నివసించే ప్రాంతం, మురికి పేటలున్న ప్రాంతం మొదలైనవి ఈ విధంగా వివిధ వర్గాల, రకాల ప్రజలు నివసిస్తూ ప్రకార్యాలను, కార్యకలాపాలను నిర్వహిస్తు ఉంటారు. సాధారణంగా ఒక ప్రాంతంలో నివసిస్తున్న వారందరూ అన్ని విషయాలలోనూ ఒకే రకంగా ఉండటం జరుగుతుంది. అయితే వివిధ ప్రాంతాలలో నివసించే ప్రజల మధ్య సహకార భావన, సమన్వయం, అన్యోన్యతతో సామరస్యంగా ఉంటూ, తామందరమూ ఒక నగర సముదాయానికి చెందిన వారుగా వారు భావించుకుంటారు.

నగరంలో అనేక రకాల ప్రకార్యాలు నిర్వహించే వివిధ రకాల ప్రజల నివాస ప్రాంతాలు ఉంటాయి. సామాజిక ఒత్తిడిలు సామాజిక ప్రక్రియల ఫలితంగా ప్రకార్యాలు కల్పించడం ఉంటుంది. తిరిగి ఇవన్నీ సంస్థాగత విలువలవల్ల ఒక ప్రత్యేక సంస్కృతిలోగల సంప్రదాయాలు, కట్టుబాట్లు, విశ్వాసాలు, ఆచారాలు వంటి వాటి వల్ల క్రమబద్ధం చెందుతాయి. ఒక నగర నిర్మితిని (పారిస్థితిక నిర్మాణం) మూడు ముఖ్యకారకాలు నిర్ణయిస్తాయి అవి.

1. ప్రకార్యాలలో విభేదీకరణ (Differentation in Functions)
2. వర్గవిభజన (Class Separation)
3. సాంస్కృతిక వేర్పాటు (Cultural Segregation)

**1. ప్రకార్యాలలో విభేదీకరణ** - నగర సముదాయంలో ప్రాంతాలను అక్కడ నివసించే ప్రజలు నిర్వర్తించే ప్రకార్యాల రీత్యా విభజించవచ్చు. ఎందువలనంటే నగర సంస్కృతి సంక్లిష్టతతోను, విశిష్టీకరణతోను ఉంటుంది. ఉదాహరణకు వాణిజ్య ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం, నివాస ప్రాంతం మొదలైనవి. ఈ ప్రకార్యాలను నిర్వహించే ప్రాంతాలలో విశిష్టత చెందిన కొన్ని ఉపవిభాగాలు (Sub-Divisions) ఉంటాయి. వస్త్రాల దుకాణాలు అధికంగా దిగువ మధ్య తరగతి ప్రజలు ఉన్నత వర్గాల ప్రజలు నివసించే

ప్రాంతాలలో ఉంటాయి. నగరాలలో ప్రతి ప్రకార్యం తనకు అనువైన ప్రదేశంలో ఏర్పడుతుంది. అందువల్ల వర్తకవాణిజ్య యంతానగరానికి మధ్యలో ఏర్పడితే, నివాస ప్రాంతాలు నగర పొలిమేరల్లో వుంటాయి.

**2. వర్గ విభజన -** ప్రాచీన మరియు మధ్యయుగ కాలపు నగరాలలో వర్గ ప్రాతిపదికన ప్రజల నివాస ప్రాంతాలు స్పష్టంగా ఉండేవి. ఆధునిక నగరాలలో నివాసాలు వర్గాలను బట్టి ఉన్నాయి. ఆధునిక నగరాల్లో నిర్మితి పరమైన విభేదీకరణ వర్గానికి బట్టి ఉంది. ఇళ్ల నమూనాల ప్రాంతం, ఇంటి పరిమాణం, రకం, నాణ్యత వంటి వివిధ సూచికలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు సంపన్నులుండే ప్రాంతంలో విశాలమైన స్థలంలో భవననిర్మాణం, దాని చుట్టూ ఖాళీ స్థలంలో పూలతోట ఉంటుంది. అదే నిమ్న తరగతి వారి ఇళ్లు తక్కువ స్థలాన్ని కలిగి ఉంటాయి. ఒక దానికొకటి అనుకుని నిర్మాణం ఉంటుంది.

**3. సాంస్కృతిక ఏర్పాటు -** నగరంలో సాంస్కృతిక ఏర్పాటు అనేది ప్రధానంగా భిన్న సంస్కృతులు గల సమూహాలు, వాటిని ఆచరించడంపై ఆధారపడి ఉంటుంది. అయితే భారతీయ నగరాలలో, పట్టణాలలో కులవ్యవస్థ వివాహ విషయంలో తప్ప అంతపటిష్టంగా లేదు.

నగరంలో జనాభా పెరిగే కొద్ది నగర పారిస్థితిక వ్యవస్థాపనలో మార్పులు సంభవిస్తాయి. ఇది వ్యవస్థాపనను కూడ మార్చుతుంది. నగర జనాభా ఎక్కువైన కొద్ది దిగువ వర్గాల వారి గృహసముదాయాలు పెరుగుతాయి. నూతనంగా ధనికులైన వాళ్లు తమ గృహాలను వదలి దూర ప్రాంతంలో నూతన గృహాలు నిర్మించుకొని వెళ్లిపోతారు. వలస వల్ల కూడా జనాభా పెరుగుతుంది. ఈ కారణంగా సంపన్న వర్గాల వారి నివాసం నగర పొలిమేర్లకు మారిపోతుంది. ప్రస్తుతం ఒక కుటుంబానికి పరిమితమైన గృహ సముదాయాలు అనేక కుటుంబాలు ఉండటానికి వీలుగా మారుస్తారు.

## నగర పారిస్థితిక వ్యవస్థ :

ఆధునిక కాలంలో నగర వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. నేటి నగరాలు జనాభాపరంగాను, స్థల పరంగాను చాలా దూరం వరకు అన్ని వైపుల విస్తరిస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగానే దాదాపు అన్ని పెద్ద నగరాలకు ఉపనగరాల ఏర్పాటుకు దారి తీశాయి. అన్ని సమాజాలలోను నగరాలు అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి. నగరాలను మహానగరాలు, ఉపనగరాలు మరియు అనుషంగిక నగరాలుగ్గా ఏర్పడ్డాయి. వీటిని గురించి తెలుసుకుందాం.

## 19.6 మెట్రో పాలిటిన్ లేక మహానగరాలు :

ప్రపంచంలో మూడు రకాల దేశాలున్నాయి. అభివృద్ధి చెందినవి, మరియు అభివృద్ధి చెందుతున్నవి. అభివృద్ధి చెందినటువంటి దేశాలైన అమెరికా, జపాన్ దేశాలలో మహానగరాల సంఖ్య ఎక్కువగా ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రధానంగా భారతదేశంలో మహానగరాల సంఖ్యను చూస్తే తక్కువనే చెప్పాలి. దేశంలో కేవలం ముంబాయి, ఢిల్లీ, కొల్కత్తా మరియు చెన్నైలు మాత్రమే మహానగరాలు. ప్రపంచంలోనే మహానగరాలుగా న్యూయార్క్, టోక్యో, లండన్‌లను పేర్కొనవచ్చు.

మహానగరాల ఆవిర్భావానికి లేదా అభివృద్ధికి కింది అంశాలు కారణమవుతున్నాయి.

1. జననాలు - మరణాల రేటు తగ్గిపోవటం
2. అధిక జనాభా
3. వలసలు

4. పారిశ్రామికీకరణ
5. రవాణా సౌకర్యాలు పెరగటం
6. వ్యాపారాభివృద్ధి జరగటం
7. బ్యాంకులు, విద్యాసంస్థలు, సినిమా కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు కలిగి ఉండటం.
8. భావ ప్రసార సౌకర్యాల పెరుగుదల

మహానగరాలను మహనగర కౌన్సిల్స్ ద్వారా పరిపాలింపబడే మహానగరాభివృద్ధికి కౌన్సిల్స్ తోడ్పడతాయి.

## ఉపనగరాలు (Sub urbans):

ఉపనగరాలకి సంబంధించి ఖచ్చితమైన నిర్వచనం ఏదీ లేదు.

డబ్ల్యు స్కానర్ (W,. Schanner) అభిప్రాయంతో నగర పొలిమేరలలో విశాలమైన స్థలంలో జనవాసాలు కలిగి ఉండి, సాపేక్షికంగా జనసాంద్రిత కలిగి ఉన్న గ్రామీణ ప్రాంతాలే ఉపనగరాలు.

జాన్ కాన్నెల్ (John Connell) ప్రకారం నగర కేంద్ర ప్రాంతానికి సుదూరంగా నుండి నగరంపై ఆధారపడి యుండే నగర సరిహద్దు ప్రాంతాన్ని ఉపనగరమంటారు.

## ఉపనగరాభివృద్ధి - వివిధ దశాలు:

ఉపనగరాభివృద్ధి ఐదు దశలలో ఉంటుందని ఫ్రెడరిక్ ల్యూయిస్ అనెన్ (Frederick Lewis) భావించాడు. ఉపనగరాల వృద్ధి, నిర్మితి ఒక్క మహానగరంలోనే ఉంటుందని వివరించాడు.

**మొదటి దశ** - దీనిని గుర్రం బగ్గీకాలము (Horse and Buggy) దశగా గుర్తిస్తారు. ఈ దశ 19వ శతాబ్దపు చివరలో మొదలై మొదటి ప్రపంచ యుద్ధకాలంతో అంతమయింది. ఈ దశలో ధనవంతులు నగరానికి దూరంగా, వెలుపల ప్రాంతాలలో గృహాలను నిర్మించుకొని విరామ సమయాలలో ప్రశాంతంగా అక్కడ ఉండటానికి ప్రాధాన్యత నిచ్చేవారు. అక్కడే ఎక్కువగా గడపటానికి మక్కువ చూపేవారు. ఆ తర్వాత కాలంలో వీరు పూర్తిగా నివాసాన్ని మార్చుకోవటం జరిగింది.

**రెండవ దశ** - దీని యొక్క కాల పరిమితి 1920 నుండి 1930 సంవత్సరాల మధ్యకాలం. ఈ కాలంలో రోడ్ల నిర్మాణ కార్యక్రమాలు పుంజుకొన్నాయి. రోడ్లు, రైలు రవాణా సౌకర్యాలు బాగా ఉండటంతో ప్రజలు ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి తరలిపోవడానికి అనుకూలంగా ఉంది. దీని వల్ల నగరానికి దాని వెలుపలి ప్రాంతానికి తరలి వచ్చి అక్కడ స్థిరనివాసాలను ఏర్పరచుకోవడంతో ఉపనగరాలు అధిక సంఖ్యలో ఏర్పడ్డాయి.

**మూడో దశ** - దీని యొక్క కాలపరిమితి 1930 నుండి 1940 వరకు ఈ కాలంలోనే ద్వితీయ ప్రపంచ యుద్ధం జరిగింది. ఉపనగరాల అభివృద్ధి కుంటుపడటం ఈ దశలోనే జరిగింది. అయితే ప్రభుత్వం మిలటరీ వాహనాలు, ట్రక్కులు నిలుపుదల నిమిత్తం, మరమ్మత్తుల నిమిత్తం నగరం వెలుపల స్థలాలను [illegible] వినియోగించడం జరిగింది. మహానగరాలలో వీటిని కలపడానికి అవసరమైన రవాణా మార్గాలను ఏర్పరచటం, రాకపోకల సౌకర్యాల్ని కల్పించటం వల్ల ఉపనగరాభివృద్ధి జరిగింది.

**నాల్గవ దశ** - ద్వితీయ ప్రపంచ యుద్ధం నుండి తిరిగి వచ్చిన వీర జవానులకు, అధికారులకు నివాస స్థలాలను, ప్రభుత్వ కార్యాలయాలను నగరం వెలుపల నిర్మించటంతో ఈ దశలో పెద్ద పెద్ద భవనాలు నగరం వెలుపల నిర్మాణం కావటంతో ఉపనగరాభివృద్ధి జరిగింది.

**ఐదో దశ** - ఉపనగరాభివృద్ధిలో చివరిదశ, ఉపనగరాలలో జనాభా, జనసాంద్రత, గృహాల సంఖ్య గణనీయంగా పెరగటంతో నగరంలో ఉన్న సదుపాయాలను ఉపనగరాలకు కూడ విస్తరింపజెయ్యటం జరిగింది. తాగునీరు, విద్య, విద్యుచ్ఛక్తి ఆరోగ్యం, పారిశుద్ధ్యం మార్కెట్లు, రవాణా సౌకర్యం వంటివి ఉపనగరాలలో అందించటంతో ఉపనగరాలు అభివృద్ధి చెందాయి.

**ఉపనగరాలు - వర్గీకరణ:**

ఉపనగరాలను కింది విధంగా మూడు తరగతులుగా విభజించవచ్చు. అవి

**1. నివాస ఉపనగరాలు** - నివాస ఉపనగరాలను సామాజిక నిర్మితిని, కాలాన్ని, వలస విధానాన్ని అనుసరించి మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

**(ఎ) సంప్రదాయిక ఉన్నత వర్గ ఉపనగరం** - ఇవి చాలకాలం క్రితం ఏర్పడినటువంటివి. వీటిలో తక్కువ జనాభా ఉంటుంది. వలస వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. సంపన్నులు ఎక్కువగా ఈ ఉపనగరాలలో నివసిస్తుంటారు. సహజంగా వీరు శాశ్వత నివాసాన్ని కలిగి ఉంటారు.

**(బి) పటిష్టమైన మధ్యతరగతి ఉపనగరం** - ఇటీవల కాలంలో ఏర్పడ్డ ఉపనగరాలు వీటితో మధ్య తరగతి వారే అధికంగా ఉంటారు. వీరిలో  ఎక్కువ ఉద్యోగాలపై ఆధారపడి జీవిస్తుంటారు.

**(సి) పేకేజ్ ఉపనగరం** - దీనిలో అన్ని రకాల, వర్గాల ప్రజలు నివసిస్తుంటారు. వలస వచ్చే వారు ఎక్కువగా ఉంటారు. ఇక్కడ ప్రజల నివాసం తాత్కాలికం

2. పారిశ్రామిక ఉపనగరం దీనిలో పరిశ్రమ మీదే ఆధారపడి జీవించేవారు ఉంటారు. ప్రధానంగా రెండు వర్గాల ప్రజలు ఉంటారు. పనిలో నిపుణులు - పనిలో అర్ధ నిపుణులు మరియు మధ్యతరగతి ప్రజలు - నిమ్నతరగతి ప్రజలు నివాస ఉపనగరాలతో పోలిస్తే పారిశ్రామిక ఉపనగరాలలో జనాభా తక్కువగా ఉంటారు.

**3. వినోదాత్మక విడిది ఉపనగరాలు - దీనికి** సంబంధించిన ఉపనగరాలు కొండ ప్రాంతాలలోను, నదీ తీరాలలోను, సముద్ర తీర ప్రాంతాలలోను ఉంటాయి. ఉదాహరణకు కొడై కెనాల్, ఊటీ, డార్జిలింగ్, సిమ్లా ముస్సోరి, కులుమనాలి మొదలైనవి విహారస్థలాలుగా పర్యాటక ప్రదేశాలుగా ప్రత్యేక లక్షణాల్ని కల్గిఉంటాయి. ఈ విడిది నగరాలలో కొన్ని ప్రత్యేక ఋతుకాలాలలో ప్రజలు వచ్చి నివసిస్తుంటారు.

**19.6.3. అనుషంగిక నగరం** (Satelite City):

అనుషంగిక నగరాలు నగర పొలిమేరల వెలుపల ఏర్పడి ఉంటాయి. వీటిలో నివసించే జనాభా నగర జనాభా లెక్కలలోకి రాదు. అనుషంగిక నగరం అన్ని విధాల ఒక చిన్న నగరంగా రూపొందుతుంది. వాస్తావానికి భౌగోళిక దృష్ట్యా పరిశీలిస్తే మహానగరం

అనుషంగిక నగరం. ఒకేరకమైన లక్షణాలలో, పరిస్థితులలో ఏర్పడినవే. అనుషంగిక నగరాల జనాభా పదివేల నుండి లక్షకు మించి ఉంటుంది. అనుషంగిక నగరం ఆర్థికంగా, రాజకీయంగా, పరిపాలనపరంగా స్వతంత్రంగా ఉంటుంది. ప్రజలకు అన్ని సదుపాయ్యాలను కలుగజేస్తుంది. ఉపనగరానికి మహానగరానికి మధ్యనున్న దూరంకంటే సాధారణంగా అనుషంగిక నగరానికి ఉపనగరానికి మధ్యనున్న దూరం ఎక్కువ. ఉపనగరానికి అనుషంగిక నగరానికి మధ్య ఉన్న ప్రదేశాన్ని పృష్ఠ భూమి (Hinter land) అంటారు. సాధారణంగా అనుషంగిక నగరం కావాలనుకుంటే మహానగరమయ్యే అవకాశాలు లేకపోలేదు.

## 19.7 సారాంశం :

మానవునికి అతని పరిసరాలకు మధ్యగల సంబంధాల అధ్యయనమే మానవ ఆవరణ శాస్త్రం. నగర ఆవరణశాస్త్రం మానవ ఆవరణ శాస్త్రంలో ఒక భాగం. నగర ఆవరణ శాస్త్రం వ్యక్తుల సమూహాలను అధ్యయనం చేస్తుంది. నగర పారిస్థితి వ్యవస్థలో ఐదు అంశాలుంటాయి. జనాభా, వ్యవస్థపాన, పరిసరాలు సాంకేతిక పరిజ్ఞానం మరియు సామాజిక, మనోవిజ్ఞాన కారణాలు. సమాజ శాస్త్రజ్ఞులు నగరాభివృద్ధికి సంబంధించి ఐదు పారిస్థితిక ప్రక్రియలు రూపొందించారు. అవి కేంద్రీకరణ, వికేంద్రీకరణ దాడి, వేర్పాటు మరియు ఆక్రమణ నగరాలు, మహానగరాలు, ఉపనగరాలుగా, అనుషంగిక నగరాలుగా వివిధ విధాలుగా లక్షణాల్ని బట్టి వర్గీకరించవచ్చు.

## ముఖ్యపదాలు :

ఆవరణశాస్త్రం
మహానగరాలు
ఉపనగరాలు
అనుషంగిక నగరం

## 19.9 నమూనా ప్రశ్నలు :

1. నగర ఆవరణ శాస్త్రాన్ని నిర్వచించండి.
2. పారిస్థితిక వ్యవస్థంలోని అంశాలను వివరించండి.
3. పారిస్థితిక ప్రక్రియలను విశదీకరించండి.
4. నగర నివాస ప్రాంత నమూనాల గురించి తెలియజేయండి.
5. ఉపనగరాలంటే ఏమిటి? వాటిలోని రకాలను వివరించండి.
6. ఉపనగరాభివృద్ధిలో వివిధ దశలు వివరించండి.
7. అనుషంగిక నగరం గురించి క్లుప్తంగా వ్రాయాలి.

## 19.10 చదువదగిన గ్రంథాలు :

1) Urban Sociology - Bergel E.V.
2) Urban Sociology - Gist P and Fava
3) Urban Structure - Ralph Thompson
4) The City - R.E. Park, E.W. Burges and R.D. MCKENZIE

డా. జి.వి. రమణ

పాఠం - 20

# పట్టణ సమస్యలు - మురికి పేటలు - గ్రామీణ, నగరవలస మరియు జనాభా సమస్యలు

## 20.0 లక్ష్యం :

నేడు పట్టణాలు లేదా నగరాలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు మురికిపేటలు, గ్రామీణ - నగరవలస మరియు జనాభా. వీటి యొక్క కారణాలు, పర్యావసానాలు, పరిష్కార చర్యల గురించి వివరించటమే ప్రసుత పాఠం యొక్క ముఖ్యోద్దేశం.

విషయ క్రమం :


20.1 పరిచయం

20.2 పట్టణ సమస్యలు

20.2.1 మురికి పేటలు

20.2.1.1 నిర్వచనం

20.2.1.2 లక్షణాలు

20.2.1.3 రకాలు

20.2.1.4 కారణాలు

20.2.1.5 పర్యావసానాలు

20.2.1.6 నిర్మూలనా చర్యలు

20.2.2 గ్రామీణ - నగర వలన

20.2.2.1 వలస అర్థం - నిర్వచనం

20.2.2.2 వలస - రకాలు

20.2.2.3 కారణాలు

20.2.2.4 విధానాలు

20.2.2.5 పర్యావసానాలు

20.2.2.6 నివారణా మార్గాలు

20.2.3 జనాభా సమస్య

20.4 సారాంశం

20.5 ముఖ్య పదాలు

20.6 నమూనా ప్రశ్నలు

20.7 చదువదగిన గ్రంథాలు

## 20.1 పరిచయం :

మానవుడు సంఘజీవి సమాజంలో పుట్టి, సమాజంలో పెరిగి, సమాజంలోనే మరణించడం వల్ల వ్యక్తి జీవితంపై సమాజం యొక్క ప్రభావము ఎక్కువుగా ఉంటుందని చెప్పవచ్చు. వ్యక్తి పురోగతి, జీవనపద్ధతి, కార్యక్రమాలు మొదలైనవి సామాజిక వ్యవస్థాపనపై ఆధారపడి ఉంటాయి. వ్యవస్థ సవ్యంగా సక్రమంగా ఉంటే సమగ్రంగా అభివృద్ధి చెందితే సమస్య లేదు. లేకుంటే సమస్యలు ఉత్పన్నమవుతాయి. సమాజంలో పూర్తిగా మార్పురాకుంటా ప్రగతికి చోటు లేదు. సమస్యలు ఉంటే సమజాభివృద్ధి జరగదు. వివిధ కారణాలవల్ల సమాజంలో సమస్యలు ఏర్పడతాయి. ఇవి గ్రామీణ ప్రాంతాలలోను, నగరాలలోను ఒకే విధంగా ఉండవు. కొన్నింటిలో తేడాలు లేకున్న మిగిలిన సమస్యలలో భేదాలు ఉంటాయి. నగరాలకు లేదా పట్టణాలకు సంబంధించిన ప్రత్యేక సమస్యలు మురికి వాడలు, గ్రామీణ-నగర వలస మరియు పట్టణ జనాభా ప్రధానమైనవి.

### 20.2.1 మురికి పేటలు :

మానవునికి తినడానికి తిండి, కట్టుకోవటానికి బట్ట, ఉండటానికి ఇల్లు ప్రధానమైన అవసరాలు. నివసించటానికి సరైన గృహ వసతి లేకుంటే అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. జనాభా పెరుగుదలవల్ల సమాజంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. వివిధ సమస్యలు కలుగుతున్నాయి. వీటిలో గృహ వసతి సమస్య నగరాలలో లేదా పట్టణాలలో ప్రధాన సమస్యగా పరిణమించింది. నగరాలలో మురికి వాడలు ఏర్పడటానికి దోహదపడింది. నగరీకరణ, పారిశ్రామికీకరణ, ప్రణాళిక బద్ధంలేని వలస విధానం వల్ల మురికి వాడలు తామరతంపరగా పెరిగాయి. భారతదేశంలో మురికి పేటలు లేని నగరాలు కాని పట్టణాలు కాని లేవు. మురికి పేటలు సమస్య ప్రధానమైన సామాజిక సమస్య.

#### 20.2.1.1 మురికి పేటలు - నిర్వచనం :

మురికిపేటలు నిర్వచన విషయంలో ఏకాభిప్రాయం లేదు. ఒక ప్రత్యేక అవ్యవస్థా ప్రాంతం అనికొందరు. జన సమ్మర్ధంతో కూడిన నివాసయోగ్యం కాని ప్రాంతం అని మరికొందరు మురికి పేటలను పేర్కొన్నారు. అయితే నేటి మురికి పేటలు ఈ రెండు లక్షణాలు ఉన్నాయి.

పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, అనారోగ్య పరిస్థితులు, అధిక జనసమ్మర్ధం కిక్కిరిసిన జనాభాతో పేద ప్రజలు, కూలీ వారు నివసించే ప్రాంతాన్ని మురికి పేటలుగా పేర్కొనవచ్చు.

ఐక్యరాజ్య సమితి నివేదకలో క్రింది విధంగా మురికి పేటలను నిర్వచించింది.

"జన సమ్మర్ధంతోను, అపరిశుద్ధ పరిసరాలతోను, ప్రజల శారీరక, మానసిక, నైతిక ఆరోగ్యాన్ని భంగపరచే పరిస్థితులతోను కూడిన ప్ర[illegible]".

#### 20.2.1.2 మురికి పేటలు - లక్షణాలు :

మురికి పేటలలో క్రింది ముఖ్య లక్షణాలుంటాయి

1. శిథిలావస్థలో ఉన్న గృహాలు తగిన గాలి, వెలుతురు లేకుండటం, మురికి నీటి పారుదల సౌకర్యంలోపించటం కుటుంబ సభ్యులంతా ఒకేచోట తినడం, నిద్రించడం, ఉండటం జరుగుతుంది.

2. అధిక జనాభా మురికి పేటలలో ఉండటం వల్ల అంటు వ్యాధుల వ్యాప్తి అధికంగా ఉంటుంది.
3. అపరిశుభ్రత మురికి పేటలలో ఎక్కువగా ఉంటుంది. చెత్త చెదారాలు, కొట్టి వచ్చినట్టు కనిపిస్తాయి. నిలువ నీరు ఉంటుంది. దోమలు, ఈగలు బెడద ఎక్కువగా ఉంటుంది. కుక్కలు, కోతులు, పందులు, గాడిదలు స్వేచ్ఛగా సంచరిస్తుంటాయి.
4. సమాజంలో ఉన్న సమస్త సమస్యలకి ప్రతిబింబంగా మురికి పేటలు నిలుస్తాయి. సమాజ అరాచక శక్తుల నిలయాలుగా ఉంటాయి. బాలనేరాలు, జూదం, పడుపు వృత్తి, మద్యపానం, భిక్షాటనం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం ఇలా అన్ని సమస్యలకు విలయాలు మురికిపేటలు. వీటివల్ల నైతిక విలువల పతనం కలుగుతుంది.
5. మురికిపేటలు మూఢనమ్మకాలకు పెట్టింది పేరుగా నిలుస్తాయి.
6. స్నానాల గదులకు కాని, మరుగుదొడ్లకుగాని ఏ విధమైన అవకాశం లేదు.
7. మంచి నీటి సౌకర్యం లేకపోవడం ఎక్కువగా గమనించవచ్చు.

## మురికి పేటలు వివిధ విధాలు :

భారతదేశంలో మురికి పేటలను వివిధ ప్రాంతాలలో వివిధ విధాలుగా పిలుస్తారు. ఇరుకైన వీధులతో, కిక్కిరిసిన జనాభాతోగాని, వెలుతురు లేకుండా, అపరి శుభ్రపరిసరాలతో అసంతృప్తికరమైన జీవన విధానాలను వీటితో గమనించవచ్చు. మురికి పేటలను ఏ విధంగా పిలిచినప్పటికి స్వభావంతో కాని స్వరూపంతోకాని పెద్దగా తేడాలు కనిపించవు.

**బస్తీలు** - ఆంధ్రప్రదేశ్, ఢిల్లీలోని మురికి పేటలను 'బస్తీ'లుగా పిలుస్తారు. మట్టితో నిర్మించిన పూరిగుడిసెలు. ఇంటిపై కప్పు ఎత్తు తక్కువగా ఉంటుంది. గడ్డితోకాని, రేకులతోకాని తేడాగానే సంచులతోకాని ఇంటిపై కప్పు కప్పబడి ఉంటుంది.

**చాల్** - ముంబాయి నగరంలోని మురికి పేటలను చాల్‌గా వ్యవహరిస్తారు. ఒక్కొక్క చాల్‌లో కనీసం 80 కుటుంబాలు నివాసముంటాయి. పొడవు, వెడల్పు ఒకే రకంగా ఉండి పైకప్పు ఎత్తు చాలా కిందికి వంగి వుంటుంది. అతి ఇరుకుగా ఉండటంతోపాటు గాలి, వెలుతురుకి ఎంత మాత్రం అవకాశం లేకుంటాయి. చాలినంత స్థలం లేక పోవడంతో రాత్రి సమయల్లో కుటుంబ సభ్యులు వంతుల వారిగా నిద్రపోయే పరిస్థితిని దీనిలో గమనించవచ్చు.

**కత్రాలు** - అతి చిన్న ఇరుకైన గది. ఒకే ఒక ముఖ ద్వారం కలిగిన ఇళ్లు. వీటినే కత్రాలు అంటారు.

**ఝుంప్రీస్** - మురికి పేటల గృహ సముదాయం ఝుంప్రీస్. సాధారణంగా కర్మాగారాల సమీపంలో, నగర ప్రధాన కూడళ్ళలో ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించుకొని గృహ నిర్మాణం చేసుకుంటారు. గడ్డి, మట్టి డాంబర్ రేకులు వీటి నిర్మాణంలో చోటు చేసుకుంటాయి. కొన్ని నిర్మాణాలలో రాతిని, కలపను కూడ ఉపయోగించటం జరుగుతుంది.

**అహతాస్** - కాన్పూర్ నగరంలోని మురికి పేటలను అహతాస్ అంటారు. మురికి పేటలకుండే లక్షణాలన్ని వీటిలో ఉంటాయి. గృహ సముదాయం చుట్టూ ప్రహరిగోడ ఉండటమే దీనిలోని ప్రత్యేకత.

**ఝూగ్గీలు** - ఇంచుమించు ఝుంప్రీస్ గృహనమూనాలను కలిగి ఉంటాయి. మట్టి, గడ్డి రాయి, కలప వంటి సామాగ్రిని నిర్మాణంతో ఉపయోగిస్తారు. స్థలాభావం వల్ల దగ్గర దగ్గర ఇళ్ళను కట్టడం జరుగుతుంది. మరమ్మత్తుకి నోచుకొని ఇళ్లు ఎక్కువగా ఉంటాయి.

**చెరీస్** - దక్షిణ భారతదేశంలో చెన్నై, మధురై, కొచ్చిన్ నగరాలలోని మురికి పేటలను చెరీస్ అంటారు. ఇంటి పై కప్పు కిరోసిన్ డబ్బాల పాతరేకులు లేదా, గడ్డితో కప్పబడి ఉంటాయి. ఇళ్లు మట్టి గోడలను కలిగి ఉంటాయి.

దేశంలో మురికి పేటలు ప్రాంత్రాన్ని బట్టి వివిధ పేర్లున్న ఈగలు, దోమలు, పందులు, కుక్కలతో, చెత్తా చెదారంలో, మురికినీటి నిల్వలతో 'దుర్గంధంతో' దుర్భరంగా, అపరిశుభ్ర వాతావరణంతో, కాలుష్యంతో ఘోరంగా ఉంటాయి. పేదరికానికి, నిరక్షరాస్యతకి, నిరుద్యోగితకి అజ్ఞానానికి, అనారోగ్యానికి భారతదేశ మురికి పేటలు ఆనవాళ్లుగా, కేంద్రాలుగా చెప్పవచ్చు.

భారతదేశంలోని నగరాలలో మురికి పేటలలో నివసించే జనాభా 1951 సంవత్సరంలో 15 శాతం ఉండేది. అది 1981 నాటికి 45 శాతం పెరిగింది. అత్యధిక మురికి పేటల జనాభాగల నగరం కొల్‌కత్తా దీని తర్వాత రెండు స్థానాలలో ముంబై, ఢిల్లీలు ఉన్నాయి.

### 20.2.1.3 మురికి పేటలు - రకాలు:

నగరాలలో ఉన్న మురికి వాడలను రెండు విధాలుగా వర్గీకరించవచ్చు.

1. పారిశ్రామిక మురికి పేటలు
2 పారిశ్రామికేతర మురికి పేటలు

చిన్న పరిశ్రమల యాజమాన్యం తమ కార్మికులకు గృహ వసతిని కల్పించలేదు. అది చాల ఖర్చుతో కూడుకున్నది. అందువల్ల కార్మికులు తక్కువ ఖర్చుతో మురికి పేటలలో నివసిస్తారు. ఇక రోజు వారీ వేతనాలపై శ్రమించేవారు. ముఖ్యంగా రిక్షా కార్మికులు స్త్రీ కార్మికులు మురికి పేటలతో ఉంటారు. దీని వల్ల పారిశ్రామికేతర మురికి పేటలు పుట్టుకొస్తున్నాయి.

### 20.2.1.4 మురికి పేటలు - కారణాలు :

నగరీకరణ, పారిశ్రామికీకరణ ప్రధానంగా మురికివాడల ఏర్పడటానికి, వృద్ధిచెందడానికి కారణాలుగా చెప్పవచ్చు. వీటితోపాటు మరికొన్ని కారణాలు.

1. పరిశ్రమలలో పని చేయడానికి గ్రామీణ ప్రాంతాలనుండి వలస వచ్చిన వారికి గృహవసతి లేకపోవటం. బ్రతుకుదెరువుకోసం వచ్చిన వారి సంఖ్య నానాటికి అధికం కావటం మురికివాడల వృద్ధికి దోహదపడుతుంది.
2. పేదరిక కోరల్లో చిక్కుకున్నవారు ఎక్కువ అద్దెను చెల్లించుకోలేక పూరిళ్లను ఆశ్రయిస్తున్నారు.
3. నగరంలో పరిశ్రమలు కొన్ని చాలా దూరంగా ఉండటంతో రవాణా ఖర్చుల భరించలేక పరిశ్రమల దగ్గరలోనే పూరీ గుడిసెల్లో నివసిస్తున్నారు. రవాణా సౌకర్యాల కొరత కూడ కారణమవుతుంది.
4. నగరాలలో ఇల్లు కట్టుకోవాలంటే అధిక మొత్తం ఖర్చుచేయ్యాలి స్థలాల ధరలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల అల్పాదాయ వర్గాలు మురికివాడలో జీవనాన్ని కొనసాగిస్తారు. చాలినంత స్థలం అందుబాటులో లేకపోవటం కూడ దీనికి దోహదపడుతుంది.
5. పట్టణ లేదా నగర ప్రాంతాలలో సరైన స్థలాలు లేకపోవటం వల్ల గృహ నిర్మాణం జరగడం లేదు. దానిలో ఖాళీ ప్రాంతాలలో మురికి వాడలు ఏర్పడుతున్నాయి.
6. పురపాలక సంఘాలకు ముందుచూపు లేకపోవటం సరియైన, సమగ్రమైన పట్టణ నిర్మాణ పథకం లేకపోవడం మురికి వాడల నిర్మాణానికి దారి తీస్తుంది.
7. అద్దెను నియంత్రణ చేయలేకపోవడం.
8. గృహ నిర్మాణం అధిక ఖర్చుతో కూడుకోవడం.

### 20.2.1.5 మురికి పేటలు - పర్యావసానాలు :

మురికి పేటల వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయి.

1. నిరక్షరాస్యత, అజ్ఞానం, అంధవిశ్వాసాల వల్ల జనాభా పెరుగుదల మురికి పేటలతో ఎక్కువగా ఉంటుంది.
2. అల్పాదాయ వర్గాలు మురికి పేటల్లో ఉండటం వారి ఆదాయాన్ని సరిగా సద్వినియోగం చేసుకోకుండా జూదం, వ్యభిచారం, మద్యపానం వంటి వ్యసనాల బారినపడి దౌర్భాగంగా జీవిస్తున్నారు.
3. మురికి పేటలకు ఆరోగ్య స్థితిగతులు సరిగా లేకపోవటం వల్ల పరిసరాల శుభ్రత లోపించటం వల్ల జీవనస్థాయి సంతృప్తికరంగా ఉండటం లేదు.
4. మానవునికి కావలసిన కనీస సదుపాయాలు మురికిపేటల్లో లభించవు. గాలి, వెలుతురు, మంచి నీరు ఇవేవి లభించవు.
5. జనసమ్మర్దంగా ఉండటంవల్ల అంటువ్యాధుల ప్రబలటానికి అవకాశం మురికిపేటల్లో ఉంటుంది.
6. శిశుమరణాలు, ప్రసూతి కారణాలు ఎక్కువగా మురికి పేటల్లో ఏర్పడతాయి. కారణం అనారోగ్య పరిస్థితులు మురికి పేటల్లో ఉండటమే.
7. అంటు వ్యాధులతోపాటు సుఖ వ్యాధులతో మురికి పేటలలో ఉన్నవారు బాధపడుతుంటారు.
8. వర్షాకాలంలో వర్షం కురవటం, వేసవిలో అగ్ని ప్రమాదాలకు గురికావటం మురికి పేటల్లో సర్వసాధారణం.
9. తల్లిదండ్రులు, పిల్లలు అంతా ఒకే చోట ఉండటంవల్ల వాళ్ల ఏకాంతానికి భంగం కలుగుతుంది.

### 20.2.1.6 మురికిపేటలు - నిర్మూలనా చర్యలు :

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక మురికి పేటల నిర్మూలన పై దృష్టి పెట్టడం జరిగింది. ఈ కృషి రెండు విధాలుగా ఉంది.

1. మురికి పేటలు నిర్మూలనా పథకాలు.
2. మురికి పేటలు పరిస్థితుల్ని మెరుగు పరిచే పథకాలు.

1952 లో కేంద్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలకు సంబంధించిన మంత్రిత్వశాఖ పట్టణాలలోను, గ్రామాలల్లోను నివసించే అల్పాదాయ మధ్య తరగతి ఆదాయాల వర్గాలకు సంబంధించిన వారికి, ఆర్థికంగా వెనకబడిన వారికి గృహ నిర్మాణాల్ని చెయ్యాలని తొమ్మిది సాంఘిక గృహ నిర్మాణా పథకాల్ని చేపట్టింది.

గృహ నిర్మాణ మంత్రిత్వశాఖ క్రింది గృహ నిర్మాణ విషయంలో నాలుగు సంస్థలు అవిరళకృషి చేస్తున్నాయి.

1. జాతీయ గృహ నిర్మాణ సంస్థ.
2. జాతీయ గృహ నిర్మాణ కార్పొరేషన్ లిమిటెడ్.
3. గృహ నిర్మాణ పట్టణాభివృద్ధి సంస్థ.
4. హిందూస్థాన్ గృహ నిర్మాణ కర్మాగారము.

మురికి పేటలు సంస్కరణ మరియు నిర్మూలన పథకాలు. 1956వ సంవత్సరంలో ప్రారంభించబడ్డాయి. ఈ పథకాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వాలకి కేంద్ర పాలిత ప్రాంతాలకి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ఈ పథకం ప్రకారం నెలకు 200 రూ॥లోపు ఆదాయంతో మురికి పేటలలో నివసిస్తున్నవారికి వారి ఇండ్లలను పునర్నిర్మించడం జరుగుతుంది. ఈ పథకాలు 1969లో ఏప్రియల్ 16వ తేది నాటికి కేంద్రం రాష్ట్ర ప్రభుత్వలకు బదిలీ చేసింది.

1972వ సంవత్సరంలో మురికి పేటల పరిసర ప్రాంతాల్ని సంస్కరించడానికి అహమ్మదాబాద్, బెంగుళూర్, ముంబాయి, ఢిల్లీ, హైదరాబాద్, కాన్పూర్, లక్నో, చెన్నై, నాగపూర్, పూనా మొదలైన పది నగరాలలో మురికి పేటలకు సంస్కరణలకు సంబంధించిన వివిధ పథకాలు చేపట్టబడ్డాయి.

1973 - 75లో కోల్‌కత్త, కొచ్చిన్, కటక్, గౌహతి, ఇండోర్, జైపూర్, లూధియానా, పాట్నా, శ్రీనగర్ మొదలైన నగరాలలో మురికి పేటల్ని సంస్కరించి, మంచినీటి సదుపాయాల్ని, పారిశుధ్యాన్ని స్నానసౌకర్యాన్ని, మురుగు నీటి పారుదల సౌకర్యాన్ని కల్పించడం, మరుగుదొడ్ల నిర్మాణం, వీధి దీపాలు, రోడ్లు ఏర్పరచడం వంటి అనేక పనులు ఈ పథకాల ద్వారా జరిగాయి.

1974వ సంవత్సరం మార్చి 3 నాటికి మురికి పేటలకు సంబంధించి 345 పథకాలు చేపట్టబడ్డాయి.

మురికి పేటల అభివృద్ధికై భారత ప్రభుత్వం ఎన్నో పథకాలను చేపట్టింది. వివిధ పంచవర్ష ప్రణాళికలలో పట్టణాభివృద్ధి కింద మురికి పేటలలో ఉన్నా జనాభాకి ఉపకరించే పథకాలను అమలు చేస్తుంది. ఈ పథకాలలో కనీస అవసరాల పథకంలో భాగంగా చేపట్టిన (EIUS) స్కీమ్ (Environmental Improvement of Urban Slums) ముఖ్యమైనది. దీనితో పాటు నగర ప్రాంతాలలో పేదరిక నిర్మూలనకు, నిరుద్యోగితను తగ్గించటానికి SEEUY, SEPUP, ఏఐఐ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి.

**మురికి పేటల నిర్మూలనకు సూచనలు :**

1. నగరాలు విపరీతంగా పెరగకుండా ఉపనగరాలను ఏర్పాటు చేయాలి. దీనివల్ల జనసమ్మర్ధాన్ని అదుపులో ఉంచవచ్చు.
2. పరిశ్రమల స్థాపించడంలో వికేంద్రీకరణ చాలా అవసరం
3. గ్రామీణాభివృద్ధి పథకాలను అమలు జరపాలి. గ్రామాలలో చిన్నతరహా, కుటీర పరిశ్రమలను అభివృద్ధి చెయ్యాలి. అదే విధంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తే గ్రామాల నుంచి నగరాలకు వలస వచ్చే వారిని నిరోధించవచ్చు.
4. నగరాలలో అద్దెలను నియంత్రించాలి.
5. కనీస సౌకర్యాలు మురికి నీరు పోయేటందుకు, మరుగు దొడ్ల నిర్మాణం, రోడ్లు, వీధి దీపాలు, స్నానాలకు గదులు వంటివి మురికి పేటలలో సత్వరమే కల్పించాలి.
6. మురికి పేటల అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలి మురికి పేటలలోని ప్రజలకు విద్యా, వైద్య సౌకర్యాలు కల్పించాలి.
7. మురికి పేటల ప్రజల ప్రధాన సమస్యలైన పేదరికాన్ని నిరుద్యోగితను పరిష్కరించాలి.
8. గృహ నిర్మాణానికి అవసరమయ్యే సామాగ్రికి తక్కువ ధరకి అందచెయ్యాలి. బ్యాంకులు ద్వారా ఆర్థిక సదుపాయాలు కల్పించాలి.
9. తక్కువ ఖర్చుతో సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టాలి.

మురికి పేటలు పట్టణాలు, నగరాల అభివృద్ధికి అడ్డుగోడలగా నిలుస్తాయి. తాడిత, పీడన, బడుగు, బలహీన వర్గాలు ఎక్కువగా ఉండే మురికి పేటల సమస్యలను పరిష్కరించకుంటే సామాజిక న్యాయాని పాటించలేని పరిస్థితి కనిపిస్తుంది.

### 20.2.2 గ్రామీణ - నగర వలస (Rural - Urban Migration ) :

#### 20.2.2.1 వలస అర్థం, నిర్వచనం :

వలసను ఆంగ్లంలో మైగ్రేషన్ (Migration) అంటారు. మైగ్రేషన్ అనే పదం మైగ్రేర్ (Migrare) అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. మైగ్రేర్ అంటే మానవులు ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి తరలి పోవడం అని అర్థం.

వీన్‌బెర్గ్ వలసను ఈ విధంగా నిర్వచించినాడు. "శాశ్వతంగా గాని - కొంత కాలం కోసం తాత్కాలికంగా గాని వ్యక్తుల నివాసాన్ని మార్చడం". ప్రతీకాత్మకంగా వలసను మానవజీవన గమనంలో ఒక పరిసరం నుంచి మరొక పరిసరానికి మారడంగా వర్ణిస్తారు. నగరీకరణలో నికరవలస ప్రధానమైన అంశం. ఐక్యరాజ్య సమితి నిపుణులను బట్టి వలస ఒక భౌగోళిక యూనిట్‌కు, మరో భౌగోళిక యూనిట్‌కు మధ్య జరిగేకదలిక, వ్యక్తులు ఒంటరిగాగాని, కుటుంబంతోగాని, బంధువులతోగాని, ఆసక్తిగల మరే సమూహంతోగాని వలసపోతుంటారు.

వలస అనేది మానవ సమాజంలోనేకాదు. జంతువులలోను, పక్షులలోను జరుగుతుంది. ఇది ప్రకృతి సిద్ధమైనది. సహజమైన సాంఘిక ప్రక్రియ. శీతోష్ణస్థితిగతుల వల్ల నీరు, ఆహారం, నివాస సౌకర్యం కోసం పక్షులు, జంతువులు వలస పోతుంటాయి. ప్రకృతి వైపరీత్యాలు, అతివృష్టి, అనావృష్టి అంటు రోగాలవల్ల అనాదిగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోవడం జరుగుతుంది. గతంలో వేలాది భారతీయులు విదేశాలకు ముఖ్యంగా శ్రీలంక, మలేషియా, దక్షిణాఫ్రికాకి వలస వెళ్ళారు. మత సంఘర్షణలు - యుద్ధాలు జాతి, రాజకీయ పరమైన సంక్షోభాలు, ఆకలి చావులు వంటి కారణాలవల్ల ప్రజలు ఇరుగు పొరుగు దేశాలకు వలస పోతుంటారు. నేడు ఎక్కువగా ఆర్థిక స్థితిగతుల వల్ల వలస పోతున్నారు.

దేశంలో ప్రధానంగా గ్రామాల నుండి పట్నాలకు, నగరాలకు వలస పోవడం జరుగుతుంది. దీనివల్ల వ్యక్తుల సమూహాల సామాజిక గతిశీలతకు తోడ్పడినా, పర్యావరణ కాలుష్యం, జనాభారద్దీ, అంటువ్యాధులు, మురికివాడల వంటి వివిధ సామాజిక, ఆర్థికపరమైన సమస్యలకు దారితీస్తుంది.

వలస రెండు విధాలుగా ఉంటుంది. వలస పోవడం (Out Migration) మరియు వలస రావడం (Immigration) వలసపోవడం ప్రధానంగా రెండు స్థాయిలలో జరుగుతుంది. అది అంతర్జాతీయ వలస (International Migration) అంతర్గత వలస (Internal Migration). వ్యక్తులు ఒక దేశం నుండి మరొక దేశానికి వలస పోవటం అంతర్జాతీయ వలసగాను వ్యక్తులు తమ దేశంలో ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి వలస పోతూ ఉండటం అంతర్గత వలసగా పేర్కొంటారు.

#### 20.2.2.2 వలసలు - రకాలు :

దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యక్తుల వలసలను ప్రధానంగా నాలుగు రకాలుగా విభజించారు. అవి

1) గ్రామాల నుండి నగరాలు
2) నగరాల నుండి గ్రామాలు
3) నగరాల నుండి నగరాలు
4) గ్రామాల నుండి గ్రామాలు

ఈ నాలుగు రకాలలో ముఖ్యమైనది. ఆందోళన కలిగిస్తున్నది. గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వెళ్లేవలస. నేటి ఆధునిక సమాజాలలో గ్రామీణ ప్రజలు అధిక సంఖ్యలో నగరాలకు వలసపోతున్నారు.

పుష్ (Push), పుల్ (Pull) సిద్ధాంతాన్ని డొనాల్డ్ బోగ్ ప్రవేశపెట్టాడు. పరిస్థితులు కారణంగా కొన్ని సముదాయాలు వ్యక్తులను బయటకు తోస్తే మరికొన్ని సముదాయాలు వారిని తమలో చేర్చుకుంటాయి. నిరుద్యోగులు, అల్పాదాయ వర్గాలు గ్రామాల నుండి వెళ్లిపోతుంటే, ఉద్యోగ అవకాశాలు, అధిక ఆదాయం, జీవన సౌకర్యాలు ఉన్న నగరాలు వీరిని ఆకర్షిస్తున్నాయి. మన దేశంలో గ్రామాలు పుష్ కారకాలుగాను, నగరాలు పుల్ కారకాలుగాను వలసను ప్రభావితం చేస్తున్నాయి. గ్రామీణ నగర వలసకు పుష్ - పుల్ కారకాలే ప్రధానం.

### 20.2.2.3 వలసకు కారణాలు:

పారిశ్రామికీకరణ, రవాణా మరియు భావప్రసార సాధనాలు పెరగటం ఉద్యోగ అవకాశాలు ఉండటం, ఆరోగ్య, వైద్య సదుపాయాలు లభించటం, వర్తక వాణిజ్య, వ్యాపారాభివృద్ధి జరగడం వలన నగరాలు గ్రామీణ ప్రజలను ఆకర్షిస్తున్నాయి. దీనివల్ల గ్రామాలనుండి నగరాలకు వెళ్లేవారి సంఖ్య రోజు, రోజుకి అధికమవుతుంది. పరిస్థితులను బట్టి ఏ ఒక్క కారణంగాని, లేదా కొన్ని కారణాలవల్ల గాని వ్యక్తి లేదా సమూహం తాము నివసిస్తున్న గ్రామాన్ని వదలి, సమీపంలో ఉన్న పట్నం, నగరం లేదా దూరంలో ఉన్న నగరానికిగాని వలస పోతారు. గ్రామీణ, నగర వలసకు అనేక కారణాలున్నాయి. వీటిలో ప్రధానమైనవి.

**1. వివాహం** - స్త్రీలు వివాహంకాగానే వలసపోవడమనేది సర్వసాధారణం. హిందూ సామాజిక వ్యవస్థలో కుటుంబ పితృస్వామం అందువల్ల స్త్రీ పెండ్లికాగానే భర్త ఇంటికి కాపురానికి వస్తుంది. గ్రామాలనుంచి నగరాలకు వలసపోయే వారిలో పురుషులకంటే స్త్రీలే ఎక్కువగా ఉన్నారని డొనాల్డ్ బోగ్ వివరించాడు.

**2. పేదరికం** - గ్రామీణ ప్రాంతాలలో వస్తున్న మార్పులు కొన్ని కుల వృత్తులపై ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. ప్రధానంగా దర్జీపని, తాపీపని వ్యవసాయ కూలీలు వారికి జీవనోపాధి కష్టం కావడం వల్ల నగరాలలో అవకాశాలు బాగుంటాయనే భావనతో వలసపోతారు. పేదరికం వల్ల వీరు ఎక్కువగా పట్నాలకు, నగరాలకు భారీగా వలసపోతున్నారు.

**3. నిరుద్యోగం** - కులవృత్తులు మూలనపడటం, పాక్షికనిరుద్యోగిత, ప్రచ్ఛన్న నిరుద్యోగితవల్ల నగరాలకు వలస పోతున్నారు. గ్రామీణ విద్యావంతులైన యువకులు, శ్రామికులు ఉపాధి కోసం పట్నాలకు, నగరాలకు లేదా మహానగరాలకు వలస పోతుంటారు. ప్రభుత్వ - ప్రైవేటు రంగసంస్థలు, పరిశ్రమలు, ఇతర వ్యాపార - వాణిజ్య సంస్థలు నగరాలలో ఉంటాయి. వివిధ వర్గాల వారికి ఉద్యోగావకాశాలను కల్పించటంతో వీరు ఎక్కువగా వలస పోతుంటారు.

**4. అనారోగ్యం** - గ్రామీణ ప్రాంతాలలో వైద్య సౌకర్యాల కొరత మూఢనమ్మకాలు, అజ్ఞానం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. తాత్కాలికంగా రోగాలు నయమైన పూర్తికాలం మందులు తీసుకోకపోవటం వల్ల ముదిరిపోతున్నాయి. కొన్ని ప్రత్యేక వ్యాధుల చికిత్స కేవలం నగరాలలోనే లభ్యమవుతుంది. వైద్య నిపుణులు కూడ నగరాలలోనే ఉండటంవల్ల గ్రామీణ ప్రజలు వైద్యానికి సంబంధించి నగరాలకు వలసపోతారు. అంటువ్యాధులు గ్రామాలలో ప్రబలినపుడు కూడా వలసలపోతారు.

**5. బదిలీలు** - గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగాలు పదోన్నతి పొందినపుడు పట్నాలకు, నగరాలకు బదిలీ అవుతారు గ్రామీణ నగర వలసకు బదిలీలు కూడ ఒక కారణంగా చెప్పవచ్చు.

**6. తగాదాలు** - గ్రామీణ ప్రజలలో వివిధ వర్గాల మధ్య తగాదాలు కూడ కొన్ని సార్లు నగర వలసలకు దారి తీస్తాయి. ముఠా తగాదాలు, వర్గకక్షలు, రాజకీయాల వల్ల గ్రామాలు వదలి నగరాలకి వెళ్లే వారు కూడ లేకపోలేదు.

**7. విద్యా సౌకర్యాలు** - గ్రామీణ - నగర వలసలకి గ్రామీణ ప్రాంతాలలో విద్యా సౌకర్యాల కొరత ప్రధానకారణం. గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్యకోసం నగరాలకి వలసపోతారు. నగరాలలో అధిక సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా, సాంకేతిక విద్యా సంస్థలు విశ్వ విద్యాలయాలు ఉంటాయి. ఒంటరిగా లేదా కుటుంబ సభ్యులతో విద్యాభ్యాసం నిమిత్తం గ్రామాల నుండి నగరాలకు విద్యార్థులు వస్తుంటారు. వారు తమ చదువులు పూర్తికాగానే గ్రామాలకు వెల్లడం లేదా ఉపాధి నిమిత్తం నగరాలలో ఉండటం జరుగుతుంది.

**8. ప్రకృతి వైపరీత్యాలు** - కరువు కాటకాలు, వరదలు, భూకంపం అగ్ని ప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల గ్రామీణ ప్రజలకి ప్రాణనష్టం, ఆస్తి నష్టంతో కలుగుతుంది. కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన కరువువల్ల సేద్యం చేయ్యటానికి వీలుండదు. వీటివల్ల జీవనోపాధి కోసం నగరాలకు వలసపోతారు. నగరాలలో మురికి వాడలలో నివసించే వారిలో ఎక్కువగా ఇటువంటి వారే ఉంటారు.

**9. ఋణాలు** - దేశంలో రైతు అప్పులోపుట్టి అప్పులో పెరిగి అప్పుతోనే మరణిస్తాడని చెబుతారు. కారణం సకాలంలో వర్షాలు రాకపోవడం చేతికొచ్చిన పంట వరదల పాలుకావడం. దీనికి తోడు పండగలు, వివాహాలు, సంస్కారాలు, ఉత్సవాలకు విరివిగా ఖర్చుపెట్టడం, వీటికోసం ఆదాయానికి చాలకపోవటంతో అప్పులు చెయ్యడం చివరికి ఆస్తులను కొల్పోయి, పరువు ప్రతిష్ఠలు పోగొట్టుకొని నగరాలకు వలసపోతారు.

**10. నగరాలపై మోజు** - గ్రామీణ ప్రజలలో కొందరికి నగర సంస్కృతి, జీవన విధానం, సౌకర్యాలపట్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. వీటి పట్ల వ్యామోహం నగరాలలో ఉండటానికి ప్రోత్సహిస్తుంది. ఫలితంగా తమ స్థిరాస్తులను అమ్ముకొని నగరాలకి వలసపోతుంటారు. వర్తక వ్యాపారంతో అక్కడే స్థిరపడిపోతారు.

### 20.2.2.4 గ్రామీణ - నగర వలస విధానాలు (Trends in Rural - Urban Migration) :

గ్రామాల నుండి నగరాలకు వచ్చేవారి వ్యక్తిగత వివరాలు పరిశీలిస్తే కొన్ని అంశాలు వెల్లడవుతాయి.

1. స్త్రీల కన్న పురుషులే ఎక్కువగా వలసపోవటం జరుగుతుంది.
2. సాధారణంగా 19 సంవత్సరాల వయస్సు లోపు వారు, మధ్యవయస్సుపై బడిన వారు వలస ప్రక్రియలోపోతారు.
3. కొన్ని ప్రత్యేక లక్షణాలు కలిగిన వ్యక్తులు మాత్రమే వలస పోతుంటారు.
4. ప్రజ్ఞ పాటవాలున్న వ్యక్తులే అధికంగా నగరాలకు వలసపోతుంటారు.
5. నేరస్థులు, వేశ్యలు, విద్రోహక వ్యక్తులు, నీతిలేని వారు కూడ ఎక్కువగా నగరాలకు వలసపోతుంటారు.

### 20.2.2.5 గ్రామీణ - నగర వలస పర్యవసానాలు :

1. గ్రామాలలో శ్రామికుల కొరత ఏర్పడుతుంది.
2. గ్రామీణ జనాభా తగ్గుతుంది.
3. గ్రామీణ సామాజిక సంబంధాలలోను, సాంస్కృతిక విలువలు, విశ్వాసాలలోను మార్పువస్తుంది.
4. గ్రామీణ ప్రాంత ప్రజలలో నగర ప్రజల అలవాట్లు కనపడతాయి.
5. నగరాలలో గృహ సమస్య ఏర్పడుతుంది.
6. మురికి వాడల పెరుగుదలకు దోహదపడుతుంది.

7. నగర జనాభావృద్ధికి దారితీస్తుంది.
8. నగరాలలో నిరుద్యోగ సమస్యకు కారణమవుతుంది.
9. అవివాహితులుగా ఉన్న గ్రామీణ యువకులు నగరాలకు వలసపోవడం వల్ల గ్రామాలలో స్త్రీ పురుష నిష్పత్తిలో అసమానతలు ఏర్పడతాయి. దీనివల్ల జీవిత భాగస్వామి ఎంపికలో సమస్యలు కలుగుతాయి.
10. గ్రామాలలో వ్యవసాయోత్పత్తులు తగ్గి గ్రామీణాభివృద్ధి కుంటుపడుతుంది.

### 20.2.2.6 వలస - నివారణ మార్గాలు :

గ్రామీణ ప్రజలు నగరాలకు వలసపోవడం గ్రామీణాభివృద్ధికి గొడ్డలిపెట్టు వ్యవసాయమే ప్రధానవృత్తిగా ఉన్న గ్రామీణ ప్రజలు దానిని నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. నగర సమస్యలకి గ్రామీణ - నగర వలసలే ప్రధానకారణం. గ్రామీణ - నగర వలసలను నివారించకుంటే అటు గ్రామాలకు ఇటు నగరాలకు ముప్పువాటిల్లే ప్రమాదముంది.

### గ్రామీణ - నగర వలస నివారణ చర్యలలో ప్రధానమైనవి :

1. గ్రామీణ ప్రాంతాల ప్రధాన సమస్యమైన పేదరికం, నిరుద్యోగిత, నిరక్షరాస్యత వంటిని సత్వరమే పరిష్కరించాలి.
2. గ్రామాలలో కుటీర, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి.
3. గ్రామీణ పేదలకు భూమిని, వసతి సౌకర్యాన్ని కల్పించాలి.
4. పేదరిక నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
5. విద్య, వైద్య రవాణా, మార్కెటింగ్ సదుపాయాలు ఏర్పాటు చెయ్యాలి.
6. గ్రామీణ యువతకు వృత్తి విద్యలలో శిక్షణన నివ్వాలి.
7. ప్రకృతి వైపరీత్యాలు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి.
8. వ్యవసాయ రంగ అభివృద్ధికి పాటుపడాలి.
9. తాగునీటిని, సాగునీటిని గ్రామాలకు అందించాలి.
10. వ్యవసాయ పనులు లేని కాలంలో ప్రజలకు పనులు చూపించాలి.
11. గ్రామీణ నిరుద్యోగితను నిర్మూలించే పథకాలు చిత్తశుద్ధతో అమలు జరపాలి.
12. భావ ప్రసార సాధనాల ద్వారా ప్రభుత్వ గ్రామీణ ఉపాధి పథకాలను ప్రజలకు వివరించాలి.
13. గ్రామీణ - నగర ప్రాంతాల మధ్య పెరుగుతున్న అసమానతల్ని తొలగించాలి. గ్రామాలలో కూడ పరిశ్రమలు స్థాపించాలి.

ప్రభుత్వం, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు కలసికట్టుగా కృషి చేస్తే గ్రామీణ ప్రజలు నగరాలకు వలస వెళ్లటాన్ని నివారించవచ్చు.

### పట్టణాల అభివృద్ధి :

భారతదేశంలో పట్టణీకరణ నెమ్మదిగా జరిగే ప్రక్రియ. 1901లో 1,916 పట్టణాలు ఉండగా 1991 నాటికి 4,689కి చేరుకున్నాయి. 90 సంవత్సరాలలో వీటి సంఖ్య మూడు రెట్లయింది. జనాభా సైతం బాగా పెరిగింది. 26 మిలియన్‌ల నుండి 217 మిలియన్లకి చేరుకుంది. వీటిలో మొదటి తరగతి పట్టణాలు (1 లక్షకన్న ఎక్కువ జనాభా ఉన్నవి) సంఖ్య 1951లో 74 ఉండగా 1991 నాటికి వీటి సంఖ్య 296కి పెరిగింది. మూడు కోట్లకు ఉన్న జనాభా పదహారు కోట్లకి పెరిగింది. ఇక మహా నగరాల విషయానికొస్తే (పది లక్షల కంటే అధిక జనాభా ఉన్న) 1981లో 12 మహానగరాలుండగా 1991 నాటికి వీటి సంఖ్య 23 కి పెరగడం ద్వారా నాలుగు కోట్లగా ఉన్న జనాభా ఈ పది సంవత్సరాల కాలంలో ఏడు కోట్లకి పెరిగింది.

### 20.2.3. జనాభా సమస్య:

భారతదేశంలో పారిశ్రామికీకరణ, నగరీకరణ, వలస ప్రక్రియల వల్ల నగరాలలో జనాభా బాగా పెరుగుతుంది. 20వ శతాబ్దంలోనే నగరీకరణ అధికంగా ఉంది. దేశంలో నగరాలన్నీ ఒక తీరుగా లేవు. రేవు పట్టణాలలోను, లోతట్టు ప్రాంతాలలోను జనసాంద్రత అధికంగా ఉంది. ప్రత్యేకించి ముంబాయి, కోల్‌కత్తా, చెన్నై మహానగరాలలో జనాభా ఎక్కువగా ఉంది. 19వ శతాబ్దంలోనే ఇవి గొప్ప పారిశ్రామిక ప్రాంతాలుగా వృద్ధి చెందాయి. వాణిజ్యం, ఆధునిక విద్య వైద్య సౌకర్యాలున్న చోట్ల జనసాంద్రత ఎక్కువగా ఉంది. నగరాలలో మురికి పేటలు కూడ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకొని నగరాభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయి. కనీస సౌకర్యాల కొరతతో అనేక మంది దుర్భర జీవితాన్ని మురికి వాడలలో గడుపుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో నుండి అధిక సంఖ్యలో ప్రజలు నగరాలకు తరలి వెళ్లడంతో నగర జనాభా పెరిగిపోతుంది. గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వెళ్లే వారి సంఖ్య రోజు రోజుకి గణనీయంగా పెరుగుతుంది. దీనివల్ల నగరాలు పెరుగుతున్నాయి. చిన్న పట్నాలు పెద్ద పట్టణాలుగా పెద్ద పట్టణాలు నగరాలుగా మహానగరాలుగా రూపాంతరం చెందుతున్నాయి. మునిసిపాలిటీలు, కార్పోరేషన్లు, కంటోన్మెంట్ బోర్డులు మొదలైనవన్నీ పట్టణ పరిధిలోనికి వచ్చేవే.

నగరాలు లేదా పట్టణాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో జనాభా ముఖ్యమైనది. నగరాలలో అధిక జనాభావల్ల అనేకమైన ఆర్థిక సామాజిక, నైతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. ఆహారం, ఆరోగ్యం, విద్య, వైద్యం, నిరుద్యోగం, పేదరికం, పర్యావరణ కాలుష్య, మురికి పేటలు, నగర జనాభా వల్ల కలిగే అనర్థాలుగా చెప్పవచ్చు. నగర జనాభా నానాటికి పెరగడంతో అనేక దుష్ఫలితాలు కలుగుతున్నాయి.

గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు లేదా నగరాలకు తరలి వచ్చే వారిని నిరోధించకుంటే దాని ప్రభావం నగరాభివృద్ధి పై ఉంటుంది. నగరాభివృద్ధి కుంటుపడటానికి అధిక జనాభాపై ప్రధాన కారణం.

గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వలస వచ్చి వారిని నిరోధించాలి. నగరాభివృద్ధికి అదే పెద్ద అడ్డుగోడగా నిలుస్తుంది. నానాటికి నగరాలలో పెరుగుతున్న జనాభా వల్ల నగరం వివిధ సమస్యలను ఎదుర్కొంటుంది.

భారతదేశంలో నగర జనాభా అభివృద్ధి కింది పట్టికలో చూడవచ్చు.

| భాతరదేశంలో నగర జనాభా అభివృద్ధి (1901-2001) | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | 1901 | 1881 | 25.85 | 10.84 | - |
| 2 | 1911 | 1875 | 25.94 | 10.29 | 0.3 |
| 3 | 1921 | 2012 | 28.09 | 11.17 | 8.3 |
| 4 | 1931 | 2145 | 33.46 | 11.99 | 19.1 |
| 5 | 1941 | 2349 | 44.45 | 13.85 | 32.0 |
| 6 | 1951 | 2924 | 62.44 | 17.29 | 41.4 |
| 7 | 1961 | 2462 | 98.97 | 17.9 | 26.4 |
| 8 | 1971 | 2641 | 109.10 | 19.90 | 38.2 |
| 9 | 1981 | 2768 | 159.46 | 23.34 | 6.414 |
| 10 | 1991 | 3768 | 217.18 | 25.72 | 36.19 |

క్రింది పట్టికలో 2001 జనాభా లెక్కల ప్రకారం పదిలక్షలకి పైగా జనాభాగల భారతీయ నగరాలు

| క్రం. | నగరము | జనాభా |
|---|---|---|
| 1. | ముంబై | 1,62,68,084 |
| 2. | కోల్‌కత్త | 1,22,16,546 |
| 3. | ఢిల్లి | 1,17,91,485 |
| 4. | చెన్నై | 64,24,624 |
| 5. | బెంగుళూర్ | 56,86,844 |
| 6. | హైదరాబాద్ | 55,33,640 |
| 7. | అహ్మదాబాద్ | 45,19,278 |
| 8. | పూణే | 37,55,525 |
| 9. | సూరత్ | 28,11,466 |
| 10. | కాన్పూర్ | 26,90,486 |
| 11. | జైపూర్ | 23,24,319 |
| 12. | లక్నో | 22,66,933 |
| 13. | నాగపూర్ | 21,22,965 |
| 14. | పాట్నా | 17,07,429 |
| 15. | ఇండోర్ | 16,39,044 |
| 16. | వడోదర | 14,92,398 |
| 17. | భూపాల్ | 14,54,830 |
| 18. | కోయంబత్తూర్ | 14,46,034 |
| 19. | లూధియానా | 13,95,053 |
| 20. | కొచ్చి | 13,55,406 |
| 21. | విశాఖపట్నం | 13,29,472 |
| 22. | ఆగ్రా | 13,21,410 |
| 23. | వారణాసి | 12,11,749 |
| 24. | మధురై | 11,94,665 |
| 25. | మీరట్ | 11,67,399 |
| 26. | నాసిక్ | 11,52,048 |
| 27. | జబల్‌పూర్ | 11,17,200 |
| 28. | జంషడ్‌పూర్ | 11,01,804 |
| 29. | ఆసన్‌సోల్ | 10,90,171 |
| 30. | ధన్‌బాద్ | 10,64,357 |
| 31. | ఫరీదాబాద్ | 10,54,981 |
| 32. | అలహాబాద్ | 10,49,579 |
| 33. | అమృత్‌సర్ | 10,11,327 |
| 34. | విజయవాడ | 10,11,152 |
| 35. | రాజ్‌కోట్ | 10,02,610 |

1991 జనాభా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 4,689 పట్టణాలు ఉన్నాయి. వీటి మొత్తం జనాభా 217.6 మిలియన్‌లుగా ఉంది. వీటిలో ఉత్తరప్రదేశ్ అత్యధికంగా 704 పట్టణాలను కలిగి ఉంది. తర్వాత వరుసగా తమిళనాడు 434 పట్టణాలు - మధ్యప్రదేశ్ 327 పట్టణాలు, మహారాష్ట్ర 307 పట్టణాలను కలిగి ఉన్నాయి. అత్యల్పంగా అండమాన్, నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీలు ఒక్కో పట్టణాన్ని కల్గి ఉన్నాయి. 2001 నాటికి పట్టణాల సంఖ్య 5,161కి చేరుకుంది.

## పట్టణాల అభివృద్ధి :

భారతదేశంలో పట్టణీకరణ నెమ్మదిగా జరిగే ప్రక్రియ. 1901లో 1,916 పట్టణాలు ఉండగా 1991 నాటికి 4,689కి చేరుకున్నాయి. 90 సంవత్సరాలలో వీటి సంఖ్య మూడు రెట్లయింది. జనాభా సైతం బాగా పెరిగింది. 26 మిల్లియన్‌ల నుండి 217 మిలియన్లకి చేరుకుంది. వీటిలో మొదటి తరగతి పట్టణాలు (1 లక్షకన్న ఎక్కువ జనాభా ఉన్నవి) సంఖ్య 1951లో 74 ఉండగా 1991 నాటికి వీటి సంఖ్య 296కి పెరిగింది. మూడు కోట్లకు ఉన్న జనాభా పదహారు కోట్లకి పెరిగింది. ఇక మహానగరాల విషయానికొస్తే (పది లక్షల కంటే అధిక జనాభా ఉన్న) 1981లో 12 మహానగరాలుండగా 1991 నాటికి వీటి సంఖ్య 23 కి పెరగడం ద్వారా నాలుగు కోట్లగా ఉన్న జనాభా ఈ పది సంవత్సరాల కాలంలో ఏడు కోట్లకి పెరిగింది.

## పట్టణ జనాభా పెరుగుదలకు గల ప్రధాన కారణాలు :

1. వైద్య సదుపాయాలు వైద్య నిపుణులు, అధునాతన చికిత్సా పరికరాలు ప్రత్యేక సౌకర్యాలతో ఉన్న వైద్యాలయాలు ఉండటం, వైద్య, ప్రజారోగ్య సదుపాయాలు లభించడం.
2. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్యాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు లేదా స్నాతకోత్తర విద్యా కేంద్రాలు (పి.జి. సెంటర్లు)తో పాటు సాంకేతిక వైద్య విద్యా సంస్థలు ఉండటం.
3. ఆహ్లాదకర వాతావరణంతో సుందరంగా ఉన్న ఉద్యానవనాలు వినోదకేంద్రాలు, సినిమా థియేటర్లు ఉండటం.
4. వర్తక, వాణిజ్య వ్యాపార కేంద్రాలుగా పట్నాలలో ఉండటం.
5. ఉపాధి అవకాశాలను విరివిగా కల్పించే పరిశ్రమలు ఉండటం.
6. లౌకికభావం బలంగా ఉండటం కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ఎక్కువమంది నడుచుకోవటం.

## అధిక జనాభావల్ల క్రింది అంశాలు నగరాలపై ఎక్కువ ప్రభావాన్ని కలిగిస్తాయి:

1. గృహ సమస్య ఏర్పడుతుంది.
2. మురికి పేటలు వృద్ధిచెందుతాయి.
3. వ్యక్తి నిత్యవసరాలను తీర్చుకోలేడు.
4. పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది.
5. నిరుద్యోగిత ప్రబలతుంది.
6. పేదరికం అధికమవుతుంది.
7. అపరిశుభ్రత, అనారోగ్యం ఎక్కువతుంది.
8. విద్య వైద్య సదుపాయాలలో సమస్యలు ఏర్పడతాయి.
9. సాంస్కృతిక, సామాజిక విలువలు పతనమవుతాయి.
10. సామాజిక స్థాయి దిగజారుతుంది.

11. సమాజంలో అశాంతికి అలజడలకి, ఆందోళనలో దారి తీస్తుంది.
12. పారిశుద్ధ్యం క్షీణించడం జరుగుతుంది.
13. ఆచారాలు, సంప్రదాయాలు క్షీణిస్తాయి.
14. సామాజిక సంక్షేమానికి అవరోధం ఏర్పడుతుంది.
15. పరిసరాల పరిరక్షణ సమస్యగా మారుతుంది.
16. ఇంధన సమస్య కూడ తలెత్తవచ్చు.
17. నైతిక విలువలు పతనమై దొంగతనాలు దోపిడీలు హత్యలు వంటి ఎక్కువవుతాయి.
18. రవాణా సమస్యలు ఏర్పడతాయి.పట్టణాన్ని కల్గి ఉన్నాయి. 2001 నాటికి పట్టణాల సంఖ్య 5,161కి చేరుకుంది.

## 2.4 సారాంశం:

పట్టణ సమస్యలలో ప్రధానమైనవి మురికి పేటలు, గ్రామీణ - నగర వలస మరియు జనాభా. పారిశ్రామికీకరణ, నగరీకరణ వలన పట్టణాభివృద్ధి జరిగిన సమస్యల మటుకు పెరుగుతున్నాయే తప్ప పరిష్కారింపబడటం లేదు. మురికి పేటలు నగరాభివృద్ధికి అడ్డుగోడలుగా నిలుస్తాయి. గ్రామీణ ప్రాంతాల నుండి జనం వివిధ కారణాల వల్ల పట్టణానికి తరలిరావడం, పట్టణాలలోనే ఉండిపోవడం వల్ల నగర జనాభా గణనీయంగా పెరుగుతుంది. దీనివల్ల పేదరికం, నిరుద్యోగం, వసతి సదుపాయాల కొరత వంటి ప్రధాన సమస్యలు ఎదురవుతాయి.

## 20.5 ముఖ్య పదాలు :

మురికి పేటలు

వలస

## 20.6 నమూనా ప్రశ్నలు :

1. మురికి పేటలను నిర్వచించి, వాటి లక్షణాలను, రకాలను, కారణాలను, వివరింపుము.
2. మురికి పేటల వల్ల ఏర్పడే పర్యావసానాలు లేదా ప్రమాదాలు నిర్మూలన చర్యలను పేర్కొనండి.
3. వలస అంటే ఏమిటో నిర్వచించి వలస రకాలను కారణాలను, విధానాలను వివరించుము.
4. వలసల వల్ల కరిగే కారణాల్ని పేర్కొని నివారణా మార్గాలను తెలియజేయండి.
5. నగరాలలో జనాభా సమస్యపై ఒక వ్యాసాన్ని వ్రాయండి.

## 20.7 చదువవదగిన గ్రంథాలు :


Problems of Rapid Urbanization in India - Bulsara J.F.

Urban Sociology - Rajendra K Sarma

Urban Crises in India - Vital Reddy, K and Ram Mohan Rao .R


డా. జి.వి. రమణ

పాఠం : 21

# భారతీయ నగరాలలో పేదరికం

## 21.0 లక్ష్యం :

పేదరిక నిర్వచనాన్ని, రకాలను కారణాలను పర్యావసానాలను మరియు నగర పేదరిక నిర్మూలన చర్యలను తెలుసుకోవటమే ప్రస్తుత పాఠం యొక్క ప్రధానలక్ష్యం.

## విషయక్రమం:


21.1 పరిచయం

21.2 పేదరికం - నిర్వచనం

21.3 పేదరికం - రకాలు

21.4 నగర పేదరికం (Urban Proverty)

21.5 కారణాలు

21.6 పర్యావసానలు

21.7 పరిష్కార మార్గాలు

21.8 సారాంశం

21.9 ముఖ్య పదాలు

21.10 నమూనా ప్రశ్నలు

21.11 చదువదగిన గ్రంధాలు


## 21.1 పరిచయం :

దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో పేదరికం ముఖ్యమైనది. పేదరికం ఆధునిక నాగరికతకు మచ్చవంటిది. సమాజంలో కలిమి, లేమి తేడాలున్నంతకాలం ప్రగతి కనిపించదు. తేడాలు సమసిపోతే తప్ప సామ్యవాద సమాజానికి అర్థం లేదు. వ్యక్తికి స్వంత ఆస్తి అవతరించిన నాటి నుంచే పేదరిక సమస్య ప్రారంభమైయింది. సంప్రదాయికంగా ఉన్న వాళ్ల లేని వాళ్ల కలిసిమెలిసి జీవించేవారు. ధనవంతులకు పేదవారు సేవలు చేస్తుండేవారు. పేదవారిలో చైతన్యం లేకపోవటం వల్ల అనాడు పేదరికమనేది పెద్ద సమస్యకాలేదు. కాని పారిశ్రామీకరణ, సాంకేతికాభివృద్ధి జరిగిన తర్వాత ధనం కేవలం కొద్ది మంది దగ్గర, కొన్ని కుటుంబాల చేతిలో ఉండి పోవటంవల్ల అంతరాలు బాగాపెరిగిపోయాయి. సంపన్న వర్గాల పేదవాళ్ళ మధ్య అగాధం ఏర్పడింది. సమాజంలో అధికశాతం పేదరికానికి లోనయ్యారు. ఎన్నో బాధలకు గురియైనారు. ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలలో వచ్చిన విప్లవాలు ప్రజాస్వామ్య, సామ్యవాద భావాలకు ప్రాణం పోశాయి. ఫలితంగా సమానత్వం సౌభ్రాత్రం, సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యత లభించింది. పేదరికాన్ని పరిష్కరించి సమసమాజ స్థాపన పూనుకోవలసిన అవసరం ఆధునిక సమాజాల మీద ఉంది.

## 21.2 పేదరికం - నిర్వచనం :

పేదరికం అనే భావనను వివిధ విధాలుగా పిలుస్తారు. దారిద్రం, లేమి వంటి పదాలను పేదరికానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తారు. పదాలేమైనప్పటి మానవుని తక్కువ ఆర్థిక స్థితిని అవి తెలియజేస్తాయి.

పేదరికం అన్న పదాన్ని నిర్వచించడం చాలా కష్టం దారిద్రమంటే తీవ్రమైన కొరత పరిస్థితి. వివిధ సామాజిక మరియు ఆర్థిక శాస్త్రజ్ఞులు పేదరికాన్ని నిర్వచించారు.

లేమిని అనుభవించడానికి అలవాటు పడిన పరిస్థితిని దారిద్రమని రాబర్ట్‌కెల్సో నిర్వచించినాడు. ఈ నిర్వచనం దారిద్ర్య భావనను సంతృప్తికరంగా వివరించలేదు.

గిల్లిన్ మరియు గిల్లిన్ అభిప్రాయ ప్రకారం "వ్యక్తి తక్కువ ఆదాయము వలన గాని, తెలివి తక్కువ వలనగాని సమాజంలో నిర్ణయింపబడి నటువంటి సామాజిక జీవన ప్రమాణము' కింద జీవిస్తూ తన యొక్క, తనపై ఆధారపడిన వారి యొక్క భౌతిక, మానసిక అవసరాలను తీర్చుకోలేని స్థితియే పేదరికం".

వ్యక్తి ధనవంతుడా లేదా పేదవాడా అని నిర్ధారించడానికి సమయం, సమాజం జీవన ప్రమాణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అమెరికాలో దారిద్ర ప్రమాణ రేఖకు, భారతదేశంలో దారిద్ర రేఖకు చాలా తేడా ఉంటుంది. అదే విధంగా దేశంలో గ్రామీణ ప్రాంతాల జీవన ప్రమాణాలకు, పట్టణ ప్రాంతాలలోని జీవన ప్రమాణాలకు చాలా వ్యత్యాసముంది. కాబట్టి వ్యక్తి యొక్క పేదరిక స్థాయి అంచనా సమాజానికి సమాజానికి తేడా ఉంటుంది.

మొత్తం మీద పేదరికమంటే తక్కువ జీవన ప్రమాణస్థాయిని కలిగియుండుట. అంటే కనీస అవసరాలైనటువంటి తినడానికి తిండి, కట్టుకోవడానికి గుడ్డ మరియు ఉండటానికి వసతి లేని పరిస్థితి ఈ విధమైన స్థితిలో వ్యక్తులను పేదవారుగా గుర్తించవచ్చు.

## 21.3 పేదరికం - రకాలు :

పేదరికం లేదా దారిద్ర్యాన్ని అనేక విధాలుగా విభజించడం జరిగింది. కొంతమంది రచయితలు ప్రాథమిక దారిద్రము, సాపేక్ష దారిద్ర్యమని వర్గీకరించారు.

1. ప్రాథమిక దారిద్ర్యము - వ్యక్తి తన కుటుంబ సభ్యులకు కనీస జీవితావసరాలను (తిండి, గుడ్డ, గూడు (వసతి) కూడా సమకూర్చలేని పరిస్థితిని ప్రాథమిక దారిద్ర్యమని చెప్పవచ్చు.

2. సాపేక్ష దారిద్ర్యము - వ్యక్తి తన సమూహంలో కొందరితో సరిపోల్చినప్పుడు వ్యక్తి తనను పేదవానిగా భావించుకొంటాడు. వ్యక్తి ఇతరులలో పోల్చుకొని బాధపడతాడు. నిరాశ నిస్పృహలకు లోనవుతాడు. అసంతృప్తితో జీవితాన్ని గడుపుతాడు. దీనివల్ల సామాజిక భద్రతకు భంగంవాటిల్లుతుంది.

మరి కొంత మంది రచయితలు దారిద్ర్యాన్ని స్వచ్ఛంధ దారిద్ర్యము, బలవ దారిద్రముగా వర్గీకరించారు.

1. స్వచ్ఛంద దారిద్ర్యము - ఇందులో వ్యక్తులు తమంతటతామే సామాన్య జీవనాన్ని కాంక్షించి దరిద్రులుగా జీవిస్తారు.

2. బలవద్దారిద్రము - ఇందులో వ్యక్తులు ప్రామాణిక జీవన స్థాయిని ఆశిస్తారు.

## 21.4 నగర పేదరికం :

ప్రాంతాలను బట్టి పేదరికాన్ని గ్రామీణ పేదరికం, నగర పేదరికంగా విభజించవచ్చు. గ్రామీణ ప్రజలు జీవనోపాధికోసం ఎక్కువగా నిరంతరం నగరాలకు వలసరావడం, తగినంత వనరులను తమంతతాముగా సమకూర్చుకోలేకపోవటంతో మురికివాడల్లో, రోడ్లపక్కన జీవించడం ద్వారా నగర పేదరికం నానాటికి పెరుగుతుంది. గ్రామాలు వెనకబడిపోవటం, వ్యవసాయాభివృద్ధి జరగకపోవటం, గ్రామీణుల మూకుమ్మడి వలసలు నగర పేదరికానికి దారితీసింది. బాగుపడాలని ఆర్థికంగా బలపడాలని భావించుకొని గ్రామీణులు నగరాలకు వలస వస్తారు. పేదరికం నుండి బయటపడాలని ఆర్థికంగా బలపడాలని భావించుకొని గ్రామీణులు నగరాలకు వలస వస్తారు. పేదరికం నుండి బయటపడాలని ఆశిస్తారు. కొంతమంది మాత్రమే వారి ప్రయత్నాలతో విజయాన్ని సాధిస్తారు. మిగిలిన చాలమంది పేదలుగానే ఉండిపోతారు. చాలీచాలని వేతనాలతో, ఎదుగులేని జీవితాలను గడుపుతారు. దారిద్ర రేఖ దిగువున ఉంటారు.

## 21.5 పేదరికం - కారణాలు :

పేదరికం కలగడానికి అనేక కారణాలున్నాయి.

1. వ్యక్తిగత కారణాలు - పేదరికం ఏర్పడటానికి ప్రధానకారణం వ్యక్తిగత కారణాలు అవి

(ఎ) శారీరక, మానసిక వ్యాధులు - హంటర్ అభిప్రాయం ప్రకారం పేదరికం మరియు వ్యాధి పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయి. వ్యాధిగ్రస్తుడైన వ్యక్తి సవ్యంగా, సక్రమంగా, సమర్థవంతంగా పని చేయలేకపోవుట వలన ఆదాయము తగ్గటం జరుగుతుంది. ఆ వచ్చిన తక్కువ ఆదాయములో అధిక శాతం వ్యాధి నివారణ కోసం ఖర్చు చెయ్యటంవల్ల మరింత పేదరికాన్ని అనుభవించే పరిస్థితి కలుగుతుంది.

మానసిక వ్యాధులున్న వ్యక్తులు పని చెయ్యటానికి ఆసక్తి చూపరు. పనిచేయు శక్తిని కోల్పోతారు. తద్వారా ఆదాయాన్ని పోగొట్టవచ్చు. కాని పేదరికాన్ని అనుభవిస్తారు.

(బి) సోమరితనం - అవకాశాలున్న కొంత మంది వ్యక్తులు సోమరితనానికిలోనై పని చెయ్యకపోవటం వల్ల పేదరికంలో ఉన్నారు.

(సి) నిరక్షరాస్యత - నిరక్షరాస్యత నిరుపేదరికానికి దారి తీస్తుంది. వ్యక్తులలో మూఢనమ్మకాలు, అజ్ఞానం వల్ల జీవన విధానాన్ని సరిగా రూపొందించుకోలేక సతమతమవుతారు. తమ శక్తి యుక్తులను వినియోగించుకోలేక పేదరికంతో జీవిస్తున్నారు.

(డి) ప్రమాదాలు - ప్రమాదాలు కూడా పేదరికం కలగడానికి కారణమవుతున్నాయి. కొన్ని సందర్భాలలో అకస్మాత్తుగా అనుకోని ప్రమాదాలు కలుగుతుంటాయి. వీటి వల్ల వ్యక్తి పూర్తిగా కాని, పాక్షికంగాగాని శ్రమించే శక్తిని కోల్పోయి భృతిని పొందలేరు. ఫలితంగా అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరు కూడా పేదరికంతో జీవిస్తారు.

(ఇ) దురలవాట్లు - మద్యపానం, జూదం, వ్యభిచారం మొదలైన దురలవాట్లు వల్ల కూడా వ్యక్తులు పేదరికానికి పాలవుతున్నారు.

(ఎఫ్) దుబారా ఖర్చు - ఆదాయానికి మించి ఖర్చు చేయ్యటం అప్పులపాలు కావడం ఫలితంగా పేదరికాన్ని అనుభవిస్తారు. ముఖ్యంగా పండగలు, ఉత్సవాలు, సందర్భంగా తమ స్థాయికి మించి ఖర్చు చెయ్యడం వల్ల పేదరికంతో జీవిస్తారు.

**2. భౌగోళిక కారణాలు** - భౌగోళిక కారణాలు కూడా పేదరికానికి కారణమవుతున్నాయి.

(ఎ) ప్రకృతి వైపరీత్యాలు - ప్రకృతి భీబత్సాలు వరదలు, కరువు, భూకంపాలు మొదలైనవి సంభవించినపుడు ప్రాణనష్టం, ఆస్తినష్టం కలుగుతుంది. ఫలితంగా ప్రజలు పేదరికాన్ని అనుభవిస్తారు.

(బి) ప్రకృతి వనరులలోటు - ప్రకృతి వనరులు సమృద్ధిగా లేకుంటే దేశాభివృద్ధి జరగదు. ఎడారులు, పర్వత ప్రాంత ప్రజల పేదరికానికి ప్రకృతి వనరులైన సారవంతమైన భూమి, నీరు, మొదలైనవి లేకపోవటమే కారణంగా చెప్పవచ్చు.

(సి) ప్రతి కూల వాతావరణము - అనుకూల వాతావరణం లేకుంటే వ్యవసాయము మరియు పారిశ్రామికరంగాలు ఉత్పత్తి పడిపోయి పేదరికం పెరగడానికి దోహదపడుతుంది.

**3. ఆర్థిక కారణాలు** - పేదరికం ప్రధానంగా ఆర్థిక అవ్యవస్థల వల్ల ఏర్పడే ముఖ్యమైన సామాజిక ఆర్థిక సమస్య.

(ఎ) నిరుద్యోగం - దేశంలో పేదరికం ప్రబలటానికి ప్రధానం కారణం నిరుద్యోగం దీనివల్ల అటునగరాలలోను ఇటు గ్రామీణ ప్రాంతాలలోను లక్షలాది మంది పేదలుగా ఉన్నారు.

(బి) ఆర్థిక ద్రవ్యోల్బణము - ద్రవ్యోల్బణము వలన వ్యాపార వాణిజ్య రంగాలలో మార్పులు వచ్చి సమ్మెలు, వాకౌట్‌లు నిరుద్యోగము మొదలైనవి పెరిగి పేదరికానికి, దారి తీస్తాయి.

(సి) కేంద్రీకృతమైన సంపద - దేశంలోని సంపద కేవలం కొద్ది మంది చేతిలో కేంద్రీకృతమయినది, అధిక సంఖ్యాకులు దరిద్రులుగా జీవిస్తున్నారు.

**4. సామాజిక కారణాలు** - వ్యక్తిగత, భౌగోళిక, ఆర్థిక కారణాలతో పాటు పేదరిక పెరుగుదలకు సామాజిక కారణాలు కూడ దోహదపడుతున్నాయి.

(ఎ) లోపభూయిష్టమైన విద్యా విధానం - నేటి విద్యావిధానం సమాజ అవసరాలకు ఏ మాత్రం అనుకూలంగా లేదు. ఫలితంగా యువతరం నిరాశా, నిస్పృహ, నిస్తేజ, నిర్వీర్యానికి గురై కృంగి పోతుంది. ఫలితంగా దారిద్రంతో గడపవలసి వస్తుంది. వృత్తి విద్య, సాంకేతిక విద్యకు అత్యధిక ప్రాధాన్యత నివ్వకపోవటం, నిరక్షరాస్యతను నిర్మూలించక పోవడం కూడా పేదరికానికి పరోక్షంగా కారణమవుతున్నాయి.

(బి) సంప్రదాయాలు - అనాదిగా వస్తున్న కొన్ని సంప్రదాయలను అనుసరించడం, వరకట్న వంటి దురాచారాన్ని కొనసాగించడం వల్ల కూడ ప్రజలు పేదరికం జీవిస్తున్నారు.

(సి) యుద్ధాలు - యుద్ధాలు వల్ల అధికంగా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుటవల్ల పేదరికం కలుగుతుంది, యుద్ధసమయంలో అంటు వ్యాధులు ప్రబలుతాయి. చాలా మంది మానసిక శారీరక రుగ్మతలతో బాధపడుతారు. ధరలు పెరుగుదల ఎక్కువగా వుండి ఫలితంగా ప్రజలు పేదరికానికి లోనవుతారు.

## 21.6 పేదరికం - పర్యావసానాలు :

పేదరికం వైయక్తిక, కుటుంబ, సామాజిక అవ్యవస్థతకు కారణమవుతుంది. చాలీచాలని వేతనాలుతో సంసారభారం మోయలేక సతమతమవుతారు. నగరంలోని పేద ప్రజలు తిండి లేక ఆకలితో ఉపవాసాలతో సరియైన పోషణ లేక అనేక వ్యాధులకు గురవుతారు. కష్టనష్టాలకు బలవుతారు అల్పాదాయ వర్గాలలో మరణాలు అధికంగా ఉంటాయి. నగరంలోని పేదలు అనారోగ్య

కరమైన ప్రాంతాలలో, కిక్కిరిసిన మురికి వాడలలో నివసిస్తుంటారు. పేద ప్రజలు శారీరిక బాధలతో పాటు ప్రత్యేకంగా మానసిక లోపాలైన ఆందోళన, భయం, ఈర్ష్య, అనుమానం, నిరాశా, నిస్పృహ, నిస్తేజం, పగటికలలు వంటి వాటితో బాధపడతారు.

పేద ప్రజలు సోమరులుగా, జాగ్రత్త లేనివారిగా తయారవుతారు. అంతేకాకుండా దురలవాట్లు, మద్యపానం, వ్యభిచారం ధూమపానం, జూదం వంటి వాటికి లోనవుతారు. ఇక యాచన, నిరుద్యోగం, కూడా వీరిలో చూడవచ్చు.

పేదరికం అనేక సామాజిక సమస్యలకు మూలకారణమవుతుంది. ఎన్నో రకాలైన సంఘర్షణలకు ఉద్రిక్తతలకు, వర్గ పోరాటాలకు, దారితీస్తుంది. సమాజంలో శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేస్తుంది.

## 21.7 నగర పేదరిక నిర్మూలన చర్యలు :

పేదరికాన్ని నిర్మూలించకుంటే దేశ ప్రగతి సాధ్యపడదు. ఆర్థిక అసమానతలు తొలగించకుంటే సమసమాజం సాధ్యపడదు. నగర ప్రాంతాలలోని పేదరికాన్ని పారిశ్రామికరణ ద్వారా ప్రజలకు ఉద్యోగ సదుపాయాలు కల్పించటం ద్వారా పరిష్కరించవచ్చు.

**క్రింది నిర్మూలన చర్యలు నగర ప్రాంతాలలో పేదరికాన్ని రూపు మాపడానికి ఉపయోగపడతాయి.**

1. పారిశ్రామికీకరణ త్వరితగతితో జరిగినట్లయితే నిరుద్యోగ సమస్య పరిష్కారం ద్వారా పేదరికాన్ని దూరంగా ఉంచవచ్చు.
2. గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలకు వచ్చే వలసలను నిరోధించాలి. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చెయ్యాలి. రైతులు వలసపోకుంటే చూడాలి.
3. చిన్న వ్యాపారలకు చేతి వృత్తులకు ఋణాలిచ్చి ప్రోత్సాహించాలి.
4. వృత్తి పరమైన విద్యను విధిగా ఏర్పరచాలి.
5 కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని సక్రమంగా సమర్థవంతంగా అమలు జరిపి అధిక జనాభాని అరికట్టాలి.
6. మురికివాడల ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచాలి. వారికి ఉపాధిని కల్పించాలి.
7. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెనువెంటనే భర్తీ చెయ్యాలి.
8. భూసంస్కరలను చిత్తశుద్దితో అమలు జరపాలి.

## 21.8 సారాంశం :

దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో పేదరికం ముఖ్యమైనది. తినడానికి తిండి, కట్టుకోవటానికి గుడ్డ, ఉండటానికి వసతి లేని పరిస్థితిని పేదరికంగా చెప్పవచ్చు. ప్రాథమిక దారిద్ర్యం, సాపేక్ష దారిద్ర్యం, స్వచ్ఛంధ దారిద్ర్యం, బలవద్దారిద్రం అని పేదరికాన్ని వర్గీకరించారు. పేదరికం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాలేదు. నగరాలలోను ఉంది. పేదరికం కలగడానికి వ్యక్తిగత కారణాలు భౌగోళిక కారణాలు, ఆర్థిక మరియు సామాజిక కారణాలు దోహదపడతాయి. పేదరికం వైయక్తిక, కుటుంబ సామాజిక అవ్యవస్థతకు కారణమవుతుంది. సమాజంలో సంఘర్షణలకు, వర్గపోరాటాలకు, కారణమవుతుంది. నగరంలోని పేదరికాన్ని ప్రధానంగా పారిశ్రామికీకరణ ద్వారా నిర్మూలించవచ్చు.

## 21.9 ముఖ్యపదాలు :

పేదరికం

ప్రాథమిక దారిద్ర్యం

సాపేక్ష దారిద్ర్యం
స్వచ్ఛంద దారిద్ర్యం
బలవద్దారిద్రం

## 21.10 మాదిరి ప్రశ్నలు :

1. పేదరికాన్ని నిర్వచించి దానిలోని రకాలను వివరింపుము?
2. పేదరికమునగల కారణాలను తెలియజేయుము
3. పేదరిక పర్యవసానాలను విశదీకరింపుము.
4. నగరంలో పేదరిక నిర్మూలన చర్యలను పేర్కొనము.

## 21.11 చదువదగిన గ్రంథాలు :


1) Problems of Rapid Urbanization in India - Bulsara J.F
2) Urban Sociology - Rajendra K Sarma
3) Urban Crises in India - Vittal Reddy, K and Ramamohan Rao R.


డా. జి.వి. రమణ

**(DASOC 32)**

B.A. DEGREE EXAMINATION, DECEMBER 2011.

(Examination at the end of Final Year)

Part II — Sociology

Paper IV — RURAL AND URBAN SOCIOLOGY

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

Select atleast TWO questions from each Section.

All questions carry equal marks.

SECTION A

1. Write an essay on the subject matter of rural sociology.

   గ్రామీణ సమాజ శాస్త్రము యొక్క విషయ పరిజ్ఞానముపై ఒక వ్యాసము వ్రాయుము.

2. Describe the different types of Indian Villages.

   భారతీయ వివిధ రకాల గ్రామాలను చర్చింపుము.

3. Discuss the role of religion in rural politics.

గ్రామీణ రాజకీయాలలో మతము యొక్క పాత్ర చర్చింపుము.

4. Write an essay on the Jajmani system.

యాజమాన్య విధానముపై ఒక వ్యాసము వ్రాయుము.

5. Examine the problems of rural unemployment in India.

భారత గ్రామీణ నిరుద్యోగ సమస్యను పరీక్షింపుము.

## SECTION B

6. Analyse the subject matter of urban sociology.

నగర సమాజ శాస్త్రము యొక్క విషయ పరిజ్ఞానమును విశ్లేషించుము.

7. Describe the different types of cities.

వివిధ రకాల నగరాలను వివరించుము.

8. What are characteristics of pre-industrial cities?

ప్రాక్–పారిశ్రామిక నగరాల లక్షణాలు ఏవి?

9. Examine the consequences of urban poverty.

నగర పేదరికము యొక్క పర్యవసానాలను పరీక్షింపుము.

10. Write short notes on any TWO of the following :

(a) Rural Development

(b) Hand reforms

(c) Urbanization

(d) Slums.

ఈ క్రింది వాటిలో ఏ రెండింటికైనా లఘుటీకలు వ్రాయుము :

(a) గ్రామీణాభివృద్ధి

(b) భూసంస్కరణలు

(c) నగరీకరణము

(d) మురికి వాడలు.

---

**(DASOC 32)**

B.A. DEGREE EXAMINATION, MAY 2011.

(Examination at the end of Final Year)

Part II — Sociology

Paper IV — RURAL AND URBAN SOCIOLOGY

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

Select atleast TWO questions from each Section.

All questions carry equal marks.

SECTION A

1. Discuss the need for study of rural sociology.

   గ్రామీణ సమాజశాస్త్రము యొక్క అధ్యయన ఆవశ్యకతను చర్చింపుము.

2. Define village and discuss its settlement patterns in India.

   గ్రామమును నిర్వచించి మరియు వాటి నివాస ప్రాంత నమూనాలను వర్ణించుము.

3. Examine the nature of caste and religion in rural communities.

గ్రామీణ సముదాయములో కులము మరియు మతము యొక్క స్వభావమును పరీక్షింపుము.

4. Evaluate the rural health and sanitation programmes in India.

భారతదేశములో ఆరోగ్య మరియు పారిశుధ్య పథకములను మూల్యాంకనచేయుము.

5. Discuss the strategies for rural development.

గ్రామీణాభివృద్ధి వ్యూహాలను చర్చింపుము.

SECTION B

6. Define urban sociology and discuss its scope.

నగర సమాజ శాస్త్రమును నిర్వచించి మరియు దాని పరిధిని చర్చింపుము.

7. Examine the characteristics of urban communities.

నగర సముదాయ లక్షణాలను పరీక్షింపుము.

8. Discuss urbanism as a way of life.

"నగరీయుత ఒక జీవన విధానము" చర్చింపుము.

9. Write an essay on rural urban migration.

గ్రామీణ నగర వలసపై ఒక వ్యాసము వ్రాయుము.

10. Write short notes on any TWO of the following.

(a) Rural unemployment.

(b) Ryotwari villages.

(c) Industrial cities.

(d) Urban pollution.

ఈ క్రింది వాటిలో ఏరెండింటికైనా లఘుటీకలు వ్రాయుము :

(a) గ్రామీణ నిరుద్యోగము.

(b) రైతువారి గ్రామాలు.

(c) పారిశ్రామిక నగరాలు.

(d) నగర కాలుష్యము.

---

**(DASOC 32)**

# B.A. DEGREE EXAMINATION, DECEMBER 2010.

(Examination at the end of Final Year)

Part II — Sociology

Paper IV — RURAL AND URBAN SOCIOLOGY

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

Select atleast TWO from each Section.

All questions carry equal marks.

## SECTION A

1. Describe the scope and subject matter of rural sociology.

   గ్రామీణ సమాజశాస్త్ర పరిధిని, అధ్యయనాంశాలను గురించి వివరించుము.

2. Describe the types of settlement patterns in Rural India.

   గ్రామీణ భారతదేశంలోని నివాస విధానాల తీరులను గురించి వివరింపుము.

3. Define urban community and describe its characteristics.

నగర సముదాయాన్ని నిర్వచించి, దాని లక్షణాలను వివరింపుము.

4. Describe the changes that are taking place in the Jajmani system of India.

భారతదేశ జాజ్‌మాని వ్యవస్థలో వస్తున్న మార్పులను వివరించుము.

5. Describe the agrarian reforms in Andhra Pradesh.

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ సంస్కరణలను గురించి వివరించుము.

## SECTION B

6. Describe urbanism as a way of life.

నగరీయుత ఒక జీవన విధానము ఎలాగో వివరింపుము.

7. Examine the nature of rural-urban interaction.

గ్రామీణ–నగర పరస్పర సంబంధాల స్వభావాన్ని పరీక్షించుము.

8. Explain the characteristics of pre-industrial cities.

పూర్వాపారిశ్రామిక పట్టణాల లక్షణాలను వివరించుము.

9. Describe the problem of slums in cities.

నగరాలలోని మురికివాడల సమస్యను గురించి వివరించుము.

10. Explain the characteristics of urban community.

నగర సముదాయపు లక్షణాలను వివరింపుము.

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకుల, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| B.A. | IIIrd Year | Paper - IV A: Rural and Urban Sociology |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)